
పురాణములు

# కన్యకా పురాణం



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభుపు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్చంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్ధికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org  Mobile App: Free Gurukul  email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul  Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

౩౩౩౬౬

# శ్రీ కన్యకాపురాణము

SARASWATA NIKETANAM
VETAPALEM



# శ్రీ కన్యకాపురాణము

శతావధాని దోమా వెంకటస్వామిగుప్త

SWATA NIKETANAM
VETAPALEM

# కృతజ్ఞతలు

గ్రంథప్రచురణ కవకాశమిచ్చిన

గ్రంథకర్తృ సతీమణి వెంకటసుబ్బమ్మ

వారి యేకైక పుత్రుడు ఆంజనేయ గుప్త

వారి యేకైక పుత్రిక భాషాప్రవీణ గోళ్ల ఇందిరాదేవి గారలకు

ముద్రణకు విరాళములిచ్చిన దాతలకు—

ముద్రణ వ్యవహారము నిర్వహించిన

పండిత శ్రీ జమిలి నమ్మాళ్వారు (గుంటూరు)

కీ॥ శే॥ కవికేసరి అద్దేపల్లి సత్యనారాయణ (మందపల్లి) గారలకు

సలహాలనిచ్చిన మిత్రవర్యులు కొమ్మూరి వెంకట్రామయ్య

చిత్రాలు గీసిన దాసరి నాగవర్ధనరావు గారలకు, తదితరులకు

మా కృతజ్ఞతాపూర్వక వందనములు

ఇట్లు

శ్రీ జమిలి నమ్మాళ్వార్ - ధర్మనిధి

(రిజిష్టర్డు) : పట్నంబజారు : గుంటూరు 3

# విషయసూచిక


1. సమర్పణ

2. విమర్శాలేశము

3. ప్రథమాశ్వాసము ౧

ప్రార్థనాదికములు - షష్ఠ్యంతములు - కథాప్రారంభము - శ్రీమణి ద్వీపము - శ్రీపరాంబ - సమాధి - శ్రీకన్యకాపరమేశ్వరీ యాజ్ఞ - వైశ్యుల దుఃఖము - వారు కైలాసమును జేరుట - శ్రీ కన్యకా పరమేశ్వరి మహాగిరి కేతెంచుట - ఆమె సమాధానపరచుట

4. ద్వితీయాశ్వాసము ౪౯

వైశ్యులకై దేవతల పుట్టువులు - శ్రీగోదావరీనది - ఆగతులు, వారి గోత్రవివరణ - శంభుశ్రేష్ఠికి శచీదేవి కొమరిత యగుట - చిత్రకంఠుని శాపము - చిత్రకంఠుడు - శచీదేవి వరము - శచీదేవికి బ్రహ్మ శాపము - శ్రీకన్యకాపరమేశ్వరి నూటరెండు గోత్రముల వైశ్యులకు గావించిన కట్టడి - వైశ్యులు శివదర్శనముచేయుట - కలికాల వర్ణనము - పెనుగొండపురము - పదునెన్మిదిపురములు - శ్రీ శివ పూజాక్రమము - వైశ్యులచింత - ఇష్టవస్తువిసర్జనము

5. తృతీయాశ్వాసము ౮౩

పాలంకాయనముని రాక - వైశ్యులవనట - పాలంకాయన మున్యా శ్రయము - సృష్టిక్రమవివరణ - ధర్మనందనచరిత్రము - ఆదిశేష దర్శనము - ప్రతాపవతీ సోమదత్త వివాహము - చిత్రకంఠుడు సోమదత్త సుతం జూచుట - కన్నె నీయని కారణము - శ్రీగౌరీ కల్యాణము - దక్షయజ్ఞము - రతివిలాపము

6. చతుర్థాశ్వాసము ౧౩౯

నారదు రాక-గిరిజ జలక్రీడావిహారము - శివలీల - సప్తర్షిప్రయత్నము వివాహ సన్నాహములు - శివుని ప్రశ్న - శ్రీ కుసుమశ్రేష్ఠి - పుత్ర కామేష్ఠి యాగము-శ్రీ వాసవ కన్యావతార, విరూపాక్ష జనన ఘట్టము

7. పంచమాశ్వాసము ౧౮౩

నగరాలంకారము - శ్రీకన్యకాపరమేశ్వరీసందర్శనము - వాసవీ దర్శనము - రాజు మోహము-రాజుకోర్కె - వైశ్యులప్రత్యుత్తరము-విక్రముని హితబోధ - వాసవీకన్య స్థితి - కుసుమశ్రేష్ఠుని ప్రత్యుత్తరము - ఆంతరంగిక సభ - బాలనగరులు - విరూపాక్షుడు - 102 గోత్రములవారి ప్రత్యుత్తరము - 612 గోత్రములవారి యభిప్రాయము

8. షష్ఠాశ్వాసము ౨౩౩

వీరముష్టివాండ్రు - మహాయుగాంతరవిషయము - దనదునకు వీర కంకణము - శ్రీకన్యకాపరమేశ్వరీసాక్షాత్కారము - సమాధినురధుల చరిత్ర - బాలనగరులకు వైశ్యదంపతుల హితబోధ - అగ్నికుండ ములు - నగరాలంకారము - కుసుమకుసుమాంబికలు - అగ్నివేదికా ప్రవేశము - వైశ్యులసందేహము - జ్ఞానదృష్టిప్రదానము - వేదవతీ చరిత్రము - శ్రీకన్యకాంబపేర్లు వైశ్యకవీశ్వరులు - శ్రీవాసవాంబా పూజావిధానము - శాపము - అగ్నికుండప్రవేశము - అగ్నిదేవ వాసవీదేవి సంవాదము - భృగుపత్నివిషయము - అగ్నికి సమా దానము - మణిద్వీపకైలాసముల సందర్శనము - విష్ణువర్ధన మరణము - ఉత్తమలోకప్రాపణము - శ్రీరాజనరేంద్రుడు - శ్రీకాశ్యాది క్షేత్రసందర్శనము - శ్రీకాశి - శ్రాద్ధవిధానము - శ్రీవిరూపాక్షపట్టాభి షేకము - మహోత్సవము - రాజ్యము - ఫలితప్రార్థన

9. అంజలి——భాషాప్రవీణ గోళ్ల ఇందిరాదేవి ౩౦౯

10. కథా సంగ్రహము ౩౧౧

# ప్రథమాశ్వాసము

శ్రీ కన్యా పరమేశ్వరీమణికి వే చేతు న్న మోవాకముల్
వీకన్ సర్వజగన్నికాయ భరణావేల ప్రభావప్రభా
సాకారాత్మ నిరాకృతాత్మ చరితవ్యాహార నీ హార ధా
రాకూలంకషకున్ సమస్త శుభ సంప్రాప్త్యర్థమై నిచ్చలున్

నిరతంబున్ మదియందునుం బయట నెంతేబొల్చి భక్తాళికే
తెఱఁగైనట్టి సిలుంగురానటు సుఖాప్తి శ్రేణియొప్ప-న్నిరం
తరముం గంటికి ఱెప్పయట్లైనఁగు సీతానాయకుఁ సర్వశం
బర రుద్బ్రాండమయు న్నిరామయుని రామస్వామినిం గొల్చెదన్

ఇలువేల్పై యెప్పుడు మం
గళ కరుణాపాంగ భంగికమ్మఁగ మమ్మున్
సిలుఁగు లడఁచియు మనుచు శ్రీ
లలనాధిపు వేంకటేశు లలిని భజింతున్

అందని మ్రానిపండ వయి యందము జందముఁ జూపుచున్ సదా
డెందములం గలంచెదు కడిందిగ మా దృశ భక్తపాళి-నో
యిందిరరో! విరక్తి సుఖ మేనియుఁ గొల్పినచో నాకళ్ళ దా
మందిర మేఁగు పాటుఁగను మాదిరి గాంచెదరే కవీశ్వరుల్

తల్లీ నీదు పదారవిందముల నాత్మం బూని-నీ వీయ నా
ప్రోల్లాసం బెటు ద్రోచునమ్మ యిఁ గృతుల్ పొల్పొందగా జల్పుభా
స్వల్లీలాభరులౌ కవీశ్వరుల కీ ప్రాపంచికార్తిచ్ఛటా
దు ల్లేకుండ వరమ్ము లిమ్మనుచు నెంతు న్నిన్ను వాగ్దేవిరో

ప్రళయాగ్ని చేఁగన్ను ప్రజ్వరిల్లియు శ్రితు
లను జల్లనౌ చూడ్కిఁ గనెడివాఁడు
గళము హాలాహలాకరమయ్యు నార్తిహ
రములౌ వరములీఁ జెలంగువాఁడు
ఘోరాహి రాజన్య కుండలుండయ్యు-నా
కల్పాయువు నొసంగి కాచువాఁడు
బూది పూఁతంబూని-పునుకలం దాల్చియు
సకల సంపదలీయఁ జాలువాఁడు.

అతుల వైరాగ్య యుతుఁడయ్యు-నర్ధతనువు
నందు సుందరిం దాల్చిన యట్టి వాఁడు
బూచు లెకిమీఁడు మేటి దోబూచు లాఁడు
అయిన చంద్రశేఖరుఁడు మ మ్మరయు సతము

కామునకుం బునర్జనిని గల్గఁగఁ జేసిన పేర్మి ప్రోవు-ప్రో
ద్దామ దయావిశేషమునఁ దద్దయు నైహిక పారమార్థిక
శ్రీమహితత్వముల్ శ్రితులఁ జెందఁగఁ జేయు లసచ్చరిత్ర-ఆ
భూమి ధరాత్మజాత మముఁ బొల్పుగ నేలు ననల్పసత్కృపన్ ౭

గజాననున్ షడాననున్ జగన్నుత ప్రకారులన్
భజించెదన్ శివాజవం జవప్రభాకరిష్ణులన్
అజేయులన్ వృషాధిరా ణ్మృగాధిరా ట్చిఖీంద్రులన్
విజయ్యు మేట్కుటుంబ వాహబృందమున్ సదామదిన్.

శ్రీమద్రాఘవ నామ సంస్మరణ మర్థిం బొల్చుచో సాంజలిన్
ప్రేమం బొప్పఁగఁ జేరి భక్తులను నేవేళన్ గడున్ దోడు నీ
డై మవ్వంబుగ నెల్లసౌఖ్యములు వారందం దయం బ్రోచు ను
ద్దామజ్ఞాననిధానముం దలఁతు నాత్మన్ వాయుపుత్త్రాగ్రణిన్

శ్రీ సాయిబాబ నెంతున్
భాసుర కరుణా రస ప్రభావునిఁకన్ సం
తోసమ్ముగ శ్రీరమణున్
దాసావను నెంతు మౌని తతి రత్నంబున్

అమరేశ్వరు నాలయ మం
దమరిన యమృతమ్ముఁ దేర నరగి విజయవ
తమెయిన్ వచ్చిన సద్వి
క్రము విష్ణురథాత్ము నెంతు గరటామంతున్

తిరుపతి వేంకటేశ కవి ధీరుల మానస మందు గొల్చి-యే
డ్తెర గదవాల కృష్ణుని సుధీమణిభూషణు నింద్రకంటి భా
సుర కుల సుబ్బయార్యుఁ గవిసోముని విశ్వపు నింక నెంద ఱెం
దఱి నొకొక్కతక్కె కొలిచి నాడను వారికి దార్తు నంజలుల్ ౧౨

ఆంధ్ర గీర్వాణ వాగబ్ధులందు రత్న
కాంతులం గన్న సుకవుల గణన సేయఁ
బూను కన్న వారికి వారి-పుణ్య శీల
ములకు సాష్టాంగవందనంబుల నొనర్తు

పది యేండ్లప్పటి నుండియుం దహతహల్ స్వాంతంబును గైతకై
యొదవన్ వైశ్యుల పట్టి నొట సిరి నెంతో కూర్చు వీళ్లుండియున్
ముదముం గైతకె పూన సమ్మదము సంపూర్ణంబుగానొందు నొం
పుదయం గొల్పిన సద్రసజ్ఞుల కివే మ్రొక్కుల్ సమర్పించెదన్

నూటిబ్బంద్రగు గోత్రసంఖ్యఁ దగుచున్ భూమండలిం బొల్చుకై
రాటోదార కులానఁ బుట్టుటను నర్యశ్రేణి యద్దానకున్
బాటిన్ సర్వశుభమ్ము లిచ్చు కులదైవశ్రేష్ఠమౌ తల్లి నె
చ్చోటన్ వాసవకన్యకం గొలువఁగా జొప్పొందు మత్కృత్యమై

అల కన్యాపరమేశ్వరీ శుభ కథా వ్యాహార మందందు రీ
తుల నెన్నింటినొ చెంది యుండనవి యేదో చేతనై నంత నే
నెలమిం జూచియు నీప్రబంధమును నిర్మింపం దగెన్ వైశ్యమం
డలికిన్ మండనమై మహాఘచయ వన్యాఖండనంబై తగన్

స్కంద పురాణ మందుఁ గల గాథ యిదంచును జిత్పురీవరం
బందును [చిత్తూరు] ముద్రితంబయినయట్టి కృతింగల దద్దికాంచగా
స్కందపురాణపుం బ్రతినొకండును గాంచఁగ గానరాదు—తా
మెందునఁ బాఠభేదమెది యెమ్మెయి గాంచిరొ చిత్పురీబుధుల్ ౧౭

ధారనుబట్టి చూడ సముదారముగాఁ గనుపించుఁగాని—గా
ధారచనంబు గాంచినను దక్కిన ధర్మవిధాన నిర్ణయ
శ్రీరుచిరత్వ మెంచినను జేరును స్కాందపురాణమందు ని
చ్చారిత యంచుఁ దోఁచునొకొ? చల్పిన మార్పులవేవి యుండునో

అల శ్రీనాథుఁడు నైషధాంధ్రమును వ్రాయంబూని యౌచిత్యమం
దెలమిం జెంది తదన్యమున్ విడుచుటన్ హృత్పద్మ మందెంచి నా
కాలయం దోఁచిన రీతి నౌచితిని నాయుల్లంబున న్నిర్ణయం
బు లలిన్ శ్రీకరి కన్యకాంబ చరితంబుం జేతు కావ్యంబుగన్

కొంచెమొ గొప్పయో చదివికొంటిని సంస్కృతమాంధ్రభాష యం
దించుక యందు నందుఁ దనియించు కవిత్వము చేయు టందు రా
జించి శతావధానకృతినీతి సభాంతరకీర్తిఁ గంటి—ని
ట్లంచితమైన సౌరుఁ గననయ్యె ధనం బొకఁడే కొఱంతగన్

ధనమే సాధన మెల్ల కార్యముల కద్దానన్ ఘనత్వంబు లే
ని నరుం డెందులకుం దగం డనుట యెందే నెంతయేఁ గానుపిం
చి ననున్ బ్రాంచిత సత్కవిత్వరచనం జిత్తంబు పొల్పొందు వా
నిని సామాన్యముగాఁ గృపం గనదు శ్రీనీరేజపత్త్రాక్షియున్

ఐనను గైసరుల్ తమకు నచ్చిన సత్కవితాలతాంగిపై
మూనిన పేర్మి సంస్కృతిని నొప్పిన చిక్కుల నెల్ల నోర్చి వి
జ్ఞానలసత్కృతిప్రతతి సల్ప ననల్పతర శ్రమంబునుం
బూనెడి వారు వారలకు ముఖ్య మదో? సిరియో? తలంపగన్ ౨౨

కరముం జిన్నతనంబునుండి కవితా కంజాత పత్త్రాక్షిపై
నారిమం జెంది తదీయలాలనలచే నుల్లంబు రంజిల్లి త
త్సరసత్వంబునఁజొక్కి యెన్నొకృతులన్ శక్త్యంచితస్ఫూర్తిమై
విరచింపం దగు నేఁబదేఁడులకు దాపే యయ్యె నాప్రాయమున్

ప్రాయము పైకొనంగ నిరపాయము గాని తనుప్రకారమా
ప్యాయము గాక యున్నను నభంగురభంగి సుమంగళప్రద
ధ్యేయపదారవింద మయి దీప్తి చెలంగెడి కన్యకాంబ దౌ
శ్రీయుత సచ్చరిత్రము పొరిం దగు కావ్యము సేయ నెంచియున్

ఎందఱో వ్రాసినార లిది యిందనుకన్ మఱి యింక నెందఱో
పొందుగ వ్రాయుచుండిరటు బొల్చియు బుఱ్ఱెకు నొక్కబుద్ధియం
చుం దలపోసి వైశ్యతను చొప్పడినట్టి ఫలం బటంచు నీ
సుందర గాథ కావ్య మగుచుం దగ వ్రాయ దలంచితిన్ రహిన్

అంకిత మీ ప్రబంధము పరాంబిక యౌ నల కన్యకాంబకున్
బొంకముమై నొనర్చునెడఁ బుణ్య మగున్ గులగౌరవంబు, ని
శ్శంకముగా నెసంగు నిఁక సజ్జను లారసి నాదుపైనఁ గూ
లంకషమైన పేర్మి గనులా గగు నంచుఁ దలంచి యెంతయున్

కడు రహిన్ సృష్ట్యాదిగతములౌ ఋష్యర్థ
గగన శర వసు దిక్పాలపాండ
వా జేందువర్షంబు (195885047) లయిన గల్యాది ఋ
ష్యాగ మా కాశేంద్రి యాబ్దములుఁ (5047) గ

దిక్పూరి వసు చంద్ర (1868) దీప్తిని శాలివా
హనసమల్ తగ విక్రమాబ్దములు గు
ణాకాశ శూన్యనేత్రా ఢ్య (2003) వర్షంబు లో
వ్యయవత్సర జ్యేష్ఠ మసిత దశమి

సోమవాసరం బింగిలీషు పదితొమ్మి
ది శతముల నలువదియాఱు తీఱగు సమ
జూ నిరువది నాల్గవ తేది సొరిదిఁ బూని
యెల్ల శుభములఁ గాంచఁగ నెదఁ దలంచి

[1946 సంవత్సరం—జూన్ 24 వ తేది—సోమవారము]

# షష్ఠ్యంతములు

శ్రీ కన్యా పరమేశ్వరి
కాకీర్ణ సురౌఘ మకుట హారిమణిగణ
ప్రాకటరుచిశోభి పదయు
గీ కంజాతకును జ్యేష్ఠగిరి మందిరకున్

శారదైందవ జ్యోత్స్నాహసన సుమంద
హాసరేఖామిళ దనుగ్రహ విలసత్క
టాక్ష భంగీ తరంగ రంగాననకును
కుసుమనామ వైశ్యశ్రేష్ఠు కొమరితకును

అర్యాల పేఁట లున్న పురులందున నెల్లెడ వైభవప్రభా
ధుర్యతమైఁ జెలంగి కడుఁ దోరముగా శ్రితపాలనక్రియన్
జర్యఁగ బూని నట్టి సరసంబగు పేర్మికి నగ్గమైన స
త్కార్యకుఁ గన్యకాంబకును ఖండిత శత్రుచమూకదంబకున్

ఏమె త్రిమూర్తిబృందమున కింకవిరాట్టున కాదిమాతయై
భూమెల కారణంబయి ప్రభుత్వము నెల్లెడఁ జేయుచుండునో
ఆమెకు సర్వదా మధురతా నఘతా ఘనతాప్రధాన దే
వీమణికిం బరాంబకుఁ బవిత్రకు వాసవకన్యకాంబకున్

వ. అనంతకోటి శిరస్సాష్టాంగ దండప్రణామ పురస్స
రాంకిత కృతిగా.

తుంగభద్రాతీర రంగమౌ కర్నూల
వైశ్యరత్నము దోమవంశ్యుఁడయిన
గోవిందసుధి సతి కోటాంబ గర్భంబు
నఁదొలి కొడుక నై జననమునొంది
శ్రీ రామచంద్ర పాదారవిందాభివం
దనలబ్ధ కవితాశతావధాన
కరణచణుఁడ స్కూల గాలెజిఁ బండితు
కరణిని బెక్కేండ్లు గడపి యుంటి

వేంకటస్వామిగుప్త నామాంకితుండ
కృష్ణవేణీ నదీ తీర హృద్యమింద్ర
కీల నగ గృహ కనకదుర్గాలసత్క
టాక్షగ విజయవాటియం దలరువాఁడ

వ. ఒనర్చునట్టి సమస్త కలికల్మషాపనోదన పారీణంబును, వందారు సమస్తార్యవైశ్యబృందార్ధ కృత సమస్త సత్పదవీ నిర్మాణంబును నయిన శ్రీమత్కన్యకా పురాణంబునాంధ్రపద్య కావ్యరూప గ్రంథంబునకుఁ గథా క్రమం బెట్టులన్నను. ౩౪

# కథా ప్రారంభము

వ. పుణ్యక్షేత్రమును సమస్తదోషాపనోదనంబును నవ వర్గ మార్గదర్శకంబును నయిన మహిమాగణ్యం బయిన నైమిశారణ్యంబునం దొకనాఁడు సకల బ్రహ్మోపాసకులయిన శౌనకాది మహామునులు కొలువుందీర్చియుండిన సమయంబునందు

అందుల కేఁగుదెంచి సముదంచిత సద్గుణపూతుఁడున్ శుభా
స్పంద సమస్తవేదచయ సారపురాణ నిదాన బోధనా
నందసమేతుఁడైన మునినాధుఁడు సూతుఁడు రాఁగ నాతనిం
జందము నంద మొందఁగనుసన్మునిచంద్రులు వారు గాంచియున్

నీ దగు రాక రాక వలె నిక్కము మాకు మనశ్చకోరకా
మోదముఁ జాలఁ గూర్చినది పుణ్యుఁడ వీ వరుదెంచినంత నీ
దౌ దురితాపనోదనసమంచిత వాగ్విభవంబునన్ మహా
హ్లాదముతో వినం దగుఁ గదా! సముదార కథానకంబులన్

వ. అని శౌనకాది మహామును లాడినంత సూతపౌరాణికోత్తముండు వినయ వినమితోత్తమాంగుండై సమస్కరించి యిట్లు వచియించె. ౩౦

మీరు మహానుభావులు నమేయ పురాణనికాయ వేదవి
ద్యా రసికప్రకారులును తాదృశులై తగు మీదు చెంత నే
నే రహి మీ రెఱుంగని వెవేనియు బల్కెడు నైన మీ రిటం
గోరిన దానఁ దోఁచినది కొంచెము పల్కెద నాలకింపుఁడీ

అనవుడు శౌనకుం డనియె నడ్గిన చొప్పన మేల్కథావళిన్
గొనబుఁగఁ జెప్పువాఁడ నని కూర్మిని బల్కితి వంతెచాలు నో
మునివర ! సూత ! మాకు వినఁబూనిక వైశ్యుల దేవి కన్యకాం
బను గుఱియించి పెల్లెసఁగు బల్కుము పేర్మిని వైశ్యసత్కథన్

నావుడు శ్రీకన్యాంబా
పావన సత్కథను సూతవరమునిమణి గం
గావాహినిఁ బోలిన సు
శ్రీవాగ్గతి శౌనకాది ఋషులకుఁ బల్కెన్

శ్రీ కన్యకాపురాణము
వీఁకం దగునవ్యఫణితి - విజ్ఞ మనోజ్ఞ
ప్రాకటతర సౌందర్యర
సాకర మది యద్ది వినిచె నట సూతుఁడిటుల్ ౪౨

## శ్రీ మన్మణి ద్వీపము

శ్రీ వైకుంఠ పురాబ్జ గర్భపద గౌరీనాధ లోకాల కెం
తో విన్నాణపు దవ్వు నందెసఁగి సంతోషం బదోషంబుని

త్యావేలక్రియఁ గొల్పు చందమున కిమ్మైనట్టి యావాసమై
ధీ విన్యాస విలాసమై కడు మణిద్వీపంబు పెంపొందెడిన్

ఆగమబృంద వర్ణన సహస్రము లేనియుఁ జాలిరాక వి
ద్యాగరిమాభిరాము లయినట్టి మునీశ్వరు లేని, శక్తిశో
భా గణనం దలిర్చు సురవారము లేని, నుతింప రాక యా
భోగ విభాయుతం బగుచుఁ బొల్చు నొగిన్ రతనాల దీవియున్

రతనా ల్రాలుఁ బసిండియంటిటులమేఁడల్ డాలుగా నొప్ప న
ద్భుత మౌ నందముతోడఁ గల్పకచయ ప్రోద్య ల్లతాపుష్పరం
జితమై వైష్ణవ శైవ పాద్మజ వర శ్రేణీ తపస్సత్ఫల
ప్రతతిప్రాప్యతకుం గరం బరుదుగాఁ బర్వున్ మణి ద్వీపమున్

మగణా గోడలు నింక గారుడమణీమాన్యస్థలుల్ పద్మరా
గగణ స్ఫాటిక పుష్యరాగ విలస ద్వాతాయన వ్రాతము
న్నొగి వైడూర్య సురేంద్రనీలరుచులన్ బొల్పొందు భూభాగమ
చ్చుగమెచ్చుం గరమున్ విరాగులకు నిచ్చుందా మణిద్వీపమున్ ౪౫

రతనాల నిగనిగల్ మగరాల ధగధగల్
మృగనాభి ఘుగఘుగల్ తగు నరుఁగులు
ఇంద్రనీలము డాలు నింపుగా దనఁజాలు
సౌరు గల్గిన ప్రతీహారచయము
శారదైందవ రోచి రారభటీస్పర్ధి
సుధవళప్రాకార శోభి లీల

పగడంబు జగడంబు జగడంబు గల కంబు
కంఠీవితా నోష్ఠగణము సొంపు

ఆదిశక్తి సహస్రనామాళి పఠన
పాఠన శుకశారీ శ్రుతిపర్వ రవము
కల్పలతికా మతల్లి కానల్పతరని
కుంజపుంజ రంజిత మల్లె గొనబు దీవి

హరి హర కంజ గర్భులుఁ దదంబుజనేత్రిలు నాఁడి పాఁడి భృ
త్యరుచిరభంగి నూనఁ జతురాగమముల్ చతురత్వయుక్తిదం
బరమున సన్నుతుల్ జరుపు మవ్వము నివ్వటిలం బరాంబికా
చరణపవిత్రి తంబయి పసం దగు నా రతనాల దీవియున్

సార సుధారసాంచిత లసన్మణిదీర్ఘిక లందెసంగు బం
గారు హొరంగు పద్మముల కర్ణికలన్ ముసు రాడు భృంగ భృం
గీరవ మంగళప్రకృతి (తతి) కీర్తన మోంకృతిరూప మొంది దే
వేరిని న ప్పరాంబికను వేవిధులన్ వినుతించి నట్లగున్

బాలరసాల సాల నవపల్లవసల్లలితాశనాన్యపు
ష్టాలపనంబు జిల్కగములాఁడు నకర్తృకవాఙ్నికాయ మిం
కోలిని శారికానికర మూనెడి భాషణ సొంపు వేణుగా
నా లఘు సుందరత్వ మరుదారు నటన్ నిరతంబు గ్రిందుగన్ ౹౹౨౫

వ. బ్రహ్మదేవుండు బ్రహ్మాక్షరంబులతోడను, వాణి

వీణాగా నానేక కళలతోడను, శ్రీమన్నారాయణుం డనేక లీలా విశేషంబులతోడను, శ్రీమహాలక్ష్మీదేవి శృంగారంబయిన పరిష్కారంబులతోడను, శంకరుండు తత్త్వవాక్క థనంబుల తోడను, గంగా గౌరీ దేవులు మహోపచారంబుల తోడను, సంతోసంబు గల్గింపుచుండ-నాశ్రిత జనవిపత్పరం పరా నిర్వాపణ ధూర్వహాఖర్వ యయిన వందారుబ్రహ్మాదిక సమస్త బృందారక బృందవసిష్ఠాదిక మహామునీశ్వర-యక్ష సిద్ధ గంధర్వ గరుడోరగ నర ఖేచరాదిక భరితంబయిన మహాసభాంతరంబు నందు నొకట ౫౦

# శ్రీ పరాంబ

శ్రీదేవియును శారదాదేవియును పీవ
నలఁ గొని యిరుకెలంకులను విసర
తొలి కైసరుండైన నలువ నాల్గు మొగాల
జయబిరుదంబులఁజదువుచుండ
బోటి వేసమునాఁటి నీటు లన్నియుఁ జూపి
వెన్నుఁ డెల్లరిని నవ్వించుచుండ
ఆకాశకేశుఁ"దేమాజ్ఞ" యంచుం బల్కి
కైమోడ్పుతోడను గాఁచియుండ

నిండు కొలువుండి యెల్ల బ్రహ్మాండములను
నేరుపయినట్టి దృష్టిపరిసారముననె

ప్రోఁచుచుండు పరాంబిక పొల్పుతోడ
అద్భుతమగు వైభవముతో నలరుచుండె

ఆగమముల్ తదంగములు నాగమశీలములుం దపంబులున్
బా గగు రూపముల్ గొని సభాజన భాజనవర్ణనంబు లు
ద్యోగము లూని సల్ప లసదూర్జితసత్కరుణన్ రహించి పా
పాగ శతారమై తగెఁ బరాంబ మహామణి ధర్మపీఠికన్ ౪౩

చారు చిరత్నరత్నవిలసన్నిజ పావనపాదపీఠి బృం
దారకపంక్తి వ్రాలి నమన మ్మొనరింపఁగ వారి మేటి కో
టీరమణిప్రభల్ తగి కడిందిగ రంజిత మాత్మపాద పం
కేరుహయుగ్మముం జలుప నెమ్మినెసంగుఁ బరాంబ యిచ్చటన్

నిజరోమాంకురపాళియం దఖిలమౌ సరేజ జాండాళి మేల్
భజియింపం దగు నవ్విరాట్టువు నిఁకన్ బ్రహ్మాది మూర్తిత్రయం
బు జనిం బొంది ప్రవర్తనం దనరు నేపూతాతిపూత ప్రభా
వ జగానిద్ధపుఁ బేర్మిఁ దజ్జనని యొప్పం బొల్చుఁ దద్ద్వీపమున్

ఆయమ దైన వైభవము నాయమ దౌ కరుణావిశేష మిం
కాయమ దౌ ప్రభావము నజాంబుజనేత్రహరాదులేని 'సే
దో యిసుమంతయేని నన నొప్పిన చేవ గలారు గారు,' నా
తాయికి మించ నౌ మహిమ డాలున నొప్పెడినప్పరాంబయున్

వ. అప్పరాంబయే పరాశక్తియును, యోగమాయయును

నా(బడు-నామెయే యఖిలంబునకు నధికారిణి. ఆమెను శాసించు నధికారి యెవ్వా(డును లే(డు. గాన నామె యనీశ్వరి, నిరీశ్వర, కన్యక నా(బడు. ఆజగన్మాతయే సాకార నిరాకారత్వములతోను సగుణ యగుచు-నిర్గుణ యగుచు( దనరు. ప్రతి రోమకూపంబు నందును బ్రహ్మాండంబు లనేకంబులు దనరు. మహావిరాట్టువు ఈయమయొక్క యంశంబనియును-సృష్టి స్థితి లయంబుల పొంటె బ్రహ్మ విష్ణు మహేశ్వరు లీ దేవేరివల్ల నేర్పడిరనియు( దెలియనగు. దయానిధి యగు నిమ్మాత విశ్వానుగ్రహార్థంబుగా నానాసందర్భము లనుకూలించుపొంటె - (1) దుర్గ (2) భద్ర కాళి (3) విజయ (4) వైష్ణవి (5) కుముద (6) చండిక (7) కృష్ణ (8) మాధవి (9) కన్యక (10) మాయ (11) నారాయణి (12) ఈశాన (13) శారద (14) అంబిక* యనెడి పదునాల్గు నామంబులతో విశ్వరక్షక స్వరూపంబులం ధరించి, నానావిధ చిత్ర విచిత్ర మనోహర వర్ణనాతీత లీలా మహత్వముతో( దనరు. ఇప్పదునాల్గు రూపంబులతో నిప్ప రాంబ మణిద్వీపంబు నందె వేర్వేఱు నెడల కల్పాగ మందార లతాసుధామయ కేళాకూళి మనోజ్ఞ పారిజాత కుంజపుంజ వరటా రాజ హంస శుక పిక శారికా పరిమండితారామ మధ్యంబున విరాజిల్లు. చారుచిరత్న నానా విధ రత్నమయ భవనంబుల బ్రహ్మేంద్రాది బృందారకబృంద వందితపదారవిందయై, అనంత కోటిదేవ దేవాంగనా, మౌని మౌన్యంగనా, దిక్పాలక, వసు,

*శ్రీమద్భాగవతదశమస్కంధ పూర్వభాగము-యోగమాయాఘట్టము

రుద్రాది సేవ్యమానయై, బహుకోటి సూర్య చంద్ర కాంతి విరాజమానయై భాసిల్లుచుండు. తచ్చతుర్దశ మహారూపంబుల యందు క్రోధగుణ ప్రాధాన్యం బే మాత్రమును లేక - మధు మాంసాది తామసపూజాద్రవ్యగ్రహణ రహితయయి, ప్రశాంత మనోహర గాంభీర్య కారుణ్య మాధుర్యధుర్యయై, శ్రీ కన్యాంబా మహాదేవి ప్రకాశించు. ఇయ్యారూపంబులనఁగా నమ్మహాదేవి పరాంబయే వివిధంబులగు స్వరూపంబులతోఁ గన్పట్టుచుండు. అత్తెఱం గమ్మహాదేవి మహామహత్త్వంబ. మఱియును,

ఒగి న ద్దేవి మహత్త్వలీల యది యేమో? బ్రహ్మవిష్ణ్వీశదే
వగణం బక్కడ కేఁగ - నప్డపుడుఁ బుంస్త్వంబంతయున్ వీడి స్త్రీ
లుగ మార్పొందియు నెల్లరా శుభనుగొల్తు ర్దీని మర్మంబు వా
రు గనన్ లే దన నింక నేరి తరమో రూపింపఁ దల్లీలలన్

శ్రీ దేవియు, భూదేవియు
నాఁ దనరెడి సజ్జననికి నానా ఽఽ కృతులుం
బ్రోదిం దగుఁబదునాల్గట
నౌదార్యము గాంచుచుండు-నయ్యాకృతులన్

శ్రీ కన్యాపరమేశ్వరి
లోకన్యాసావన సదలోల మనోజ్ఞ
శ్రీకర కరుణాపూరిత
ప్రాకటముగఁ దనరు నల్ల రతనాల్దీవిన్ ౬౦

నైకవిధ బ్రహ్మఋషిపరివేష్టితుం
డగు వాఙ్మనోహరుం డలరుచుండ
సనక సనందన మునిప బృందారక
బృందవంద్యుఁడు శ్రీహరి తగ నొకట
రుద్ర ప్రమథగణ భద్రవైభవుఁడు భ
వానీశుఁడొకట తేవం దలిర్ప
ఉపనిషన్నికరంబు నొగి నిగ మాగమం
బులు దాస్యముం జల్పఁ బొనర నొకట
ఆగమ పురాణ శాస్త్రేతిహాసవేత్తృ
నైకవిధ తపస్సిద్ధులు హస్తములను
వేత్ర దండంబులం బూని వెలయుచుండ
ఒక సభా భవనమం దొరిమ మించి

బంగరు టరుంగు మీఁదం దురంగలించు
పలుమెఱుంగుల రంగులం బరఁగు నిగని
గనిగఁ దగు రతనాల సింగంపు గద్దె
మీఁదఁ బరమ సౌందర్యంబు మేల్మి దనర

బహూరవద్యుతులను బరిభవింపందగు
కురువింద మణి కాంతి భరము దనర
కోటిచంద్రుల డాలు గోట మీటం జాలు
మగఱాల ధగధగల్ మవ్వ మెసఁగ

మందారపరిమళామంద మందానిల
బృందంబు లెల్లెడ నందమిడఁగ
సామాగ మామల స్వర మనోహరగాన
మాత్మీయసన్నుతి నాచరింప
సకల సౌఖ్య కారణ కారణకలితంబు
ముక్తిమయ పావనాకారము నయినట్టి
యా సభాంతరంబందు సింహాసనమున
కన్యకాపరమేశ్వరి ఘనత మెఱసె

అజ హరిశంభు లొక్కెడ మహామరు లొక్కెడ దిక్పయాధిప
వ్రజ మొక వంక మేటి మునివర్యులొకంటను జేరియుం దనున్
భజన యొనర్పఁగా సకల పద్మభవాండగణైక మాతతా
విజయమయమ్ముగాఁగ మణిపీఠి నెసంగెను గన్యకాంబయున్

అల పదునాలు గై తగు పరాంబిక రూపము లొప్పనొక్క యొ
క్కలసిత నైజరూప మొగిఁ గ్రాలెడిచో నొక యొక్క యాశ్రితా
త్మలకును మోదమిచ్చుటకు ముచ్చటఁజెందెడి నప్పరాంబ-యం
దొలసెడి కన్యకాంబ దరి నుండిరి వైశ్యకులశ్రితుల్ కడున్

అట్టి వైశ్య లా నాశ్రితులందు నేఁడు
నూర్ల పదునాల్గు (714) గోత్రాలనుం దనరి, రిఁ
కందును సమాధిముని ముఖ్యులైన నూట
రెండు గోత్రాల వార్ముఖ్యరీతిఁ దగిరి

## సమాధియను వైశ్యఋషి

అల్ల సమాధి వైశ్యుఁడు మహామునివర్యుఁడు ధర్మకర్మర
తోల్లసితుండు- ముక్తిసతి యుల్లము నచ్చిన వాఁడు, వాడు గా
కెల్లెడ నొప్పు వర్తన మ దెచ్చి పొరిన్ సురథాభిధానభూ
వల్లభమౌళి కోల్పడిన ప్రాజ్యపురాజ్యమువాని గ్రమ్మరం
జెల్లరె! నాఁగఁ జెందునటుఁజేసెను వాసిగఁ గీర్తినిండఁగన్

ఆ సమాధి మహర్షి లోనయిన వారు
వైశ్యరత్నముల్ కన్యకాంబా పదార
విందవందారుబృంద మై వెలసిరి కడు
నల మహాదేవి సత్కృప కగ్గ మగుచు

## శ్రీ కన్యకా పరమేశ్వరి యాజ్ఞ

ఊరుభవు లైన యా భక్తవారము దయ
జూచు టారయ లోకోరు సుఖద మంచు
నల్లతల్లి నిర్ణయ మాత్మయందుఁ బూని
యెంతయో కృపతో వారి నేలుచుండి

ఊరుభవుల్ మహోరుగతి నుల్లసనంబును విశ్వమందుఁ జె
న్నారఁగఁ జేయఁ జాలిన ఘనంబగు యోగ్యత గల్గుటన్-దగన్

---

* శ్రీ బ్రహ్మవైవర్త మహాపురాణము—ప్రకృతి ఖండము, సప్తమాశ్వాసము—అనగా 61 వ అధ్యాయము.

వారిని భూతలంబునకుఁ బంపిన నైహిక పారమార్థిక
శ్రీ రుచిరత్వముఁ భువికి జేర్తురు చాల నటంచు నెంచియున్

అందులకుఁ దగు పద్ధతి యలరునట్లు
ఏడు వందల పదునాలు గెసఁగు గోత్ర
ము లగు వైశ్యులఁ గన్యాంబ పోల నపుడు
గాంచి యిల్లనుఁ గరుణారసాంచితముగ

ఇచట వసించు నెల్లరును నేదగు లోకమునందునేని నా
త్రిచయము గల్గుచో నటఁ బోరిం ప్రభవించి యపాంతరాత్మలై
ప్రచురపు ధర్మదీక్షను నభంగురభంగి చెలంగ బూని ము
క్తి చపలనేత్ర పొం దట నొగిం గల వారి కొసంగఁగా నగున్

కలియం దా కలి కాఁకలి
యలఘు వగుట భువిని మానవాళి నధర్మా
త్ములఁ జేసి నరక మొందన్
జలిపెడి నల రీతి మార్పఁ జను మీ ర్సనియున్ ౨౪

వ. ఆ రీతిని

నెఱిని శ్రీకన్యాంబ "నిజవైభవంబెల్ల
ధరణీతలంబందుఁ దనర వలయు"
నంచు సంకల్పించి యాత్మీయ పార్షద
వైశ్యమునులతోడఁ బరఁగ నుంద్రి

మూర్త్యాది కొంశ్రిత పుంజంబుతో వచ్చి
క్షోణీస్థలిన్ "పెనుగొండ" యనఁగ
బృహదద్రి పేరం బురి న్నెలకొల్పి, శం
ఖుశ్రేష్ఠి యవతారమునగు కుసుమ
శ్రేష్ఠి కొమరిత తానయి క్షితిని బుట్టి
"నగరశివ జనార్దనులు భాస్కరుఁడు" ననఁ ద్రి
మూర్తులును "వింధ్యవాసినీ పుల్లవనజ
నయనయును గోన కమలయున్ శారదాంబ
యు" నన వారిం గోరె నుర్విఁ బొడమ

శ్రీ కన్యా పరమేశ్వరీమణియటుల్ జెన్నార దీవ్యన్నిజా
స్తోక శ్రీకర వైభవం బఖిలమున్ క్షోణిం దగం జేర్చె నం
శాకార క్రియమైఁ గలిన్ వృజినమొయ్యం బాఁపిధర్మంబు నే
కాకారంబుగ నిల్పఁగా వలయు నం చారంగ లో నెంచియున్

వ. అప్పు డమ్మహాదేవి తన పార్షద వైశ్య మహర్షి బృందంబుతో నిట్లు వచియించె.

కలియుగమున మీ రెల్లరు
నిలయందుం బొడమి మాన్యు లెంచు సునిష్ఠన్
వెలసిన వర్తనమై స
ద్వ్యలకున్ మేల్బంతు లగుచుఁ బొనరన్ వలయున్ ౭౮

వ. అందులకుఁ దగిన యాజ్ఞాపనము లెల్లఁ గైలాసంబునఁ బార్వతీమనోహరుఁడు మీకొసరించును కావున మీరెల్లరు నఘనాశంకరుండయిన శంకరుం గొలువఁ జను నని శ్రీ కన్యకా పరమేశ్వరి పల్కి యెండియు నిట్లు వక్కాణించె

ఏడు వందల పదునాలు గెసఁగు గోత్ర
ములను నూట రెం డగుగోత్రములు కరంబు
నా కృపకుఁ బాత్రమైన విన్నాణము మెయి
లోకమం దెచ్చువారు సుశ్లోకు లగుచు

## వైశ్యుల దుఃఖము

అమ్మెయిఁ గన్యకాంబ పలు కాడిన వీనుల కద్ది వజ్రపా
తమ్ముగ సోఁకి నంత నది దబ్బఱయా ? నిజమా ? యటన్న భా
వమ్మునఁ గొంత సేపు నల వైశ్య లెదం గని "కల్ల గాదు ని
క్కమ్మ" యటం చెఱింగి కలఁగందగె వార లభంగురంబుగన్.

కొందఱు మూర్ఛ వోయి రిఁకఁ గొందఱు పెట్టిరి వెఱ్ఱికేకలం
గొందఱు 'కుయ్యో! మొఱ్ఱో!' యనిగోలగనేడ్వఁగనయ్యెగొందఱుం
జిందులఁద్రొక్కసాఁగి రనుకొంటకుఁగూడ భయంబునొందియుం
గొందఱు మాట దక్కి యట నుం దనరారిరి గోడ బొమ్మలై ౧౧

ఇమ్మెయిఁ జాల సేపు తమ రెవ్వరో ? ఆ సభయేదో ? యన్న భే
దమ్ము నెఱుంగ లేక యటఁ దగ్గ కిరాటనికాయ మెల్ల దై

ర్యమ్ములు సన్నగిల్లి మఱి యా పయి మెల్లగఁ దెల్పెనంది దం
డమ్ములు కన్యకాంబకు దనర్చియుఁ బల్కిరి నీతిభీతులన్

## వైశ్యుల విజ్ఞప్తి

అంబా! మా మన వాలకింప వలె నీ దైనట్టి మేల్పన్నిధా
నంబు న్నిత్య నితాంత శాంతియుత హృన్నాళీకము ల్మాని యం
దంబుం జెందుచుఁ గొల్చుచుందు మొక బాధం జెంద కీనాఁడు నీ
కుం బల్కం దగు నొక్కొ మా పయిఁగడుం గోపాన నిమ్మొక్కఁగన్

సకలాంభోజ భవాండభాండపరిరక్షాదక్ష వైనట్టి నీ
వొకసంకల్పము సల్పుదేని జననీ! యుద్భూతినిం జెంద దొ
క్కొ కడుందుర్లభమైన యేదయిన న ట్లొప్పొందియున్ మాకు నీ
వకటా! నీ దరి వాయ నెందులకు నిట్లాజ్ఞాపనం జేయఁగన్

సకలంబైన చ రాచ రాచరణ పుం జారిత్రకందంబ పై
న కడుం జిత్రవిచిత్రలీల వగు కన్యాదేవిరో! నీవు లో
నొక యింతెంచినఁ గాని దేః దటులుగా నుండన్ మమున్ భూమి కేఁ
గి కలిన్ వందుర నేటి కాజ్ఞ యిదెదో? కీల్కొల్పు మాపైఁగృపన్

మందారప్రసవప్రతాన విగళ న్మారంద మాధుర్యసా
నందాళిన్ మదనంబుఁ జేరఁ జను మన్న ట్లుండుఁ గాదొక్కొ మ
మ్మిందున్ వీడి భువిం జనించుటకుఁ బొండీ! పార్వతీశాలయం
బందుం జంద్రకళావతంసు మతిమై హర్షొంద నం చీవనన్ ౮౭

వారక శారదేందు పదవార సుహృష్టచకోరకంబు నీ
హార యుతప్రదేశములకై చనఁ జేయుట గాదె? తల్లి! వం
దారుమనోహరంబయిన తావక సన్నిధి పేడి యొండెడం
జేరఁగ మాకు నిమ్ముదలఁ జేయుట చూడ సమస్త నేత్రిరో!

వెలఁయగఁ గొంత కాల మిట వీఁడి యుమారమణాంతికంబునం
దొలయఁగఁ బొందటన్న యెడ నొక్కవితంబగు నట్లుఁ గాకభూ
వలయముఁ జేరఁ బొందనిన భావము డీల్పడ సాగె మమ్మ ని
స్తులకరుణావిశేషమునఁ జూడఁగదె? జగదేకమాతరో!

హరికడనేని శంకరుని యందను నేనియు నుండి రం డటం
చొరిమను బల్కుదేని శుభరో! యదియుం దగ నొక్కయందమం
చరిగియుఁ గొంత కాల మట నాజగదీశుల పేర్మి నందియుం
బొరి నిట రాఁగ మాకు నొక మోదమకా? యటు గాక నీ విటన్

అవనికి నేము పోవలయునంచు నటం జను ముందు శంభు చెం
త వెసను గొన్ని నాళ్లు మని ధారుణిఁ జేరుఁ డటంచు బల్కినా
వవును కరంబు దుర్భరముగా! భవదంఘ్రి వియోగ మంబ! యి
ట్లవునెడ మామనంబు సముదారతరవ్యథ నొందు మిక్కిలిన్

వ. అని యా జగదంబ భక్తరత్నంబులైన వైశ్యులు కరంబు దుఃఖంబు నొందిరి. అందు నూటరెండు గోత్రాలవా రాదేవేరి సన్నిధానంబును విడనాడుటకుఁ గడుంగడు వందిరి కుందుచుండఁగా న ప్పరమేశ్వరియుఁ గొండొక నిజభావంబున భావించి యిట్లు వక్కాణించె. కా౨

# శ్రీదేవి తెల్పిన వివరణము

ఇది సంకల్పము మార్ప రానిది కరంబీ రెల్ల నియ్యాన చొ
ప్పొదవన్ ధారుణి కేఁగఁ జెల్లు నట మత్ప్రోద్యన్మతిం బొల్చు వా
ర్మద మొప్ప న్నను వేగఁ జేరునటు సంపూర్ణాదృతిం జేసెదర్
సదనూనాద్భుత శంభుసన్నిధిఁ జనన్ సన్నాహముం జల్పుఁడీ

నిసుఁగు ! లిదాలకింపుఁడీ ! అనిందితమైన జగత్ప్రమోదముం
బొసఁగ నపాంతరాత్మ లయిపోవుచు నుంటిరి. దీని మార్చుచొ
ప్పెసఁగదు నాఁగ వైశ్యమణు లెంతయు నద్ది మహాప్రసాద మం
చన దది కానిభక్తి నని యంబ పదంబుల కోలి మ్రొక్కినన్

వ. మరియు శ్రీ కన్యాంబ వారి కిట్లనియె.

కైలాసంబు కపర్ది వాస మటకుం గానంగ నైనంత ద
వ్వైలా గొప్ప 'మహాగిరీంద్ర' మను నీహారాద్రి శృంగం బొకం
డే లీలం గర మంద చందముల నెన్నే శైలముల్ దానికిం
బోలం జాలవు సన్మహత్త్వమునకున్ బొల్పైన తా వద్దియున్

వాసిగఁ జంద్రచూడ శుభపాదజలేరుహ సేవపొంపెఁ గైఁ
లాసము మీరు వెళ్లినఁ జెలంగెడు పూజన వేళలందు గౌ
రీ సముపేతుఁ డాతనిఁ బొరిన్ యజియించుట లైన వెన్క మీ
రాసముదార పర్వతమునందున నుండుఁడీ సౌఖ్యమొప్పగన్ ౯౭

ఆ కైలాసము న మ్మహాగిరియు వేఱంచున్ మనంబందు నెం
దే కానీ తలపోయకుం డచట నెంతే మీదు పై నిచ్చ తే
నేకాకార కృపావిశేషమున వర్తింతున్ మదీయార్చ మీ
రా కొండం బొనరింపుఁ డిందువలె మీకందంబుఁ జందం బగున్

మానుఁడు మాఁట లింక ననుమానము మానిన మానసంబులన్
బూని శశాంకశేఖరుని పొంతకుఁ బొం డిపు డీరువైశ్యులా
రా! నెఱి నప్పు డప్పు డెటు లాచరణం బొనరింప నౌను మీ
రా నిరతిన్ వచించు నిటలాక్షుఁడె మీ కటఁ దెల్లమౌ నటుల్

మీ కనుమాన మెందయిన మేకొనునేనియు నేను మీ దరిన్
వీకను గాన వచ్చియును బేర్మిని మీ మది సందియంబు న
స్తోకజవానఁ దీర్తు ననుచున్ వచియించెను గన్యకాంబ-మో
దాకలనంబొ యిం కొకటొ యందిరి వైశ్యచయంబు లందునన్

## వైశ్యులు కైలాసము చేరుట

తప్పని దంబి కాజ్ఞ, సముదారుఁడు సారుఁడు భోగిహారుఁడౌ
న ప్పరమేశుఁ గొల్చుటకు నందఱు దచ్చివలోక మేఁగ నౌ
నప్ప! యటంచు వైశ్యులు సమర్థపు సన్నహనంబుతోడ దా
మ ప్పరమంపు రత్నమయ మై తగు దీవిని వీఁడ నెంచియున్

వ. ఏఁడువందల పదునాలు గనఁగా-నూట రెండును, నాఱు
వందల పదిరెండును-గోత్రంబుల వైశ్య లప్పుడు శ్రీ కన్యకా

పరమేశ్వరిని నామె నెలవయిన యమ్మణిద్వీపంబును విడువ
మనస్సు రాక యప్పరమేశ్వరి నిట్లు నుతించిరి.

కారుణికావతంసముల కాండములందు నఖండ సద్యశ
స్స్ఫార విహారముం జలుపుచాతురిమైఁ దగునట్టి మాదు దే
వేరిని గన్యకాంబను బవిత్రను జిత్రవిచిత్రలీల కా
ధారపు దేవరం గొలువఁ దగ్గది శ్రీకరియౌ పరాంబికన్

ఆనందంబున కాలవాలమవు గాదా ! సర్వమౌనీంద్ర దే
వానీకస్తవనీయ పావనచరిత్రానూనవై విశ్వవి
శ్వాసంత ప్రమదప్రద ప్రకృతి వై హర్షాందు సర్వేశ్వరీ !
నీ నామంబునుతింప నిన్నుఁ గొలువన్ జెన్నొందు మేలెంతయున్

నిన్నుం గొల్చుటకన్న మిన్నగ నెటం డెందాన కానందముం
గ్రన్నం జెందఁ దరంబు గాదు గద? కన్యాంబామహాదేవి! మ
మ్మిన్నాఁడిట్లు నినున్ విడన్ ముదల గావింపంగ న్యాయ్యంబె! ఆ
పన్నార్తిప్రశమౌషధాయిత జగద్వంద్య ప్రభావాఢ్యరో !

కైలాసావాసుం డగు
వ్యాళగ్రైవేయుఁ గొలువ నరుగు మముం బ్రే
మాలోకనలం బ్రోవుము
శ్రీ లీలా ! కన్యకాంబ ! శిష్టాలంబా !

వ. అని లోనుగ శ్రీకన్యకాంబా నుతినతులను గావించి
య వ్వైశ్య లంత బయల్దేఱి ౧౦౭

"వందే శంభు ముమాపతి" మ్మనుచునుం బైల్దేటి వైశ్యాళి యు
ల్లం దైవాఱఁగ ముంగలం గనిరి కైలాసంబు గౌరీయు తా
ర్ధేందూద్యన్మకు టైకవాసము సమద్బృందారకా ఘూసురే
ద్బృం దానందకర ప్రకార నిగమావేల ప్రభాభాసమున్

భృంగి భృంగరిటాది విమలప్రమథగణ
ములు "మహాదేవ" యం చెలమిఁ గొలువ
పరగ నందీశాది పారిపార్శ్వకు లెల్ల
విమలసద్భక్తిమై వేచియుండ
ఓంకారరూపుండు నోంకారవేత్తయు
నగు గజషణ్ముఖు లలరుచుండ
క్ష్మాధరేంద్రకుమారి సకలజగన్మాత
హైమవతియుఁ జెంత నలరియుండ
జాహ్నవీ చంద్రరేఖాలసన్మకుటుని
అక్షికౌక్షేయు ఫణిహారు హరుని వారు
వైశ్యు లటఁ గాంచి సాష్టాంగవందనములు
భక్తి మించంగఁ జల్పి యభంగురముగ

వందనముం బొనర్చెద మభంగురభక్తి చెలంగుచుండ సం
క్రందనముఖ్య దైవత శిరస్థ్స కిరీటసముల్లసన్మణీ
బృందపరిక్షిక్రియాంచిత పవిత్ర చరిత్రపదారవింద ని
ష్యంది మరందనందిత నతాశ్రితపాళికి నిందు మౌళికిన్ 110

వ. అని పలికి యా వైశ్యనికాయం బంతయును, బురాంతకునకు సాగిలపడి నమస్కరించి, తాము మణిద్వీపమున శ్రీ కన్యకాపరమేశ్వరి సన్నిధినుండి యామె ముదల ప్రకారముగా నట కరుగుదెంచిన తెఱంగు నెఱింగింపఁగా, భుజంగాభరణుం డాదరణాయత్తచిత్తుండై మే లని పల్కి, తన కైలాసంబున కల్లంతదవ్వున నుండు మహాగిరియందు వారు నెలకొనియుండి ప్రతినిత్యంబును సకాలంబునకుఁ దన సన్నిధానంబునకు వచ్చి, తన యానతి ప్రకారము మెలంగవలయు ననవుడు వైశ్యులెల్లరు మహాప్రసాదం బని యట్లు కావింపఁబూని. ౧౧౧

పౌనఃపున్యముగాఁ ద్రిశూలికి నమోవాకంబులం బల్కి వై
శ్యానీకం బట నేఁడు నూర్ల పదునా ల్గౌ గోత్రముల్ జ్యేష్ఠ శై
లానం గాఁపుర మూన బోయిఁ యల గొండం గల్గు సౌందర్య మెం
తేనిం గాంచియు సంతసించియుఁ గడున్ హృద్వీధులన్ వారలున్

సంతత హిమపరిచ్ఛన్న మౌ పట్టులఁ
బండు వెన్నెలఁ బోలి పర్వతాల
నానావిధ ప్రసూనానీక రంజన
నవరత్నచయ మండనమయి తోప
దట్టంబుగా నొప్పు తరు లతాపుంజముల్
గారుడ హరినీలకాంతులూన
కలకంఠ శుక నీలకంఠ హంస ధ్వనుల్
సంగీత సారస్య సరణిఁ దెల్ప

శరభ శార్దూల హరి కరి కిరి మృగముఖ
జంతుసంతాన మెంతయు వింత నొసఁగ
ఈ మహాగిరి తగు పేరు నెనయుఁ దగిన
వాస మిదె మన కిందు నంబా మతల్లి

అంతె కాక యీపొంతనే యభవు హితుఁడు
విశ్వధన సహితుఁడు నయి వెలయు ధనదుఁ
డున్నవాఁడు నిజము మన కన్న గారు
ఈ నెలవు శివసేవ కౌ నెల్ల గతుల

సిరి గల వాఁడు కుబేరుఁడు
సిరు లిడు వాఁ డీశ్వరుండు శ్రీగళభక్తిన్
దఱుచగును కుబేరుఁడు మన
మొరిమన్ శివభక్తి వృద్ధి నొందెద మిందున్

కరుణాంబురాశి కన్యాం
బ రహిన్ మహాగిరిని మన నివాసము గాఁగం
బరఁగించి యనుగ్రహముం
బరపెన్ మన యందు-నిజము-పైని కతములన్ ౧౧౬

కులమున మనము వైశ్యులము గావున ధేను
గణమును బెంచియుఁ గావ వలయు
వాని వలని గవ్య వస్తువులం జేసి
హోమాది కృత్యము లొనరుప నగు

బేరసారాలం గుబేరుఁ గేరం జాలు
నెచ్చో తెలివిఁ బ్రకటింప వలయు
నవనిధులను మించు నవనిధుల్ మా వన
ధనసంచయంబును బొనరుప నగు

అన్న వస్త్ర విద్యోపనయనవివాహ
వైద్యముఖ్య సాహాయ్యముల్ పఱపి విరివి
గాఁగ జగతి నార్తుల నెల్లఁ గావ వలయు
నంచు వైశ్యు ల్నియమ మూని రందు నిల్చి

వెలయఁ దన పలుకునన్ వై
శ్యు లల మహాగిరిని జేరి శోభితధర్మా
త్ములుగ మనుటఁ గన్యాంబిక
లలి నెఱిఁగియు వారి విడుచు లా గొప్ప కెదన్ ౧౧౮

## శ్రీ కన్యకాపరమేశ్వరి మహాగిరి కేతెంచుట

"మాతల్లిన్ వీఁడి యిందున్ మనుటయెటులనో? మాకుగానంగనౌనే
చేతోమోదంబు నిందున్ జెలగ" నని శ్రితశ్రేణివైశ్యుల్ కలంగన్
మాతృశ్రీ కన్యాంబామణి యల శ్రితులన్ మానఁగా లేక యెంతో
ప్రీతిన్ డెందంబునందున్ వెలసి వెడలె నర్థిన్ మహాశైలమంతన్

శ్రీ కన్యాపరమేశ్వరీమణి కహా! జ్యేష్ఠాద్రి మోదం బిడెన్
వీఁక న్నందనకాన నాపహసనావేలాతి గానందకం

దాకారాటవికాతతిన్ సురపశూద్యత్పంక్తి - మారాంబకా
సీకా భాంబుజనేత్రులన్ బరమమౌనిశ్రేష్ఠ సంఘంబులన్

అందలి కందరంబులు మహామునిబృందము లుండు నిక్కలై
యందలి చెట్లు కల్పకములై మఱిఁ గల్పలతాళి యై లతల్
చందనగంధిలంబు గను సౌ రయి యందలి గాడ్పు లెంతొ యా
నందముఁ గొల్పఁగాఁ నచటు నల్వగు కందువ కన్యకాంబకున్

ఆ యూరూద్భవు లేడునూర్ల పదునాల్గౌ గోత్రము ల్వార్యమని
ప్రాయుల్ నిత్యముఁ గన్యకాంబకు సమర్చల్ సల్పియున్ శూలిదౌ
తాయిం జేరి యటన్ భజించి రల చూడాశ్రీ పరిష్కారక
న్యాయార్ధేందు నహీంద్రకుండలుని భస్మాంగున్ శుభాఙ్గభంగునిన్

కుతుకము తోడ నిత్య మహికుండలమండితగండమండలుం
డతికిన పేర్మి శూలి సముదారులు వైశ్యుల నెల్లవేళలన్
వితతముదంబునం గను చవేలకృపాపరతంత్రమానస
స్థితి దనరంగ వారిఁ గడు ధీరులుగాఁ గనె నైజసన్నిధిన్ ౧౨౩

గణనాథుం బలె షణ్ముఖుం బలెను శ్రీగౌరింబలెన్ నందిన
ట్లణుమాత్రంబును లోటు లేనిగతి నత్యంతంబుగా వైశ్యులన్
గుణరాశ్యాత్మకు లంచు శంభుఁ డెదలోఁగొంకింతయున్ లేని కా
రుణికత్వంబున నోమె ముక్కపయి వ్రేల్ పొల్పొంద నెల్లగ్గనన్

ఒకనాడు గణపతి యొడికంబుతో నాఁడ
బేరు గ్గనియు మెచ్చి వినతు లిడిరి

ఒకట సుబ్రహ్మణ్యుఁ డోంకార మాహాత్మ్య
ముసు దెల్ప - నూరుజుల్ గొన బెజిఁగిరి
హరతాండవముఁ జూచి యానందమున భూత
తతి యాఁడ - నొంట వైశ్యతతి వొగడె
భరతనాట్యముగూర్చి పరఁగ నంద్యాది చ
ర్చల నొకంటను విని రల వణిజులు
వామదేవ పరాశర ప్రముఖ మౌని
వరుల వేదాంత వాదంపు ఫణితులెల్ల
నొక్కట విని యానందింతు రూరుభవులు
అల్ల కైలాసమున భవాన్యధిపు సభను ౧౨౫

వేద వేదాంగ వేదోదంత వేదాంత
వాదోపవాదాళి ఫక్కి గనుచు
బహు పురాణ వితాన పటువిధానవిధాన
పరతంత్రరీతుల పటిమ గనుచు
నట నాభినయతంత్ర నానావిశేషంబు
లన శేషవైఖరిన్ లలి నరయుచు
ప్రణవప్రధాన మంత్రప్రతానంబుల
మవ్వంబులందలి మహిమఁ గనుచు
యోగులన్ యోగిభోగులం దొనరు భోగి
త్యాగులన్ ద్యాగియౌ విచిత్రప్రభుఁ డగు

శంకరుఁ దఘనాశంకరు సన్నిధి మని
సరగ నల వైశ్యు లానందసాంద్రు లయిరి

వసువుల్ రుద్రులు దిక్పతుల్ మునులు దేవశ్రేణి యక్షాళి రా
క్షసులున్ బన్నగులున్ నభశ్చరతతుల్ గంధర్వులున్ లోనుగా
వెస నేతెంచియు నుత్తమాంగములు పత్పీఠంబు దాఁకన్ గళ
త్రసమంచత్తనుఁ డల్ల శంభునకు జోతల్సల్పి రా వైశ్యులున్

పాదవిభూషణ పద్ధతిన్ ఫణియును
రత్నమంజీరంబు రాణఁ దనర
నెమ్మేనఁ దాల్చు వస్త్రమ్ముగాఁ బులి తోలు
బంగారు రంగు వల్వయుఁ దలిర్ప
అంగరాగంబుగా నలరుచుఁ బూఁది పూఁ
తయుఁ జందనంబు నందంబుఁ గొల్ప
కంఠంబునం దహిగ్రైవేయకము మణి
మౌక్తిక హారముల్ మవ్వము నిడ

ఫాలపట్టికన్ వహ్ని దీవ్యన్నయనముఁ
గస్తురీతిలకంబును గ్రాలుచుండ
శంభుఁడుఁ దదంగనయుఁ జేరి సౌరునిచ్చు
విభవముం గాంచి వైశ్యులు వేడ్కఁ గనిరి ౧౨౫

గరుడవాహన మెక్కి కంజవాసినితోడ
వైకుంఠనాథుండు వచ్చినపుడు

వరటారమణుపయి వాక్సతీయుక్తుఁడై
బ్రహ్మదేవుం డొగి వచ్చినపుడు
చౌదంత హస్తిపై శచివెంబడింపఁగా
బలదైత్య భేదియు వచ్చినపుడు

సార్వభౌమంబు పై శ్రవణుఁ డెక్కియుఁ బ్రియా
స్పద చిత్రరేఖతో వచ్చినపుడు
వైశ్యు లెల్ల గౌరీశుని పావనాజ్ఞ
మేర కవ్వారి కెంతేని గౌరవంబు
పరమభక్తిని గావించి వారిదగు న
నుగ్రహంబును జెంది రనూనలీల

వ. అమ్మెయి హరి హర హిరణ్యగర్భు లిందిరా పార్వతీ వాక్సతీ యుక్తులై యెక్కిరింత లయిన గరు డాధికార నంది హంసంబులతోడ దరిసెనం బిడినప్పుడు నూర్మడుంగుల సంతసం బుల్లంబులందు మల్లడిగొన వారిని పంకను నట సవాహనంబుగా సతీయుక్తంబుగాఁ జేరిన దేవేంద్ర కుబేరాదులను గాంచి సవి నయ భయానత తనుయుతులై ౧౩౦

మరుని గాంచిన వాఁడు మరుని గాల్చిన వాఁడు
మరుని తో డగువాఁడు మా గురువులు
మా నాయకుండు నుమానాయకుండును
మాఁటనాయకుఁడును మా గురువులు

అక్కునన్ మేన నాస్యమున సతులఁ దాల్చు
మవ్వంబు వారలు మా గురువులు
మా యాతిగులును నామ్నాయాతిగులు నిఁక
మాయాకలితులును మా గురువులు

గరుడిపై నెద్దుపైనఁ జక్రాంగము పయి
నెక్కి తిరిగెడు సాముల కిఁక జగములఁ
బ్రోవఁ గూల్పఁ గొల్పఁ దగు విభులు తలంప
మా గురువులు; వారల కివే మా వినతులు

వ. అని వైశ్యులు త్రిమూర్తులకును, దద్భార్యలకును నమస్కరించి తక్కుంగల దేవేంద్రాదు లగు వేల్పులకును, వేల్పు సానులకును నమస్కారంబు గావించి యుండునెడ భవానీపతి వైశ్యులం గాంచి యిట్లనియెడి. ౧౩౨

మనమం దెంతయుఁ బేర్మి మీ కనియెఁగా! మణ్యంత రీపంబునం
దునఁగన్యాపరమేశ్వరీమణి కడుం దోరంబుగా "ధర్మర
క్షణమున్ మీరు కలిం ధరాతలమునం గావింపఁగా నుర్వికిం
జనఁగా నో" నని యల్ల కృత్యమునకున్ వైశంబ పొం దిప్పుడున్

కలియుగ మేఁగుదెంచియు నఖండధరాతలమున్ గరం బవ
స్థలఁ గనఁ జేయుచుండెను గదా! గద మట్టుల నల్లబాధయం
దొలసిన వారి నేఁచెడి సమూర్జితబుద్ధులు మీర లేఁగి ని
స్తుల మగు ధర్మమున్ భువిని జొప్పడఁజేసియు మేలుఁగూర్పుఁడీ.

స్తవనీయంబుగ ధర్మమర్మములు విస్తారంబుగాఁ బూని, భూ
భువనంబందును మేలుబంతు లయి పొల్పుం గొల్పుఁ డెంతేని వై
శ్యవరుల్ తాఁ గలి యాఁకలిం గలిగి విశ్వంబెల్ల గాసిల్లఁ జే
యు వేసన్ మీర్సనితత్ప్రయత్నమునకెంతో యంతుఁ గూర్పం దగున్

అని శివుఁ డాఁడ వైశ్యతతు లా నుడులన్ విని నెమ్మనంబునం
దునఁ గడుఁ జింత నొందియును దోడ్తను వందన మాచరించి యి
ట్లని "రభవా! దయారసము నాంతరమందునఁ బూని మా నుడుల్
విన వలె మాదు కోర్కె జరిపింపవలెం గర మేము మేల్గనన్

రతనాల దీవిఁ గన్యాం
బ తగన్ బృహదద్రిఁ జేరి మని శివ సమ్మా
నితసన్నిధి మనుఁ డనె ని
వ్వితమున శివ! నీవ మము భువికిఁ బంపెదవే?

ఆకాశమునుండి భువికి
నాకడనుండి యతలమున కన్నట్లుగ మా
దౌకరణియు నిట నగుఁ గద?
శ్రీకన్య దరిసి విడి యిటఁ జేరి భువిఁ జనన్

"పరమేశ! రమేశముఖుల్
కరుణానిధు లిందుఁ గలరు కర మరసియు ని
త్తెఱగున మా కిం పిడ వలె
నారిమ" నన(గ నాలకించి యోలి శివు డనున్ ౧౩౯

వైశ్యులార ! మీరు పలికిన దాలించి
నాము. కన్యకాంబ నలువుగ నని
నట్టి రీతి మీకు నంటిని నా మాఁటె
కాని భావ మద్ది కన్యకదియె

మీరు దీన మార్పు మేకానఁ గోరుదు
రేనిఁ గన్యకాంబనే యజించి
యడుగుఁడి తదనుగ్రహమున మీ కెన్నే శు
భంబు లొప్పుఁ గలవు వైశ్యులార !!

అనినంత వైశ్య లందఱు
ననఘత రతనాలదీవి కభిముఖు లై - యి
ట్లని తలఁచిరి శ్రీకన్యాం
బను - వినతాలంబ - సుగుణమహితకదంబన్

సకలాజాండ కటాహనాయికవు వాణ్మా పార్వతుల్ నీకు నా
క్తొక యంశంబులు మూఁడుమూర్తులును నీకోలిన్ శ్రితత్వంబునొం
ది కడు నీ్న మతిమేర కొప్పదు రొగిం దేవి ! యిదే నీదు పు
త్రికదంబంబుల మేము వైశ్యులము సంప్రార్థింతు మెప్డు న్నినున్

ఆ మణిద్వీపమందు నీ యంతికమున
నలరుచుంటి మందుండి నీ యానఁజేసి
శంభులోక మిఁదునకు రాఁ జనియె నిందు
నుండి భువి కేఁగుఁ డనియె శివుం డితండు ౧౪౪

ఎసఁగ నీన్ని దరియందు వీఁడి యిట కేమేతెంచినన్ మాదు పై
ననమానంబగు పేర్మి నిక్కడను నీయత్యంతపావిత్ర్య మొ
ప్పు సుసందర్శన మిచ్చుచుంటి వదియుం బోవంగ భూలోకమే
ము సనం బోలునటంచు శంభుఁ డనె మా హొల్పెంతయున్ డుల్లగన్

అనఘధర్మ మఁట అపాంతరాత్మ లఁట ఏ
మో యటంచు మమ్మ నేఁగుఁ డనియె
భువికి శంభుఁ డకట ! పూర్వకృపన్ మమ్ము
నేలవలయు దేవి ! యిప్పు డీవు

నేల కేఁగ నేలనే ? లలి నిప్పుడు
నేల వేల ! మమ్మ ? నిందుముఖిరో !
కన్యకాంబ ! భక్తకరుణావలంబ ! యం
చనిరి వైశ్య లెల్ల నంబఁ గుఱిచి

వ. అని వైశ్యులు పలుభంగులఁ బ్రార్థించినంత నక్కడ
నున్న త్రిమూర్తిముఖ్యులు, బృందారకులును, మునివర్యులును
నచ్చెరు వొంద –

# శ్రీ కన్యకా పరమేశ్వరి సమాధాన పఱచుట

కన్యకాపరమేశ్వరి కానవచ్చె
కోటి సూర్యచంద్రుల డాలు గోట మీటఁ
జాలు తేజంబుఁ జిఱునవ్వు హాళిఁ దనర
కోటి రతిసామ్య మగు రూపు కొమరు మిగుల ౧౪౯

రక్తారవింద జైత్రంబు లై కడుఁ బావ
నములైన దివ్యపాదములతోడ
రంగారు బంగారు సింగారముం గారు
బాగైనయట్టి యంబరముతోడ
వర దాభ యాంకుశ పాశాంచితంబు లై
లీల మీఱెడి నాల్గు కేలతోడ
మణిహార కేయూర మాణిక్యకుండల
ప్రముఖ దివ్యాభరణములతోడ
పర్వశారదేందు తులితవదన మందు
జాలువాఱెడి మందహాసరుచితోడ
అందుఁ గనుపట్టె నత్యంత మద్భుతముగ
నలరఁ గన్యాంబ సర్వలోకావలంబ

ఆ సకలైక మాత కనులారఁగఁ గానఁగ వచ్చినంతనే
వాసిగ భీతిసంభ్రమవిభన్ మొగము ల్దగ నందు నున్న దే
వాసురులున్ మునివ్రజము వైశ్యవరుల్ మఱియుంద్రిమూర్తులున్
చేసిరి. వందనంబుఁ గడుఁ జెన్నుగఁ దజ్జగదేక మాతకున్ ౧౫౧

శ్రీ వెలయగ నల దేవి రత్నమయాస
నాసీన యగుచును నలరినంత
పాణి వీణం బూని వాణి పాడఁ దొడంగెఁ
గలకంఠ కంఠ మంజుళముగాఁగ

నిటలప్రదేశ సంఘటి తాంజలులతోడ
సకలదేవతలున్ వెసంబొనరిరి
ఋ గ్యజుస్సామాది కృతకేతరాక్షర
తతులఁ దాపసులు సన్నుతిఁ జలిపిరి

అభవుఁ డానందతాండవం బాఁడసాఁగె
బ్రహ్మ తాళంబు వాయించె బద్మనయనుఁ
డున్ మృదంగంబుఁ బూనెఁ గడున్ రహి నటఁ
గన్యకాంబ యీరీతిఁ బల్కంగ సాఁగె ౧౫౨

ఆ రహిఁ గన్యకాంబిక సమక్షమునం దగి మందహాసరే
ఖా రుచిరాస్యపద్మ యయి కారుణికత్వసుధారసంబు పొ
ల్పారుచునుండఁ బల్కె నిట వైశ్యులు నా నుడు లాలకింపుఁడీ!
మీరు భువిం జనన్ ముదము మించఁ గనన్ వలె నెమ్మనంబులన్

మిమ్ముల వంతలం గనఁగ మేదినికిం జనుఁడంటి నొక్కొ? ధ
ర్మ మ్మట బాధ నొందినది మానితధర్ములు స్థిర లేఁగి ధ
ర్మ మ్మగు చర్య నూని నికరమ్ముగ లోకము నెల్ల మేలి మా
ర్గమ్మున సంచరించునటులం బొనరింపుఁడి మీ యుదాహృతిన్

భారతదేశమాత కలిభంగి సభంగురభంగ మొంది బా
ధారటనంబుఁ జల్పెడిఁ గదా? యిటువంటి విపర్యయాన మీ
ర్ధారుణిఁ జేరఁ బోయి యటఁ దగ్గతెఱంగు నెసంగఁ జేయవ
ల్దా? రయ మార వైశ్యులు! సుధారుచిరాశయు! లెంత యేనియున్

అని వచియించి నంత సముదారతరంబగు భక్తి నెమ్మనం
బునఁ దనరంగ వైశ్యలు సముజ్జ్వలనీతి వినీతి భీతియుం
దనర నమస్కరించియు నదంభ విజృంభివచో నిగుంభనం
బున వచియించి "రంబ! పరిపూర్ణదయన్ మముఁ బ్రోవఁగావలెన్

సకలానందనికాయము
లకు గుటి గద! నీ దరి యెటులన్ విడఁగలమో?
సుకృప నీ విచ్చుట మా
కకలుష భవదీయ సేవ నబ్బింతువు గా?

రతనా ద్రివిన్ వీఁడిచి
శితిగళు దరిఁజేర్చి యిటను జ్యేష్ఠగిరిని జే
ర్చితివి మమునైన రహి ని
చ్చితివి భవత్సేవ నటనుఁ జెలఁగియుఁ దల్లీ!

ఆ మణిద్వీప వాస తుల్యంబు గాఁగ
ఈ మహాగిరి వాసంబు నెసఁగు నటుల
నీవు మా కడకున్ వచ్చి యెసఁగుచుందు
వసుధ కేఁగినన్ మాకుఁ దద్భాగ్య మెట్లు?

ధన ముండిన లే కున్నన్
దిన నుండిన లేక యున్న దీపిల నెది యుం
డిన లే కున్న నీవుం
డినఁ దల్లీ! యదియె చాలు నెటి మా కెంతో! ౧౬౦

కొన దయ యుంచి మేము నీగణ్యభవ్య
పాదకమలసాన్నిధ్యంబు వదలనట్లు
నీవు దయఁజూడ వలయు నో నిఖిలమాత!
కలితకరుణావలంబ! శ్రీ కన్యకాంబ!!

అని పలుతెఱగుల వైశ్యులు
వనరంగాఁ గన్యకాంబ పటుకృప వారిం
గని వగవకుఁ! డని యేదో
యనఁ బూనెన్ వారు నోరులు నలరియు వినగన్

అ ప్పరమేశ్వరి యేదో
చెప్పం బూనినది వినఁగఁ జెలఁగు ననుచు నం
దొప్పిన వా రెల్లను నే
చప్పుడు లే కలలు లేని సంద్రమటు మనన్

వ. అట్లు తత్సభ మిక్కిలి గంభీరముగా నుండెనని సూత పౌరాణికుండు వినిచినంత శౌనకాది మహామును లతనిం గాంచి పేర్మిమై నిట్లనిరి. ౧౬౪

## ఆశ్వాసాంత పద్యములు

ఈ యాఖ్యానము నీదిగ
దా! యో శ్రీకన్యకాంబ! ఆ శ్రీరాముం

డే యటుఁదన కథనుం దా
నే యాలించె సుతుచేత నిదియు నటులగున్

నీ కత నీకే తెల్పఁగ
నౌ కరణిని బ్రథమపురుషయందు నిను ననన్
ప్రాకటముగ నీ కత దగె
వీఁకన్ శ్రీకన్యకాంబ ! పేర్మిం గనుమా !!

లోకాలోకాతిగ సు
శ్లోకైకాకారభవ్యరూప ! పవిత్రా !
శ్రీకన్యాపరమేశ్వరి !
రాకాచంద్ర గళదమృతరమ్యా దరణా !!

ఆంగీరసగోత్రుఁడు నిఁకవైశ్యకులుఁడయిన
దోమవంశ్యుండు వేంకటస్వామి గుప్త
అమల గోవిందసుతుఁడు వ్రాయ నయినట్టి
కన్యకాపురాణపుఁ బద్యకావ్యమందు
దొలిది యాశ్వాస మియ్యది - తోయజాక్షి !!
కలిత కరుణావలంబ ! శ్రీ కన్యకాంబ ! ౧౬౭

౧. ఇయ్యది శ్రీ తుంగభద్రానదీతీర విరాజమాన కర్నూల్నగరనివాసి - నిరంతర శ్రీమద్వేంకటేశ్వర చరణారవింద మిళిందాయమాన మానస - వైశ్యర త్నాంగిరసగోత్ర పవిత్ర - ధర్మపత్నీకోటాంబికాసమేత - దోమా గోవిందార్యవర్య సుత

జ్యేష్ఠుండును - శ్రీరామచంద్ర కృపాకటాక్ష వీక్షణాసాది తాంధ్ర గీర్వాణ కవిత్వకృత పరిచయుండును - శ్రీ బ్రహ్మవైవర్త మహా పురాణ - శ్రీ పరకాలవిలాస - శ్రీ బ్రహ్మేశ్వర పురాణ - శ్రీ గౌతమక్షేత్ర మాహాత్మ్య - శ్రీ విష్ణుభక్తి - ప్రేమాభిరామ - శ్రీ ముకుందమాలా - శ్రీ గంగాలహరీ - శ్రీ కనకధారా స్తవ-చంద్ర కళాసుదర్శన - దూతాంగ - దాత్మబోధ - సుజనత్రయ - శ్రీ కృష్ణదేవరాయచరిత్ర విమలానందాద్యనేక గ్రంథకర్తయు- నానాదేశ రసిక జనదత్త-శ్రీ మదాంధ్ర విద్యావాచస్పతి-సాహిత్య సరస్వతి - విద్యావినోద - కవిభూషణ - విద్యాసాగ - రాశుకవి తల్లజ - కవిర-త్నా శుకవితాధురీ-ణావధాని పంచానన-కవికుంజ- రావధానపితామహ - కవిచక్రవర్తి త్యాద్యాదరాభిధానాభిరాము( డును నగు-శతావధాని-విద్వాన్-దోమా వేంకటస్వామి గుప్తచే ప్రణీతంబయిన శ్రీ కన్యకాపురాణ పద్యకావ్యంబున( బ్రథమాశ్వాసము. ౧౬౯

# ద్వితీయాశ్వాసము

శ్రీకన్యాపరమేశ్వరి!
నాకాధిప మకుటమణిగణ లసితపన్నా
శీకా! లోకాలోక!
ప్రాకటలీలాభరణ! కృపాయుత శీలా!

వ. అవధరింపుము దివ్యంబయిన భవదీ యానంతర కథావిశేషంబు—నట్లు సూతపౌరాణికుండు భవదీయకథానకంబును దెల్పినంత. శౌనకాది మహామునిపుంగవు లాలకించి యుచితాలాపంబులఁ దదనంతరకథ వినిపింపవలసినదిగాఁ గోరినంత—— సూతమహర్షి శిరీషకుసుమ పేశల సుధామయోక్తుల నిట్లు వక్కాణించె—— ౨

# వైశ్యులకై దేవతల పుట్టువులు

శ్రీ కన్యాపరమేశ్వరీమణి యటన్ హృద్యానవద్యాదృతిన్
పీఁక నైన్నిజ పదారవిందనతులై వెల్గొందు వైశ్యాళితో
రాకాచంద్రదగళత్సుధాలహరియై రాణించు వాగ్వైఖరిన్
ప్రాకట్యంబుగఁ బల్కె—వైశ్యమణులారా! చింత మానుండెదన్

కలి నిల ధర్మపద్ధతిని గాచుట కేగుదు రీరు-నన్ను నిం
దుల విడనాడు రెంతయును దోరపుఁ జింతను గొల్వ మీకు న
ట్టుల వగఁ బొందకుం, డెదఁ గడుంగడుఁ బేర్మిని కన్యకాంబనై
యిలపయిఁబొల్చుదాన మిము నెంతయు నోముఁగ వైశ్యరత్నముల్

మీకొఱ కేను బుట్టెదను మేదినిపై నొగిఁ గన్యకాంబనై
యీ కమలారిమౌళి నగరేశ్వరుఁ డౌ-నిఁక-వింధ్యవాసినీ
ప్రాకటరూప గౌరి యగు-వాసవి యౌ శచి-వైశ్యరత్నముల్
శ్రీకమలాజనార్దనుల రీతులఁగాంత్రు రమాతదీశ్వరుల్

ఏయెడ మీర లుండినను-నెంతయు నయ్యెడకున్ మహాచలా
మేయసమాఖ్య నిచ్చి-యట మేల్మిని నన్ను యజింప మీది యా
తోయపుఁ బెద్దవాని తొలి తొయ్యలిపుట్టువు బ్రహ్మచర్యను
స్థాయ దుదార ధర్మమునఁ బర్వఁగఁ జేతురు గాత-సజ్జనుల్.

ప్రాణము లుండు నేఁటి-కవిపాటెడి తేఁపటి కెందునేని-నే
రాణను నెన్ని సౌఖ్యములు రాఁగను పోఁగను లెక్క గాదు-ని
ర్వాణధనంబు నిల్పఁగఁ గరంబును మానధనంబె ముఖ్య-మీ
స్థాణువు మాటమై భువి నెసంగుఁడి మీరలు మానరక్షకై ఒ

మానము పొంతఁ బ్రాణములు మానుగఁ గాసునకేని నౌనె? యో
మానితులార! మీ రిలను మాననిధానములై చెలంగి-ధ
ర్మానుపమాన ధాను లయి హర్వగ బర్వ దఖర్వసత్కృపా
శ్రీనియమంబుతో మిము లలిం గనెదన్ భువి వైశ్యరత్నముల్:

అని కన్యాపరమేశ్వరి
యనుకంపం బల్కి యందె యంతర్ధానం
బును బొందె నల్ల వైశ్యుల
కనుమానము వాయ మదులయందుఁ గడంకన్

## బ్రహ్మచేయు యజ్ఞమున కేగుట

అంతట వైశ్యు లెల్లరు గజాస్యషడాస్యమహేశ్వరీయుతా
త్యంత మహావిభూతిసముదారుఁడు నై కరుణానిధాన మై
సంతస మొప్పుచున్న యల చంద్రకళాధరుఁజేరి భక్తిపూ
ర్ణాంతరులై తదీయచరణాబ్జములందును వ్రాలిరెక్కటిన్.

అట్టులె గౌరి కింకను గజాస్య షడాస్యుల కింక నందికిం
గట్టిగ నొప్ప తత్పరతగా నతులం బొనరించినంత న
ట్టి ట్టన రాని పేర్మిని మహేశ్వరుఁ డూనియు వైశ్యపాళితో
నిట్టులఁ బల్కె మీ కిపుడు నే నొక సద్విషయంబుఁ జెప్పెదన్

## శ్రీ గోదావరీ నది

వ. అనవుడు వైశ్యశ్రేష్ఠులెల్ల నత్యంతంబు మక్కువతో
న వ్వార్త నాలింపఁ బూన న ప్పరమశివుం డి ట్లనియె ౧౨

అవనీమండల మండనంబు భరతాఖ్యంబైన దేశంబు దా
నె వెసన్ గౌతమపుత్రికామణి కడున్ హ ర్షొందు గోదావరీ

సువిశేషాఖ్య నదీవతంసమయి శ్రీశోభం గరం బొప్పి పా
పవితానైకలవిత్ర మై సకలసంపన్మంగళాకీర్ణ మై.

కడఁగిశ్రీనాసికాత్ర్యంబక మను క్షేత్ర
రత్న మందు జన్మించి శ్రీరామలాలి
త మయి య మ్మహావాహిని ధన్య మయ్యె
వృద్ధగంగ గోదావరి కీడు లేదు!

పావనపావనం బగుచుఁ బర్వు నఖర్వగుణాఢ్య మల్ల గో
దావరి తీరమందుఁ గమలాసనుఁ డిప్పుడు బ్రహ్మమేధ మన్
భూవలయైక దుర్లభతఁ బొల్చు మఖం బొక డాచరించుఁ ద
త్సేవన కేగుదెంచెదరు దేవ మునీంద్రు లనల్ప సంఖ్యగన్ ౧౫

గౌరీ షడానన గజముఖులను గూడి
యే నరుదెంచెద నింపుతోడ
శ్రీదేవితో వచ్చు శ్రీమహావిష్ణువు
సనకాది సన్ముని సహితుఁ డగుచు
బృందారకానంద బృందంబు లింద్రాది
దిక్పలు రుద్రతతి వసుగణము
అంతియే గాదు చరాచరకోటియం
దున్న యట్లుఁ దలంప నొనరు నిజము
బ్రాహ్మణ క్షత్త్రి వైశ్య శూద్రచయములును
నందు కేతేరవలయు న ట్లగుట మీరు

మేల్మిత్తో నేగుడీ బహ్మమేధమునకు
ఆర్యులార! ప్రజాహితకార్యులార!!

బమ్మ యొనర్పఁబోవు నల బ్రహ్మమఖంబును గాంచి యెంతొ మో
దమ్మును జెందఁగా మనము తద్దయు వైశమ పోవ నౌ నటం
చి మ్మిహికాచ లాత్మభవ ప్రాణవిభుం డన నందు నున్న బృం
ద మ్మఖిలంబు బ్రహ్మమఖదర్శనలాలస మై చనెన్ వడిన్

వ. అంత ౧౮

స్థిర మై భారతభూమి కాభరణ మౌ శ్రీనాసికాత్ర్యంబకం
బురుగోదావరి పుణ్యవాహినికి జన్మోదారసుస్థాన మై
పరమాఘవ్రజవారకం బఖిల సంపత్కారకం బందు వా
గ్వరుడున్ బహ్మమఖంబు సేయుటకునేర్పాటున్ బొనర్పన్ రహిన్

అమ్మెయి బైలుదేఱిన సురాకరమున్ మునిబృందమున్ నరుల్
బమ్మ యొనర్చు యాగమది పర్విన మోదమునం గనంగ వే
గమ్మగ వచ్చి యంత నల కంజభవుం డొనరించు నల్ల యా
గమ్మ సువైభవంబు గని గణ్యముదంబునఁ బొంది రిమ్మగన్

అణిమాది కాష్టసిద్ధ్యనుపమానకృతార్థ
తాంచిత సిద్ధ యోగ్యాకరంబు
ఇంద్ర హరి హరాది బృందారకామంద
బృంద పరిష్కార విమల తమము

వేద పురాణ శాస్త్రాది ధర్మస్థాప
నాచార్యవర్య సంయమియుతంబు
ప్రతిసృష్టి నిర్మాణ పరమమాహాత్మ్యగ
బ్రహ్మమౌనీశ్వరభ్రాజితంబు
క్ష్మాచతుర్వర మానవసంభరితము
నగుచు గోదావరీ తీరమందు బ్రహ్మ
బ్రహ్మమేధయాగముఁ జూడ వచ్చినట్టి
వారిసమర్ద మెంతో యవారియయ్యె.

వచ్చిన వా ర్పరస్పర కుశలవిచార
ణములఁ గావించుకొనం దనరుట
యాజ్ఞికోచ్చారణ మందిన నిగ మాగ
మానూన మంత్రచయ ధ్వనులును
స్రుక్స్రువాదులను నిచ్చుకొనుట పుచ్చుకొ
నుట లను బుట్టిన పటపటలును
దేవ భూదేవతా దివ్యము న్యన్యోన్య
హేవాకపాక సంభావనములు
ప్రీతి భక్తికృత్య త్రిమూర్తిసమనములు
హోమధూమ సమావృత వ్యోమతలము
నగుచు నల్ల గోదావరీ హ్రాదినీ త
టంబు సందడిగా నందు డంబు మించె. 22

శ్రీ నాసికాత్ర్యంబ కానూనదైవద
ర్శ నజ సుకృత విశేషంబువలన
గోదావరీ పావనోదారవారి నీ
రం బాడు మేటి పుణ్యంబువలన
హరి హర బ్రహ్మము ఖ్యామరశ్రేష్ఠసం
దర్శనభవ ఘనత్వంబు వలన
వేదశాస్త్రపురాణవిన్యాసధన్యము
న్యాదికవాక్శ్రవణాళివలన
అటకు జనిన వా రెల్లరు నాశయంబు
లందు నానంద తుందిలు రగుచునుండ
కంజగర్భుండు వారలం గాంచి యెవ్వ
రేఁగుదెంచి ర టంచు బ్రశ్నించె నందు ౨౩

అమరులు వీరు-వీర లల యాగము గాంచగ వచ్చి రంచు నిం
ద్రముఖులుఁ బల్కి రింకనొగిఁ దాపసులుం దగ వీరు వీరు మో
దముమెయి వచ్చినారనుచు దక్షులు పల్కిరి యింక నల్ల ప్ర
శ్నము మనుజాళి నద్దుడును నల్వగ వచ్చె జవాబు లిమ్మెయిన్

## ఆగతులు - వారి గోత్రవివరణ

అపుడు దుర్వాసోమహాముని బ్రాహ్మణుల్
పదునెన్మిది గణాల వారు వచ్చి

నా ర్నూట తొమ్మిదై నలువొంద గోత్రము
లనె ధనంజయనాముఁ డయిన క్షత్రి
యుఁ డొక గణమ్ము వా రొగి నేడు గోత్రాల
క్షత్రియుల్ వచ్చిరి కడకు ననియె
పరగ సమాధి యన్ వైశ్యమహాముని
యేడు వందల రెండు నేళ్ల నయిన
గోత్రముల వైశ్యు లిందులకు నరుదెంచి
నా రనఁగ నెచ్చు గోత్ర సంఖ్యగను వచ్చి
నా మనుచు నాఱు నూర్లునున్ బదియు రెండు
గోత్రముల వణిక్కులు కడు గొనబు నొంది

యాగముం గన నేగుదెంచిన యన్ని జాతులలోన దా
మే గదా యధికంపు సంఖ్యగ నెన్నికం గనినా మటం
చౌ గురుత్వము నాఱు నూర్వదియాల రెం డగు గోత్రముల్
బాగుగా నగినారు వైశ్యులు బ్రాహ్మణాదుల గాంచియున్.

మిగిలిన నూట రెం డగుచు మేకొను గోత్రము లొప్ప వైశ్యులు
ల్లాఁగఁ బ్రయతింపకుండి రట బ్రాహ్మణులుం దమ నట్లు నవ్వెం
చుఁ గడు రుషన్ వహించియును "క్షోణి జనించి కడున్ వసంటలం
బొగులు" డటంచు వైశ్యులకు బొల్పుఱ శాపము నిచ్చిరుగ్రతన్

వ. అంత

నూఱును రెండయి నూలొక్కను సంఖ్యల
నుందగు గోత్రము లొప్పియుఁ బొ
ల్పారిన వైశ్యులు పల్వగలన్ మది
బాధను జెందియు బ్రహ్మకడం
జేరియు "వాక్పతి ! చేయము మే మెది
చెన్నంటి కార్యము చేర్చి మమున్
ఘోరపు శాపముఁ గూర్మి చెడంగను
క్షోణిసురాళి యిడం దగునే !

కర మవనీసురావళిని గాంచి మదంబున వారు నవ్వి ర
త్తైఅఁగునఁజేసి శాపమును దీసికొనం దగు వార లాఱు నూ
ర్ల రహి నిరాఱు గోత్రములఁ బ్రోదినెసంగెడి వైశ్యు లింక మే
మరయఁగఁజేయ మేదియుఁగదా మము శాపము జెంద నేటికిన్?

కలిని ధరిత్రి సంస్కరణకాంక్ష నెసంగునటం జనంగ నా
వెలయగ మీరలంచనెఁ బవిత్రమహోగుణ కన్యకాంబ-ఆ
లలి మది కెట్లొ యందము చెలంగె నటయ్యు నిదేమి చేటు! క
ర్మలసిత రీతి దూరగతి మాకుఁ దరంబొకొ చెంద? వాక్పతీ! ౩౧

అని పలుభంగులం బొగిలి నంతజలేరుహ సూతివారలం
గనియును విప్రు లన్నుడికా కెటు బోవును మీకు నామకా
ర్ధనియతిఁ గర్మబాహ్యత చెలంగు జగంబున నాల వేదమా
ర్గ నిరుపమానధాను లయి గణ్యత మీ ర్గన నొప్పు-వర్తకుల్.

నూటను రెండుగోత్రముల నూల్కొను వైశ్యులు! మీకు శాపమే
పారిన కారణంబటుల వైశ్యులు షట్ఛతకంబుపై నిరా
ర్లైరహినొప్ప గోత్రములయట్టిరు నవ్వినయన్న డూరకే
మీ రొగి నడ్డగింప కట మిన్నక యుండుటె! నుండి వర్తకుల్

శాపంబిది మీ కెంతయు
శాపంబటు గాక వరము సరణిం దగి ని
ష్పాపుల మిము భూలోక
వ్యాపకయశులం బొనర్చు-వైశ్యకులమణుల్

నూట రెండు గోత్రంబుల నూల్కొనని కి
రాటులకు శాపముం దప్ప రా దొకళ్ళఁ
బరిహసించిన ఫలితంబు వదలునొక్కొ-
నగుచుఁ జేసిన ఫల మేడ్చుచుఁ గుడువవలె 	౩౫

శాపం బియ్యది యాత్మగౌరవమహాచారిత్రులై భూమి మీ
రేపారం బొనరించు నుర్వి మనియున్ హృద్యాన వద్యాత్మధ
ర్మాపార్వతముతోడ మీరు మనుస ట్లంచద్గతిం గొల్పుమీ
కే పాటిన్ మఱిఁ జింత యేలనుచు వాగీశుఁడు వాక్రువ్వగన్

నూటను రెండుగోత్రముల నూల్కొను వైశ్యులు చింతఁదక్కి హృ
త్సారసరీతి నెట్లొ సరిసల్పికొనం దగె; నింక నొక్కఁ డౌ
తీ అపు దొప్పె-మౌనికుల ధీరులు మీరు వినుండియంచు వి
స్తారపురాణతత్వఖని చయ్యన బల్కెను సూతుఁ డిమ్ముగన్

## శంభుశ్రేష్ఠికి శచీదేవి కొమరిత యగుట

వ. అప్పుడు శౌనకాది మునివర్యు లత్యంత శ్రద్ధమై విను చుండ, నిత్యపూజితుం డఖిలవిజ్ఞాననిష్ణాతుండు జగదంబికాభక్తి తాత్పర్యసమేతుండు సూతుం డిట్లు వక్కాణించె.

అ నూట రెండు గోత్రము
లై నలు వగు వైశ్యబృందమందున్ దగు సు
శ్రీ నెఱి శంభుశ్రేష్ఠి ప్ర
ధానుండు ధన్యతను నుదారుఁడు బుద్ధిన్. ౩౯

## చిత్రకంఠుని శాపము

ఆ మణిదీవియందు జగదంబను గన్యక నర్చ సేయ నె
ప్డో మఘవాను భార్య చని యుండఁగఁ గన్యక భక్తుఁడైన ని
స్సీమశుభుండు శంభుఁ డను శ్రేష్ఠసువైశ్యుఁడు కన్యకాంబ నెం
తో మొగి వేఁడి యా శచి తనూభవ యై దనకుం జనింపగన్

వరమును గోరినంత నటుఁ బర్వను గా కని కన్యకాంబ స
త్కరుణను నాన తీయ - నటుగా శచి శంభుకిరాటు కూతురై
పరఁగఁగ నామెతో మఖము పర్వుటఁ జూడఁగ నేఁగె గౌతమీ
సరిదురుతీర మాత డట జన్న సమస్తులు నామెఁ గాంచియున్.

కన్నియ వాసవీవిమల గణ్యసునామను నామె నెంతయున్
మిన్నగ నొప్పు నచ్చెరువు మేకొనఁ గాంచియు - నల్ల హావ భా
వోన్నతసుందరత్వ మధురోక్తి సదాభరణాంబ రాదులో
వన్నెలఁ జిన్నెలం గని యభంగురభంగి రహించి రెల్లరున్

వ. అప్పుడు

అందాల చందాల యడుగుఁదామరల ధా
మర లరసియుఁ బేరు గరువ మీగె
మదమరాళ సమానమానయాన మటన్న
నలుపు మీఱెం గల్కి నడక తీఱు
రంభోరుగౌర వారంభ రంభోరు వం
చీమె ననుట పేరి కెగ్గు గాదె!
పూల మారుడు జయశాలి గాకున్న నీ
చూపుఁగోపులు వాని సొంపుఁ బెంచు
కరము పదియాఱు వన్నె బంగారు నౌను
గాదు లాఁడు నీ మేనిదే క్రాలు రంగు
నిండు జాబిల్లియే చాన నెమ్మొగమ్ము
అంచు వాసవిం గన్న వా రాడి రందు ౪౪

## చిత్రకంఠుఁడు

అ౦ యాగంపు సభాంతరమ్మున మనోజ్ఞాకార మందల్ల పు
వ్వుల విల్కాని జయంతుఁ జంద్రుఁ గని వోహో! లాడఁగాఁజాలుస

ల్ల లితాకారుఁడు చిత్రకంఠుఁ డను గంధర్వావతంసుం డెసం
గె లతాంగినిక రాళయైకదళ నాకించిత్ప్రభావంబుతోన్

పంచశరుండు వానిదగు పంచను బంచెను వైచి కొంచు త
త్ప్రాంచితరూపవైభవము హర్షుఁ గనం బరిచర్య చేయు చే
మంచి దటంచు నాఁడికొను మాదిరి రూపము వాఁడు-వాడులే
కించును ఖేచరేంద్రుఁడు రహిం గర మొప్పుచుఁ జిత్రకంఠుఁడున్.

పరమానందకరంబు వాని లలితవ్యాపారముం గాంచి శం
బరజాతాక్షులు శంబరారివిశిఖవ్రాతాహతిం దూలుచుం
దు-రతం డామణిపూర్వరుం డగుచు నెందుం బీరువోనట్టి ని
ష్ఠురవిక్రాంతిని జిత్రకంఠుఁ డెసఁగున్ శుంభత్ప్రతాపంబునన్

సుందరసుందర శోభ నెసంగు గం
ధర్వుండు చిత్రకంఠతతనాముఁ
డాతండు శంభునామార్య కౌమార్తవా
సవిని గాంచి మరుని శరహతులకు
లోనై మదిం దెల్వి మాని గ్లానిం జెంది
యచ్చానతోఁ బొందు నందకున్న
నత్యంతమున్ బాధ యంచు లోనెంచి-త
గిన సమయాన నేర్పున జెలంగి
యల్ల కన్నెను తన కిమ్మ టంచు నామె
తండ్రి నడుగం దలంచియుఁదనరె-బ్రహ్మ

మఖము సాంగంబు సాంత మై మవ్వ మొంద
తనదు భావంబు కళవళంబునఁ గలంగ

అల యాగంబున కేఁగుదెంచిన సమస్తామర్త్య మౌనీంద్ర మ
ర్త్యులు లోనై తగు వారలెల్లరును యజ్ఞోదారతంగూర్చి నో
ళులు వేయింట నుతిం బొనర్చు చది యాలోకించుభాగ్యంబు ని
స్తుల మంచెంచి త్రిమూర్తిముఖ్యులకునుం జోహారులర్పించియున్

ఎవరి యెడలకున్ వారలు
మివుల జవముతోడఁ జనిరి మేల్మి మహాశై
లవరము వైశ్యులు జేరియుఁ
దవిలిరి తమ సాజమైన ధర్మములందున్

వ. అట్లు వైశ్య లెల్లరు మహాగిరిం జేరినంత మణిపురా
ధీశ్వరుం డగు గంధర్వుండు చిత్రకంతుం డక్కడ కరిగి

శ్రీకైలాసగిరీంద్రసన్నిధిని గౌరీశోత్తమాం గేందురే
ఖాకళ్యాణరుచిప్రతానమున సింగారంబు రంగారు శో
భాకీర్ణంబు మహాగిరిం గని కడున్ భావంబు రంజిల్లి, యం
దాకారింపఁగ రా నటుం దనియు వైశ్యశ్రేణి నగ్గింపుచున్

వ. ఆ గిరి నెక్కి యందు ౫౩

అనవరతము కన్యకాంబా పదారవిం
ద మిళిందమైన డెందంబుతోడ

కల్పోక్తగతి సర్వకాలక్రమంబుల
న్నిలకంఠుం గొల్చు నియతితోడ
బహుతపంబులను సంప్రాప్తించనట్టి శం
కరతాండవపు దర్శనంబుతోడ
సాంగ వేదంబులు సాధింప లేని గు
హ్యాభాష్యసేవల యింపుతోడ
సౌరు గాంచిన యచటి వైశ్యవ్రజమున
దనరు మేటి శంభుశ్రేష్ఠి నెనయు పేర్మి
గాంచి, గారవ మంది యీ కరణిఁ బల్కె
నతఁడు నట వారు నాశ్చర్యమందుచుండ

"ఓశంభూత్తమనామ! వైశ్యమణి! ఆర్యోత్తంస! విఖ్యాతి నీ
కే శస్త్రం బగు; నీదు పుత్రిక కరంబెన్నంగ రానట్టి స
ర్వాశానుత్యమనోహరాంగియగు బుణ్యాత్మం డెవం డామెతో
వేశుంభద్గతిమై సుఖించు నని హృద్విన్యస్తమోదంబునన్

ధాక న్నెమ్మనమందు నామెపయి గాఢం బౌ గతి న్నాకు నెం
తో కీల్కొన్నటుఁ బేర్మిగల్గిన" ది—తత్పుత్రభూమణీహస్తమున్
నా కీ రప్పన జల్పి నావయిన దండా లొంది డాలొందుడీ
నా కళ్యాణ మహావిభూతుల వెఱుంగన్‌రానివేః సజ్జనుల్! ౫౬

ఈ మహాగిరి కింక మామణిపురికిని
గూఁత వేటౌ దవ్వు గుదిరియుండు

సర్వ గంధర్వవంశంబులకు న్నైన
నాయకుండ నగుచుం దనరు వాఁడ
నా రూపసంపద-న్నాదు గౌరవమును
నే నయి చెప్పికో నేల మీకు ?
ఈడు జోడు తనంబు - నింత దగ్గఱి చుట్ట
ఱికముఁ బొందుట మీకుఁ బ్రియము కాదె ?
అన్నిటికి మిన్న - మీదు కన్యామణికయి
నంద నా మది తహతహ లాఁడుచుండె
వాసవీపతి నై నేను పరఁగునట్లుఁ
జేయు మయ్య ! శంభుశ్రేష్ఠి ! చిత్త మలర ! ! ౫౭

అని-తనకుం గొమార్తనిడి-యందముఁ గూర్పు-మటంచు ఖేచరుం
డనవుడు - శంభుసెట్టి తన యాశయమందుఁ దలంచి - బంధుపం
క్తి నడిగి- "యల్ల కన్య నిడు తీఱు చెలంగ" దనంగ-నుగ్రకో
పను గతిఁ జిత్రకంఠుఁ డల భంగికి నుత్తర మిచ్చె ని మ్మెయిన్

గంధర్వేంద్రుండ నా నేఁ గరము మనసుతోఁ
గాంక్ష సేయంగ - నా ధౌ
రంధర్యం బింత లోనన్ రహిని దలఁపకే
"రామ నీనా" నటన్ ధీ
బాంధుర్యం బింత లేకే ర్పలుక నగునె ? నా

భావ మెంతేని రుష్టిన్
సంధిల్లన్ శాప మిత్తున్-పరగ నదియె ?
జై ప్రకారంబు మీ కౌన్

నూఱును రెండు గోత్రములు నూల్కొని మీ-రల కన్నెతోడనుం
ధారుణియందుఁ బుట్టియు-హుతాశను పాలగుఁ"డంచుఁ దన్నిభ
శ్చారుఁ డనంగ-నెంతయు రుషాపరిపూర్ణత వైశ్యు లిచ్చి రా
సారున కెంతయేనిఁ బ్రతిశాపము గర్వము డుల్లి పోవఁగన్

వ. శంఖుశ్రేష్ఠి ప్రముఖులు చిత్రకంఠుం బొడఁగాంచి రుషాపరిపూర్ణులై యిట్లు వెండియు వక్కాణించిరి

"ఔరా ! యెంతటి కండకావరము నీ ?కాకాశ సంచార ! నీ
కే రీతిన్ ఋణపడ్డ వారమోకొ? నీ యిష్టానుసారం బొగిన్
మా రామామణి ని మ్మటంచు నడుగంగానే భవత్సన్నిధిం
గారాకూరవు డెంద మూనియును గాన్కంగా సమర్పింతుమే ?

నీవంటి ఖలున కిడ నే
లా వనితను ? దానికన్న లా గగు జగమం
దే వికృతంపున్ మృగమున
కో వెస నిచ్చినను వింటె ? ఓ దుష్టుండా ! !

ఖచార్యగ్రగణ్యా ! వి న్మిదియు భవ దుగ్రంబయిన తి
ట్టు చెందన్ మా కన్యామణి యెటులఁ గీడుం బొరయు-న

ట్ల చెట్ట నీన్ని వొందన్ భువి నవవి, పాలత్వమును జెం
ది-చేటుం దానిఁ గూర్చు మతి నవయం జెల్లు మిగులన్

అటుం గన్నైపై మోహ మం తేఁది మించన్
పటు క్కాంచు శీర్షంబు వ్రయ్య ల్గ వ్రీలన్
కటా ! చత్తు వీవున్ రకంబైన చావున్
గటుత్వంపు శాపంబుగా నిత్తె మాకున్ ?"

అని యుగ్రప్రతి శాపం
బు నిడిరి గంధర్వునకును బొరి వైశ్యులు న
య్యనఘేతరు తల భూమిని
బెనువ్రయ్యలు గాఁగ వాఁడు వెసఁ జావంగన్॥

ఆ కన్యయె వాసవిగా
వీఁక భువిఁ బొడమె-ఖచరవిభుఁడుం
దగె భూఁలోకమున విష్ణువర్ధన
భూకాంతుం డగుచు-వినుఁడి ! మునివరులారా ! !

వ. అని సూతమహర్షి మతి యొక విశేషము వినుండని
శౌనకాది మహామునుల క నైమిశ వనాంతరంబున నొనరిన
సభాంతరమున ని ట్లనియె ౬౭

# సుశీలా సోమకాంతులకు శచీదేవి యొసంగిన వరము

సోమకాంతుం డను నొక యక్షుండు గలఁడు
వాని సతి సుశీల-సుశీల భరిత-నిజము
పుణ్య దంపతుల్ వార లిర్వురను - శచికిఁ
బ్రియతమాశ్రితు లామె నర్చించి రొగిని

ఆ మహాదేవి యింద్రాణి యాత్మజాత
యగుచు జన్మింప వలె నని ప్రార్థనంబు
వారు గావించి రెంతో యవ్వారి భక్తి
వీఁక మఘవాను సతి య దంగీకరించె

అల్ల సోమకాంతాఖ్య యక్షుఁడె పౌరి
శంభునామవైశ్యుం డయ్యె పరగఁ దా మ
హాగిరీంద్రంబునందు నింద్రాంగన యల
కౌమిరె వాసవి యయ్యె-భవ్యమునులార

అల్ల సోమకాంతుఁడె కుసుమాఖ్యవైశ్యుఁ
డగును భువి-సుశీలయుఁ గుసుమాంబ యగుఁచు
నతని వనిత యౌ-శచి వారి యాత్మజాత
యగుచు వాసవాంబానామ మందఁ గలదు ౭౨

## శచీదేవికి బ్రహ్మదేవుని శాపము

తొల్లి శతజిహ్వుఁ డనెడి దైత్యు నొగిఁ బోరఁ
గా జయంతుని గోరెను గంజభవుఁడు
కొడుకు ప్రాణాల భయమున నడలి శచియు
నడ్డుపడ-బ్రహ్మదేవుండు నాగ్రహించి

"లోక కల్యాణముం గోరి యీ కడిఁదిప
నిం జయంతునకున్ బూన్ప-నీతి మాలి
యడ్డుపడ నౌనె యింద్రాణి వయిన నీవు?
దీనికిన్ బ్రతిఫలము నందెదవు నీవు

నీవు భూలోకమందు జన్మించెదవు న
రాంగన వయి" యంచును శాప మజుఁ డొసంగె
అందులకు శచి యత్యంత మడలె మదిని
దాని కెచ్చు వనరె నమర్త్యప్రభుండు ౨౫

అపు డమరాధిపుండు కమలాసను పాదములందు వ్రాలియున్
విపులపుఁ జింత నొంది యిటు వేఁడికొనెన్ బహుభంగు లొప్ప "నో
యపరిమితానుకంప! మది నాగ్రహ మిమ్మెయి నొందనల? స్త్రీ
చపలతకొద్ది నాదు సతి చర్యను బూనిన-దీ వెఱుంగవే?

రక్షశ్శిక్షణకై మదీయ వరపుత్త్రిశ్రేష్ఠు నిం బొ-మ్మటం
చక్షయ్యనంబగు తావకాజ్ఞను మృగాక్ష్యత్యంతసామాన్య బా

లాక్షీణాదృతి నీకు నాదయిన శుద్ధాంతం బెదుర్వక్కె--నీ
కౌక్షేయ క్రమ శాప మింతనె యొసంగం బాడియే? పద్మజా!!

ఉర్వీమండలిఁ బుట్టు నా సతి త్వదీయోగ్రోరుశాపాన రం
భోర్వాకారము నొంది యొక్క నరుతో నుద్వాహ మౌనేని--సా
పర్వశ్రేణికి నాయకుండ నగు నాపర్వంబు ఖర్వంబు గాఁ
బర్వంగా? సతి యన్య కేల్గొనుటకున్ వైకల్య మే ముండెడిన్?

కాన--శాప మిది--నా కాంతకుమాత్రమే
గాక--కాంత కగు భంగంబుకరణి
నాకుఁ గూడ నయిన నలువు గాదో? దేవ!"
యనినంత--బ్రహ్మ సమాదరమున
నీ కాంత యన్యుని నీరేజపత్రాక్షి
యేనాఁటి కగు నని యెంచ--కయ్య
ఆమె భువిం బుట్టి--యందుఁ గన్యగ నుండి--
ఆ జగదంబా సమాదరణను
మహిత భూభువనైక సన్మాన్య యగుచు
కన్యకాంబా మహాదేవి గౌరవంబుఁ
గాంచఁ గల దయ్య! కలఁకను గాంచ కయ్య!
అంచు నోదార్చె దేవేంద్రు నబ్జభవుఁడు

వ. కావున

అంభోజగర్భు సభాంతరంబునఁ జిత్ర
కంతు డిచ్చిన శాపకారణమున
సౌరిది సుశీలయు సోమకాంతుఁ డను
స్త్రీకాంతులు కోరిన కారణమునఁ
బోరి జయంతుఁ డనికిఁ బో నడ్డుఁగాఁ గంజ
గర్భుఁ డిచ్చిన శాపకారణమున
అన్నిటికిం బయి నాదిశక్తి యయిన
కన్యాంబ సంకల్పకారణమున
అల్ల యింద్రాణి భూలోకమందుఁ బుట్టి
లోకపావన లోకావనైక సుకృత
భవ్యగా నగు వింటిరే? పరమమౌను
లార! సత్కథాశ్రవణహృద్యమ్యులార ::

## శ్రీ కన్యకాపరమేశ్వరి నూట రెండు గోత్రముల వైశ్యులకుఁ గావించిన కట్టడ

శ్రీ కన్యాపరమేశ్వరి
వీఁక మహాశైలమందు వేంచేసియు న
స్తోకాదృతి నొక నాఁడు శ్రీ
తాకరమున్ వైశ్యులఁ గని యనె నీ రీతిన్ ౮౨

“ఇందు నొప్పొందు వైశ్యులం దెంతయేని
నూట రెండు గోత్రంబుల నూలుకొనిన
వారు నా పేర్మి కెంతయుఁ బాత్రు లింక
మిగులు వా ర్నామమాత్ర వైశ్యగణ మరయ

మీదులోన శంభుశ్రేష్ఠి మిగుల ఘనుఁడు
వాసవి తదాత్మజాత దేవప్రభు సతి
యామెను మదీయసేవకు నప్పగింపఁ
డామె పుట్టువ రీతిని నలర వలయు

వ. ఇంకొక విషయంబు వినునది

నూఱుగు రిరుగురు గోత్రజు
లారా! వైశ్యులార! లలి నిది వినుఁడీ!
మీ రెట నున్నన్ జో టది
తా రహి జ్యేష్ఠగిరి యంచుఁ దగుఁ బ్రఖ్యాతిన్

పురమో పురతతియో మీ
యిరవునఁ దగునెడ మహాగిరీంద్రాఖ్యం బై
పుర మున్న నందులో మి
మ్మరయఁగ నే నుండు దాన నమితాదరణన్ ౬౭

పరఁగ మహాగిరి యనఁగాఁ
బరఁగెడు నెడయగును నా నివాసము మఱిఁ ద

త్పురమందుఁ బెద్ద సెట్టి కా
మిరె తొలి దాజన్మము నను మేల్మిం గొలుచున్

ఎందే నూఱున్ రెం డై
యందం బగు గోత్రములను హరువగు వైశ్యుల్
సందీపిం త్రందున నే
నుందుం దేవళమునందు నొందుచుఁ బూజల్"

ఇటులఁ గట్టడ నొనరించెఁ గన్యాంబిక
గాన వైశ్యతతులు క్రాలు నూరఁ
గన్యకాంబ యుండుఁ గడఁగి యక్కడ నామెఁ
గొల్చుఁ బెద్ద సెట్టి కామిరె తొలిది

నియమము నేను మీకు భువినిం గనుపట్టెడి నంతదాఁక మీ
కయి తగు నిద్ది యవ్వలను గ్రాలు నొకట్టుల నంచుఁ గన్యకాం
బయు వచియించె వైశ్యతతి మానుగ మానస పంకజంబులన్
భయము నయంబు భక్తి తగ వందనముం బొనరించి రంబకున్

## వైశ్యులు మరల శివదర్శనము చేయుట

వ. అంత శ్రీ కన్యకాపరమేశ్వరి యంతర్హిత మయ్యెఁ
దదనంతరంబు

కైలాసంబున కేగి వైశ్యతతి శ్రీ ఖండేందుకోటీరు ను
ద్వేలామోదమునం గనుంగొని "నమస్తే దేవదేవాయ!. గౌ
రీలీలారమణీమణీప్రకలిత శ్రీ వామభాగాయ! వే
దాలాపాతిగ సత్ప్రభాయ!" యని జోహార్లర్పణం జల్పియున్

శ్రీమత్పర్వత సార్వభౌమ తనయాంఘ్రిద్వంద్వమందున్ శిర
స్తోమంబుంచి నమస్కరించియు గజాస్యున్ షణ్ముఖున్ నంది ను
ద్దామానూన సుభక్తి మ్రొక్కియును దద్దం బేర్మి వైశ్యాళి యా
శ్యామగ్రీవుని యాజ్ఞ బొల్చి రొక యందాసీనులై సొంపునన్

వారస వైశ్యులున్ బ్రమదవారము దేవతలున్ మునీశులున్
చేరి శివామనఃపతికిఁ జిత్తమెలర్ప నమస్కరించి యెం
తో రహిఁ గూరుచుండ బరితోషమునన్ శివుఁ డాఁడు నిట్లుగం
భీర పయోధరాచ్ఛటినిఁ బేర్మిని వైశ్యుల నందుఁ గాంచియున్

# పరమేశ్వరుని పునస్సంభాషణము

"శ్రీ కన్యాపరమేశ్వరీమణి తొలిం జెప్పెం గదా మీకుః స
త్యైకాదే విన వచ్చె నౌల నటు మేల్మిన్ మీ ర్కలిన్ ధారుణిన్
ప్రాకట్యంబుగ నొప్పు బాధ లడఁపన్ జన్మింపగా నిప్డు మీర్
గోకర్ణస్థలి నాయెడం గడచియున్ క్షోణీస్థలిం జేరుఁడీ!" ఉ

అనుచున్ శ్రీకంఠుఁ డనన్
విని వైశ్యులు సెమ్మనమున వెక్కస మౌ చిం
తను వంతను గని యని రి
ట్లనుకంపాజనకముగను నల శంభునకున్

"ఓ మృత్యుంజయ! శంభో!
సామాన్యేతరకృపారసప్రచురాత్మా
ఈ మాడ్కిన్ మము వీఁడన్
మా మనముల కొప్పునే? ఉమాపతి! యెపుడున్?

జగదేకాంబిక కన్యకాంబ ప్రకృతి స్వారస్యముఁ జెందు నీ
విఁగ బ్రహ్మంబవు మాదుచెంత నెటనేన్ వేడ్కల్ పిసాళింప నుం
డఁగమిమ్మున్విడిపొమ్మటందురిదియున్న్యాయంబె?యంచన్న వై
శ్యగణంబుం గని సత్కృపం దగి లలాటాక్షుం డిటుం బల్కెడిన్"

సాదరమేదురముగ నా
నా దురితాంతక మగు వచనవితతిమై నిం
పాదిగ వైశ్యులతోడ మ
హాదేవుడు వల్కెఁ గరుణ హాళిఁ దలిర్పన్

"మీ రన్నటుఁ గన్యాంబకు
నారయ మాకుఁ బ్రకృతిపురుషాత్మకభావో
దారభిన్నత యొప్పెడి
వారక మా నుడులకు భిద పరఁగంగలదే ౧౦౧

రామాయణ మెల్లన్ విని
రామునకున్ సీత కేమి రాణయటన్న
ట్లీమెయి మీ చింత దనరు
నో మాన్యులు వైశ్యు లిటగునో పల్కఁడగన్''

అని యనుచున్ సంకల్పం
బును శంభుఁ డొనర్పఁ బల్కఁ బొలఁతుకతోఁడన్
వనజాసనుం డటకు వ
చ్చెను సర్వుల కెంతయేనిఁ జెలగన్ ముదమున్

అజుడున్ శ్రోతగ నుండగ
నిజహృద్వైకల్య మెల్ల నెఱిఁ దేటపడన్
త్రిజగత్పతి హరు కడ వై
శ్యజనంబులు పల్కి రిట్టు లమితవినీతిన్ ౧౦౪

## కలికాల వర్ణనము

"ధరణికినిం గలిం జనగఁ దగ్గది యంచును నిప్డు మాకు మీ
రొ్వారి ముదలం బొనర్చితిరి పూజ్యతముల్! కలి భూతలంబునన్
బరగుట యన్న మాటలొకొ? పాపమయం బఖిలార్తియుక్త మౌ
ధరణి యట న్నరుల్ గరముఁ ద గ్గగు పుట్టువు గల్గువారు గా ?

వేసంబు మోసంబు దోసంబు గ్రాసంబు
గాఁ బెట్టినవి వెన్నగడ్డ తోడ
పరుల విత్త మనంగఁ బంచదారకు సాటి
పరు నాలు గని తమ భార్య యంద్రు
మధుమాంసములతోడ మంచిగా భుజియింత్రు
నీతి మాలిన వారి స్నేహ మెచ్చు
అధికారి కధికారులయి భృత్యులు చరింత్రు
పొరుగు పచ్చకు నోర్వ పొనరదింత
ఆలి నుడి కేఁగి జనకుల కార్తి నిడుదు
రన్నదమ్ములు కలహించు రర్థమునకు
ధర్మములు మాఱుఁ దండోపతండములుగ
వర్ణనియమంబులకుఁ బరివర్తనమగు

పాఱులు రాజధర్మమున-వైశ్యుల వృత్తిని క్షత్రియావళుల్
జేరులు శూద్రవృత్తి సరణిన్-బదజాతులు పంచమక్రియన్
పారెఁ గలిం జరింతు రఘసక్తులయందు గురుత్వమొప్పు బు
ణ్యేరుతరాత్మలెంతయును నొందెడి వారల గౌరవంబులన్ ౧౦౭

దుష్కామితాభిఖ్య తోయయుక్తం బయి
క్రోధాభి ధౌర్యాగ్ని కూడి యుండి
షేరాస యను నుప్పు వెలయంగ విత్తవి
షము మత్సరగ్రాహ సంకులంబు

దుర్మోహ పాశాతి దుర్గమం-బంగనా
వ్యాళీభయదము-దంభగిరియుతము
నరక పాతాళ గహ్వర మై-యపార మై
సంసారవార్ధిలో సరన మనుచు

తోలు బొక్కలు తొమ్మిది తొడరు దేహ
నావపై క్షణక్షణ విభంగ భయదమగు
యౌవనపుఁ గే వొసఁగి మనుజాకరంబు
సంచరింతురు కలివేళ సాధ్వసముగ ౧౦౮

ఆకలి యాకలిం దగి మహోవని నుండఁగ నాజవంజవం
బాకులపా టిడుం బ్రజకు నంబుధిఁ బోలి నికామ కామ నీ
రాకరమై ప్రలోభ లవణాంచితమై కటురోష బాడబా
గ్న్యాకులమై యదృష్యమయి యర్థహలాహలమొప్పి మోహమే
పీఁకను నాఁచుఁదీఁగ గమి వెక్కసమై చొఅరాక గ్రాహయూ
థాకృతి మత్సరంబు గన నంగన లన్ ఫణిసీవితాన మ
ఙ్ఞాకలిడంగ దంభ మహిమాద్రియుతం బతలాధ్వగామి ద
ర్వాకలితంబునై తనరు నందు నరుల్ నవరంధ్రయుక్తమై
మేకొను దేహ నావ క్షణ మేనియు నిల్కడలేని యౌవనం
బే కయికేవు గాఁగ తలఁపింక వికల్పములే తుపానులై
డీకొనుచుండ విచ్చలవిడిం జనుచింక నహంమమతత్వముల్
చీఁకటు లొచుఁ గ్రమ్మకొనఁ జెల్వుగ భవ్యనరాంగబృంద మం
చేకత నొప్పు దీవుల స్పృశింపగ లేక రుజామధుస్మర

ప్రాకట బంధ మొందుటకు భావము నొందుచు దేహపోతమున్
భీకరభంగి ప్రీలఁగ గభీరమహాభవవార్ధియందు లే
వే కర మొప్పుగా ధరయవిస్మృతి మృత్యు వటన్న గ్రాహ మ
య్యో! కడిఁదిన్ మెసంగ గలి నుక్కివమందుదు దుర్వరన్ బ్రభూః
ఆ కలి లీల లొప్పు భువికా! మముఁ బంపుచు నుంటి రిప్పుడున్?

## శ్రీ పరమేశ్వరుని సమాధానము

వ. అని వైశ్యరత్నములు దేవిరింపగా సమస్తాఘ నాశఁ
కరుండయిన శంకరుడు వారల కిట్లు వక్కాణించె.

"నాయనలారా! వైశ్యకుల నాయకులార! యి టీర లింత చిం
తాయుతు లౌటకుం గతమెదా? యని యారయ సున్నె గాని యే
దే యిసుమంతయేనిఁ గనుపింపదు ముక్తు లపాంతరాత్మరూ
పాయతులై ధరన్ సుకము నందఁగుఁ జేయుదు రంద మొందగన్
ఆయటు నిత్యముక్తు లగు నట్టిరు మీరు ధరాతలాన సౌ
ఖ్యాయతిఁ గల్గఁ జేయుటకునై యట కేఁగఁ బరాంబ యానతిం
జేయఁగ "జే"యటంచు నదిచేయఁగఁ జెల్లెడి నంతె గాని తా
నీ యని గీని యం చనుట నీతి వినీతి విధానమౌనొకో? ౧౧౨

## పెనుగొండపురము

పావనపావన కన్యా
దేవి భవత్స్థలముగను నదీమణి శ్రీగో

దావరి దరిని మహాగిరి
నా విలసిలు పురముఁ గొల్పె నవ్యవిభవమున్
అది విశ్వకర్మనిర్మిత
ము దయాస్త హిమాద్రి సేతు లొనరెడి ధరణిన్
ముదమెంతే నొసఁగెడి పుర
లఁ దగుం దలమానిక మయి రమ్యతమం బై

శ్రీకర మై సుప్రాకా
రాకర మై బహువిధనిలయానీక విభూ
త్యాకీర్ణం బై యప్పురి
మీకుం దగు వైశ్యులారా? మీ రట మనుఁడీ!

వినుఁడి "మహాగిరి" సంస్కృత
మున నగు పేరుఁ "పెనుగొండ" పొనరెడి నాంధ్రం
బునఁ బేరు దాని కద్దియె
యెన యగు వైశ్యులట నుండుఁ డింపు దలిర్పన్

## మిగిలిన పదునేడు పురములు

వ. అని పరమశివుండు వెండియు వైశ్యుల కిట్లు లనియె

ఈ మహాగిరి గాక పదేడు పురము
లింకఁ గన్యాంబ మీకొఱ కిలను గొల్పె
వెరసి పదునెన్మిది పురముల్ పృథ్వి వైశ్యు
లకు నివాసమ్ములో వైశ్యులారా! విండ్రె ౧౧౭

## వైశ్యుల పదునెన్మిది పురములు

పరగ జ్యేష్ఠశైలము - నిరవద్యకంబు
వీరనారాయణపురంబు - వెస శివపుర
ము - విశాల (విశాఖపట్టణము) - మేలాపురము - నరసంబు
ధనద -ధర్మ - త్రిగుణ - జగన్నాధ - భీమ
ఘంటసాలమ్ములుఁ - గళింగకమ్ముఁ - బీఠి
కాపురము - బాలకుండము - గడఁగి యుఁకను
బౌనర నాసంట పాంచాలములుఁ బదెన్మి
దర్యు లగు మీకు నెలవులౌ నవని యందు
నటను బెనుగొండ పురి మణి యై చెలంగు

పరగఁ బంచయజ్ఞ బ్రహ్మచర్య యజ్ఞ
యాగ దానధర్మములచే నమర మౌని
పితృ సమర్చ సల్పి తదృణతతులఁ దీర్చి
కృషి వణిగ్వృత్తి గోరక్ష యొసఁగఁ బూని

ఓడలందు బేరంబుల నురుతరనవ
రత్న మాణిక్య ముఖ్యముల్ పరగఁ జల్పి
కోట్లకుఁ బడగ లెత్తియు గుంభిని సుగ
ము గని సుగ మిందు మీ రైవైశ్యముఖ్యులార! ౧౨౧

# పునఃపరిదేవనము

వ. అనవుడు వైశ్యులు మరల సదుఃఖంబుగా నిట్లు వచియించి రెక్కటి! ముక్కంటి! యక్కటికంబున మా చిక్కు నాలింపవలయు

శౌరి గుణాతీతు లై పుణ్యస్వభావు లై
తగు సనకాదుల తా వగుచును
బ్రహ్మార్పణ మని నిర్వాంఛ యజ్ఞంబుల
నాచరించిన వారి కాకర మయి
నిష్కపటములట్టి నిష్కపటోక్తు ల్ప్రి
యముగఁ బల్కు నరుల యాలయమయి
రాజయోగాభ్యాస రమణీయులగు జన
కాది భూపతుల కాయతన మగుచు
రాజసూ యాశ్వమే ధాధ్వరములఁ జల్పి
నట్టిరును భవాబ్ధిం దాఁటినట్టిరును స
మాధినిష్ఠులు స్వార్థహీనాత్ములును వ
సింతు రీ మీ జగాన శ్రీశివ! మహేశ!!

లోకకళ్యాణముం గూర్ప వీక మేను
గడ్డిపోఁచగా వదలిన ఘనులు మీదు
లోకమందును గాంతు రస్తోకముదము
భవభయవినాశ! వింటివే? పార్వతీశ! ౧౨౪

"జ్ఞాతి శ్చే దనలేన కిం" మ్మనినటున్ నైజారి యుండంగ రా
దేతీజేనని యాజి శత్రువులతో నెంతేని బోరన్ శరా
ఘాతచ్ఛిన్న తనుక్షతిప్రతతి నిర్గచ్ఛన్మహాసృఙ్మహా
స్రోతస్సిక్తభుజాంత రాస్యులు రణక్షోణీమృతుల్ వే దినేం
ద్రాతిప్రోజ్జ్వలబింబభేదన సుమార్గప్రాప్తలౌచున్ విరా
డ్జ్యోతిర్మండలగుల్ చెలంగు నిట మే మో శర్వ! పోనాఁడియున్
పాతిత్యంబున కాలవాల మగు భూభాగంబునం జొత్తుమే ?

## బ్రహ్మదేవుఁడుఁ సమాధానపఱచుట

అని దురపిల్లు వైశ్యులకు నంబుజసూతి వచించు నెమ్మనం
బునఁ గరుణారసంబు కడుఁ బొంపిరివోవుచునుండ మీ ర్విను
డనఘవరేణ్యులార! కలియందు ధరన్ నివసింపఁ బోవ మీ
ర్వనఁటను నిట్లుఁ జెందుట కరంబు విచిత్రముగాఁగఁ దోఁచెడిన్

కసటు మీదెల్లఁ బంచబంగాళముగను
నక్షికౌక్షేయుఁ బన్నగహారు హారుని
పాదకంజాతములను గొల్వంగవలయు
అదియె సర్వసౌఖ్యంబుల కాకరంబు ౧౨౭

సృష్టి స్థితి లయ కర్తృత్వంబు గలవాఁడు
నెల్ల జగంబుల నేలువాఁడు

సాధు సజ్జనుల రక్షణము సల్పెడి వాఁడు
మానాతిగామి సన్మహిమ వాఁడు
వాడు వాఁడని పాపపటలిఁ గాల్చెడి వాఁడు
వామాంగమునఁ గాంత పరఁగువాఁడు
నిత్య నిరంజన నిర్మలత్వము వాఁడు
సకలాగమాతీత సరణివాఁడు
మేరువును విల్లుగాఁ దాల్చి మెఱయు వాఁడు
హరుఁడు భక్తపరాధీనుఁ డయిన వాఁడు
చూచు లెకిమీఁడు మేలి దోచూచు లాఁడు
శంకరుం డేలు మిమ్ముఁన్ శివంకరుండు ౧౨౮

వేయి తలల్ మ ఱింకఁ బది వేల కరంబులు గల్గి తొల్లి నా
మ్నాయనికాయగేయమహిమప్రచురుం డగు శూలి సర్వవి
శ్వాయతనాయమానము నిజాద్భుతతేజముతోడ నుండఁ ద
చ్ఛ్రీయుతు పాదముల్ గనఁగ లేమల శ్రీశుఁడునేనుఁబూనియున్

తొలిఁ ద్రిపురాసురాఖ్యులగు ధూర్త దనూజులు సర్వవిశ్వసం
విలయముఁ గొల్పుచుండఁ బృథివీరథ చంద్రదినేంద్రచక్ర మే
రులసితచాప విష్ణుశర రూపమునన్ నిగమాశ్వయుక్తి నే
నల యరదంబుఁ దోల నుఱుమాఁడె హరుం డల దుష్టదైత్యులన్

మీకును మాకు నింకఁ గడిమిన్ సకలామర యక్షకిన్నరా
నీకినికిన్ భయాపహృతినీతిఁ దనర్చు నుమాధినాథు న

స్తోకమనీషతోడఁ బరితోష మెలర్ప భజింపుఁ డీరు పే
యాకులపాటు నెల్ల నతఁ డార్తిహరుండు హరించు సత్తముల్

పరఁగ నజుం డిటుం బలుక వైశ్యులు సర్వులు శర్వుఁ గాంచియున్
కరములు మోడ్చి శీర్షము లఖండ సుభక్తిని నల్ల చంద్రశే
ఖర చరణారవిందముల గాటముగాఁ దనరారఁ జేసి యే
డ్తెర నిటు గద్గదత్వసుగతిన్ వచియించిరి బ్రహ్మతో నొగిన్

వ. "ప్రభూ! కమలాసనా! నీ వానతి యిచ్చిన రీతి నిదే యీ మహాదేవునకు నమస్కరించుచున్నా"మని సనమస్కారముగా వచియించి శంకరుం గాంచి ౧౩౩

"శర్వాయ - దుర్వారగర్వగ పురమద
నిర్వాపణాయ - సుధూర్వహాయ -
కాలకాలాయ - కాకోలగళాయ - కా
కోదరహారాయ - గురువరాయ -
ఖండేందుమకుటాయ - ఖండితాఖండాఘ
కాండాయ - వినమితాఖండలాయ -
శైలేంద్రకన్యకాసహితాయ - విశ్వవి
శ్వంభరానందనపావనాయ
వేద వేదాంగ వేదాంత వీథి కాతి
గామి చరితాయ - బృందారకప్రకాండ

మౌనిమార్తాండ వందనమానితాయ -
భవహరాయ - దేవాయ తుభ్యం నమోస్తు

అని శివునకు మ్రొక్కియు వై
శ్యనికాయం బజున కెఱిఁగి యంబా
ధవపూజన పద్ధతిఁ దెల్పు మన
ల్వనియతిఁ దగు పేర్మి వాగ్వరా! జోతలివే!

భవపూజన మన మానవ
భవ పావన మఖిలభక్తవరజీవనమున్
సవనాయు తాతిగం బగు
ప్రవిమలఫలదంబు వినఁగ రమ్యంబు కడున్

కాలు జాఱి నతఁడు కస్తూరిలోఁ బడ్డ
చందముగను దుఃఖసహితుల మగు
మాకు శివుని పూజ టీకు వినం గల్గె
పంకజభవ! నీ కృప నొగి నేఁడు ౧౩౭

## శ్రీ శివపూజా క్రమము

అని వైశ్యు లడిగినంతన్
వనజభవుఁ డభంగతర కృపావీక్షణముల్

దనరం గని వారల కను
వనజారికిరీట యజన పద్ధతి నిట్లున్

"కామ క్రోధ మద ప్రలోభగుణ ముగ్ధ త్వాసహిష్ణుత్వముల్
తా మార్యశ్రతులు వానినిం గెలిచి మిత్రవ్రాతవైరివ్రజముల్
సామాన్యంబుగ నెంచి డెందమును హింసాదూరముం జల్పియున్
సోమున్ సోమకిరీటుఁ గొల్వ వలయున్ శుద్ధాతిశుద్ధాత్ములై

పరమపావన మైన పంచాక్షరీమంత్ర
రాజ మాననమందు రాజిలంగ
బంగారునం గాని బంకమట్టిని గాని
శివలింగముం జేసి చెలఁగి దాని
ముంగల గణపతిన్ బొనర నిల్పియు నవ
బిల్వదళంబులన్ వెల్లనయిన
యక్షతల నిఁక నంద్యావర్తిసుమముల
నుమ్మెత్తపూలతో నొగి సమర్చ
వెసఁ జలిపి ధూప దీప నైవేద్యములను
చేసి మంగళారతి నిడి చెలఁగి బయట
లోన సంశుది నొంది సుశ్లోకమయుని
పార్వతీశుఁ గొల్వవలయు వైశ్యులార!"

వ. అని బ్రహ్మదేవుఁడు వైశ్యులకు శివపూజావిధానం
బును శ్రీ శివపంచాక్షరీమంత్రరాజంబును నుపదేశించె ౧౧౪

అని యజుఁ డాగమోక్తవిధి హర్షు చెలంగు శివార్చనప్రకా
రనియతిఁ దెల్పినంత విని రాజదఖండముదంబుతోడ వై
శ్యనికర మెల్ల మౌనితతి కాకరమై, వివిధాగబృంద స
జ్జన ఖగ పన్నగ ప్రతతి సంకుల కాననదేశ మేఁగియున్

కూర్మి లతానికాయ బహుకుంజ నికుంజ మనోజ్ఞ మై సదా
ధర్మవిరాజమాన మయి తద్ద రహించు వనాంతరంబులన్
బేర్మి సదాశివుం గుఱిచి విస్తృతమైన తపంబుఁ జల్ప, నం
తర్మదముఖ్యశత్రుల నణంచియు వైశ్యులు పోయి రప్పుడున్

గంగాతరంగశీకర పావనస్థలీ
ముఖ్య పుణ్యస్థలపుంజములను
బహుమహామునిచంద్ర పరిషేవితములైన
సప్తమహాశైల సానువులను
నైక గంధర్వ కిన్నర గరుడోరగ
సురనివాసంబులై పరఁగు నెడల
వేద వేదాంత సద్విజ్ఞానవాదంబు
లమరుచుండెడి నైమిశాది వనుల
జేరి యావాసములను వాసిం బొనర్చి
కొని భసితపూత దేహులై కూర్మిని శివ
లింగముల నుంచి పంచాక్షరిని జపింపు
చును శివుని గొల్చి రల్ల వైశ్యులు సుభక్తి ౧౪౪

ఈ రీతి నెన్నొ చోటుల
నా రమ్య చరిత్రులయిన యర్యులు శివునిం
గూరిచి తపముం జల్పియు
గౌరీశుఁడు కానఁబడమిఁ గటకట పడియున్

## వైశ్యుల చింత

కైలాసంబుననుండి వచ్చితి మటం గంగాధరుం డింపుగా
వాలాయంబుగఁ జెంగటం గనఁబడున్ భవ్యంబు తత్సూక్తిచే
భూలోకం బిది చేరి యింతగఁ దపంబుం జల్పికూడం గనం
గా లే మైతిమి శంభుఁ, గారణ మె దై నల్వొందునోః యంచొగిన్

అందఱు నొక్కెడం గలసి యందము జంద మెసంగు సేమ మిం
పొందిన డెందముల్ దనరి, పొంపిరిపోయెడి భక్తితోడ నా
నందకరుం గళామయుని నందకపాణి హితున్ భజించి రె
క్కుందమితోడ వైశ్య లహికుండలమండితగండమండలున్

వ. అట్లు వారలు పూని ౧౪౮

తాల హింతాల రసాల సాల శిలావ
ట వట చందనముఖద్రుమవిసరంబు

వామదేవ వసిష్ఠ వాలఖిల్య భృగు భ
రద్వాజముఖ మౌనిరాజితంబు
నికట పర్వతసాను నిస్సర న్నిర్ఝర
ధారాఘుమంఘుమ ధ్వానయుతము
కాంచన కేతకీ కల్హార మందార
రాజీవముఖ సుమరంజితంబు
నైక లతికా నికుంజ పుంజ ప్రచురము
స్నిగ్ధ మృగ మృగాదన గజ సింహ మూషి
కా త్వహి ఖగేంద్రముఖ్య జంతూత్కరమగు
నాశ్రమమునఁ దపము సల్పి రర్యమునులు

మునుల యధ్వరధూమములు మందమందాని
లస్పందమానముల్ గాఁ దలిర్ప
గంధర్వ కిన్నర కమలేక్షణా గాన
యాత్రసుస్వరముల యందమెసఁగ
అత్రి కశ్యప పులహ పులస్త్య ముఖ మహ
ర్షులవాద నాదముల్ సొంపు నిడఁగ
పరఁగ నానందరూపంబు నందుం గాంచ
దేవేంద్రముఖ్యు లేతెంచి యుండ
మిగుల శాంతిప్రధాన మై మేల్మిఁ దనరి
నట్టి య వ్వనరాజంబునందు బ్రహ్మ
చర్యదీక్ష వైశ్యమునీంద్ర సత్తములు స
దాశివుం గూర్చి సలిపిరి తపము సతము ౧౫౦

# ఇష్టవస్తువిసర్జనము

వ. అట్లెంత కాలమో యవ్వైశ్యులు తపంబుఁ గావించి

శివుఁడొక పట్టునం గనఁగఁ జెల్వొలరారమి వైశ్యులెల్ల నె
చ్చపు తమితోడ నందలి మహామునులం గని మ్రొక్కి యుద్గినం
త వెసను మౌను లాఁడి రిటుఁ దద్దయు వేడ్క నొసంగు వస్తుసం
క్తి విడిచి సోమశేఖరుని దీక్షమెయిం గొలువుండు తత్ప్రభున్

వ. నావుడు నవ్వైశ్యబృందం బంతయు నట్లాచరింప
నంత

చండ చండభానుసాహస్రికం బోలి
ప్రళయవహ్నిఁబోలె వైశ్యుల తప
మద్ది వేంద్ర మిడఁగ నమరేంద్రముఖ సురు
లెల్ల డిల్లపడి నుతించినంత

ప్రాత రాదిగ రవి పశ్చిమాద్రిఁ జేరు
వఱకు బొటనవ్రేలి పయి నిలఁబడి
సూర్యుఁ జూచుచుఁ దపసుం జేయు వైశ్యుల
యందుఁ బేర్మి నొంది త్ర్యంబకుండు ౧౩౪

వింజామరలతోఁ గుబేర వరుణులు గొ
ల్వఁగ వెల్ల గొడ్గు దేవవిభుఁ దూన
మాతరిశ్వుఁడు మంద మందానిలము వీవ
సకలలోకంబులు సన్నుతింప

యముఁడు చేతం బెత్త మమర ముందు నడువ
శూల పినాకముల్ కేలఁదనర
అణిమాండవ్య భృగ్వాది మహామునుల్
వేద వేదాంతోక్తి వినుతిసేయ
వెండికొండను బురుడించు వృషభరాజ
మెక్కి గౌరీజగన్మాత యెలమిఁజెంతఁ
దనర ఖండేందుజూటుఁ డఖండకృపను
సరగ నల్లవైశ్యులకు సాక్షాత్కరించె

అమ్మెయి నంతకాంతకుఁ డుదార కృపారసపూరితాంతరం
గమ్మన వచ్చి కట్టెదుటఁ గానఁగ వచ్చిన వైశ్యులెల్ల వై
శమ్మ కరమ్ము సంభ్రమము లాగు చెలంగఁగ లేచినిల్చి ఫా
లమ్ములఁ గేలుఁ గీల్కొలిపి వ్రాలిరి నేలకు నొక్క యుమ్మడిన్

పౌనఃపున్యముగాఁగ వ్రాలి యపుడున్ వైశ్యుల్ శివుంగాంచి యెం
తేనిన్ వందనముల్ వొనర్చి నిగమానింద్యప్రకారంబుగా
ధీనైర్మల్య మెసంగఁ బల్కిరిటులన్ దివ్యాపగానూన భం
గి నిర్ణిద్రతరంగ మంగళమహా గీర్వైభవం బేర్పడన్ ౧౫౨

వందామహే దయావారిధే! విశ్వేశ!
యణువుల నణువవై యలరు దీవు
పెద్దలం బెద్దవై పిన్నలం బిన్నవై
వెలయుచుందువు పూజ్య! విమలచరిత!

సూర్యదంత విభంగ! శుద్ధ! నిర్గుణ! నిర్మ
ల! నిరంజన! యభంగ! లలితరూప!
ఖండేందుకోటీర! గంగాలసజ్జటా
మండల! కుండలిమండితాంగ!
భూ జ లా ర్కేందు వాత నభో దహన మ
ఖి స్వరూప! గుణాంచిత కీర్తనీయ!
శూల ఖట్వాంగధర! పులితోలుఁదాల్ప
నీకు నతు లివే చేతుము నీలకంఠ!!

అని నుతియించి పాదముల యందును వ్రాలిన వైశ్యకోటినిం
గనుగొని శంకరుండు సదఖండ మహాకరుణాభిరాముఁ డై
మనమునయందు నందము నమందతరంబుగఁ గంటి మీ తపం
బున కిఁక మీకు నిష్టవరమున్ వచియింపుఁడు పేర్మి నిచ్చెదన్

తనరఁగ నిట్లు శంకరుఁ డుదార సుధారస ధారలం గరం
బనువుగఁ జిమ్మురీతిఁ బలుకాఁడఁగ వైశ్యమునీంద్రు లెంతయున్
ఘనతరభక్తిమై విని నిగారపుఁ బేర్మి చెలంగుచుండ ని
ట్లని రల యంతకాంతకుని యంతరమందుఁ బసందు పొందఁగన్

"దేవా! శ్రీకన్యాంబా
దేవీభక్తులము మేము దీవ్యత్తద్దే
వీ విమలభక్తి మావగు
భావంబులఁ దగ వర మిడు వరద! యుమేశా!!

వ. మఱియును

నీదు పదారవిందముల నిర్మలభక్తి చెలంగు టన్న స ౧౬౩
ర్వాది! సమస్తపాపముల కంతము - సంసరణాంబురాశి కెం

తే దయివాఱు నావ - యిహ మింక(బరంబును గల్గ దాన శం
ఘూ! దయతోడ నల్లవరముం దయచేయుము మాకు నిమ్ముగన్

అనవుడు సాంబు(డెంతొ యెదయందున నందము నొంది యట్టులే
తనరెడి నంచు( బల్కి-యును దద్ద వరంబి(క నొండు( గోరు( డం
చన(గను వైశ్యు లా(డిరి నయంబు భయంబును డంబు మించ నో
యనఘ! త్వదీయ దివ్యచరణాబ్జయుగమ్మున కి య్యవే నతుల్

"తొలి మణిదీవినుండియును దోరపు( బేర్మిని గన్యకాంబ యా
జ్ఞ లలి నిడన్ భవజ్జగతి( జయ్యన( జేరితి మీశ! యెప్పుడున్
జెల(గ(గ( గన్యకాంబిక యనిందితలోకమునం దిఁకన్ భవ
త్థ్సలమున మేమెసంగునటు సర్వమయా! వరమిమ్ము సత్కృపన్"

అని వైశ్యు లాడి నంతన్
ఘనమోదమ్మున "సరె"యని గంగాధరు(డా
యనఘుల నెల్లం దనజగ
మునకుం గొని చనె నఖండపున్ విభవమునన్

వ. అని సూతమహర్షి వచించినంత శౌనకాదిమహా మునీంద్రు లెంతయు ననంతంబయిన సంతోషంబు నొందిరి

## ఆశ్వాసాంత పద్యములు

అఖిలలోకాంబ! సత్కరుణావలంబ!
వేద వేదాంత వినుతపవిత్రచరిత!
మహిత మంగళాయతనాయమాన రూప!
కారుణికతార్ణవంబ! శ్రీ కన్యకాంబ!! ౧౬౯

జగన్నికాయస్తుత! సత్పవిత్రా!
ఖగేంద్రవా హోక్షపగ ప్రణుత్యా!
భోగీంద్రసంబోధిత పుణ్యధాటీ
గా! గుర్వపేతా! జయ! కన్యకాంబా!!

శ్రీ కన్యాపరమేశ్వరీ! శుభకరీ! శ్రీదా! జగన్మాతరో!
సాకారా! గుణదూర! దేవి! అరవిందాసాది సత్తత్త్వగా!
లోకాలోక రమాక రాద్భుతయశోలోలా! ప్రపూతాశయా!
ఆకల్పాది నియుక్తిముక్తిభర లీలా! అంచితార్యాత్మగా!

పరమేశ్వరీ! శుభకరీ!
అరవిందాసాదితత్త్వ! అరవిందాసా
కర! మాకరాద్భుతయశో
భరలీలా! యంచితాత్మ! భరలీలార్యా *!!

ఆంగిరసగోత్రుఁడు నీక వైశ్యమణియయిన
దోమవంశ్యుఁడు వేంకటస్వామిగుప్త
అమల గోవిందసుతుఁడు వ్రాయ నయినట్టి
కన్యకాపురాణపుఁ బద్య కావ్యమందు
రెండవది ఆశ్వాసంబు శ్రీయుతాంగి!
కలిత కరుణావలంబ! శ్రీకన్యకాంబ! ౧౭౩

*భర=చుక్కలదొర యగు చంద్రమండలములోని ఆర్యులు—వైశ్యులుగలదాన! అని చెప్పుకొనవలెను.

ఇయ్యది శ్రీ తుంగభద్రా నదీతీర విరాజమాన కర్నూల్నగరనివాసి నిరంతర శ్రీ వేంకటేశ్వర చరణారవింద మిళిందాయమాన మానస వైశ్యరత్నాంగిరస గోత్రపవిత్ర ధర్మపత్నికోటాంబికాసమేత దోమగోవిందా ర్యవర్య సుత జ్యేష్ఠుండును, శ్రీరామచంద్ర కృపా కటాక్షవీక్షణాసాది తాంధ్ర గీర్వాణ కవిత్వకృతపరిచయుండును, శ్రీ బ్రహ్మవైవర్త మహాపురాణ శ్రీ పరకాలవిలాస శ్రీ బ్రహ్మేశ్వరపురాణ శ్రీ గౌతమక్షేత్ర మాహాత్మ్య శ్రీవిష్ణుభక్తిప్రేమాభిరామ శ్రీముకుందమాలా శ్రీ కనకధారాస్తవ శ్రీగంగాలహరీ చంద్రకళాసుదర్శన దూతాంగద సుజనత్రయాఽఽత్మబోధచంద్రికా శ్రీకృష్ణదేవరాయ చరిత్ర విమలానందా ద్యనేకగ్రంథకర్తయు, నానాదేశ రసికజనప్రదత్త శ్రీమదాంధ్రవిద్యావాచస్పతి-సాహిత్యసరస్వతి - విద్యావినోద - కవిభూషణ - విద్యాసాగ-రాఽఽశుకవితల్లజ-కవిర-త్నాశుకవితా ధురీణాఽవధానిపంచానన -కవికుంజ- రాఽవధానపితామహ -కవి చక్రవర్తీత్యాదరాభిధానాభిరాముఁడు నగు శతావధాని విద్వాన్ దోమా వేంకటస్వామిగుప్తచేఁ బ్రణీతంబయిన శ్రీకన్యకాపురాణ కావ్యంబున ద్వితీయాశ్వాసము. ౧౭౪

# తృతీయాశ్వాసము

శ్రీమత్సకలాజాండ
స్తోమాభరణ! భరణ! పటుసుందరచరితా!
సామాన్యేతరసుగుణగ
ణామల! శ్రీకన్యకాంబ! అద్భుతబింబా!

వ. అవధరింపుము—భవదీయ దివ్యచారిత్రంబునందు నవ్వలి కథావిధానంబు నట్లు శౌనకాదులు వినుటకు వేంచేసి యుండఁగా, సూత పౌరాణికుండమందానందకందళిత హృదయార విందంబయిన యమ్మునిబృందారకబృందంబునుం గాంచి మందార మకరందబిందు సుందరంబయిన వచనబృందంబుతో నిట్లు వక్కాణించె త్రి

## సాలంకాయనముని రాక

కైలాసంబును జేరి వైశ్య లటు శ్రీకంఠుం గిరీట్పుత్రి దే
వాశివ్యూహపతిం గణాధిపతి నత్యంతంబు భక్తిన్ సము
ద్వేలప్రక్రియఁ గొల్చు చందమును నెంతేఁజెందుచుండన్, రహిన్
సాలంకాయనమౌనిచంద్రుఁ డటకున్ వచ్చెన్ శివుంజూడఁగన్

"శంభో! శంకర! సాంబ! భక్తవరదా! సంసార హింసా రిరం
సాంభోరాశినిమగ్న సంతరణ!" అం చత్యంతమున్ భక్తిసం

రంభం బొప్ప మహామునీశ్వరుఁడు సాలంకాయనుం డప్పుడున్
దంభాపేత వచోనిగుంభనలఁ దద్గౌరీధవుం బాడుచున్

రాఁగా నటు వచ్చిన యల
యోగిన్ భోగీంద్రహారుఁ డుల్లంబున నా
భోగానందం బొందియు
స్వాగత మిడి యాదరించె సత్కరుణఁ తగన్

ఆ లలి వచ్చిన మునివరు
సాలంకాయనుని గాంచి సరగున నచటన్
హాళిం దగు వా రెల్లరుఁ
గాలుష్యము లేని ముదముఁ గాంచిరి మిగులన్

గణపతి పొంగె; షణ్ముఖుఁడు గౌరవమిచ్చెఁ; వృషాధిపుండు సో
ల్బణ ముదముం గనెన్; ప్రమథవర్గము తోషిలెఁ; దేవమోద కా
రణము చెలంగెఁ; మౌనితతి రక్తి గనెన్; ద్విజపంక్తి సొంపునం
గణఁకఁదలిర్చె నల్లమునిగణ్యుని రాక శరత్తు రాకగాన్

అఖిలధర్మంబులకుఁ బేటి యల్ల మౌని
వరుని హరుఁ డెంతో యాదృతిపటిమఁ గాంచె
ఎల్లవారితో నచటన్ రహించుచున్న
వైశ్యులన్ మ్రొక్కె ర మ్మునివర్యునకును

వ. అంత ౯

చేసిన కుశలోత్తర భా
షాసందర్భమున నల్ల సన్మునితోడన్
వే సని సంగతులను గని
వాసిగ భువి కేఁగుఁ డనియె భవ్యుఁ డర్యులకున్

వ. పరమశివుండు వైశ్యుల కిట్లాన తిచ్చె

"సాలంకాయనమునివరుఁ
డోలి న్నిజవనికి నరుగు నో వైశ్యులు! మీ
రీ లలితాశయుతోఁ జని
యా లలినే భువికి నేఁగుఁ డంచితు లగుచున్

ఈ మునీంద్రు నాశ్రమమున కేఁగి మీరు
సందియముల నెన్నిటినో యీ సంయమికడఁ
దీర్చికొనియు 'గోకర్ణ'మన్ దివ్యమయిన
క్షేత్రరాజముం జేరియుఁ జెన్ను మెఱయ

## వైశ్యుల వనట

అందు వేంచేసి యుండు నా కర్చ నల్పి
కన్యకాంబాజ్ఞ మేరకున్ క్ష్మకుఁ జనుఁడీ"
యనఁగఁ గంఠోష్ఠ తాలువు లట్టె యెండి
వైశ్యులు మఱొక తఱి నటన్ వ్యథనుగనియు ౧౪

"అంబాంతికంబొ? నీ నిఁ
టంబో మోదంబు మాకు డాలొందించున్
సాంబా! తా కటు భూలో
కం బేఁగుడు నందె?" యనిరి కడు వెత వైశ్యుల్

నావుఁడు వారి కనె మహా
దేవుం "డో వైశ్యులార! తీర్చితిమి గదా?
మీ వౌ శంకలఁ గన్యా
దేవియు నే నిపుడడుగు టదే పనె మీకున్? ౧౬

కన్యకాంబ కన్యాంబికగాఁ దలిర్చు
ఏను నగరేశ్వరుండ నై యెసఁగువాఁడ
వింధ్యవాసిని యగుచును వెలయు శివయు
హరి జనార్దనుఁ డగుచుఁ దా నవతరించు
కమల కోనకమల యయి క్షమను బుట్టు
బ్రహ్మ భాస్కరాచార్యుఁ డై పరఁగు నంచు
గన్యకాంబయె సెల విచ్చెఁ గాఁదె? ప్రీతులు
మిగులునట్టి శంకల కెల్ల మేల్మిఁ దనరు
నుత్తరంబుల మీకు మే మొసఁగినాము
నలువ మీఱ సాలంకాయనమునివర్యు
నాశ్రమంబున కేఁగి యాశ్రమమున
నచటఁ దన్మౌని కృపచేత నాత్మ నిఁకను
మీకు నున్న సందియములఁ డీకు దనరఁ

దీక్షిచికొని గోకర్ణం బధిగమము నొన
రించి భువిని బవిత్రీకరింపవలయు
మఱి నిటులఁ జెందు చింతను మాని మాన
సంబులను సంతసంబుఁ గాంచంగవలయు"
అంచు శంకరుఁ డాస తీయంగ వైశ్య
సముదయమ్ము సాలంకాయనమునివరుని
యాశ్రమమున కేఁగిరి కడుహర్షమునను

# సాలంకాయనమున్యాశ్రమము

వ. అప్పుడు

ఆ వైశ్యులు వెంబడి రాఁ
గా వెస న మ్మౌనివరుఁడు కదలియుఁ జేరెన్
దా విమలనిజాశ్రమ మట
నా వైశ్యుల నాదరించె నతఁడు కరంబున్

కడుఁ బ్రశాంత మై విమల మై కరము రమ్య
మై రహించు న య్యాశ్రమమందు వైశ్య
లెల్ల జ్ఞానవిశేషాళి కెల్ల నెల్ల
యల్ల మునికి వందనముల నాచరించి

వ. అందు

వేలకు వేల శిష్యతతి వేల యటన్నది లేని భక్తి యెం
తో లలిమైఁ చలిర్పఁగనుఁ దోరపు సేవలఁ జల్పుచుండ వి
ద్యాలసమాన మానసుఁ డుదారుఁడు తన్మునిచంద్రదముండు తా
రాళి నొగించ దనర్చు శశి యందమునం దగెఁ దత్సభాస్థలిన్

కర మటు వైశ్యమండలి యఖండసుభక్తి సమస్కరించి "యో
వరమునిచంద్ర! కాలగతి పద్ధతియున్ మఱి మా చరిత్రలోఁ
బరఁగెడి కొన్ని సంగతు లభంగుర సత్కృపతోడఁ దెల్పుమా
కొఱయును లేక సృష్టిగతి గూడను సందు నెఱుంగఁ జేయుమా!"

నావుడు మౌని యనంతకృ
పావిమలుం డై యను నిటు "వైశ్యవరేణ్యుల్!
మీ వైశ్యకథయె సృష్టి
శ్రీవిధి వచియించు నద్ది చెప్పెద మీకున్

# సృష్టిక్రమ వివరణ-ధర్మనందన చరిత్రము

లలిఁ బ్రతిష్ఠాననగరంబు గలదు భువిని
దానఁ జూడామణి యటన్న ధన్యుఁ డెసఁగు
వైశ్యరత్న మిం కతఁ డనపత్యుఁ డగుచుఁ
గొలిచె భార్గవచ్యవను సద్గురుని ఋషిని ౨౫

అల్ల భార్గవచ్యవనుని యాజ్ఞవల్ల
నతఁడు శ్రీ విష్ణువుంగొల్చి యతని కృపను

నందనుఁ గనె నతని ధర్మనందనుఁ డని
పిలిచె నామకరణమునన్ వేడ్క యలర

ధర్మనందనుఁ డాతండు తగ జననము
చేతనే ధర్మయుక్తుఁడై వెలఁగుఁ దండ్రి
ముదల: భార్గవచ్యవన సన్మునివరు కడ
విద్య నభ్యాస మొగిని గావించుచుండి

అలర నొకట సమిత్కుశాహరణమునకు
వనికి వెడలి ఆంగీరసుఁ డనెడి విప్రుఁ
'డకట! ఒకబోయఁడు నను సంహరణము నొన
రించుచుండెను' నాఁగ నాలించెఁ గేఁక

అపుడు ధర్మనందనుఁ డట కరిగి బోయ
వానిని గని 'విప్రుని జంపఁ బూను టేల?'
యనఁగ బోయ 'కాళి కల బ్రాహ్మణు బలియిడఁ
గొంచుఁ బోచుంటి' ననఁ గరుణించి సెట్టి

'బ్రాహ్మణో న హంతవ్య'యన్ పలుకుఁ దలఁచి
భూతదయ కడుఁబుణ్య మన్ ఖ్యాతి నెంచి
తాను బల్యర్థ ముండి తద్బ్రాహ్మణు విడి
పింప బోయఁ డా సెట్టితో వెడలె వనికి ౩౦

అట్లు ధర్మనందనుఁ గొని యల్ల బోయఁ
డడవియం దేఁగుచుండి సైన్యమ్ము వేఁట
కొకటి రాఁ గాంచి యెవ్వఁడో యుర్వినేత
వేఁట కేతెంచె నె ట్లని భీతి నొంది

అచట నతల కవాట గుహ యొకఁ డుండ
నందు వైశ్యపుత్రుని దాఁచి యక్కిరాతుఁ
డొక్క చెట్టెక్కి నక్కియు నుండఁగ నల
వేట కేతెంచినట్టి భూవిభుఁ డలసియు

ఆ తరువు క్రిందనే సేఁద కధివసించి
పైన నెక్కిన బోయ కన్పడఁగ 'నౌర!
వాఁడు మానవహంత యై పరఁగు-వాని
జంపుఁ'డంచు భటులకు నాజ్ఞం బొసర్ప

భటులు వానిని గొనిపోయి వధ యొనర్చి
రపుడుఁ గైలాసమునుండి హరుని యాజ్ఞ
నాదిశేషుని గాంచఁగా నరుగుచున్న
వాసుకి యల మార్గంబునన్ వచ్చుచుండి

అల్ల యతల కవాటగుహాముఖంబు
మూఁత వడి యుండఁ గడుఁ గోపమునను రేఁగి
ఘోరదంష్ట్రిలం దానిని గొఱికినంత
ఆ గుహాద్వార శిల భస్మ మయ్యె నపుడు

అటుఁ బటపటారవము ఘనఘోంతరముల
నిండ గహ్వర ముఖగత గండశిలయు
వాసుకి భయద దంష్ట్రికోజ్వల దతులవి
షానలజ్వాలలన్ భస్మ మయ్యె-గుహయు
గాఱు మంటలతోడను గరము మంచె

వాసుకి యందుఁ జొచ్చి యటఁ బంకజనేత్ర పదాంబురుడ్యుగీ
భాసుర మానసుం డగుచుఁ బర్వియునుం గమలాసనస్థుఁ డై
భాసిలు ధర్మనందనుని బాలుని గాంచి ముదంబు నొంది యెం
తో సుకృపం దదర్భకుని దోడ్కొని వెళ్లెను తండ్రి చెంతకున్

## ఆదిశేష దర్శనము

వ. ఆ పాతాళమునందు

నాగి నాగసహస్రసేవితుఁడు శ్రీనారాయణాంఘ్రిద్వయీ
భాగంచన్మతియున్ మహోజ్వలఫణాభాస్వన్ముఖోద్యన్మహా
వాగర్థోచ్చరణైకతానుఁ డహిరాజన్యుం బొడంగాంచి ఆ
భోగంబౌ మతి ధర్మనందనుఁడు కేల్మోడ్పుం బొనర్చెన్ రహిన్

వ. అప్పుడు ౪౦

శ్రీనారాయణ పాదపద్మ యుగళీ సేవా వినోదైక స
న్మానుండైన ఫణీశ్వరుం డల లసద్ధర్మాదర స్వాంతుఁడై
జానుం బొందిన ధర్మనందనుని హర్షంబొప్పఁగాఁ గాంచి వ
త్సా! నీకున్ వరమిత్తుఁ గోరుమనె నత్యంతంబు దివ్యత్కృపన్

అని ఫణినాయకుండు తన కానతి యిచ్చిన ధర్మనందనుం
డనుపమ భక్తి నాతనికి నంజలి మోడ్చియు సృష్టిరీతి యు
ట్లని వచియింపుమం చడుగ నయ్యనిలాశన సార్వభౌముఁ డా
తని కిటులన్ వచించె సముదారసుధారస సామ్య వైఖరిన్

పదియు నేడు లక్షల యిరువది యెనిమిది
వేల సమలు కృతయుగంబు వెసను త్రేత
పదియు రెండు లక్షలును దొంబదియు నాఱు
వేల సంవత్సరము లయి వెలయునయ్య!!

ఎనిమిది లక్షలును నఱువ
ది నాల్గువే ల్ద్వాపర కగుఁ దీఱుగ సమ లి
కను నన్నూర్ముప్పది రెం
డనువగు వేలేండ్లు కలికి నగు వైశ్యమణీ! * ౪౪

వ. ఈ కృత, త్రేతా, ద్వాపర. కలియుగంబులు చేర్పఁగా మహాయుగంబు (43,20,000 సం॥). అట్టి మహాయుగంబు లొక వేయి కడచినంత బ్రహ్మదేవున కొక పవలు. అందుకు డెబ్బది యొక్క (71) మన్వంతరంబులు. ఈ బ్రహ్మదిన పరిమాణం బింద్రకల్పం బగును. ఇట్టి యింద్రకల్పంబులు రెండైనచో

*కృతయుగము 17,28,000 సంవత్సరములు; త్రేతాయుగము 12,96,000 సం॥లు; ద్వాపరయుగము 8,64,000 సం॥లు; కలియుగము 4,32,000 సం॥లు.

బ్రహ్మకొక రోజు. అట్టి రోజులతో నేర్పడ్డ సంవత్సరంబులు వందగడచినచో నజుని యాయుఃప్రమాణంబు. అద్దియే బ్రహ్మ కల్పంబు.

అజుల శతమేఁగ దీర్ఘాయు వనెడి మునికి
దినము - దీర్ఘాయువు లనెడి మును లిరువది
యేఁడు కోట్లేఁగ రోమశఋషి మెయి నొక
రోమము పడిపోవును శుభరూపచరిత!

రోమశులు ముప్పదగు కోట్లు భూమిఁ బడఁగ
నొక్క యెముక యష్టావక్రు నొడల వంగు
కోట్లు సెలువ దష్టావక్రగుణ్యు లేఁగఁ
బాదపృక్కున కొక తెప్పపాటు తలఁప

అట్టి పాదపృక్కులు నియుతార్బుద (10000) మగు
కోట్లు చనిన న్నిమేషంబు గూడఁ గాదు
హరున, కతఁడె యన్నిటి కాదిపురుషుఁ డయ్య!
ఎలమి పుట్టించి ప్రోచి కిట్టించు వాఁడు

వే తలలుఁ గే ల్వేయిం గనుల్ వేయి గలఁడు
కనులు లేకె కాంచును వీనులొనరకె విను
కర చరణ హీనుఁడయ్యును దిరుగు నొసఁగు
సర్వదివ్యావయవమూర్తి శంభుఁడతఁడు ౪౫

దహరాకాశంబున మని
సహృదయులగు యోగితతి వెసంగనఁదగి-య
ల్లి హరుండు లోకగురుఁ డౌ
ప్పు హరిద్వస్త్రుండు సకల పూజితుఁ డర్యా!

అన్నిటికి నిమిత్తోప దానాది కార
ణుఁడయి హంసస్వరూపుఁడై పుడమిఁ బొడమి
వేద వేదాంగములఁ గొల్పి వెసఁ బ్రళయము
నందు నిల్గక యాత్మతేజోంచితుఁడగు

ఎల్ల సంద్రంబు లేకీభవించినపుడు
తమ మెదియు గానరానట్టు లమరినపుడు
ఒక మహాదేవుఁడే స్వయంజ్యోతి యగుచు
వెలుఁగు ధర్మనందన! దీని వింటివాక్కా?

అల్ల పరమేశునుండియే యమరె మాయ
ఆతఁడే మాయ; మాయయే యాతఁడయ్యె!
ఒనర మహదహంకారంబులను గొలిపియు
నతఁడు గుణములం గొల్పె ననంతరంబు

వ. అటు పిమ్మట ౫౪

సొరిది శంకరుఁడు రజోగుణంబును జతు
ర్వేదంబులను నల విధి కొసంగె

జగదవనార్థమౌ సత్త్వగుణంబుఁ జ
క్రాయుధంబు నల శ్రీహరి కొసంగె
లోక సంహారకరూప తమోగుణం
బును త్రిశూలమును దా నొనరఁదాల్చె
అపుడు సృష్టిన్ మొద లాచరింపఁగ ముహూ
ర్తము మాత్ర విధినిల్చె ధ్యానమందు
అట్లజుఁడు శివు నెంచిన నతని ప్రాణ
మం దాపానాన వ్యాససమానముల ను
దానమున దక్షుఁడుఁ గ్రతువుఁ దగ వసిష్ఠుఁ
డును బులస్త్యుఁడున్ బుట్టువు నెనసి రెలమి

తల నింగి, చెవుల గాలి, క
నుల రవిశశులును, మొగమునను సురేశాగ్నుల్
లలి నాభి నంతరిక్షము
వెలయన్ రోమముల లోకవితతులు వొడమెన్

సకలావయవములన్ సుర
నికరము మొగమందు విప్రనికరంబును మ
చ్చిక బాహుల క్షత్రియు లూ
రుకాండముల వైశ్య లంఘ్రిఁ బోదిన్ శూద్రుల్ ౫౭

వ. మఱియు నశ్విన్యాది నక్షత్రంబులును, గ్రహంబు
లును, యక్షరక్షోగంధర్వులును, సప్తమాతృకలును, సప్తసము

ద్రంబులును, నేకాదశరుద్రాష్టవసు, ద్వాదశార్క, ప్రమథ
గణ, తారానికాయంబులును, నదులు, వనంబులు, నానామృగ
ములును బ్రహ్మదేవుని నుండి యుదయించినవి

ఇమ్మెయి నెల్ల విశ్వములు నింకను వానికిఁ దగ్గ వృత్తి బ్రం
దమ్ములు నిక్కలింక శయనంబు భయంబు సృజించె ధాత లో
కమ్మున సృష్టిరీతి యి దఖండముదానఁ బఠించువారి క
ష్ట మ్మఖిలమ్మునుం గలిగి సౌ రిహమందుఁ బరానునుం దగున్"

## ప్రతాపవతీ సోమదత్త వివాహము - సోమకాంత విచారము

వ. అప్పుడు వైశ్యుం డానందంబుఁ జెందియుండ నర్హే
తుకానందంబుతో సాలంకాయన మహామునీంద్రుండు వైశ్యులం
గనుంగొని, మఱొక విషయంబు వచింతు నాలకింపుఁడు యని
యిట్లు వక్కాణించె ౬౦

సోమకాంతుని నొకచోట "సోమదత్తుఁ*
డనఁగఁ బడినది"-వైరాజుఁ డనెడి వాని
కూఁతు నల సోమదత్తుండు నాతిగాఁ బ్ర
తాపవతి యను కన్నెను దగ వివాహ

*సోమకాంతుఁడని యొకచోట, సోమదత్తుఁడని యొకచోట (స్కాందపురాణమునఁ గాఁబోలు) చెప్పఁబడినట్లు తెలియుచున్నది.

మాఁడు కోర్కెని జెందఁగ నందుల కట
నున్న గంధర్వపతి కోపమొంది యెదను

కన్నెమిన్న నామెను వనకన్న నెవఁడు
పెండ్లి యాడఁగరా దట్లుఁ బెండ్లియయిన
గన్నె యేడునాళ్ళకుఁ జావఁగల దనంగ
సోమకాంతుండు ప్రార్థించె సోమధరుని

"సాంబా! నీకు నమస్కా
రం బిదె గంధర్వ శాపరంహ స్స్వద్వా
హంబుం దీనిం జెఱుమవొ?
యింతగు నీపేర్మి మమ్ము నేలుంగాతన్ ౬౩

సకలాంతర్యాలసన్మహత్త్వయుతుఁడై సంపూర్ణ కారుణ్య రూ
పకుఁడై వేదనికాయగేయుఁడయి సర్వంబొప్పు శర్వుండు ప్రో
వకయున్నన్ మన కేది దారి? యింక శర్వాణీ మనోనాథుఁడు
త్సకతన్ బూని యనుగ్రహించు మనలన్ సోమార్ధజూటుం డాగిన్

శైలాఽపత్య మనోఽధినాయక! సమస్తంఘాతముం జేతు ము
ల్లోలంబై తగు మా వ్యథన్ గుఱిచియుం దోరంబుగా మాపయిన్
వాలాయంబగు సత్కృపా నిరతి యేపారంగ గంధర్వ శా
పాలస్యంబును బాఁపియున్ మనుపు మ"మ్మంచెంతొ ప్రార్థించినన్

ఆ వైశ్యావళి పయిఁ గరు
ణా విమలుం డగుచు, "ఖచరనాయకు దుశ్శా

పావేశ మేడు దినములై
తా వెస మిమునేచు'' నని సుధాకరధరుఁడున్ ౬౫

అని పంచకల్ప వృక్షము
లనడుము గౌరీ శివులును లలి హరియు సురల్
తనరం బొనరిచి యేఁడగు
దినములలోఁ బెండ్లి జరగఁ దీర్చెన్ హరుఁడున్

వ. అంత

అయిదు కంబాల మంటపం బటులఁ గొల్చి
యల్ల పెండిలి గౌరీశుఁ డలరఁ జేసె
ఆ ప్రతాపవతి నటుఁ బెండ్లాడె సోమ
దత్తుఁడు హరాజ్ఞదు లెదల మోదంబు నొంద ౬౮

ఆ వివాహ మట్లయినది యాది గాఁగ
క్షత్త్ర విప్రుల పెండ్లి నల్కాంబములును
వైశ్యతతి పెండ్లి నైదు కంబముల పెండ్లి
తిన్నె కలర నౌనని మహాదేవుఁ డనియె

# వైశ్యులు కన్నెనీయని కారణము

అట మణిగ్రీవుఁ డనెడి వైశ్యమణి యప్పు
డు మొగి ననియె సాలంకాయన మునినిఁ గని
''మౌనివర్య ! గంధర్వున కా నియతని
గన్నె నీయమంచును వైశ్యు లన్న దేల
నలువుగ'' నన సాలంకాయన ముని యనియె

స్వర్గమందు గంధర్వులు చరణ జాత
సములు గాన వారలకు మా కొమరితె నిడ
జాల మని వైశ్యు లాఁడిరి సరగ నింద్రు
డాదిగాఁగల దేవత లాలకింప ౭౧

అందుకు గంధర్వులు రుష
నొందియు "వైశ్యులకు దివిని నుండదు విషయా
నందం" బని శపియింపఁగ
నింద్రుఁ గొలిచి శాప మద్ది యీఁగిరి వైశ్యుల్

వ. పిమ్మటఁ బ్రతాపవతీసోమకాంతుల వివాహంబత్యంత వైభవంబుగా నిర్వహింపబడినది

కర మానందముగాఁ బ్రతాపవతి యింకం సోమకాంతుండు ని
ర్భర శృంగార రసైకతానముగఁ గడ్పం జెల్లెఁ గాలం బొగిన్
పరసాలాపములన్ మనోభవ కళానంతైక సంతోష వి
స్ఫురణన్ వత్సరముల్ నిమేషములుగాఁ జూపట్టు నప్పట్టునన్

వారి విలాసవైఖరులు వారి యఖండ రసానుభావముల్
వారి మనోజ్ఞవర్తనలు వారి మనోభవబంధ పద్ధతుల్
వారి బెడంగు కూర్ములును వారి పరస్పర నర్మగర్భముల్
చేరి తలంప నౌ నిఁకను జెప్పఁగఁ గిప్పఁగ నౌనె యేరికిన్? ౭౨

వారియనుంగు బేర్మియు నవారిగఁదీగటు లల్లిబిల్లిగాఁ
బాఱి ఫలంబు నూనినటు వారికి నొక్క కుమారి గల్గె న
వ్వారొగిఁ గోరుగొన్నటు సుపర్వవరాంగన వారిపుత్రియై
యా రహిఁబుట్టు వొందెనన నా బిడ రూపము నెన్న నేటికిన్ ।

ఆ బాలికా వతంసా
కీలాకారముఁగని మునిశేఖరులే లో
నాబకు లోనై మరునకు
లోఁబడఁగా నొరుల రీతులు పనే మనగన్ ??

వ. అంత ౭౦

ఆ రామామణియొక్క నాడు లలినానానూనపుష్పాంచితం
బై రాణందగి నైకవిధ్య ఫలభారానందమై చాల సిం
గారానం గర మొప్పు కేళివనికాంతస్థానమందుంగడున్
హారి ప్రక్రియమై విహారమును చేయం బోయి యుండం బొరిన్

తొగతేని తోడఁ జెందొవలతోఁ దొమ్మిది
పొల్పుతో సంపెఁగ పూవుతోఁడ
దొండ తోడన్ మేఁడితో సంకుతో గజ
నిమ్మ పండులతోడ నీటుఁ గుల్కు
పైఁడి తామర తూండ్లతోడఁ జీమలబారు
తో నింగితో నంటితో మొసళ్ళ

తోడను దాబేళ్ళతోడఁ గెంజిరాకు
గమితోడ బవరంపు గణఁక దనరుఁ
మేని యంద చందాలతో మెలఁగు చాన
కీర్తియను పేరి యన్నువ కెరలుసొరు
తోడ వ్యాహాళి సేఁతను దొడరియుండె
అల్ల సోమకాంతుకుమారి హాఱుపు మీఱ ౮౦

నగు నగునేనిఁ జాలుఁ బదునాఱు కళల్ గల యా సుధాకరు
న్నగు; మొగ మంద మన్న నలనాకవనీ కనకారవిందము
న్నగు; గరవల్లికల్ కమలనాళములన్నగు; ముష్టి ముష్టితో
నగుఁ గవు నిట్టు లా పడుచు నల్వగు నంద మెసంగెఁ గ్రందునన్

తన సొరుఁ గాంచి మేలను చున్నవోయనం
దుమ్మెదగమి ఝుంకృతుల నొనర్ప

తన మొగమ్ముం దమ్మియనుకొని మకరంద
మును గోరి యళితతుల్ మొనయుచుండ

తన యుర సౌందర్యమున కీఁగె ననఁ బుష్ప
కోరకంబులు విచ్చుకొనఁగఁ జూడ

తన నడం గదలి రొదవొనర్చు నూపురం
బులఁ జంచులంటి యంచలు చరింప

కాంచికా కననైక రత్నాంచితరుచి
దేవకాంత ధనుషాక్రాంతి సరగఁ గొల్ప

అల్ల సోమదత్తుని కూఁతురయిన కీర్తి
యింద్ర కాం తాఽంశ కన్య చరించె వనిని ౭౨

## చిత్రకంఠుఁడు సోమదత్త సుతం జూచుట

పరఁగఁ గలావతీ శుభవిపంచికనుం గయిఁ దాల్చి మీటు చుం
బరిజనయుక్తయై యల శివస్థల మండనమౌచు న వ్వనిం
బరిపరి రీతులన్ మధుర మంజుల గానరసానదేల్చు సుం
దరియగు నామె కీర్తి యటఁ దద్దయునట్లు దలిర్చియుండగన్ ౭౩

తగ నటకుఁ జిత్ర కంఠుం
డొగి గంధర్వుండు వచ్చె నొకఁడతఁడా కీ
ర్తిఁ గని స్మరార్తిం బడి కీ
ర్తిఁ గొనఁ దలఁచి కీర్తిఁ బాయు తీఱు చెలంగన్

కన్నెం గాంచిన యంత నంతకు నటుం గంధర్వుపై మారుఁ డౌ
గ్రౌన్నత్యంబున సవ్యసాచి యయి పూలా యివ్వి క్రొన్నిప్పులా?
యన్న ట్లుద్ధతి బాణము ల్వరపి పెల్లార్తిం గనం జేయ న
న్ననా! వాఁ డల చిత్ర కంఠు గతి నేమన్నం మఱిం జాలునో ౭౫

మారుం బోలియు మారుఁడు
వే అంపము లటు సుమశర బృందము నేయన్

గారా కూరము ఖేచరుఁ
డై రహిఁ జానం దఱిసి కరముఁ బేర్మి ననెన్

ఓ! కళ్యాణీ! మే లగు
నీకు న్నీవెవత వాక్కొ? నీ పే రెదియో?
నీకు జనకు లెవ్వారో?
నాకున్ వచియింప వేల నళిన దళాక్షీ!

అనినంత గీర్తి కన్యక
విన చెలికిన్ సన్న సేయ వే నల సఖియున్
వినిపించెఁ జిత్ర కంఠున
కును దత్కన్య తెఱఁగెల్ల గోమలి ఫణితిన్ ౮౫

"సోమకాంతుని పుత్త్రి యీ రామ యిట్టు
లిప్పు డారామసీమం జరించుకొఱకు
నిందు నేతెంచె" నని నంత నెలమి ఖచరుఁ
డడిగె "నామెకుఁ బెండ్లైనదా?" యటంచు

ఆమె "అవివాహిత" యటంచు నాఁడఁ బడిన
యంత గంధర్వుఁ డాతం డుదార మార
తాప మభినయించుచు ననెన్ ధన్యురాల!
నిన్ను గాంచిన దాది నా తెన్ను వినుము

అడరు నీపైని మోహాభరమ్మునం జేసి
కొండఁ బోలిన వాఁడ బెండు నైతి

ప్రిదులు నీ వంక యాకృష్టి బలంబున
భీము నంతటి వాఁడఁ జీమనైతి

పరఁగు నీ రూప వైభవ గౌరవముఁ జేసి
రాజు నంతటి వాఁడ గాజు నైతి

వెలయు నీ నెమ్మేని బిగువు కౌఁగిలిఁ గోరి
బింక మెల్లం దొంకఁ గుంక నైతి

చాన! నీ యాన నిను గాన మాన, మాన
సమ్ము నాది క్షణమ్ము ధైర్యమ్ముఁ గనదు
కొమ్మ! నీ దాసునిగ నేలుకొమ్ము! నన్ను
నలువుగా నీ పదమె దిక్కు నాకుఁ జుమ్మ ౫౧

తాఁకినంతన వాఁడి దయఁజూచినం జల్ల
నౌ నీ కటాక్షమ్ము లలరుఁ గాక

చూచినంతన కలంచుచుఁ జేరఁగనె యల
రించు నీ సౌరు రాణించుగాక

దవు నుండి యాతురతను గౌఁగి లిడ హాయి
నిడు నీతనూవల్లి యెసఁగు గాక

అంటకున్నం గాల్చు నంటినం దేర్చు నా
నీదు కెమ్మోవికిన్ మేల్మి గాక

సదరుఁడ న్నన్ను దరిఁ జేర్చి యదరు నాఁపి
చెదరు మోహాంబునిధి దరిఁ జేర్పవలయు
నెలఁత! నీవాఁడ: నీ వాఁడ వలయుఁ బేర్మి
నిటుల నీ వాడఁ జేరి ప్రార్థించు వాఁడ ౯౩

కోమలీ! నీపైట కొంకుల గాడ్పు సో
కకయున్న నా మేను గ్రాఁగకున్నె?

లేమ! నీ పల్కు లాలింపక నా వీను
లందు నానందంబు పొందు టెట్లు?

కమలాక్షి! ననుఁ గంటఁ గనకున్న నా పాటు
గంటఁ గొట్టిన చాడ్పు గాకయున్నె?

నాతి! నీ మోవి పానక మానకున్న నా
మానసంపుం దగ మాన నగునె?

ఉవిద! ఒక మాట ఒక చేర్పు ఒక్క చూపు
ఒక్క ముద్దు నొసఁగి నన్ను నోలిఁ దేర్పు
నీదు దాసాన దాసుండ నెలఁత మిన్న
అంచు గంధర్వుఁ డర్థించె నయ్యతివను

## కీర్తికన్య తిరస్కారము

అంచతిక్రాంత మర్యాదుఁ డగుచు ఖచరుఁ
డాడిన నుడుల వినియుఁ గన్యావతంస

మల్ల కీర్తి సరోష భయంకరముగ
నిటులఁ బల్కె వానికిఁ గడు నెదఁ గలంగి ౯౪

"ఖేచరపతి ! ననుచుంటివి
నీచా ! యీ చొప్పుఁగాఁగఁ నీతి వదలి యే
మో చావల పై వచియింతువు
వే చను మీ వెచటినుండి విచ్చేసి తటన్

"గంధర్వ పతివా ! గుణధౌ
రంధర్యము నీది తెలిసె రంగగు గుణ సం
బంధము గల దెవ్వతె నిను
బంధకి గా కెంచుఁ ? జనుము వచ్చిన త్రోవన్

"మతి నీకు సున్న నీసం
గతి గల యెవ్వతెకుఁ గల్గు గతి ! మతి నీ యో
గ్యత లేమి యెంచుకొన కీ
గతి ననుఁ గోరితివిర ! పలుగాకివి గదరా ? ౯౭

"నీ దొక రూపమంచు; మఱి నీ దొక వర్తనమంచు; నీపయిన్
నీ దొక ప్రేమ యంచనుచు; నిన్ను వివాహము గమ్మటంచు; నా
నా దురిత ప్రకారుఁడవు న న్నెడఁ గోరెద వాక్కొ? దుష్ట! యే
పైదలి నీదుపైఁదలిరు వహ్నిపయిం బలెఁ గోర్కె సేయునే ?

“సిగ్గనునట్టిదే లవము చిత్తము నందును నీకు గల్గిన్
బగ్గెయె నీకు నుండిన నభాగ్యుఁడ! యొక్క చిరంటిపై నిటుల్
లగ్గాన రింతువాక్కొ మది? లా గగు పాప మెదేని నీవాగిం
దగ్గఁ జేరు వారికిని దార్కొనదే? జగదేక నీచుఁడా!! ౯౯

“నిలిచెదవు ప్రాటికంబము
వలె; నోరి కురూపిగాఁడ; భావము శుద్ధిం
జెలఁగక పైపై యంద
మ్ములఁ జందమ్ములకు లెక్కవోల్చునె ఖలుఁడా? ౧౦౦

“నెమ్మని వీడి న న్గనిన నీ కనుదోయిని మట్టిగొట్ట న్యా
య్యమ్మను టీఁగి నాయెడల నాశయ మూనిన నీ మనంబు భ్ర
ష్టమ్మయిపోను; నాయెదుటఁ జయ్యన నొండొక దున్నపోతు చం
దమ్మున నిల్తువేల? యిఁకఁ దచ్చన లాఁడక వెళ్ళిపొమ్మురా!”

అని శూలమ్ములఁ బోలు వ
చనముల నొప్పించు నల్ల సారసనేత్రం
గన సిగ్గు నొంది గంధ
ర్వనికాయేశుండు వెడలె వడి నట నుండిన్ ౧౦౨

చిత్రకంఠుండటుం జనం జిత్తమందుఁ
గొంత నిబ్బరముం జెంది; కాంత కీర్తి
చెల్మికత్తెలం గూడియుం జేరి గీము
తల్లికిం దెల్పె నెల్ల వృత్తాంత మద్ది ౧౦౩

అటులఁ దిరస్కృతుండయిన యా ఖచరుం డట మాని మానసం
బెటు నల కాంతనుండి యెట కేఁగమి నే గమనింపు నింపుగా
కటమటతోడ వైశ్యకుల *యంతను జేరియు సోమదత్తునిం
దటుకున దన్ను నేలుమని తద్దయు నార్తిని గోరె నాతనిన్

వ॥ అంత ౧౦౫

శరణాగత రక్షణ మా
భరణముగఁ గలిగిన వైశ్యవరుఁ డాతఁడు ఖే
చరునకు "నీ వెత యెది? నా
కొరిమఁ దెలుపు" మనఁగ ఖచరుఁ డొగి నిట్లనియెన్

"మారుఁడు క్రూరుఁ డౌఁచు నల మారుని బోలె గరంబు నేచుచున్
"నారకమయ్యె నారక" మనం బొనరించెడి; నింత; సోమద
త్తా! రహి నీ కుమారికయె తద్దయు నా మది నాఁచికొంటచే
నీ రక మైతి నయ్య యిక నే గతి నేలదెవో నను ద్వరన్

నీ కుమారి నిక్కము మారుచే కటారి
నా మనంబు నువ్వొత్తుగా నాఁచికొనియె
ఆమె నా కాంత గాక నా కంత మగును
ఆమె నా కాంతగా జల్పుమయ్య! తొరను ౧౦౭

* యంతను=నాయకుని

ఆరామ నాకు నిల్లాలు గా కిల్లు నా
కిల్లుగా దది తుమ్మముల్లు గాని

ఆ యింతి ననుఁ బొంద కకట! నాదౌ మేను
మేను గా దది బీటి చేను గాని

ఆ చేడె పేర్మి సేయని నా మనంబు మ
నంబు గా దది గహనంబుగాని

ఆ లేమ కెమ్మోవి నానక నా మోవి
మోవి గా దది పాడు బావి గాని

అల్ల కన్నె మిన్నె సదరహాస సుంద
రవదనారవిందమున నన్ మిపుల రహిని
గనుపె నా కోర్కి; సోమదత్త! నెఱి నీదు
సుతను నా కిచ్చి, ననుఁ బ్రోవు సొరిది నిపుడు ౧౦౯

కీర్తి నా చెట్టఁ బట్టిన గీర్తిఁ గాంతు
క్షితిని; దాన నాకెంతయుం గీడు వాయు;
కీర్తి ననుఁ జేరదేనియు గీర్తి శేషుఁ
డ నగుదును నా వెతం దీర్చుము నెఱి నర్య!''

అనఁగా నర్యులు సోమదత్తుఁడును లో నాలోచనం జల్పి నె
ట్టన గంధర్వులు శూద్రులీ దివిని ''నీడా? జోడా మీర్మాకు నీ
కును మా కన్నెను నిమ్మనంగ నుడి మీకున్ వచ్చె నే రీతి? నీ
కును మా బిడ్డను నిచ్చుకన్ననెటనో కూల్పంగ మేల్గాదొ కో!!

"ఏ గంధర్వున కో యిది
యేఁగంగఁ బొనర్చుకన్న నింతిని వడిగా
నే గంగలోనా త్రోసిన
నేఁగం గల దస్మదీయ మెసఁగు వెత యొగిన్ ౧౧౨

పో పొమ్మ! చిత్రకంఠుఁడ!
యీ పగిదిని మాదు కీర్తి నీ వర్థింపన్
రూపఱును మాదు కీర్తియు
వే పొఱుమ యిచటనుండి వెస నెచ్చటికో"

అనుచు మొగమోట మీఁగి వైశ్యావతంసుఁ
డతని వారు గంధర్వున కాడినంత
నంతకాంతిక మేఁగిన యట్టు లతఁడు
చల్లఁబడి పుల్లఁబడి తన స్వాంత మఱియు

అవమానం బొకట న్నిరాశయొకటం బ్రాంచద్రుషావేగ మొం
ట వెసం బర్వఁగ మోము గెంపు గదురన్ గంధర్వుఁడయ్యార్యులన్
జవి యేఁదం గని యిట్టులాడు నజ లానల్పోరు కల్పాంతకా
ల విశేషోద్ధత నీరదారభటిఁ బోలంజాలు కంఠధ్వనిన్ ౧౧౩

"అవురా! యార్యులు! చిత్రకంఠుఁడనఁగా నావంతగా మీకు లో
న వెసం దోచి తృణీకరింతురొకో? గంధర్వేంద్రుఁ డన్నంతఁ జీ
మ వలెం దోఁచెనొ? మీరు మీకొమిరెతో క్ష్మామండలిం బుట్టి వై
భవ మేదన్ శిఖిఁ గూలి గ్రమ్మఱదరు శాపం బిద్ది మీకిచ్చితిన్"

అని యుగ్రంబుగ శాపం
బును గంధర్వుం డొసంగఁ బూర్ణక్రోధం
బున వైశ్యు లాతనిం గని
యని రిటుఁ బ్రళయాంబురాశి దగు నారభటిన్

"ఔరా ! గంధర్వాధమ !
నేరము మాదేమి? కలదు ; నీచుఁడవై మా
కీ రాని శాప మిచ్చితి
వా రామ న్నీ కిడ భవ దాశ్రితులమొకో ? ౧౧౮

"నీ తాత బంట్లమా ? నే
మీ తఱి నీ కోర్కెఁ దీర్ప ? నీవు పొడమియున్
భూతలమున నీమె పయిం
బ్రీతి వడియు శిరము వ్రీలి బిద్దెద వార్తిన్ ౧౧౯

"ఈ లోకముననె కా దిం
కే లోకంబునను నీకు నీకన్య మఱె
న్నే లీల న్నీ కన్యయె
యా లోబడ దోరి నీకు నగు మరణంబే" ౧౨౦

అని ప్రతి శాపంబును ఘో
రనియతి గంధర్వునకును బ్రబలరుషన్ వై
శ్యనికాయం బిడఁగా వా
డును బడి యవ్వాడునుం గడుం ద్వర నేఁగెన్ ౧౨౧

వ॥ అంత

కైలాసముఁ జని వైశ్యులు
కాల గణం గని జరిగిన గతిఁ దెల్పియు నం
దా లోకపు సాంబుఁ గొలిచి
హాళిన్ శ్రీ కన్యకాంబ నర్చించి రొగిన్. ౧౨౩

వ॥ అని సూతుండు వచించినంత శౌనకాది మహా మునీంద్రు లవ్వలి కథానకంబు వినంగోరి రంత ; నవ్వారికి నవ్వారి మోదంబు గదుర సూత పౌరాణికావతంసం బిట్లు వక్కాణించె. ౧౨౪

ఆపయి శ్రీ గౌరీ శివు
లేపుగఁ బెండ్లియగు గాథ యెసఁగె ననఁగ సూ
తా ! పౌరి నది దెల్పుమనిరి
ప్రాపుగ శౌనకముఖ మునివరు లాతనికిన్

వ॥ అంత సూతుం డిట్లు వచియించె ౧౨౫

హాళిన్ శౌనకముఖ్యులార! వినుఁడీ! యర్యావళిం గాంచియున్
సాలంకాయన మౌని చంద్రుఁడన నేఁ చాడ్పొప్పగాఁ దెల్పెదన్
గైలాసాధిపుఁడైన శంకరునిదౌ కళ్యాణపుం గాథ దం
భోళిం బోలి న దెల్ల పాపకుధరవ్యూహంబులన్ ప్రీల్పఁగన్

# శ్రీ గౌరీ కళ్యాణము - దక్ష యజ్ఞము

దక్షుఁ డశ్వమేథము నిటలాక్షుఁ దనదు
నల్లునిం బిల్వ కూనెఁ జేయంగ నట ద
ధీచుఁ డను ముని యజ్ఞవేది గల శాల
దానఁ బరమేశుఁ డుండమి దనరఁ గాంచి ౧౨౮

దక్ష ప్రజాపతీ! నిట
లాక్షుం డిటలేఁడు ; దేవతాధ్యక్షుం డా
యక్షరుఁ డుండని జన్నం
బక్షయ శుభదం బెటులగు? నన దక్షుండున్ ౧౨౯

''శివుఁ డనఁగా దిగంబరుడు; చేతఁ గపాలము బూను; బిచ్చమె
త్తవలెఁ; దమోగుణాఢ్యుఁడయి తద్ద లయంబు ఘటిల్లఁజేయు;'' నం
చు వెసను దక్షుఁడాఁడ నటఁ జొప్పడు మాయను నందునున్న మౌ
ని విసరమెల్ల దక్షునకు నెమ్మది లోఁగి రటం గరంబునన్

వ॥ అప్పుడు దధీచుండు వారలం గాంచి యిట్లనియె ౧౩౦

సర్వేశుండగు వామదేవుని దిరస్కారంబు గావించియు
న్నిర్వాహం బొనరింతు వీ సవనము న్నిర్ణిద్రపాపుండ! వో
దుర్వారాత్మక! దక్ష! నీవు నిఁక నిందుం బొల్చు నీవారు త
త్సర్వేశాగ్రహపాత్రు లారయఁ గదున్ సత్యంబు నామాటయున్

శ్రీ విష్ణుండు పరేశు డౌ శివునకుం బ్రేమైకపాత్రుండు తా
నే వా ర్మంకరు లెంత లై మనక వర్తింతు ర్కాడున్ వారిపై
లో వైషమ్యము మాను నంచు నల సుశ్లోకుండు వాక్రుచ్చె, తే
జోవిస్తారుని శంకరుం దలచుచుం జొప్పొందె న ప్పట్టునన్

అప్పుడు——

ఒగి దాక్షాయణి భర్త శంభు మతి దా నుల్లంబునం బెట్ట కో
లిగ దక్షుండౌనరించు జన్నమును నర్థిం గాంచఁగాఁ బోయి తం
డ్రి గుణాపేతతఁ దన్ను నాత్మపతి నెంతే దూషణం జేయ నో
ర్వఁగ లే కా సతి యగ్నినిం బడియటన్ బ్రమగ్గెన్ గడున్
భీకృతిన్ ౧౩౫

అంత ౧౩౬

అట రుషఁ గన్న శంభుని జటాంతరమందును వీరభద్రుఁ డు
త్కటభయకృ త్ప్రభుండు వెయికన్నులు వేతల లింక వేయికేల్
పటుబల విక్రమాఢ్యముగఁ బర్వఁగ ధూర్వహుఁ డై జనించె దీ
క్తటములు వెల్గఁ జేసెడి నకాండరవిప్రభనుం జెలంగుచున్.

ఆ వీరభద్రుఁ డ ట్లావిర్భవం బంది
శర్వునకు న్నమస్కారము లిడి
పంజరంబున విడివడ్డసింగము లటు
ప్రమథగణంబు తేవఁ దగి రాఁగ
దక్షయజ్ఞస్థలిం దగఁ జేరి యతని జ
న్నము పాడు గావించె ప్రమథు లందుఁ

గొందఱు కుండాగ్ని డిందఁ జేసి రిఁకఁ గొం
దఱు స్రుక్స్రువాది భంగము సలిపిరి
ఋత్విగ్ఘోష బాధ జరగె ఋషితతి భయ
మొదవె దక్షప్రజాపతి నొగిని వీర
భద్రుఁ డట గట్టె భృగువు సుభవుఁడు దఱిని
గడ్డముఁ దఱిగె; భగు నంది కరము నేచె ౧౩౭

కట్టె భృగు మణిమంతుండు గట్టెఁ బూషు
నంతఁ జండీశుఁ డిక నపహాసము నొన
రించు పూషుని పండ్లు రాల్పించి; వీర
భద్రుఁ డాదక్షు తలఁ గోసి వైఁచె శిఖిని ౧౩౯

వ. అటు వీర భద్రుఁడు దక్షయజ్ఞధ్వంసం బొనరించి
కైలాసం బేఁగె; నంత ౧౪౦

శూలి రహించి యజ్ఞపురుషం బ్రతికించి మఖాజి మస్తకం
బోలిన దక్షు మొండెమున కుంచియుఁ బ్రాణముఁ గొల్వ దక్షుఁ డ
వ్వేళను నైక రీతులను వే వినుతెంచె శివున్; మఱిన్ శిఖిం
గూలిన దక్షపుత్రికయుఁ గూఁతుగఁ బుట్టెను మంచుకొండకున్

సతి తన్ను వీడినందున
మతిఁ గుందిన శంకరుఁడు హిమగిరి దరి దరిన్
సుతపంబుఁ జేయఁ బూనెన్
వితతజ్ఞానప్రకార విస్తారముగన్ ౧౪౨

వ. అట్లైన్నో దివ్యవర్షంబులు గడవఁగా

తారకుఁ డన్న దైత్యపతి తద్దయు ఘోరతప మ్మొనర్పఁగా
సారసగర్భుఁ డెంతయును సంతస మొంది వరంబు లీయ వి
స్తార మదాతిరేకమున సర్వజగంబుల నేఁచుచుండె బృం
దారకనాయకాదు లల యద్భుతశక్తికి భీతినొందఁగన్

అ త్తారకదానవుఁ డు
వ్వెత్తుగ లోకతతి నేఁప బృందారకమౌ
న్యుత్తము లేఁగియు వేఁడిరి
య త్తామరసోద్భవుని నుపాయముకొఱకున్ ౧౪౫

అనవుడు బ్రహ్మ వేల్పులకు నాఁడెడి హైమనగంబునం దపం
బునుఁ బొనరించు శూలి గిరిపుత్రికచేఁ గను పుత్రుచేత నీ
దనుజుఁడు నాశ మొందియును దద్దయు మేలు జగంబు లొందు నం
దున శివపార్వతుల్ గలియనుం బొనరించు మరుండు పూనియున్

వ. అని వనజగర్భుం డానతియొసంగినంత-గురునను
మతిం దేవేంద్రుండు మన్మథునిం బిల్పించి చల్లని మెల్లవి
సూక్తుల నతనికి నిట్లు వక్కాణించె ౧౪౬

తారక దైత్యనాయకుఁడు తద్దయు విశ్వము నేఁచుచుండెఁ -త
ద్దారుణబాధ లీఁగ-సముదారుఁడు శంకరుఁ డద్రిపుత్రి దే
వేరిగఁ గాంచు-నందుఁ గనుబిడ్డఁడు త ద్దనుజాతుఁ గూల్చియున్
పాఱె సుఖంబు విశ్వమున సంఘటిలం బొనరించు మిక్కిలిన్

కాన-శివా శివుల్ గలియఁగా సుమకాండము లేసి-నీవు ఖాం
కాన నొనర్తువేని-నల కార్యమునం జగముల్ సుఖించు-నం
చూనిన పేర్మి నింద్రుఁ డన నోలిని మన్మథుఁడెంతయేని వే
గానఁ జనెన్ హిమాద్రికడఁ గాలగళుండు తపించు చోటికిన్

చిలుకలతోడఁ గూడియును-చెల్వగు చందనవల్లికాపరీ
మళ మలయానిలంపు రథమంటప మెక్కి-శశాంకుఁడాతప
త్రలసితపాణి నొప్ప-నళిరాట్పిక శారికలున్ రొదల్ వాన
ర్ప-లలి మరుండు చేరె హిమవంతము సద్గుణభాగుదంతమున్

వ. అందు— ౧౫౧

ఏలాలతాజాల హేలాపరిష్కార
కలిత పున్నాగవృక్షవ్రజంబు
పన్నగాహార దీవ్య చ్చందన సుమర్తు
ల్లికలస న్మందానిల లలితంబు
వికచారవిందౌఘ మకరందపానమ
త్త మిళింద ఝంకారతతియుతంబు
పుష్పి తాశోకసంఫుల్ల మల్లీవితా
న వకుళ వంజుళ ప్రవిలసితము

మదనసందీప నామంద మంత్ర తంత్ర
పఠన సంభ్రాంతికర శుకవ్రాతశారి
కానికాయ వైభవయుతుఁడై నెఱిని వ
సంతుఁ డవతరించెను బలుసంతసమున ౧౫౨

అటు వసంతయుక్తుఁడు కంతుఁ డపుడుఁ జూచె
సచ్చిదానందరూపు-బ్రజ్ఞానమయుని
శంకరు-నతం డటుల నల్లశంభుని గని
వెసను మాయావిమోహిత విషయుఁ డగుచు ౧౨౩

జ్యాకిణాంకబాహువులను నట్టె తట్టి
యల్ల జగదేకధన్వి యా నద్రిచాపు
పయిన నిష్పుష్పధన్వి పుష్పశరచయము
నిక్షుకోదండమునఁ గూర్చి యెక్కు-వెట్టె ౧౨౪

ఆ కాముండు నికామకామమున నొయ్యన్ బువ్వు విల్తాటి వే
నాకర్ణాంతము లాఁగి-మోహన మనన్ హర్షాంబు నీలోత్పలం
బేకప్రక్రియ నేయ-శంభు షిరమందెంతేని నాఁటెం గడున్
వీఁకం దన్మదనాద్భుత క్రమమునన్ విశ్వంబొగిన్ బ్రాన్పడన్

ఆ బాణం బెద నాఁట-శూలి మదియందత్యంతమున్ రేఁగి-య
క్షీబం బంతకపాశసన్నిభముగాఁ జెల్వొందు భ్రూవుం గడున్
భీబాహుళ్యదభంగిమై ముడిచి-వహ్నిప్రోజ్జ్వలన్నేత్రమున్
"గిబా" యంచును నెల్ల రార్వఁ-దెఱచెన్ గీల్యర్చులుర్లం దొరన్

అంతం బువ్విలుకాఁడు నప్రదర బాణాసంబుగా భీతి న
త్యంతం బిచ్చుచు బూదిరాశిగ హరోపాంతంబునం దందు "బల్
వింతా? విప్లవమా?" యటంచుఁ గను వార్విద్దూరముం జెందఁ-దా
నంతంబుం గనెఁ బాటు నొంది-తగునే యాద్వారి భావంబెటన్??

## రతివిలాపము

అంతం-ద్దైవత మౌనికోటు లల మారాంతంబునుం గూర్చి త
త్కాంతం గాంచి వచింపగా రతియుఁ దత్కంజాతపత్త్రాక్షి వృ
త్తాంతం బయ్యది యాలకించి-మొద లొయ్యం ద్రెళ్ళ చెట్టట్లిలన్
శాంతిచ్ఛేదక రీతిఁ గూలి-పటుమూర్ఛన్ లోఁగి యొక్కింతలోన్

ఆ యటు మూర్ఛిల్లిన రతి
పోయిన తెలి వొంది-భువిని బొరలుచును నురం
బోయని మోదికొనుచు "నాఁ
థా!" యని యేడ్చెం గరంబు నార్తికరముగన్ ౧౫౯

నను వీఁడి యెందేఁగినావు? ప్రాణేశ్వర!
యీ వేఁగ నేను జీవించినానె?
ఏల నా గుండియ వ్రీల కున్నది పది
వేల ముక్కలు గాఁగ? వెస నదియును?
ఱాతిదో? లేక వజ్రంబుదో? నీవె ది
క్కన్నట్టి నన్ను నన్యాయపఱతె?
నాథ! యనాథ నై-నలువుగా నినుఁ గొల్చు
నే నేడ్వ-నొప్పరికింప నగునె?

నిండు చందురుం దెగడెడు నీ ముఖార
విందముం గాంతు మెప్పుడొ? విందవగుచు
నీదు సాన్నిధ్య మిందు రాణింపఁ జేయు
నాదు పతి!" యంచు రతి యేడ్చె నాథు నెంచి ౧౬౦

ఆ రతి యాగతి న్నవయుచందు నొగిం దగి యున్న చంద్రకో
టీరుని పాదకంజముల డెప్పర మైతగు భక్తి వ్రాలి-యో
సారకృపావిలాస! మనసార దయం గని నాకు నా పతిం
గూరిచి నన్ను నేలుమ! యకుంఠిత సత్కరుణాపయోనిధీ!!

ఒక పరి నీకు మ్రొక్కు-నెడ-నుండిన పాపము లెల్ల డుల్లియున్
సకలసుఖంబు లబ్బు-నని సత్యపు లీలఁ బ్రమాణజాలముల్
నికరముగాఁ జెలంగుఁ గద? నీకు నివే పదివేల వేటికో
ళ్ళు కడింది భక్తిఁ జేతు-నతిలోకముదాఽఽకర! చంద్రశేఖరా!!

కంటన్ వహ్ని-మనంబునం గరుణయుంగంఠంబునందున్ విసం
బుంటం గల్గిన దేవదేవుఁడవు-నీవుగ్రత్వముం బూని-ము
క్కంటీ! నా పతిఁ గంటి మంటల మసిం గావించి-త వ్వాని న
న్నంటం జేయుము జీవితుం జలిపి-లేదా! నాథు నీ విప్పు దే
కంటం గాల్చితి-వల్ల కంటనె ననుం గావింపుమా! భస్మమున్

అటు రతి పటుదుఃఖమతిన్
నిటలాక్షుని పాదయుగ్మనీరజములపైఁ
దటుకునఁ బడ-నల రతి న
క్కటికమునఁ గను-మని దేవగణముం గోరెన్ ౧౬౪

అమ్మెయి వేల్పు లెల్లఁ ద్రిపురాంతకుఁగాంచి-యుదారసత్కృపా
ధ్యమ్మగు మానసమ్మునను నా రతి నేలు-మటంచుఁ గోరి-రా
యిమ్మగనే మునీంద్రులు వచించిరి-దానను శంకరుండు డెం
దమ్మున సత్కృపం దగియుఁ దద్దయుఁ-దద్రతి కిట్లుఁ బల్కెడిన్

ఓ సాధ్వీ! రతి! నీవా
యాసముఁ గన-కింక-నీదుప్రాణేశు మరున్
వాసిగ బ్రతికించెద-నీ
పై సరగ నతండు కానఁబడఁ డితరులకున్ ౧౬౬

నీ కొకతెకు గానంబడు
వీక న్నీ పతి-సమస్తవిశ్వమునన్ జీ
వాకరమున కెదలో మని
ప్రాకటముగఁ గానఁ బడకపరఁగు నతండున్ ౧౬౭

నావుడు-మారుండు పున
ర్జీవితుఁ డై తనర-రతియుఁ చిత్తం బానం
దావిల మై-పతిఁ గౌఁగిటి
లో వెస గొని-యతులతృప్తి లోనంది కడుఁ౯ ౧౬౮

తానున్ దన పతియున్ స
న్మానంబున హరు పదముల మస్తము లంటఁ౯
మానుగ నతు లిడి-మోదుల
కేనిఁ జనిరి మదిని ముదము స్వేచ్ఛ చెలంగన్

అంతన్ వేల్పులు మిక్కిలి
సంతోషమున శివుపయి-వెసను సుమప్రై-న
త్యంతము పూల్ గురిసిరి-వా
క్కాంతుండట శివుని జేరి-కడఁగి యిటు లనున్ ౧౭౦

దేవ! మహాదేవ! కడున్
బావన మగు నీదు లీల పరమంబు గదా?
నీ విట గిరిజను గొనుమా
దేవిగ-మీ సుతుఁడు తీర్చు దేవతల వెతన్ ౧౭౧

వ. మఱియును-సాలంకాయన మునీంద్రుండు వైశ్యుల కానతి యిచ్చినరీతిగా నైమిశారణ్యంబునందు సూత పౌరాణిక వతంసంబు శౌనకాది మహాముని పుంగవుల కిట్లు వక్కాణించె.

## ఆశ్వాసాంత పద్యములు

సరసతర చరిత్రా! సన్ముని స్తోత్రపాత్రా!
నిరత మధురశీలా; నిర్మలానంత లీలా!
కరుణపటలభాస్వత్కన్యకాంబా స్వరూపా!
పరిణత మహిమాఢ్యా! భవ్యకృత్యాకరేఢ్యా!! ౧౭౩

కుసుమ సుజన పుత్రీ! గుణ్యవిశ్వైకనేత్రీ!
అసమసుఫలదాత్రీ! హానికృత్పాపదేత్రీ!
భసల దఖిల నమ్రవ్రాత రక్షావిధాత్రీ!
లసిత విమల శక్త్యుల్లాసితా! కన్యకాంబా!! ౧౭౪

అంగిరసగోత్రుఁడు-నీఁక-వైశ్యకులుఁ డయిన
దోమ వంశ్యుండు-వేంకటస్వామి గుప్త;
అమల గోవిందసుతుడు; వ్రాయనయినట్టి
కన్యకాపురాణపుఁ బద్యకావ్యమందు;

ఇద్ది మూడవయాశ్వాస మింతుముఖిరో
కలిత కరుణాలవంబ ! శ్రీకన్యకాంబ !; ౧౭౫

గద్యము. ఇయ్యది శ్రీతుంగభద్రానదీ తీర విరాజమాన_కర్నూల్నగర నివాసి-నిరంతరశ్రీమ ద్వేంకటేశ్వర చరణారవింద మిళిందాయమాన మానస_వైశ్యర-త్నాంగిరసగోత్రపవిత్ర-ధర్మపత్నీ కోటాంబికాసమేత-దోమాగోవిందార్యవర్య సుతజ్యేష్ఠుండును-శ్రీ రామచంద్ర కృపాకటాక్షనిరీక్షణాసాది తాంధ్రగీర్వాణ కవిత్వ కృతపరిచయుండును-శ్రీ బ్రహ్మవైవర్తమహాపురాణ శ్రీ పరకాలవిలాస-శ్రీ బ్రహ్మేశ్వరపురాణ-శ్రీ గౌతమక్షేత్ర మాహాత్మ్య-శ్రీ విష్ణుభక్తి-ప్రేమాభిరామ _ శ్రీ ముకుందమాలా_శ్రీ గంగాలహరి _ శ్రీ కనకధారాస్తవ - దూతాంగద - చంద్రకళా సుదర్శనాత్మబోధసుజనత్రయ _ శ్రీ సీతాకళ్యాణ శ్రీ మార్కండేయవిలాస _ శ్రీ సిరియాళచరిత్ర శ్రీ నృసింహాధ్వరీయ _ శ్రీ మదభినవరామదాస-శ్రీమదభినవ ప్రహ్లాదచరిత్ర_శ్రీరోహిదాస శ్రీగిరిధరలాలచరిత్ర-సుభాగ్యశతక - శ్రీకన్యకాపరమేశ్వరీ శతక శ్రీ వీరరాఘవశతక-సన్మార్గాద్యనేక _ భాషాంతరీకరణ-ప్రబంధ - నాటక-యక్షగాన_శతక-ఖండకా-వ్యోపన్యాసకర్తయును- హరికథా కాలక్షేపనిర్వాహకుండును-నానాదేశ రసికప్రదత్త-శ్రీ మదాంధ్ర విద్యావాచస్పతి - సాహిత్యసరస్వతి - విద్యావినోద - కవిభూషణ- విద్యాసాగర-కవిరత్నాశుకవితల్లజ _ జాశుకవితాధురీణ - కవికుంజ-రావధానిపంచానన _ నావధానపితామహ-కవిచక్రవర్త్యాద్యాదరాంకిత-దోమా వేంకటస్వామిగుప్తచే ప్రణీతంబయిన శ్రీ కన్యకా పురాణపద్యకావ్యమునందు తృతీయాశ్వాసము.

# చతుర్థాశ్వాసము

శ్రీదా! శ్రీ కన్యాంబ! మ
హాదురిత నివారణచణ! అర్యనియంత్రీ!
సాదర దృగ్దత్తాఖిల!
మేదురవై భవచయా! అమేయామేయా!!

దేవీ! యవధరింపవలయు - భవదీయంబయిన యనంతర కథావిధానంబు-నట్లు పాలితకింకరుండయిన శంకరుండు రతి ప్రార్థనంబునం జేసి కామునిం బునర్జీవితుంజేసి-కైలాసంబుం జేరి నంత-నొక్క నాడు.

## నారదురాక

కరమందుఁ మహతీవిపంచిక మనో
జ్ఞంబైన యాలాపనం
జరపఁ-మానసమందు నోట భగవ
న్నామస్మృతిం బూని-యిం
చోరయఁ శారద నీర దేందురుచిభా
గుద్యత్తనూకాంతి వి
స్ఫురణ న్నారదుఁ డేఁగుదెంచె నల శం
భుం గాంచఁగా నొక్కటఁ.

అమ్మేయి వచ్చినట్టి జలజాసన సూతిని సాదరాతిరే
కమ్మునఁ గాంచి-శంకరుఁ డఖండముదంబున విశ్వపున్ విశే
షమ్ముల నడ్గుచున్-మఱెట సమ్మని యమ్ముని మేటియందచం
దమ్మగు కన్నెమిన్నను గనం దగెనంచును బ్రశ్న సేయఁగన్

అంతన్ శంకరునిం గనుంగొనియు-నయ్యంభోజగర్భాత్మజుం
డెంతే భక్తి నమస్కరించి యను-"సర్వేశా! నిజం బీవు స
ర్వాంతర్యామివి-సర్వవేత్తవును-నీవయ్యా! కనన్ లేని దే
యంతం గాని చెలంగఁ బోదిటుల నన్నడ్గం గతం బెద్దియో??

"నీ దయ యూఁతగా జగతినిం జరియించెడి వాఁడ-నాకు నీ
మాదిరిగాఁగఁ బ్రశ్న మిడు మాఁటకు నీ దగు నాదరంబు గా
లేదియుఁ గారణం బెసఁగునే? గనుకన్ వచియింతు నొక్క ప
ల్కా-దరమేదురత్వ మెసలారఁగ దానిని నాలకింపుమా!!

హిమశైలనాయకు నప
త్యమణి-యుమారమణి యొప్పు నామె యనఁగ-రం
బమలిన సౌందర్యాంబుధి
శ్రమపడియే నామె బొగడఁ జాలర దెవరేన్

పల్లవతతి యామె [1]పల్లవంబున కోడుఁ-
గాహళం బీఁగు జంఘాద్వయికిని

1. పల్లవంబు = పత్ + లవంబు = కాలిధూళి.

రహి నూరువుల పొంత[2] రంభోరుత యడంగు-
కా "న_స్తి నా_స్తి" వాదాన కిక్క-
ఆ కుచద్వయి దింపుఁ గోకద్వయము సొంపు
[3]నటితి శ్రీకిం గాంచు[4] దరము [5]దరము
నెఱి కొప్పు [6]నీరద నీరదత్వముఁ గొల్పు
నిండుఁజందురు నొంచు నెమ్మొగంబు !

మేని చాయ బంగారంబు మేల్మిఁ దెగడు
అల్ల చాన-నీయాన-నీ కర్ధ్మా మాన
సానఁ గాని-వాక్కునఁ గాని-సరగ నెవ్వ
రేని నల సోయగము సుంత నెన్న లేరు ౭౦

అందఱిఁ బుట్టఁ జేయు నలయంబుజసంభవుఁ-డట్టు లయ్యు-నీ
సుందరి తన్మహ_త్త్వమునఁ జొప్పడినట్టిది గాఁగఁ దోఁప-దో
చందురుఁదాల్ప ! యల్ప మనఁ జాలరు దాని హొరంగు-నీవుఁ ద
త్సుందరతావిధేయతను జొక్కక పోవు-నిజంబు పల్కెదన్ ౭౧

2. రంభోరుత = రంభా + ఊరుత = అరటియొక్క లేక రంభయొక్క గొప్పతనము.

3. అటితి శ్రీ = గొంతు (మెడ) అందము.

4. దరము = భయము.

5. దరము = శంఖము.

6. నీరదనీరదత్వము = మేఘమునకు పండ్లులేనితనము, అనగా గర్వ భంగము.

మాఁటలు వేయు నేల? యొక మాఁట వచించెద-నాలకింపు-నీ
వా? టకటొంకు లేల? పురుషాత్ముఁడవు-ప్రకృతిస్వరూప యా
పాటలగంధి-నీకు నలభామయు-నామెకు నీవు సాటి-యో
హాటకశైల చాప! మదినారయు మాఁట వచించి నానిటన్

వ ఇంకను నాలకించునది. ౧౧

ఆ లలనా వతంస-మభవా! భవదేక నిమగ్నచిత్తయై
కాలముఁ బుచ్చుచున్నయది-కాలగళా! భవదీయ యయ్యెడిన్
వైళ మొనర్పకీవు గొనినన్ మఱి యట్లుఁ గానిచో నొగిం
గాలవశాత్మ గాఁగలదు కార్య మవార్యము గాఁగఁ బూనుమా!!!

అని పని వినియెద నని-య
మ్మని నారదుఁ డేఁగె నంతఁ బువ్వు ల్తుఁడు తొ
ల్లి నిగిడ్చిన శరముల నొ
చ్చిన వాఁడై శివుఁడు జేర్చె శివయందు మదిన్.

అప్పుడు

"తా నొగి మున్ను వేసిన యుదారశరం బల యోగిపైఁ బనిం
బూనదొకో?" యటంచు నెదఁబూర్ణత సంశయ మొంది
యున్న యా
సూనశరుండు మారునకు సొం పది హెచ్చఁగ నిందుశేఖరుం
డా నళినాక్షి గౌరిపయి నంతము లేని విరాళిఁ గనెన్ ౧౩

ఓలిం గైలాసశైలం బోగి విడి యభవుం
డోషధిప్రస్థనామ
శ్రీలీలాంచత్పురంపుం జెలువగు తనికం
జెల్మికత్తైల్ కడున్ సే
వాళిం జేయంగ శోభాయతన గిరిజయున్
హాళి నందాల మే ల్పం
దాలం బర్వాన్ మదిన్ సంతసము గని సుమ
గ్ధత్వమున్ శంభుఁ డందెన్— ౧౬

అంత ౧౭

# గిరిజ జలక్రీడావిహారము

బృందారకానంద కందమై యంద చం
దాల కెంతే నాలవాల మగుచు
శారదనీరద చంద్రకాడంబర
పుణ్యనిర్మల వారి పూర్ణ మగుచు
స్వగత కాంచన పద్మ తిగళన్మరందరం
గద్భృంగవార ఝుంకార మగుచు
కమలినీలతికా నికాయ భోజనతుష్ట
కలహంస హింసికా కలిత మగుచుఁ

నై కశంపాలితా ఝంప నాఁ దగు శకు
లకుల సంచరణానంద నికర మగుచుఁ
గ్రాలు నట్టిమానసతటాకమునఁ జెలుల
తోడ న య్యుమ చేరి సంతోష మడర ౧౯

ఆకాశంబున నంత నింతట ప్రకాశాపేతతం జెందు శం
పాకాండంబును బోలెఁ గాక తిరమై ప్రాకాశ్యమేపా తటి
ల్లోకం బియ్యది నాఁగ నగ్గిరిత లందున్ గేళిఁ గావించియున్
బైకిన్ వచ్చియు ధౌతవస్త్రము లలంకారంబులం దాల్చియున్

నానా సూనానీకం
బానిన మతిఁగోసినంత నపు డుమ మది నెం
తేనిన్ సద్భక్తి మెయిన్
బూనె మహాదేవి శివుని బూజింప నొగిన్ ౨౦

"బృందారకానందకంద త్వదీయది
వ్యాకృతిం గానంగ నబ్బు టెపుడో ?
చంద్రరేఖాపరిష్కార భాసురము నీ
నెమ్మోము గాంచు పున్నె మ్మ దెపుడో ?
ఎల్లలోకము లేల నింపైన నీ కేలు
దామర నా తలం దాకు టెపుడో ?
పరమపావనమైన భవదీయ పాదార
విందంబు లేఁ గొల్చు వేళ యెపుడో ?

నీవు న న్నేలఁ కొండేని నీలకంఠ
నాదు బ్రదు కొప్పుఁ గాక యున్న నొగి నీల
కంఠకంఠస్థనాగి నీ గతికి నగ్గ
మగు మహాదేవ! నా రీతి నరయు మెలమి ౨౧

## శివలీల

అని నానావిధుల న్నుతుల్ నుతు లసంఖ్యప్రక్రియం జల్పి శై
లనికాయేశు కుమారి శంకరుని నుల్లంబందు నం జేర్చ నె
మ్మనమం దంతను బొంతు లేని కృప సమ్యగ్రీతినిం జెందగాఁ
గనుపట్టెన్ ముది విప్రలీల హరుఁడక్కాంతాగ్రభాగంబునన్

బహుళ జరాభార పలితంబులై జడల్
గట్టిపట్టి శిరోజగణ మెసంగ
ధవళాతిధవళ మై తనివి గా ముడుతలు
నస్థిఁ గన్పడు దేహయష్టితోడ

అడు గామడగఁ దోఁచు టగుపడగాఁ బదం
బుల జాలఁ దడఁబాటు నొలయుచుండ
శిశిరత్వ సర్వస్వదశఁ జూపు టన నెల్ల
యంగకంబులు వణం కందుచుండ

కనులు గాక కాళ్లయ్యె మూఁడనఁగఁ గేలి
క్రిందుగ కాళ్లకుం దోడుగాఁ జెలంగఁ
దొంబదియుఁ దొమ్మిదగు వత్సరంబు లొప్పు
ముదుక పాఱుని యాకృతిం బొందె శివుఁడు ౭౩

పరఁగం దద్గతి నైజసన్నిధిని నిల్వంబడ్డ శర్వున్ ధరా
ధర కన్యామణి యాతిథేయ వర సత్కారాఢ్య చిత్తంబుతోఁ
గరముల్ మోడిచె; నందు కిందుధరుఁడుం "గళ్యాణమ" స్తంచు వి
శ్వ ర మాఽఽపాదక లీలఁ బల్కె నల యబ్జాతాక్షి కాశీస్సులన్

అమ్మెయి వచ్చినట్టి కృతకావనిదేవుఁడు కన్నెమిన్న నం
దమ్మగు డెంద మొప్పఁ గని "తద్దయు నీదగు పూజకున్ ప్రమో
దమ్మును నీదు వేల్పు గనుఁ దామరసాక్షిరో" యంచుఁ బల్కె "నా
మ మ్మెది నీకు? నెవ్వతెవు? మానిని! నాకు వచింపు"మం చనన్

ఆ గిరికన్నె యంతట నిజాంతికవాసిని కాజ్ఞ సేయఁగా
వాగమృతంబు చింద నల భామిని పల్కె 'ధరామరేంద్ర! యీ
సోఁగకనుల్ గలట్టి దగు సుందరి శైలకుమారి-నేత కాఁ
గాఁ గడు భక్తి శంభు పదకంజములన్ భజియించు నిచ్చటన్

వ. మఱియును దన చెలి మహాదేవార్పిత మనో ర
విందయై క్రందయిన తపంబు గావించుచున్న దనియును, వ

య్యఘనాశంకరుండయిన శంకరుం డనుగ్రహించి పరిగ్రహింపని నాఁడు విగతప్రాణ కాఁదలంచియున్న దనియు వచింప, న మ్మాయావిప్రవేషధరుం డా హరుండు పకాలున నగి సాపహా సంబుగా న ప్పార్వతి కిట్లు వచించె ౨౭

ముగ్ధలం దీవు మిక్కిలి ముగ్ధ వరయ
శంకరునివంటి వాని నీశ్వరునిగాఁగఁ
గోరు కాంత వెట్టిది గాక సారమతియ
టంచుఁ దెలిసిన వాఁడు వచించునెవఁడు? ౨౮

దై నందినంపుఁ గర్తవ్యం బటందమా?
యింటింట బిచ్చంబు నెత్తవలయు
అంబరం బందమా? అంబరం బొక్కొ? యే
నుఁగు తోలొ? ముప్పన్నెమెగము తోలొ
బిచ్చంపుఁ గడి గాక విసము మెక్క వలసె
బూఁది పూఁతం బూయు బునుకఁ దాల్చు
వాసంబుఁ గాంతమా? వల్లకాటను బాము
లే మేని సొమ్ములై యెసగుచుండు
దయ్యములు భూతములు గావె తదనుచరులు?
జనకులా? సున్న చెడు మేలి గొనము లరుదు
తప్తకాంచనసన్నిభ తనురుచి గల
యబల! నీ వేడ? విషమాక్షుఁ డాతఁ డేడ? ౨౯

అని వికటముగా శివదూ
షణరీతిం బల్కు విప్రు జంకెనతోడం
గని గిరిజ వీనులం గే
లను మూసికొనియు శివస్మరణముఁ జలిపియున్ ౩౦

"అఖిలాఘాంతకుఁడై తగు
నిఖిలాధిపు శంభు శూలివిం దూషింపన్
ముఖరత్వ మెట్లు గలిగెన్
ముఖమున నీ?" కనియె గిరిజ భూదేవునకున్

వ. అ త్తెఱంగు నంతయుం జూచి యగ్గిరజ చెలిక త్తియ ల క్కుహనాబ్రాహ్మణుం గాంచి పరిహసించు వారై

ఒక చాన వికచాంబుజ కచాకచిక ముఖం
బున నాతనిం బకాలఱనను నవ్వె
ఒక లేమ య ప్పాఱుఁడు కయిం ధరించిన
దండంబుఁ గైకొని దాఁచి పెట్టె
ఒక చెలి య వ్విప్రుని కమండలువు లాఁగి
"యెంత నీ ర్పట్టు? నేమి?" యని యగ్గె
ఒక రామ య బ్బాడబు కయిం గలట్టి పు
స్తకమునుం గొని పోయి చాటుపఱచె
ఇట్టు లల భూసురుఁ బరిహసించు చెలుల
జంకెనల నాఁపి యవయవస్థవిరుఁ డగుచు
నాతఁ డన్నవి లె క్కేమి? యనియె నగజ
అంత నటఁ దగె నొక్క మహాద్భుతంబు ౩౩

# శ్రీ శివ నిజరూపదర్శనము

కోటి చంద్రుల డాలు గోట మీటఁగఁ జాలు
భస్మలిప్తంబైన వపువుతోడ
గంగాపరిష్కార కలిత మౌ చంద్రార్ధ
భాసు రారుణ జటాపటలితోడ
హారవల్లరివోలె ననఁగిపెనఁగు లాఁడు
చారు వాతాశన స్రజముతోడ
ఇంద్రధనుఃకాంతి నెనయంగఁ జాలు ము
వ్వన్నె మొగంబు దుప్పటముతోడ
డమరు త్రిశూల ఖట్వాంగ సారంగ సం
కలితమౌ కరచతుష్కంబుతోడ

డాలయిన మణిమయమకుటంబుతోడ
నందివాహమెక్కిన మేలి క్రందుతోడ
నందచందాలఁ జిందుచు హరుఁడు వారి
చెంత సాక్షాత్కరించె బల్ చెలువుతోడ

సంతోషాన సుపాంతమం దటుల సాక్షాత్కారమైనట్టి స
ర్వాంతర్వాణినికాయ గేయ కరుణా స్వాంతుం డనంతుండు వే
దాంతస్థాపిత చిన్మయాంగుఁడును నౌ నర్ధేందుకోటీరు న
క్కాంతామండలిగాంచి యద్భుతమునుంగాంచందగెన్ మిక్కిలిన్.

చిరకాల కామితంబగు
వర మేర్పడె నం చలరియు భరమగు లజ్జన్
గిరి కన్యామణి తన మతి
పరఁగకయుఁ దెఱ మఱుగునకుఁ బాఱె వడి నటన్ ౩౬

డాలుగ నప్పు డీశుఁడు హుటాహుటిమై గిరిరాజ కన్యకన్
గేలను గేల్దెమల్చి దరికిం దగ లాఁగి యిటు ల్వచించు "బ
ల్మే! లబలావతంసమ! లలిన్ హృదయాంబుజమందు నీపయిన్
జాల నెసంగు మక్కువఁ బెనంగు ననుం గరుణం గనం దగున్

సాంగుఁడై యయ్యనంగుండు సవ్యసాచి
యగుచు నోహరి సాహరి నస్త్రచయము
నాపయిన్ వేయుచున్న వాఁడాఁప, కబల
ప్రబల వై నీవు నన్నుఁ గాపాడవలయు ౩౮

కన్యామణిరో! నీ కే
నన్యుఁడనె? యనన్యమయిన యర్మిలితోడన్
ధన్యుం జేయవలె ననా
మాన్యానంద మపు దేను మానుగఁ గాంతున్ ౩౯

అంతఁ బైకొన్న సిగ్గుమై నాస్యమందుఁ
జెమట బిందువుల్ ముత్యాల చెలువునూన
డాలుగా మేను బుళకనిచోళితముగఁ
జారుతరహాస్య సుందరాస్యంబుతోడ ౪౦

రమణి మందాక్షమందాక్షరంబు గాఁగ
నక్షికౌక్షేయునిం గాంచి యనియె నిటులఁ
"ప్రాణనాథ! నీ దానను బరను గాను
గాని మా వా రిడం దగుగాదె నన్ను" ౪౧

అని యానందముతోడ వంతను గరం బంతస్థలింబూని, య
వ్వనజాతాక్షియు నీలకంఠుఁడుఁ గరాబ్జంబుల్ విడం జేసి కొం
చు నెఱిన్ మాటికి మాటి కొండొరుల నెచ్చుం బేర్మిమైఁ జూచు కొం
చు నిజేశాను నధీశ్వరిం దలఁపుచున్ జొత్తెంచి నా ర్గీములన్ ౪౨

## సప్తర్షి ప్రయత్నము

అటుఁ గైలాసముఁ జేరిన
విటలాక్షుఁడు సప్తమౌని నిచయంబున కు
త్కటముదముగఁ దన కగజకుఁ
దటుకునఁ బెండిలి జరపఁగఁ దగు నని తెల్పన్ ౪౩

"చిరకాలాభిమతంబు నేఁడుఁ గద? చేకిక్కెన్ మఱి తారకా
సురుఁ డీపై నిల లేని వాఁడె" యనుచున్ శుంభత్ప్రమోదాన న
వ్వరమౌనుల్ హిమశైలనాయకుని తేవం జేరియుం దత్సుతన్
హరు కాంతామణిఁ జేయ నౌ" నని సమర్థ ప్రక్రియం బూనియున్

వ. ఆ యేడ్వురమునులటు వచ్చినంత ౪౫

మునివర సప్తకంబును సమున్నతభక్తిని శీతశైలభ
ర్త నెఱిని గాంచి యెంతయును ధన్యుఁడ నైతినటంచుఁ బల్కివే
దవిచయవంద్యుఁడైన సముదారుని బన్నగహారు నల్లువా
వివి గను జెందు భాగ్య మది నిస్తుల మంచు వచించి యర్మిలిన్

పౌరిఁ దనదు నోషధిప్రస్థపురమునందు
సకలమైన సన్నాహముల్ జరపికొనియు
నెప్పుడేని సిద్ధముగ దా నెసఁగుదు నని
తరలి రా వచ్చు శివుఁ డనె గిరివరుండు ౪౬

భూమి యంత యరుఁగు నభము నెనయంగఁ
బందిరిన్ వేయ గిరిభర్త పంచినాఁడు
మునులు కైలాస మేఁగి శూలిని గని గిరి
భర్త రహి నొప్పు టతనికిఁ బల్కి రిట్లు ౪౭

# వివాహ సన్నాహములు

దేవ ! మహాదేవా ! నీ
కీ వలెఁ దన సుత నుమ నని హిమగిరి పతికిన్
మా వాక్కుగ మే మన నతఁ
డావిర్భూతప్రమోదుఁ డయ్యెఁ గరంబున్ ౪౮

వ. ఆ హిమాచలభర్త పట్టరాని సంతోషంబుతో మా యభిప్రాయంబు నొప్పికొని వివాహ సన్నాహంబులు గావింపఁ బూని యున్నాఁ డని వచింపఁగా శంకరుని సంకల్పంబునం జేసి భృంగి యనెడి ప్రమథరత్నం బాజ్ఞాపింపఁగా శీర్షుండును బ్రవర్ధనుండును జండుండును ననెడీ బ్రమథత్రయంబు వెడలి పిల్పోన రించి నంత ౫౦

హ ర్యజేం ద్రాదు లిం కష్టవసువులు వి
శ్వేదేవ గంధర్వ సిద్ధ సాధ్య
ఖచర కిన్నర నవగ్రహ పులస్త్యాదిప్ర
జాపతులును వసిష్ఠముఖమునులు
బ్రాహ్మయనుండు నాపస్తంబ బోధాయ
నాశ్వలాయనులాది యయిన గృహ్యా
సూత్రకర్తలు వీఁకఁ జొప్పొందు ఘను లెల్ల
మేటి బహూకృతుల్ మేల్కొనియు

లోక జనకుల పెండ్లి యాలోకనంబు
సేయవలె నంచు గముల విచ్చేసి రెలమి
నల్ల శివలోకమునకు మే లతిశయిల్ల
సకల మానందతాండవ సరణిఁ దోఁప ౫౧

వ. అప్పుడు ౫౨

హరియును బ్రహ్మయు నిరువంకలం బరా
బరులఁ జేయుచును బెద్దటికఁ బూన
పెండ్లికొడుక వౌచు వేడ్కఁ బొందుమ యంచు
వేల్పులందఱుఁ గడుఁవేడ్కఁ బల్కఁ
దనర బృహద్రథంతర జగతీ సామ
ముల మును లాహ్వానముల వచింప
కిన్నర గంధర్వులు నొ్నగి యంత్రగా
త్రముల గానంబుల రహిని జల్ప
గణపతిన్ వెంటఁ గైకొని కాలకంఠుఁ
డు మణికనక భూషణములన్ విమలవిభవ
మున ధరించి రజితశైలమున కెనయగు
వృషభరాజంబుపై నెక్కి వెడలెనపుడు ౫౩

వ ఇమ్మెయిఁ దరలి బృందారకామంద బృందంబుతో
నేతెంచిన శంకరుం గాంచి

మాల్యవన్నిజసుత గంధమాదనగిరి
సహ్య వింధ్యాచల సుమేరు శైలముఖ్య మ
హానగస్వాములు తనతో దరిగి రా హి
మాద్రిపతి శంభున కెదు రరుగుదెంచి ౫౫

ఓం నమో మహాదేవాయ! చోత్తమాయ!
యని నమస్కారముం జల్పి యల్లుఁడ వాగి

నాకు నైతి వందుకు నెమ్మనమునఁ గరము
నిర్మలానంద మొందితి నిశ్చయముగ ౫౬

బ్రహ్మాదిదేవతాపటల శిరోరంజ
కంబైన పాదపీఠంబుతోడ
కృతకేతరపదాంతతతి పరిష్కారాతి
గంబైన సత్ప్రభావంబుతోడ
నాద బిందు కళాప్రణవ నవనవ విధా
నంబు లీలావిహారంబుతోడ
ప్రణతార్తిహర బహుపరతంత్ర మంత్రయు
క్తంబైన రూపచయంబుతోడ
సర్వసమత సర్వజ్ఞత సర్వగతియుఁ
గలిగి యెఱుఁగ నై యెఱుఁగ రాక తగు నీదు
పాదయుగళిని గన్య కార్పణము సేఁత
కన్న మిన్న పున్నెం బేది ? కాలకంఠ ౫౭

వ. అని ముత్తైదువలచే వివాళి యొసంగించె. నంత దేవగణము నానతిం జేసి దేవదేవుండు వివాహమంగళ పరిష్కారసన్నాహంబు నొందె ౫౮

గజచర్మమయమైన కటివస్త్ర మెనయుచో
రంగుబంగారు వస్త్రంబుఁ దాల్చె
పులితోలు వడ్డాణమును దాల్చ నడుమునఁ
గనకరత్నా ల్నడికట్టుఁ గట్టె

చిట్టు బుస్సాడు నాశీవిషంబుల బోలు
నవరత్నహారముల్ నలువు పఱచె
మంజులారుణ జటామండలంబును గప్ప
మాణిక్యమయమైన మకుట ముంచె
కాటిభస్మంబుఁ దాల్చునంగకములందు
జందనాగరువాసిత చర్చ లందె
అద్రికన్యామణిని బెండ్లి యాడఁ జనుచు
సర్వమాంగల్యకరుఁడైన శంకరుండు

వ. అంత ౬౦

అఖిలాగ మాగమాంతాభిజ్ఞుఁ డైన దే
వగురుండు పౌరోహితగతి నూన
వామదేవ వసిష్ఠ వరమౌని ముఖ్యులు
సామగానసోమసరణి బల్క
కిన్నెరసానులు కిన్నెరల్ గైకొని
పరువంబుఁ గడు నింపు పాటఁ బాడ
రంభాది కాప్సరః ప్రకరంబులు కరంబు
నంద చందా లీన నాట లాడ
తనరు చారు చిరత్నప్రతాన
మయవితానంబునందు సింహాసనమున
సర్వబృందారక మునీంద్ర శైల ఖచర
సేవ్యమానుండగుచు నొగిన్ శివుఁడు మించె ౬౧

వ. అంత

సరగం జారు చిరత్నరత్నమయ భూషాప్రోల్లసద్వైభవా
సుర యై వహ్నివిశుద్ధవస్త్ర పటలీ శోభాయమానాంగియై
సరస స్మేర మనోజ్ఞ వక్త్రరుచి భాస్వత్కాంతితో నొప్పున
గ్గిరిజన్ నైజకుమారి నద్రిపతి రక్తిన్ వేదికన్ జేర్చియున్

బంగరుతోడ రత్నముల భాసురమై సురభూజ పుష్ప రా
జిం గడు మేలి వాసనలఁ జెల్వగు పెండిలి మండపంబు నం
దుంగర మెప్ప భక్తిమెయిఁ దొయ్యలి మేనకతో గిరీంద్రుఁ డో
జం గొమిరెన్ హుతాశనుని సాక్షిగ శంభుని చేత నుంచుచున్

సకలాజాండకటాహభర్త వగు నీజామాతృభావాన నే
నకలంకాత్మలయందు మేటినయి సర్వాజాండమం దొప్పెదన్
సకలామ్నాయనికాయ గేయుఁ డవుభాస్వచ్ఛ్రీచరిత్రుండ వీ
వు కృపన్ నాసుత నియ్యమం గొనుమ శంభూ! పాణిసంపీడనన్

అవి యగ్ని సాక్షి గాఁగన్
దనయం గిరిపతి శివునకుఁ దగ నిడ వేల్పుల్
మను లింక జగము లన్నియు
ఘనసంతోషంబు నొందె గాఢస్ఫూర్తిన్

బంగరు బొమ్మ యై జిలుఁగు వల్వ ధరించి యనంగు తూఁపనన్
రంగు చెలంగి సర్వవిధ రమ్యవిభూషణ భూషితాంగియై
మంగళవస్త్రయుక్త యయి మానుగ నొప్పు గిరీంద్రపుత్రితో
శం గడు మించె మించునను డాలగు శారద నీరదంబనన్

పెండిలి కేఁగుదెంచియు నవేలముదంబును గన్న మౌని మా
ర్తాండులు వేల్పురాయలును రాజదఖండమదంబుతోడ వే
నిండుల్ఁ జేరి రింక నొగి నీశ్వరుఁ డీశ్వరితో సుఖాన మే
ల్మెండగు వెండికొండ-గడిమిన్ రహిఁ జేరియు నుండె వేడ్కమై

ఆ జగజ్జనకులయిన యగజ కభవు
నకుఁ గుమారుండు పుట్టి తారక దనుజవ
రుని సమయఁ జేసి వేల్పులకును జగతికి
నెల్ల నానంద మెంతయు నెనయఁ జేసె ౬౯

లోకమంగళకర శ్లోకము నం దగు
గౌరీపరిణయ కథారీతి యిద్ది
ఇద్దాని భక్తి నాలించు వారుఁ బఠించు
వారు స్మరించు వా ర్పటుశుభమ్ము
ల నఖిలైశ్వర్యంబులను జెంది పుత్ర పౌ
త్రాదులనుం గర మర్థిఁ గాంచి
సకలవిద్యాలాభ సంతుష్టినిం గాంచి
యెల్ల భోగంబుల నెనయఁగలరు
లోకసన్నుత్యమైన సుశ్లోక మెసఁగు
సర్వమంగళమాంగళ్యసరణి నొప్పు
ఇహపరంబుల సార్థక్య మెనయఁ గలరు
పార్వతీపరమేశుల భవ్యకృపను ౭౦

# శివుని ప్రశ్న

వ. ఆవివాహంబు జరిగిన విశేషంబని సూతుం డిట్లనియె ౭౧

పాతాళంబున నుండి స్వర్గభువనంబందుండి నాగామరా
నీతంబౌ నుపదల్ వివాహమున కెన్నన్ వచ్చియున్. భూతలా
నీతంబౌ నుపదల్ చెలంగమిక్కిఁ బ్రశ్నించెం గుబేరున్ హరుం
డాతండున్ శివుఁ జూచి యత్కృతము నొయ్యం బల్కె నీ రీతిగన్

క్రయవిక్రయముల కాగమ
నియతులు వైశ్యు లిట నుంట నెటివస్తువు లే
వియు దొఱకమి నచ్చట నుం
డి యుపద లెవి రాక పోయె నిటలాక్ష! ప్రభూ!! ౭౩

అనవుడు శంకరుండు విని యౌ నవు బేరము గోసురక్షణం
బును గృషి వైశ్యరత్నములు పూనియు వేదశుభప్రకారులై
యనఘ మనోజ్ఞధర్మముల యాచరణన్ భువియందుఁ బొల్చి పై
నను ననుఁ జెంది దానిపయినం గను వారల కన్యకాంబకన్ ౭౪

ఆ మాటన్ విని వైశ్యపాళి మదియందత్యంతమౌ వంత నె
చ్చౌ మాడ్కిం గని శంభు సన్నిధి విడన్ హోయిం గడుం బాపునాఁ
డా మవ్వంబుగ లోకరక్షణకునై కావింప నొఁ ద్యాగ'' మం
చా మాన్యాత్ములకున్ హరుం డనియు నయ్యార్యాళి తోషిల్లగన్

ఇంతకు ముందె యీ విషయ మెంతయుఁ దేఁటఁగ నిర్ణయంబులన్
సాంతముగాఁగ విన్నదె కదా? భువి మీకయి కన్యకాంబ-శ్రీ
కాంతుఁడు నేను గంజజుఁడు నయ్యయి రూపుల నొప్పువార మం
చెంతయుఁ బేర్మి శంభుఁ డన నెంచిరి వైశ్యులు భూమి కేఁగఁగన్.

వ. అట్టి యుద్యమంబుతో వైశ్యు లక్కడ నుండిన బ్రహ్మదేవునకుఁ జింతాక్రాంత స్వాంతులై నమస్కరింపఁగా నజుం డా వైశ్యుల కిట్లు వచియించె ౭౭

మీరిటువంత నొందు నెడ మేలగునే? యలచిత్రకంఠు శా
పారభటీప్రకారసమయంబును దగ్గఱుచుండె గౌతమీ
తీరమునం దొగిన్ మఖము దీర్చెఁ గుమారుఁడటన్ బదెన్మిదే
మారుల నేర్పరించుకొని యుండుఁడి నేను జనింతు భూస్థలిన్*

విశ్వకర్మ పదెన్మిదివీళ్ల మీకుఁ
గాఁగ నిర్మించు నిలయందు ఘన విభవము
తోఁడ నందుండుఁడీరు మీతోడు గాఁగ
భాస్కరుండనై జన్మింతు వసుధ నేను ౭౯

* పద్యము 78—అష్టాదశపట్టణములు. 1. జ్యేష్ఠశైలము (పెనుగొండ), 2. నిరవద్యకము, 3. ఏలాపురము, 4. వీరనారాయణము, 5. విశాలము (విశాఖ పట్టణము). 6. శివపురము, 7. అపంటము, 8. నరసము, 9. ధనదము, 10. ధర్మపురము, 11. జగన్నాథము, 12. కళింగము, 13. పాంచాళము, 14. పాలకుండము, 15. త్రిగుణము, 16. భీమము. 17. ఘంటసాలము, 18. పీఠికాపురము అనునవి.

వ. అని బ్రహ్మయనె నికను ౭౧

అపుడు శంకరుఁ డాసతినట్టు లొసగి
తాను నగరేశుఁడుగ నిలఁదనరి వింధ్య
వాసినిగ గౌరితగఁ బద్మతనయుఁగోన
కమలగా జనార్దనుఁడయి కంజనేత్రుఁ
డజుఁడు భాస్కరుండుగ నొప్ప నలవృతనరె।

అట్లు దైవాజ్ఞగొని నూఱునవుల రెండు
గోత్రముల యర్యులెల్లను గొమరుగ భువి
చెలమి గోకర్ణమున శూలి చెరఁగి గౌత
మీ తటస్థలిఁ గలయూళ్ల మేల్మి మనిరి ౭౨

ఆ బృహద్గిరి ముఖనగరాళి పదియు
నెనిమిదియు విశ్వకర్మచే హృద్యముగను
నిర్మితంబులై శివశివా నీరజాక్ష
పద్మజాబ్రహ్మ భాసురపక్కిఁదనరె

ఆ బృహద్గిరి యందుఁ గన్యాంబ యాది
శక్తి భక్తరక్షణశీల సర్వజనని
యర్యరక్షణదక్ష దివ్యస్మహిమను
మేలిదైవంబుగాఁ బొల్చి మేళ్మి నొసఁగు

వ. అట్లు ౭౩

శ్రీకన్యాపరమేశ్వరీనిలయమై శ్రీ శేందిరార్యేశనా
శక్రప్రోద్భవ వాసమై కరము నర్థిన్ విశ్వకర్మప్రభూ
తాకల్పామల నిర్మితిం దనరి యత్యంతంబుఁ బెన్గొండ భూ
లోకైకాభరణాయమానమయి వెల్గు న్నల్గురా నౌ ననన్ ౭౬

ఆనందకందంబులై యందచందంబు
లెందునం గ్రందైన యిండ్లతోడ
ఆయిండ్లలో నిగమాగమవ్రజతదం
గ తదంతవేత్తృవైశ్యతతితోడ
ఆ వైశ్యతతిచేయు నర్ఘ్యదన్యర్ఘ్యదా
ధిక బహువర్తకాదికము తోడ
ఆవణిగ్భవజోదార సంపత్కృత
దానధర్మోరు విధానములను.
అల్లసత్కారములకుత్సహానము నొసగి
మేటి సత్కథాశ్రవణముల్ మేకొనియును
కలవనెడిమాఁట కలవయి క్రాల దనరు
చుండు నిలకాభరణము పెన్గొండపురము ౭౭

ఆపెనుగొండయుఁ బదు నే
డౌపురలఁ గుబేరుఁ డజుఁడు నభవుఁడవిన తీ
తేపుగ వైశ్యుల్ నేరియుఁ
బ్రాపగ సంపదలతోడఁ బరఁగి రట నొగిన్

శర్వాదికులగు వేల్పుల
ఖర్వ శ్రీఁదొంటిమాఁట గ్రాలంగాఁద
త్పూర్వరముల శ్రీకన్యా
సర్వేశ్వరితోడ వెలయ సౌరయ్యె నటన్ ౮౯

నగరులన విసములేని జ
నగణమగుట నగరులని నాగరులనియున్
దగిరర్యులు నగరేశుఁడ
నఁగఁదత్పూజితుఁడు హరుఁడు నల్వ వెలంగెన్

వ. సాలంకాయనుఁడు వైశ్యులతోనన్న నుడి యిది,
అట్లే సూతుండు మునులకు ననియె ౯౧

## శ్రీ కుసుమశ్రేష్ఠి

ఆపురులందుమిన్నయగునట్టిది శ్రీబృహదద్రి;(పెనుగొండ)సత్పురిం
బ్రాపుగ నెల్ల సంపదల పట్టును ధర్మములెల్ల జేరియున్
రూపును గొన్న యట్లుఁ గడుఁబ్రాపును గన్నటు లొప్పువాఁడు వా
డై పరగంగఁబోవని శుభాంచితుఁడై కుసుమార్యరత్నమున్

శ్రీ ప్రాభాసతగోత్రుం
డై పరఁగె నతండు గోత్రమది సంకేత
శ్రీపరి నుద్వాహకులా (పెండ్లికుల)
ఖ్యాపరనామంబునొందె నర్యులలోన్ ౯౨

వెస మైత్రేయసగోత్రవైశ్యసుకులాబ్ధిన్ రత్నమై పుట్టియున్
గుసుమాంబామణియన్న చాన కడు మే ల్కాల్గొందు సౌజన్యవి
న్యసనప్రాభవమోది తార్యగణ మై యందంబు జందంబునం
దసమానం బధికత్వదూరయను పేరందం దగెం గ్రందుగన్ ౯౩

మంచికొలంబునందుఁ గడుమంచితనంబున కాలవాలమై
మించిన జంటకుం బొడమి - మేల్మికి నగ్గముగాఁదలిర్చి తా
ణించిన యందచందముల నీచెలి యీడు జగానఁ గానఁబో
మంచు జనంబులాడఁ గుసుమాంబ తగెం గుసుమాంబకాస్త్రమై

ఆకుసుమాంబ తండ్రియగు నర్యవరుండు నిజాంగనాయుతుం
డై కడుయోచనం బరిపి యాత్మజునుం గుసుమార్యవర్యునా
శీకసమాక్షినిం బలుప శ్రీకరమైతగునంచు నెంచి య
స్తోకమనోహరంబుగను జొప్పడఁజేసెను బెండ్లి దానికిన్ ౯౪

అవివాహమన్న నావివాహవివాహ
ము గన నట్టివా రదిగను నెడల
నల్లలోటు దీఱునను నంత సంతోష
కరముగఁదగె జనతకరముఁబొగడ

నానాభూషణభూషితాంగులగుచు న్నాశీకపత్రాక్షు లెం
తేనిన్ "మించులుఁ బంపవన్నె చిలుకల్ దీపించు లీలం గడున్
జానుం జెంద వివాహమంటప మ దందం బొందె సంచారి దీ
పానీకచ్ఛల తద్విభూషణమణి పాంచద్రుచిస్ఫీత మై ౯౬

ఘనతపో విన్యాస గణ్యతన్ మును లట్టి
విప్రు లాశీర్వాదవితతి నీయ
సకలశాస్త్ర విశారద కమనీయాత్ములౌ
పండితుల్ ధర్మం బుపన్యసింప
హరిదాస సుకవి గాయక నికాయంబు త
త్తత్ప్రదర్శనజ మోదంబుఁ గొల్ప
ఇష్ట మృష్టాన్నసంతుష్టి పుష్టిం జెంది
బంధుమిత్రాళి సంబరమునొంద
ఆశలందలి యర్థుల యాశలెల్ల
నిండి వేడ్క సూక్తులు దెసల్ నిండి వైశ్య
కీర్తి కల్పవృక్షము పండి కెరల మిగుల
కుసుమ కుసుమాంబికా వివాహసుఖ మెసఁగె ౯౦

కైలాసంబును మేరువుంగదలికం గాంచెం దనూజేంద్రుడున్
పాలాక్షుండు గదల్ప వి ల్లగుఁగొనుటన్నా విందు మ ట్లొత్తఁదా
నాళిం దత్కుసుమార్యు పెండ్లి రహిసీయన్ దన్మహత్వానఁ ద
మ్మోలిన్ "ఖ"ర్చొనరింతురో యనఁగనౌ నుల్లాన జంకుం గనెన్

అట రాచబాటల నట్టు లుంచుడు సందు
గూడ నలంకృతిం గొనబు మించు
అధికారి జననికాయము మాఁట యటు లుంచఁ
దెల్ల పేఁదలు సొంపు పెనసి రెంతొ
స్వర్ణరజితమయ పాత్రముల్ పెండ్లింట
నే కాక తగె నెల్ల యిండ్లయందు

తద్వివాహాగతతద్జ్ఞసూక్తులు వివా
హమునన కా కొప్పె నఖిలపురిని
జిలుఁగు వలువల జిగిజిగల్-వెలఁగు నగల
ధగధగల్ మణికాంతుల నిగనిగలును
మంచి గంధాల బుగబుగల్ మించునట్టి
అల్లపెండ్లి సకలసంపదా౽౽కరంబు ౧౦౦

పాతివ్రత్యముతోడఁ గాంతమనఁగా బర్వున్ భవిష్యత్తనం
దా తీ తొప్పఁగనే వరుండు సతియందాదృత్యుపేతంబుగాఁ
జేత మ్మూనుట దార్ఢ్య మొంద నట'' నిస్సీ! యిస్సీ! నాఁజేయు వే
శ్యాతత్యద్భుత నాట్యవార్తలెవి లేవయ్యెన్ విటుల్ కుందఁగన్

వందలుగాదు-వేలకును వంటలు పాచక కోటి వండఁగాఁ
గ్రందుగ నెల్లవారలును-గడ్పులు నిండఁగ నారగించి-యే
సందునులేక పొట్టలును-జందెములం బిగియింపు నంద వే
లందగ ''బ్రేవు''మంచు మిగులం గను బ్రేఁపులఁ బ్రేఁపి రందునన్

'నీతలకన్న లడ్డూ తక్కువా?'' నా-''జి
లేబి నీ మొగమంత'' లెక్కగనర!
మండెగ చిటి చాప మాదిరిరా! యద్ది
పాలలోఁ బిసకరా! పాయసమగు
చల్విమడతవోలెఁ జనురా! పదరపేణి
క్షీరంబులో బట్టచీలి క లగు

"సేమ్యా" పసిఁడి తీఁగ చెలువురా! నీ యిల్లు
బంగారుఁగాఁ-జూడు పాయసంబు
అప్పడాల్ వడెంబులు-వడల్-పప్పు ధప్ప
ళములు-బూందీ-పకోడీలు-రసపుఁగాయ
లూరుఁగాయ_లూర్పిండులుఁగూర గాయ
లోహో! "నా నల్లి భుక్తుల నొప్పె నుదులు ౧౦౩

కుసుమాంబా కుసుమశ్రే
ష్ఠ్యసమానాధిక్య దూరమగుకళ్యాణం
బు సలుపఁబడెఁ దద్దీక్షా
వెస వేల్పులుఁ గూడఁ గాంచి వింతం జెందన్

వ. ఆ వివాహానంతరం బవ్వధూవరులు గృహప్రవేశంబు గావించి పెద్దలకు నొద్దికగాను-చిన్నలకు మిన్నలుగాను మెలంగుచుండి-రంత ౧౦౪

ఆ యింటం దలమానికంబు కుసుమాఖ్యశ్రేష్ఠుఁడొ ప్పొందు బల్
హోయిన్ శ్రీకుసుమాంబికామణియు నిల్లాలై సుకంఠీయ-నా
మ్నాయ ప్రస్తుత పద్ధతిం దనరుచున్-మర్యాదలన్ ధుర్యుఁడై
శ్రీయుక్తాత్మక కన్యకాంబ పదముల్ సేవించు సద్భక్తుఁడై

ఆ కుసుమాఖ్య వైశ్యునకు నర్మిలి ధర్మముఁ గర్మతత్వమెం
తో కమనీయమై తనరు నుగ్మలి యాకుసుమాంబయన్న నా
శీకరదళాక్షి సర్వవిధ లీలల హేలల భర్తసేవకుం
బ్రాకయి యొప్పు నామె నికరంబగు దం బగు రూపరేఖకున్

శ్రీకమనీయ వక్త్రము కుశేశయవైరిని గేరుచుండు-నా
శీకదళంబులం గనులు లెక్కను బెట్టకయుండ-వల్లికన్
పోకను బాహునాళములు వేడ్కనుజల్ప-బిలేశయంబు దం
బైకవు నొప్ప నక్కుసుమమాతరుణీమణి మించె మించుగన్

రూపున కేమి? రూపు నను రూపముగాఁ దగునట్టి సద్గుణ
శ్రీపటుమూర్తి యై తనరి చేడెలకుం దలమానికంబనం
బ్రాపుగఁ బేరునొంది యల రామ నిరామయభాగ్యసీమ యై
యేపుగ భర్తృ భక్తికిని నిక్క యనం దగె నల్ల గీమునన్

వేద శాస్త్ర పురాణవిన్యాస-సంగీత
సాహిత్య సౌహిత్య సరణిఁ దెలిసి
అంచితాచారదీవ్యద్దేవతార్చనా
దికముల నెప్పుడుం దీప్తిఁ గాంచి
గురుజన గౌరవస్ఫురణంబునుం బిన్న
లందు నాదరణంబు నందమొంది
అతిథి మర్యాదయు-నాశ్రిత రక్షణం
బును నియమంబులై-పొల్పుమిగిలి
అన్నిటికి మిన్న-శాంతి-దయానుశీల
సత్య-వినయ-క్షమాదిక సద్గుణముల
కిక్క యిల్లాలగుచుఁ గరం బింపు గొల్పె
నైహిక స్వర్గమగుఁ గుసుమాఖ్యునిల్లు ౧౧౦

"ఓం భూర్భువస్సువరో" మను శారిక
"అతిథి దేవో భవ" యను శుకములు
"శ్రీకన్యకాధీశ్వరి! నమ" యనా బిడ్డలు
"బ్రహ్మార్పణం" బను వైశ్యతతియు
తగ—"నోం నమశ్శివాయ గురవే-యోన్నమో
నారాయణాయ" యన్ భక్తజనులు
"పతికి వేల్పే?" రని పల్కెడి సతులును
స్వామిభక్తిగల సేవకచయంబు

గల్గి-యపరకైలాసంబుగాఁ దలిర్చి
యెల్ల వేళలఁ గుసుమార్య నిల్లు సత్య
మిహపరముల సాధన హృద్యతఁ సజ్జ
నంబు పాలిధనంబయి దంబుమించి ౧౧౧

కలవా వణిక్కు నగారమందే కాదు
కల—వా పురాలనే కలవు కలవు
లేమియాబేరిదా గేమునందే కాదు
లేమి—ఆయూళ్లనే లేమిలేమి
"సున్న" ను టల్ల శ్రేష్ఠుని యింటనే కాదు
సున్న—ఆపురులనే సున్న సున్న
"నాస్తి" మాఁటా యర్య నాలయానన కాదు
నాస్తి-యా వీళ్లనే నాస్తి నాస్తి

స్వస్తి యెల్లరికిం దగి—శిస్తుగల్గి
యెల్లఁ గోకొల్లగా నున్న-యల్ల కుసుమ
మందిరమునఁగూడ శశిబింబమున మచ్చు
వోలె నల జంట కొాక పంత వొానరె నెదల ౧౧౨

వ. ఆ దంపతు లెంతయుఁ గాలంబుగా నంతుం బొంతును లేని యానందంబుతో నుండి—రయినను సంతానంబు లేమింజేసి వారెంతయుఁ జింతాదంతురి తాంతరంగులై ౧౧౩

కోటుల కొద్ది ద్రవ్యమది "కు" య్యని గీమున మూలమూలలం
బాటిగ మూల్గుచుండినను-బాపలయాఁటలుఁ బాఁటలుండకే
నాఁటికిఁ గాని సౌఖ్య మను-నట్టిది వట్టిదె యల్ల గేస్తు లా
నాటకశాల నాఁడిన జనంబుల డంబు చెలంగు వారె సూ!! ౧౧౪

# పుత్త్రికామేష్టియాగము

వ. అని దంపతులు తమలోఁ దాము వంతనొంది ౧౧౫

తమకోసం బవతార మొందిన యజున్ ధన్యాత్ము బౌరోహిత
క్రమునిన్-భాస్కరుఁ జేరి-నైజమగు గోత్రంబుౘ ప్రభాతర్షికం
బుమ-ఉద్వాహకు లాభిసంజ్ఞ నని కేల్మోడ్పునఁగా-దేశికుం
డమలప్రీతి చెలంగ-భాస్కరుఁ డతం డత్యంతముం బూనియున్

వారిఁ గూర్చుండఁజేసి యవ్వారి పేర్మి
వారు వచ్చిన కతమును బల్కుఁ-డనఁగ
వా రవారిచింత గదరు పల్కులఁ బలి
కిరి "నిజాపత్యహీనత కీ" దటంచు

వ. అంత ౧౧౮

తీఱును దానిని౯ వినియు-దేశికుఁడాతఁడు భాస్కరుండు త
ద్ధరుని వైశ్య-సద్గుణి సతీమణినిం గని పల్కె నెమ్మది౯
మీర లొకింత చింతయును-మేకొన జేయకుఁడయ్య నే
తీఱు నపత్య హీనతను దీర్చు నుపాయము నేను బల్కెదన్

తొలిని దశరథుఁ డనపత్యుఁడులలి మఖముఁ
బుత్రి కామేష్టిఁగావించి-పుత్త్రిలనలుఁ
గురిఁ గనె-న దీవు నలిపినఁబొరి నొకసుత
నొకసుతుం గాంతు వందున నొనరుపు మది

అంచుభాస్కరుఁడు గురువరుఁ డాఁడినఁ-గుసుముండు తా
నంచితప్రమోదమున మఖాచరణకు వస్తువుల్
కొంచ కొంగిని దేఱఁ బంచి- కోర్కె నల మఖంబు గా
వించె ఋత్విక్కాళి సభ్య లెల్ల మేలుమే లనగా. ౧౨౧

భాస్కరునకు నధ్వర్యుత పరఁగ-నింద్ర
ముఖ్యులయిన బృందారకుల్ మొగి హవిస్సు

నొంది-రవనీసురుల్ సామమోలిఁబాఁడి
రింక శాస్త్రచర్చలను గావించి రెలమి

వెసను దేవభూదేవ తృప్తిగ నటులయి
నట్టి మఖమున శంకరుఁ డాత్మనలరి
యుం బ్రదక్షిణార్చు ల్దగ నొప్పు శిఖిని
బ్రోత్సహింప-నవ్వహ్ని యుప్పొంగి యప్డు ౧-౨౩

బంగారంబును మించు కాంతులను బర్వంజేయుచున్-దిక్కులన్
రంగారన్-మఖవేదికాంతరమునన్ గన్పట్టి యంతన్ గరం
బుం గారుణ్య విలాసుఁ డగ్ని చరు* సంపూర్ణంబు గుంభంబు నొం
డుం గో మొప్పఁగ వైశ్యమౌళి కిడియున్ దోడ్తోఁ జనెన్ మాయమై

వ. అంత ౧-౨౪

ఆభాస్కరగురుఁ డాదృతి
శోభఁ జరు వదియొసఁగెను గుసుమునకు-నిం కా
ధీవరుసతికిం గుసుముఁడు
బ్రాభవమునఁ జేసె దానపటలిని నపుడున్

ఆ గో హిరణ్యదానము
లా గురుదేవార్చనములు-నా ధర్మంబుల్
లాగది కనవలెనే-కా
నీ-గణియింపంగ నేరికేనిఁ దరంబే ?" ౧-౨౫

* చరువు—హోమార్థమయిన యన్నాదికము.

ధనహీనుల్ ధనమొంది-రే పొలమునుం దైవాఱకల్లాడువా
రు నొగిన్ భూములనొంది-రింకను గడుం బ్రోల్లాసయుగ్భక్తితో
ప్పునెటిన్ క్షీరదధి ప్రతాన ముదధిం బోలెఁ-విభూషాంబరా
ద్యనిదానంబగు దాన మిద్ధి యగునింతా? నాఁ దరంబౌ నొకో?

# శ్రీ వాసవకన్యావతార విరూపాక్ష జననష్టపము

ఆ యాగాంతమునందు న మ్మెయిని దానాదుల్ విశేషంబుగా
నా యార్యుం డొనరించి యెల్లరికి నీయం జెల్లె సంతోష మా
పై యాగంపు ఫలంబుగాఁగఁ గుసుమాంబాదేవి గర్భంబు నా
ప్యాయంబౌ గతిఁ దాల్చె దేజ మది యత్యాకర్షకంబై తగన్

మగఁడున్ బందుగులున్ శి
ష్టగణంబు ముదంబునొంద - సద్దై్వైశ్వవరుం
డగు కుసుమదేవి కుసుమాం
బ గర్భమునుదాల్చెఁ బటుకుభ శ్రీ నిండన్ ౧౩౦

# శ్రీ వాసవీ విరూపాక్ష జననములు

వ. అంత నాయమ్మ గర్భంబు క్రమక్రమంబుగా శుక్లపక్ష
క్షపాకరబింబింబు చందంబుగా నెల్లవారికి నానందకందంబుగా
నభివృద్ధి నొంది—నెలలునిండి— ౧౩౧

వైశాఖమునఁ బునర్వసుభంబునఁ శుద్ధ
దశమి - భార్గవవాసర శుభదినము
శుభమౌ గ్రహంబులు సొరిది నుచ్చను నుండఁ—
దీఱ శుభగ్రహాధిష్ఠితముగ
తనర శుభగ్రహత్రయ దృష్టి తగుచుండ—
శుభలగ్నమున నొక్క సుతయు—నొక్క
సుతుఁడు జన్మించి—రా సుతుఁ డా శశి దివా
కరము నెసఁగు వంశకరుఁ డగుచును
ఇరువురివలన నతుల శుద్ధేద్ధకీర్తి
సుప్రకాశ మర్యులకును జొప్పడునని
కరము మౌహూర్తికుఁడు జాతకమ్ము వ్రాసె
సకల సజ్జన సంతోష సరణి గాఁగ ౧౩౨

## విరూపాక్షుఁడు

ప్రభుఁడు విరూపాక్ష కృపం
బ్రభవించెంగానఁ గుసుమబాలుఁగ దివ్య
త్ప్రభులు విరూపాక్షుండని
విభవాత్మక సంజ్ఞ నతఁడు ప్రిదులంగ పిలఁగ ౧౩౩

# శ్రీ వాసవి - (కీర్తికన్య)

వాసవ వసుప్రసాదంబు పరగి పుట్టు
కతనఁ గీర్తికరి యగుమఁ గ్రాలుకతన
కన్యకకు నామెకుం బేరు కరము దనరె
"వాసవియుఁ గీర్తికన్య నా వసుధయందు ౧౩౪

ఆ యన్నయుఁ జెల్లెలు నా
ప్యాయనముగ వృద్ధి నంది రందఱు మెచ్చన్
హాయిగ జననీ జనకుల
కేయంత కొఱంత లేని యింపు చెలంగన్ ౧౩౫

చాలఁ బేర్మి గర్భ ద్వాదశమున బాలు
న కుపనీతి విరూపాక్షునకుఁ జెలంగె
పరగ భాస్కరుని యుపదేశమునఁ దండ్రి
జరప నా కుఱ్ఱ డెంతయు-సౌరునొంది ౧౩౬

భాస్కరాచార్య సన్నిధిం బరఁగఁ బూనె
వేదముఖ్యముల్ చౌషష్టివిద్యల నొగి
నేర్వ నవ్విరూపాక్షుండు నెఱిఁ ద్వరను స
మర్మకముగ వానిం జెందె మాన్యులెన్న ౧౩౭

కీర్తియును సర్వవైదుష్య మూర్తి యగుచు
తొగ కనుల కాంతి మైఁ జాయ-మొగము డాలు

ఈడులేనియందముఁ జంద మెనసియుండె
అల్ల వాసవీకన్య. ధన్యాతిధన్య ౧౩౮

అని సాలంకాయనుఁ డ
ర్యనికాయముఁగాంచి యింక ననె వైశ్య లోసం
గిన శాపాన నిల భవములఁ
గనె రాజై చిత్రకంఠగంధర్వుండుఁ ౧౩౯

ఆగంధర్వుఁడు చిత్రకంఠుఁడటు లర్యశ్రేణి శాపాన భూ
భాగంబందును జంద్రవంశమునఁ దా బర్వెన్ శశాంకాన్వయ
శ్రీగణ్యత్వము నెట్టివారికిని వర్ణింపం దరంబౌనె? నా
నా గీర్వాణ మునీంద్ర బృందవినుతిం దైవారు నవ్వంశమున్

రాజసూయాధ్వరార్థము కుబేరుం బోరి
ధనమును దెచ్చిన ఘనబలుండు
కాలకేయ నివాచకవచుల నోర్చియిం
ద్రుని కింపుఁగూర్చిన రుంద్రయశుఁడు.
ఏకతంబున దరి కేతెంచు నూర్వశి
నెనయక యంపు జితేంద్రియుండు
కెరాతవేషుఁడౌ కాలకంఠుని దన్పి
పాశుపతము గొన్న బాహుశాలి
సర్వలోకగురుఁడు కృష్ణుసారథిత్వ
మునను గౌరవుల నని గెల్చిన యజేయుఁ
డయినయర్జునుఁ డభిమన్యునాత్మజాతుఁ
గాఁగఁ గనె మహాశౌర్య లోకైక మాన్య ౧౪౦

చెలఁగి యభిమన్యునకుఁ బరీక్షిత్తనియెడి
కొడుకు కుదురుమిడుకుల పాలి కులిశమూర్తి
పాపచయ సమవర్తి యపాపుఁ డఖిల
ధర్మవేత్త సర్వదిగంత ధవళయశుఁడు ౧౪౨

ఆపరీక్షిత్తుని తనూజుఁడై జనించె
ను జనమేజయుండను పేరు సుజనహితుఁడు
భారతము నాలకించిన భవ్యుఁడతని
కిని శతానీకుఁడను సుతుం డొనరె నిలను

ఆ శతానీకునకు క్షేముఁ డాత్మజుండు
అతనికి విజయార్కు డొదవె; నతని సుతుఁడు
విష్ణువర్ధనుఁ డతఁడు తా వెసను దొల్లిఁ
గ్రాలె గంధర్వుఁడై చిత్రకంఠుఁ డనఁగ ౧౪౪

వైశ్య లిడ్డశాపంబును బట్టి చిత్ర
కంఠగంధర్వుఁ డారీతి క్షమను విష్ణు
వర్ధనుఁడన జన్మించి సద్వైదుషీ సు
వేత్తృతం దగె వేదశాస్త్రోత్త మదిని.

అతడు ప్రాజ్యరాజ్యం బొంది స్యందనగజ
హయపదాతి వర్గములతో నఖిలదిశల
యందు విజయంబు గావింప నాత్మనెంచి
వెసఁ దనయు రాజరాజేంద్రుఁ బిల్వఁబంచి ౧౪౬

పద్మశైలాఖ్యగల తన పట్టణమును
సుతునధీనంబుఁ గావించి - యతని కడను
దగిన సైన్యంబు రక్షకత్వమున నుంచి
తాను దేశదేశ విజయార్థముగఁ దరలె ౧౪౩

అంగ వంగ కళింగ సింహళముఖపద
ముల జయించి తుండీరమండల ముఖ యమ
దిక్ప్రదేశ రాజన్యు లీ తేజమునకుఁ
జెలిమి నొందఁగ నెంతయు నెలమి నొంది

పారశీక - కాంభోజ - బర్బర నిషాద
ముఖ్య పశ్చిమాశాపతుల్ పౌనరఁ గోస
లాది కోత్తర భూపతు లతని ధాటి
కోడి జోహార్ల నర్పించి రొడువుఁ దక్క ౧౪౭

ఇట్లు దేశ దేశవిజయ హిండితుఁ డయి
విష్ణు వర్ధన భూపతి వెసఁ దదీయ
ధనకనక వస్తు వాహనతతి విశేష
ముల నుపార్జించి విభవ సంపూర్ణుఁడగుచు

వైశ్యతతిచేఁ బరిష్కారపటిమ నొంది
కుసుమగు ప్రపాలన సుఖాఽకుంఠిత మయి
నట్టిపట్టణ రాజమై యలరు జ్యేష్ఠ
శైలనగరంబుఁ గాంచె నుత్సాహమొంది ౧౫౧

పరమ పావన చరితులై పరఁగుచున్న
తత్పురాధికారులకును దనదు రాక
రాక వలెనుండు ననువార్త వీఁక నంప
వార లానంద తుందిల భావులగుచు ౧౫౨

వ. విష్ణువర్ధను నాగమనము నాఁగమనము మనములందు సంతసంబు నొందవలయునని వైశ్యులెల్లం దమలోనఁ గలియఁ బల్కుకొని - తద్గౌరవ సన్నాహంబులను గావించు చుండిరని సాలంకాయన మునీంద్రుండు వైశ్యులకు వినిచిన క్రమంబున సూతమహర్షీంద్రుండు శౌనకాది మహామునుల కనినంత వా రవ్వలి కథావిధానంబు విన వలతుమనిరి- ౧౫౩

## ఆశ్వాసాంత పద్యములు

లోకైక స్తవనార్హ తావక శుభశ్లోకంబు నా తల్లిరో!
శ్రీకన్యాంబికరో! వచించుటది యుర్విన్ సజ్జనానందకం
దాకారంబు ప్రబంధరత్నమయి హార్వొందన్ వలెన్ విన్న వా
రేకాకార శుభంబు లందవలె హాయిం గాంచుచు న్నిత్యమున్.

వయసెచ్చెన్ మదిరెచ్చెఁ గొంప కలతల్ పర్వం గడున్‌దల్లి! వి
ర్ణయభావంబె యభావమయ్యెఁ గర మర్థం బర్థినై కోరు బా
ధ యి దేనాటికి నన్నువీడునొ ? భవత్కారుణ్య మే కొంతొ యు
న్నమెడన్ దుఃఖపరంపరల్ సురిగి కన్యాంబా! సుఖింతుం గడున్

ఆంగిరస గోత్రుడు నికవైశ్యకులుడయిన
దోమవంశ్యుండు వేంకట స్వామిగుప్త
అమల గోవిందసుతుఁడు వ్రాయనయినట్టి
కన్యకాపురాణ పద్యకావ్యమందు
ఇద్దినాల్గవ యాశ్వాస మిందుముఖిరో !
గణ్యకరుణావలంబ ! శ్రీ కన్యకాంబ ! ! ౧౫౬

ఇయ్యది శ్రీతుంగభద్రానదీ తీరవిరాజమాన కరూల్నగరనివాసి-నిరంతర - శ్రీమద్వేంకటేశ్వర చరణారవింద మిళిందాయమాన మానస వైశ్యర త్నాంగీరస గోత్రపవిత్ర - ధర్మపత్నికోట మాంబికా సమేత శ్రీదోమా గోవిందార్యవర్య సుతజ్యేష్ఠుండును శ్రీరామచంద్ర కృపాకటాక్ష వీక్షణాసాది తాంధ్ర గీర్వాణ కవిత్వ కృతపరిచయుండును శ్రీ బ్రహ్మవైవర్తమహాపురాణ శ్రీ పర కాలవిలాస, శ్రీ బ్రహ్మేశ్వరపురాణ, శ్రీ గౌతమక్షేత్ర మాహాత్మ్య, శ్రీ విష్ణుభక్తి, ప్రేమాభిరామ, శ్రీ ముకుందమాలా, శ్రీ గంగాలహరీ, శ్రీ కనకధారాస్తవ, చంద్రకళాసుదర్శన, దూతంగ దాత్మబోధ, సుజనత్రయ, శ్రీ సీతారామకల్యాణ, శ్రీ మార్కండేయవిలాస, శ్రీ సిరియాలచరిత్ర, శ్రీ నృసింహో ధ్వరీయ, శ్రీ మదభినవరామదాస, శ్రీ మదభినవప్రహ్లాదచరిత్ర, శ్రీరోహిదాస, శ్రీ గిరిధరలాలచరిత్ర, సుభాగ్యశతక, శ్రీ కన్యకా పరమేశ్వరీశతక, శ్రీ వీరరాఘవశతక, శ్రీ మహాత్మాగాంధీ శతక, శ్రీ తిలకశతక, దీనకల్పద్రుమాద్యనేక, భాషాంత

రీకరణ, ప్రబంధ, నాటక, యక్షగాన, శతక, ఖండకా, వ్యోపన్యాసకర్తయు - నానాదేశరసికప్రదత్త, శ్రీ మదాంధ్ర విద్యావాచస్పతి, సాహిత్యసరస్వతి, విద్యావినోద, కవిభూషణ, విద్యాసాగ, రాశుకవితల్లజ, కవిర, త్నాశుకవితాధురీ, ణావధాని పంచానన, కవికుంజ, రావధానపితామహ - కవిచక్రవర్తిత్యనే కాదరాభిదానాభి రాముండును నయిన శ్రీ దోమావేంకటస్వామి గుప్తచేఁ బ్రణీతంబయిన శ్రీ కన్యకాపురాణ పద్యకావ్యంబు నందుఁ జతుర్థాశ్వాసంబు

# పంచమాశ్వాసము

శ్రీ కన్యాపరమేశ్వరి!
లోకైకపవిత్రి! దీనలోకా వనిరో!
నీకు న్నాపై దయరా
దా! కర మీ భవజలనిధి దాటింపగఁదే!! ౧

తల్లీ! దీనజనామర
వల్లీ! కృపఁ జల్లి నన్నువంటి యనదఁ గో
కొల్ల సుకం బిడి ప్రోవుమి
యుల్లమ్మున విన్ను నెంతు నొదికపు వెల్లీ!!

వ. అవధరింపు మనంతర కథాప్రకారంబు. సాలంకా
యన మునిచంద్రముండు వైశ్యుల కాన తిచ్చిన చందంబున
సూతుం డత్యంత పూతుండు శౌనకాది మహర్షుల కిట్లు వచించె

శ్రీ విష్ణువర్ధనుఁడు భూ
మీవిభుఁ డేతెంచుఁ దమదు మేలి పురి కటం
చా వైశ్యులు విని మిక్కిలి
భావంబున సంతసించి పలుకుకొని రిటుల్

రాజకు లాలంకారుఁడు
రాజమనోరంజకుఁ డరిరాజవిజయసూ
త్రేజుండు విష్ణువర్ధన
రా జేతెంచెడిని సుకృతరాజి మనదిగా!! ౨

అని యా జ్యేష్ఠగిరిపురిన్
దనరెడు నూరుభవు లెల్లఁ దగు శ్రద్ధమెయిన్
బొనరించి రలంకారము
ఘనముగఁ బురి నమరులు నది గనియున్ మెచ్చన్ ౬

## నగరాలంకారము

ఊరియం దెల్ల బాజారులందుం గస్తు
రి కలయంపిం జల్లిరి కడు రహిని
ఎల్ల గేహముల ముంగిళ్లను ముత్యాల
ముగ్గులు దీర్చిరి మురువు మెఱయ
పచ్చల తోరణాల్ అచ్చల వీథుల
నిండ్ల వాఁకిండ్లఁ గట్టింపఁ బడియె
రంగారు బంగారు రతనాలు మగఱాలు
నంగళ్లలో రాసు లమరుపఁబడె
గోపురం బంటెడి గోపురంబుల్ పైఁడి
కుండల జెండాల గోటుమించె
రంగు రంగుల చిలుకల రాణ మెఱయఁ
బౌర కాంత లలంకార వస్త్రకలిత
లగుచు మేఁడలపై నెక్కి యక్షతలను
మొగిని గొని నిరీక్షించిరి భూపు రాక ౭

ఘూపు రాక రాకం బోలి పొనరగా మ
నశ్చకోరిక లద్భుతానంద మొంద
నగరజను లెల్ల మనము లనంతముదము
నఁ దగ రాజునకున్ వేడ్క నెదురు సనిరి ౯

నానారత్న సువర్ణ తోరణములంచ ద్రంగవల్లీచయం
బానందంబుగ నెల్ల వీథుల కలంకారంబు సంధింపగా
మేనాలున్ గరులున్ హయంబులు భటుల్ మేల్మిం దగన్ బారులై
శ్రీ నల్వారఁగ నప్డు రాజున కెదు ర్వేవెళ్లి రా వైశ్యులున్

జెండా జెండానునై జ శ్రితచయ వరద
శ్రీ కకన్యాంబ రూపం
బుండం దండం దులా సీరాలోనరు కొ
లత పాత్రోచ్ఛయం బింక గోవుల్
మెం డౌ బొమ్మల్గ నొప్పన్ మిగులఁ జెలువుగా
మించు మించుల్గఁ గాంతా
కాండంబుల్ వస్త్రోత్కరముఁ గరముగా
గ్రాలఁగాఁ గ్రేవలందు
ద్దండం బంబారులన్ భద్రగజ తతితగన్
దన్నృ పార్థంబు రాగన్ ౧౦

ఆరాజేంద్రుఁడు విష్ణువర్ధనుఁడు జేష్ఠాహార్య పూర్వార్యమా
తీతొప్పం దటి యంగఁద త్స్ఫురవణి గ్ధిరుల్ పసంద్దై యెదు
ర్వేరంబోయి రథంగ మంగళ మహాశ్రీఁ దూర్య వాద్యంబులన్

శ్రీ మెఱయఁగానల నరేంద్రవరుఁడా పురిఁ బొ
రిం దఱియఁగా నపుడు మేల్మిన్
భూమమగు సొమ్ములును బట్టములును దాల్చియును
బొల్పు మెఱయం బుర మృగాక్షుల్
వేమొగిని నివాళులిడ విజ్ఞులగు వైశ్యులట
బేర్మి నృపుఁ గొంచరిగి తీఱు
ద్దామమగు సౌధమునఁ దద్ద విడియించి సము
దారసభఁ జేర్చిరి ముదానన్ ౧౨

వేదవేదాంగ విద్యోదారులౌ బ్రహ్మ
వేత్తలు పేర్మి దీవెనల నీయ
లలిత కవిత్వ విలాసులౌ సుకవులు
సరసకవిత్వ ప్రశంస సల్ప
వేద శాస్త్ర పురాణ విషయముల్ తద్జ్ఞులు
ప్రామాణికముగా నుపన్యసింప
నగరాధినాయకుల్ నలువైన పలువితం
బుల కానుకలఁగొని పొల్పుగ నిడ
ఎల్ల గౌరవంబుల నొంది యింపుమెఱసి
విష్ణువర్ధన భూపతి వెలయఁ గొలువు
దీఱియుండె మహాగిరి దివ్యవిభవ
యుతపురిని నెల్లరకుఁ గడుఁ గుతుక మెసగ ౧౩

వ. అంత నప్పురీ వైశ్యులందు నాయకమణియై
శ్రీకన్యకాపరమేశ్వరీ దివ్యచరణారవిందమిళిందాయమాన మాన

సుండైన కుసుమగుప్తుండు భార్యాసమేతుండై యరుగుదెంచి, యారాజశేఖరునకు నమస్కారంబుగాఁ గానుకలొసంగి తమ యిలవేల్పును, గులదైవతంబును, దేవతావతంసంబును నయిన శ్రీకన్యకాపరమేశ్వరి యొక్క పరమపావనంబయిన దేవాగారంబును సద్వైభవోదారంబును "సందర్శింప" రండన నపుడు భూపాలుం డందుల కందంబొందు డెందంబుతో నియ్యకొనియె నంత— ౧౪

ఇరు ప్రక్కలందును నురురీతి సరదారు
లరుదారఁగా బరాబరులు సేయ
కోమలీయుతుఁడైన కుసుమగుప్తుని సుప్ర
ముఖత గోమటులెల్ల ముందునడువ
బ్రహ్మవేత్తలయిన వైశ్యరత్నంబులు
స్వస్తివచనములఁ బల్కుచుండ
భైరవ భేరికా భాంకారచయ దక్కి
కాహళదుక్కారతుల్ మ్రోయుచుండ

ఇకను నెన్నొతూర్యరవంబు లెసగుచుండ
నేనుగంబారిపైన వసించి కరము
నెలమి శ్రీకన్యకాపరమేశ్వరీని
లయమునకు వచ్చె భూపు డుల్లాసియగుచు

వ. అయ్యవసరంబున ౧౬

పారాణికాలికిఁ బామకొనెడు నొక
వనిత పాముకొనకే పాఱివచ్చి
తలదువ్వుకొను నొక తరుణి సగము దువ్వి
నట్టి శిరముతోనె యరుగుదెంచి
రతనాలఁగ్రుచ్చెడి రామ యొకర్తి య
ద్దండవీడి వడి నిద్దండఁజేరి
పువ్వులన్ హారానఁ బూనుచు నొక లేమ
యా గొడవను వీగి యేఁగుఁదెంచి

ఇట్టులప్పురి భామినులెల్లనింగి
దాకుమేడలఁ గిటికీలఁ దనరఁజేరి
యాకసంబునఁ దారక లట్లు మెఱసి
కాంచి రారాజచంద్రు నుదంచితముగ ౧౭

కలువకంటులచూపుల కలువపూల
మాలికలు నివాళులుగ నమ్మానవపతి
యట్లు మన్ననఁ గనుచు దేవాలయంబుఁ
జేరె నగరంబు వా రెల్ల "జే" యనంగ

నూటరెండు గోత్రంబుల నూలుకొనిన
వైశ్యచయము నార్యాణులుఁ బదియు రెండు
గోత్రముల వైశ్యులును నష్టఁ గుతుకమెసఁగ
రాజునకు ముందు నడిచిరి రాణమెఱయ ౧౯

అటుఁజను వారెల్లరు ను
త్కటను శ్రీకన్యకాంబికాగేహంబున్
బటువిభవమునం జేరియు
నట గర్భగుడిం దఱిసిరి యర్యులు నృపుతోన్ ౨౦

# శ్రీ కన్యకాపరమేశ్వరీ సందర్శనము

నానారత్నమణీ సువర్ణకలితా నంతక్రియా భాసమా
నానూనామల శోభతో నిహపరోదార ప్రమోదప్రద
శ్రీనల్వారుచు సూర్యచంద్రురుచిం జెల్వొందు శ్రీ కన్యకాం
బానవ్యాలయ గర్భగేహమును వారడ్డుం దగన్ జూడగన్

మాంగల్యంబున కాలవాల మల యంబాగేహ మట్లుర్వి త
న్వంగీనాథుని వాని నర్యులటు లొయ్యం జేర్చినంతన్ లస
ద్భృంగీ సంగతిఁ దూర్యవాద్యముల నాదంబుల్ సమైక్యంబుగా
నింగిం దాకె నభస్థ్సదేవతల నెంతేఁ బిల్చుచు న్నట్లుగన్ ౨౨

అటు దేవస్థలి జేరినట్టి శశివంశాలంక్రియాభూతుఁడౌ
పటుభూమీపతి కాంబగజ్జననిదౌ ప్రాంచన్మహోవైభవో
త్కటతం గూర్చి యభంగ భంగిని వణిగ్రత్నంబు నత్యంతవి
స్ఫుటరీతిన్ వచియింప సాఁగి రతుల ప్రోల్లాసకృద్వైఖరిన్

ఈ కన్యకాంబయే రాకేందు చంద్రికా
డంబర కరుణావలంబచరిత
ఈ కన్యకాంబయే యిందిందిరీభవ
ద్వృందారు భృంద మందారవల్లి
ఈ కన్యకాంబయే ఋషిదేవతాచయా
ఖండప్రమోద శ్రీకారకలిత
ఈ కన్యకాంబయే యిల వైశ్యమండలి
కండయై వెలసిన యాదిశక్తి
సాత్వికస్వభావ సరసప్రభావ సు
భావ భావుకప్రభాప్రదాత్రి
సర్వలోకజనని సకలసౌఖ్యప్రద
విష్ణువర్ధన పృథివీతలేంద్ర !! ౨౪

ఎందేము నివసింతు మందు మాపురి "పెను
గొండ" యన్ పేరితో నుండునయ్య !
యెందేము వసియింతు మందు మాయిలవేల్పు
'శ్రీ కన్యకాంబ' తాఁ జెలగునయ్య !
యెందేము వసియింతు మందు శ్రీ వింధ్యవా
సినితో నగర శివుం డొనరు నయ్య !
యెందేము వసియింతు మందుఁ గోన కమలా
యుతజనార్దన దేవుఁ డొలయునయ్య !

వేదశాస్త్ర పురాణ సంవేద్య యను మ
హామహత్వ కలితయైన యంబ యీమె
కన్యకాంబ మాపాలిటి కామధేను
వయ్య! శ్రీవిష్ణువర్ధన! యరయుమయ్య! ౨౫

బేరసారంబుల విత్తంబు నార్జించు
పని వెన్నతోఁ బెట్టినది మాకు
కృషియు గోరక్షణవృత్తియు రక్తమాం
సనిరూఢమగుచు నుండునవి మాకు
వేదవేదాంగైక విద్యలున్, యజనముల్
నల్లేరుపై బండి నడకమాకు
ధరణిలో బీద సాదలను మన్నించుట
మానని సన్నియమంబు మాకు
శ్రీ కన్యకాధీశ్వరీ చరణారవిం
దయుగంబు సతము వంద్యంబు మాకు
ఖండఖండాంతరంబులం గల్గు నిఖిల
వస్తువులఁ గొని యమ్ముచుఁ బరమధర్మ
భరణ విక్రమక్రమమునఁ బటిమ మాకు
రమ్యగుణ సాంద్ర! విష్ణువర్ధన మహీంద్ర!

వ॥ అని మఱియు ౨౬

కోటిసూర్యులదాలుఁ గోటమీటగ జాలు
దాలొప్పు మణి కిరీటంబు తోడ
నిండుపున్నెమనాటి పండువెన్నెల కాంతి
వెలయించు ముత్యాలపేర్లతోడ
తులలేని బంగారు వెలలేని రతనాల
నొగిని దాపిన మొల నూలుతోడ
కురువింద గారుడ హరినీలమణులతో
బరగు కేయూర సుప్రభలతోడ
రంగు బంగారు మేలిమి వస్త్రంబుతోడ
అంకపొంకాల మేలైన కింకిణీమ
ణిగణ శింజానమంజీర యుగళితోడ
వెలమి శ్రీకన్యకాంబ రహించుచుండు ౨౮

పరమానందకరంబు సర్వనిగమప్రస్తూయమానంబు వి
ర్భరమాకందమరంద సుందర కృపాపాంగ ప్రకారంబు నై
సరసంబై సకలార్యవైశ్యజనతా సంసేవ్యమానంబుగా
బొరికన్యాపరమేశి యొప్పు రహి తద్భూపాలుడుం గాంచియున్

ఆనానామణి ధర్మభూషణ మనోజ్ఞాలంక్రియా యుక్తమై
మౌనివ్రాత సురాసురప్రకర సన్మాన్యంబునౌ కన్యకాం
బా నైర్మల్యయుతాకృతిం గనియు దత్ప్రాంచన్మహాగారశో
భా నవ్యత్వముఁ గాంచి ప్రమాప్పడియె భూపాలుం డవేలంబుగన్

ఎక్కడఁజూచినన్ మణులు నెక్కడఁగాంచినఁగాంచనంబు విం
కెక్కడఁగాంచినన్ బరిమళోద్ధ మహాగురు ధూపవాసనల్
మిక్కుటమై మణిప్రభల మేల్మిఁ జెలంగెడి నల్లసుస్థలిన్
మక్కువమించు చోట్లఁగని మానవనేతఁ రహించె మిక్కిలిన్. ౩౧

# వాసవీ దర్శనము

మఱియును నందువచ్చి సదమందపరాంబ పదారవిందముల్
పౌరి భజియించు వైశ్యచయముఁ బలవిక్రమసుక్రమాఢ్యమౌ
పురుషచయంబు ధర్మమణిభూషణభూషితభామినీ తతిన్
సురుచిరులైన బిడ్డలను సొంపుగనన్ నరనేత గాంచియున్

అలకాపుర మాయిది వే
ల్పులకాఁపురమా? తనువునఁ బుల కాంకురముల్
వెలిసెడి - వెలసెడిఁ బరపుర
ముల కీపురభూతి కనుచు భూపతి యలరెన్

వ. అప్పుడు ౩౪

ఓంకార ధ్వనిఘంటా
ఠాంకార మెసంగ మఱియు "ఢంఢ" మ్మంచున్
ఢాంకారమ్ములు డమరువు
లుం కంపుచు మొఱయఁ బూజలున్ మొదలయ్యెన్ ౩౫

వేదవిదులు నధ్యయనని
నాదములను గన్యకాంబ నలువు నుతింపన్
శ్రీదమ్ములు తద్దేవీ
పాదమ్ముల కప్డుఁ బూజ పరగె రహి నటన్

అట్లుఁ బాదారవిందాదియయిన పూజ
యలరె నాకేశపర్యంత మల్లకన్య
కాంబకందు నాకేశముఖ్యార్చితకు స
మస్తవేద వేదాంతనుత్య ప్రకృతికి ౩౭

ఆచారమ్ము ప్రకారమల్లగుడిలో నంబామహాదేవికిన్
వాచంయద్వ్యభిగీతకుం గుసుముడున్ తత్పూర్వణిజ్ముఖ్య స
త్ప్రాచుర్యాత్ముని పుత్రి వాసవి మహా పావిత్ర్యచారిత్ర పూ
జాచర్యల్ జరపెం దదేక హృదయస్ఫాయత్పరా శక్తిగన్

ఇంద్రాణ్యంశ జనించినట్టి యలపూరింద్రాత్మజా రత్నమం
దుంద్రాషిష్ఠమనోజ్ఞ భక్తి కరమున్ బొల్పొంద భవ్యోక్తిన
ర్థిం ''ద్రాహి'' యని యంబ కారతిడి తత్తీర్థప్రసాదంబులన్
సాంద్రానందమునన్ శ్రితాళికొసగన్ సాగెన్ గడున్ ముర్వగన్

బాల్యఁబింత తరించినట్టి నవలావణ్యంబుతో మోమునన్
దౌల్యంబందని మందహాసరుచి క్రన్నన్ వెన్నెలన్ గాయ నే
లౌల్యంబొప్పమినిం బ్రసాదము నృపాలశ్రేష్ఠహస్తాల న
క్కళ్యాణీ మణి యుంచె వాసవి సమగ్రంబౌ సముద్రిక్తతన్

మోము ప్రశాంతభావము నమోఘముగా వెలయింపజేయ నే
త్రామలకాంతి నిశ్చలత కగ్గముగాఁ జెయువుల్ సమస్త మా
భూమిని లెక్కకుం గొనని పుణ్యతమక్రియ నొప్ప నల్ల క
న్యామణి వాసవీ శుభసమాఖ్య యటం దగె నంబికార్చనన్

ఆ రాజన్యుఁడు జనముల
కే రా జటఁ గొల్చు కన్నె కెల్లరి యంతే
యై రాజిలె లో నెట్టి వి
కారం బామె కన దతనిఁ గాంచుట నపుడున్ ౪౨

వ. ఆసమయంబునందు

అందుల నున్న వైశ్యజను లందఱికిం దగఁ గన్యకాంబపై
డెందములందు భక్తియుఁ గడిందగ నుండెను గాని మర్త్య భూ
పేందున కల్ల వాసవి యతీంద్రియభక్తి నంబ పూజ సే
యం ద దమంద సుందరతయందె మనంబు లయించె మిక్కిలిన్

## రాజు మోహము

నవపంకేరుహ కర్ణికాంతరగళ న్మారందధారా పిపా
సువు భృంగం బల పుష్పపీఠి నెటులన్ సుస్థైర్యముం బూను వా
సవి లావణ్యమయామృతంబుఁ గను లాసం బానముం జేయఁ జే
యవిశేషంబుగ ముగ్ధుఁడౌచుఁ దగె మర్త్యస్వామి యాతం డటన్

అందఱుం గన్యకాంబాఖ్యన్ వచింప రా
జను నదేమో కాని యద్దిగాదు
అందఱుం కన్యాంబ యందముం గని పొంగ
రాజల్ల వాసవి రాజుఁ గాంచు
అందఱుం కన్యాంబ యందు భక్తిం బూన
రాజు వాసవి యందు రక్తి నూను
అందఱుం బరమార్థ మందుఁ దేటం జెంద
తేడు చాపల్యవార్థిన్ మునుంగు

ఎల్లరకును నిష్కామత్వ మెసఁగ మదిని
అకట! నృపతి కామశరోపహతుల నొందె
వేయి మించుల మించుతో వెలుఁగు నల్ల
కన్నియం జూచు చే నృపుకనొఁక యందు ౪౬

తన్నుం జూడదు కన్నె యందుకు నిజోద్యద్వైభవంబిందు లో
టున్నా? "యంచును దన్నుఁ జూచికొను చోహో" యన్నటు న్నెత్తి యూ
పు న్నేత్రంబులతో విసంబొలుకు చూపు ల్బ్రాచుఁ దద్రీతి న
న్నన్నా! చేయఁగఁ జొచ్చెఁ జేష్టల నసంఖ్యప్రక్రియన్ రాజటన్

మీసా ల్దిడికొనున్ మొగానఁ గడు మేల్మిం బూను చిర్నవ్వు వే
వే సొమ్ముల్ వలువల్ సరింజలుపుకోన్ పెం పూను నుష్ణీషమున్
వే సారుల్ సవరించుకొం చటు నిటుల్ దృష్టిం బ్రసారించుఁ జే
ష్టాసాహస్రిక భూపుఁ డూన నటుఁ గాంచన్ లే దెదిం కన్యయున్

# రాజు కోర్కె

అటు లపు డా భూపతి యె
క్కటి మారశరముల కోడి కడు దర్పముతో
ఓటమై వైశ్యులఁ గాంచియు
నిటు లనియెన్ "వైశ్యులు" వినుఁడీ నా తెలుఁగున్ ౪౯

ఈ కుసుమాఖ్యపుత్రి యగు నీ చెలి వాసవికి న్నిజంబుగా
లోకమునందు నెందు నవలోకనముం బొనరింతు మేని మా
తే కనరాదు మా మది విహారిం బొరి హత్తెను దానిపైన మీ
రాకెను నాదు రాణిగ రయం బిడుడీ! శుభ మందుఁ డాపయి౯

రామాలలామ యగు నీ
లేమ న్నేఁ గనఁగ నే మలీమస రోషం
డై మారుఁడు శరముల నా
పై మా తెది తోచ నట్లఁ బరఁగించెఁ జుఁడీ!! ౫౧

నేనా? చంద్రాన్వయభూ
షానూనాకారుఁడను గదా? నాచేర్పున్
మీ నారి చెంది యెంతయుఁ
దా నింపుం జెందు నాకు దాని నొసఁగుఁడీ ౫౨

ఈ చాన సొరు నా యెదను బాఱిన యంత
మారుండు నా పాలి మారుఁ డయ్యెఁ
ఈ లేమ పలుకుల యింపు నే విన్నంతఁ
బైకంబు నా బెట్టు (బైక మూడ్చె
ఈ కన్నె యెదుటొమ్ము నెమ్మె నేఁ గన్నంతఁ
గోకమ్ము నా పాలి కోక మయ్యెఁ
ఈ యింతి కబరిక యి మ్మె నరసి నంతఁ
బాశమ్ము నా పాలి పాశమయ్యెఁ
ఇంక నే మేమొ యైతి నీ యిందువదన
యంద చందాలనుం గాంచి యన్నలార!
యిటకు నా రాక కీరు నా కిచ్చు కాన్క
యిద్ది యత్యంత మా జన్మ మింపు నింపు ౫౩

అన్నుల మిన్న మో మందమ్ముం గనుఁగొన్న
బ్రహ్మలోకము[1]ఁ గాంచు పని యదేల?
ఇంతి కుచద్వయి యింపు సొంపుం గన్న
శివపదమ్ముం[2] జూచు చెలు వదేల?
మదిరాక్షి లేఁగౌను మవ్వంబుఁ గనినంత
విష్ణుపదా[3]నకై వెదుకనేల?
అలివేణి వే నలి హారువునుం గని నంత
నాగలోకంబు[4] నెన్నంగ నేల

1. కమలము 2. కైలాసము 3. వైకుంఠము (ఆకాశము) 4. పాముల గుంపు - పాతాళము.

పాటలాధర కెమ్మోవి గోటుఁ గన్న
నరుణకుధరంబు[౬] పొంతకై యరుగ నేల?
ఆ వపువుఁ గన్న శ్రీరంగ మరుగ నేల?
అల్ల పుణ్యను నాకు నిం దర్యులార!

ఆ మోము నంద మిం తరసినన్ శరదిందు
సుందరత్వము గడుసుఁదన మేల?
ఆ మోవి పానకం బానినన్ భర్మకం
జాత మరంద పానం బ దేల?
ఆ మేని కౌగిలి ననుభవించిన రంగు
బంగారు వల్వఁ దాల్పంగ నేల?
ఆ నూపురారావ మాలించి నంత రా
యంచల పిండు లో నెంచ నేల?
వాసవి నిజ మింద్రాణి నే వాసపుండ
నంచు నెంచెద నా మాట నాలకించి
వాసవీవాసవులఁ జేర్ప వలయును మీరు!
భవ్యతర చర్యులార ఓవైశ్యులార! ౫౫

అని నంత నంతుఁ బొంతుం
గన రాని దురంతచింతఁ గని రటు వైశ్యుల్
ఘనహీ నాకాశమునుం
డి నెటిన్ బిడుగు పడినట్లు డీ కది తోపన్ ౫౬

౬. ఎఱ్ఱని కొండ = అరుణాచలక్షేత్రము. క్షేత్రము = సంపదకు విహారస్థలి.

ఏ మిది? పుణ్యానకుఁ జన
బా మటుఁ బాప మిది యెదురు వచ్చిన దకటా
భూమీశున కేమి బదులు
గా మొగి నందు? మని వైశ్యగణ మదిరెఁ గడున్ ౫౭

వనధిని బాడబానలము పై కుబుకంగఁ గలంగు దొప్పిన
ట్లనుపమమైన వంత యెద లందు జనింపఁగ వైశ్యులెల్ల బల్
వనఁటను జెంది యె మ్మెయి జవా బిడ లేక కరంబుఁ జింతనం
బును మదు లందె సల్పుచును బొల్చి రనల్ప మనోవ్యథాగతిన్

## వైశ్యుల ప్రత్యుత్తరము

అంతట యెట్టకేనిఁ గుసుమాఖ్యుఁడు భూపుని గాంచి పల్కె భూ
కాంతవరేణ్య! వందనముఁ గైకొని మా మన వాలకింపు మి
య్యింతి జనించినద్దె పరమేశ్వరి యర్చన కప్పనంబుగా
నెంతయు వంశపద్ధతిని నిచ్చితి మీ ప్రతిబంధ మొప్పెడిన్

శ్రీ కన్యాపరమేశ్వరీశ్రితుల మై చెల్వొందు మా కెంమ నీ
శ్రీ కన్యాపరమేశ్వరీమణియె యిల్వే ల్పై ప్రకాశించు న
స్తోకంబౌ రహి నూరి పెద్దగు వణిక్పూరుండు తొల్కాతు ని
శ్రీ కళ్యాణిని గొల్వఁగా నిడ వలెఁ జీవాంతపర్యంతమున్

## రాజుకోపము

అను కుసుమాఖ్యుం డగు వై
శ్యనికాయేంద్రుని వచనము లాలించి నృపుం
డనుకొనె "నవురా! రా జొం
దును గోరఁగ లే దను పెటనుం గంటి మొకో?

ఈగర్వుల కే నన నే
మో" గాదోఁచిన య టుండెనో? యేమొ? యటం
చాఁగని రుష భూపుం డట
నాఁగక చను చర్యులఁ గని యను నీ రీతిన్ ౬౨

ఏ నన నేమొ? నాముదల యెట్టిదొ? దానిని "గాద" టంచు మీ
రీ నెటి నాఁడు పెట్టిదొ, గ్రహించియు మీ రనినట్లు నాకు నా
మానసమందుఁదోఁపదిఁక మానుగ ని వ్విషయంబుఁగూర్చి మీ
రూనిన తెల్వినీదినము యోచనఁ జల్పి జబా బిడం దగున్

అని మంత్రికిఁ గనుసన్నన్
బొనరిచి యటనుంచు మనచు భూపుండరిగెన్
దన పరివారముతోడం
దన శిబిరమ్మునకును సముదార జవమునన్

ఒగి నటు రాజమౌళి చనుచుండఁగ వైశ్యులు ధర్మ నూత్న ర
త్నగణమయంపుఁ గానుకల నుదారముగా నల జేనివెంట నం
పఁగఁ దగె - నవ్వి కంటి కగుపట్టియుఁ బట్టని యట్లుఁ జూడ కేఁ
గెఁ గడు రుషాఽతిరేకము నొగిన్ మదిఁ బూని నరేంద్రుఁ డప్పుడున్

# విష్ణువర్ధనుని మంత్రియగు విక్రముఁడు వైశ్యులకుఁ గావించిన హితబోధ

రాజటు లేఁగ వైశ్యజన రాజని విక్రమసింహుఁ డన్నత
ద్రాజవరేణ్యు మంత్రియటఁ దద్దయుఁ గొల్వును జేర్చి యిట్లనున్
ఓ! జనమాన్యులార! వినుఁ డూరుజరత్నములార! మీర లీ
రాజిదు నాజ్ఞకుం దలఁపరాదు తిరస్కృతి సేయ నెంతయున్

వ. అని వచియించి యమ్మంత్రి కుసుమార్యు దిక్కు
మొగం బై యిట్లుఁ బల్కె ౮౨

కుసుమార్యా! పురి పెద్ద వీవు గద? నీకున్ సర్వముం దెల్ల మీ
యసమానంబగు పుణ్యసాధ్యమగు భాగ్యం బింటికి న్నేఁడు నీ
దెసగా వచ్చుచు నుండె మా ర్పలుక కర్థిన్ రాజు జామాతఁగా
వెసఁ గావించుకొనంగ లేని దెదియే నున్నె భువి న్నీకిటన్??

కాలందన్నకు మల్లమ
హాలక్ష్మీదేవి నీ గృహాన నడుగిడన్
హాళిన్ వచ్చుచునుండఁగ
నే లాగున సందియ మిటు నెందుకు నీకున్?? ౮౪

చాళుక్యరాడ్వతంసం బైన శ్రీవిష్ణు
వర్ధనుం డల్లుఁ డై పరఁగునెడల
కౌబేరసంపద కల్గు నీకు న్నిదు
వారి కవ్వారిగాఁ బరఁగ రాజు

కార్యతంత్రంబు నీ కైవసం బగు నింకఁ
గా రాని దెది నీకుఁ గ్గలుగనొక్కొ?
"విష్ణ్వంశ మగును భూవిభుఁ"డన్ప్రమాణంబు
నీ మనంబందు గణింపు మిప్డు
రాజు నానతి మరలింప రాని దగుట
ఈ తెఱంగు నా పద్ధర్మరీతిఁ గాంచి
"అ" స్తటంచుఁ బల్కుటయె శ్రేయస్కరంబు
బుద్ధిఁ బెడతలఁ బట్టింపఁ బోకు మయ్య!! ౭౦

ఈ పని మీ రొనరించిన
భూపుఁడు మీ పయిన మిగుల ముదముం గను నిం
కీ పని నేఁ జేసితి నని
నాపయినన్ భూపతి కడు నర్మిలి నొందున్ ౭౧

"కా" దనకుఁడు-"మాసమ్మతి
లే" దనకుఁడు-"భూపతికిని లేమను మేమీ
రా" దనకుఁడు-మీకు రహికి
వా- దనకుఁడు-శుభము దీని వలదనకుండీ!! ౭౨

బాపడు తక్కు వర్ణముల భామినులం గొన వచ్చు రీతి తా
నేపు గలిం దలిర్చుఁగద? యీ కలి ని గ్గతి లే దటంచు మీ
రే పలు కాఁడినన్ భువి రహించునె? కావునఁ గన్యకామణిన్
భూపున కిచ్చి సౌఖ్యమును బొందుఁడి రాజును రేఁపఁ బోకుఁడీ

చాళుక్యాన్వయుఁ డీ భూ
పాలుఁడు శ్రితులందుఁ గడుఁ గృపాళుం డింకా
భీలుఁడు వ్యతిరేకించు జ
నాళిపయిన సర్వజనము లాలించితిరే??

ఈ రాజన్యశిరోవతంస మనిలో బృథ్వీం గనన్ వచ్చు* పం
కేరుణ్మిత్ర కుమారరత్నమె యగున్ హృద్భావమం దిప్పుడీ
రే రాణం దెలి వన్న దూలి యిది యోజింత్రేని భూపాలుతో
మారాముల్ల వహించు ట య్యనలుతో మారాముగాఁ దోఁపదే??

# వాసవీకన్య [కీర్తికన్య] యుండిన స్థితి

అని మంతిరి యే మేమో
యనియు సమాధానము నల యర్యుల నందం
బొనరింపఁ జూచుచుండఁగా
గన వలదే వాసవి యటఁ గ్రాలెడిరీతిన్

కీర్తి యను మాఱు పే రేల కీర్తనీయ
వాసవీకన్య యటు విష్ణువర్ధనుండు
తన్నుఁ గోర-నాతని కీయఁ దగు నని యల
మంత్రి యాఁడునెడ వహించె మౌనముద్ర ౭౭

* (యముడు)

''హరి''లే-''కచ్యుత''లే-కా
సురనేత్ర్యపరావతార సుభ్రు లె సంగెన్
జరగినది జరఁగుచున్నది
జరగంబోవునది తాను సరగ నెఱుగుటన్॥

ఆ జాతిస్మర వాసవీ రమణి మర్త్యస్వామి గంధర్వుఁడై యోజం దొల్లిఁ దమంగుతించి మది మోహోద్రేకముం జెంద సుత్తేజం బందియు శాప మర్త్యలిడఁ బృథ్విన్ భూపుఁడై పుట్టె నాశా జీల్గుం దన కారణాన నని యారామాంగి కాంచెన్ మదిన్

వ. అంతియకాక ౮౦

ఆ నూటఃఱ మటి రెండు గోత్రముల వారా వైశ్యలా కన్యకాంబా నిత్య శ్రితు లీ కలిన్ సవరణన్ హర్షాందఁగాఁ జేసి యాపై నంబా చరణారవిందయుగళిం బ్రాపింపనౌ నందుకుం దానీయున్ వలెఁ దోడుపాటు ననుచున్ భావించె నక్కన్యయున్

# కుసుమ శ్రేష్ఠుని ప్రత్యుత్తరము

అంతన్ శ్రీకుసుమాభిధానుఁ డగు వైశ్యస్వామి యత్తీఱు నత్యంతంబుఃఱ మదియందు నారసియు-నిట్లాఁడున్ మహామంత్రి ధీమంతుఃఱ విక్రమసింహుఁ గాంచియును ''సన్మానంబుతో నిప్ప డాలింతు ర్గావుత నాదు విన్నపము'' నం చీ లీల వాక్రుచ్చెఢిన్

శ్రీ కన్యాపరమేశ్వరీమణి యనన్ బృథ్వీస్థలిన్ మాత్రమే
కా కెందేనియు వేల్పు మా కగును బ్రాక్కాలంబునందుండి సు
శ్లోకశ్రీకరి యామె యర్చనకు మాలోఁ బెద్ద యవ్వాని తో
ల్దొ కన్యం దగఁ దత్సమర్చనకునై యామృత్యుపర్యంత మో
కైకోల్గా నిడు టొప్పుఁ దాదృశయగున్ గంజాక్షి యీ కీర్తియున్

కానం గీర్తిని జేని కిచ్చు నెడ పీఁకం గీర్తి మా కీఁగి-న
త్యానంతామలతావిదూరులముగా నైపోదు మే మెల్ల వం
శానం దుమ్మను బోసిన ట్లగును గా మా పల్కు నొక్కండు వ
య్యా! నల్వొప్పఁగ నాలకింపు మిఁక వేయాఁడన్ బ నేమీ? సుధీ!!

అనులోమ వివాహమ్ము క
లి నసామాన్య మయినను మలీమస మన రా
దొనరంగ దేవి కిచ్చిన
వనితం గొన రాదు - మంత్రివర్యా! కంటే?? ౮౫

ఈ కీర్తిం గా-కింకన్
మా కొమిరెల నెవతెనయిన మానవపతి కీ
మీ కిచ్చ యయిన నన్నదిఁ
జేకొని యోజింతు మయ్య! చెలఁగఁ దలఁపుమా!! ౮౬

అని కుసుముండు పల్కు విని యాగ్రహ మింతన రాఁక రేఁగ మం
త్రి నెటివి బల్కు "మీరు నొక లెక్కయె? మీ మత మొక్క లెక్కయే?
మనుజవరేణ్యుకోరికను మానసమందుఁ దలంపకుంటి ర
ల్ల నృపుఁడె యగ్గెనేని నొక లా గొకొ మీరలు భంగ మొందుటల్

ఇందుకులావతంసుఁడు మహీరమణాభరణాయమానుఁ డ
స్పంద యశోఽభిరాముఁడు నభంగురధర్ముఁడు విష్ణువర్ధనుం
డందము మెచ్చి మీకొమిరె యందును డెందము వొందినప్పు డా
నందముతోడ నొప్పక యనందగునా "నహి"యంచు నో బుధుల్!!

రాజకులైకమండనుఁడరాతిభయంకరుఁ డైన భూపుఁ డీ
యోజను గోరుకోర్కె నిటులుల్లమునందును నెక్క నీక మీ
రో జనమాన్యులార! యెటకో మఱి నేమము ద్రోవ వీఁడి మీ
ర్యోజనమేఁగుచుంటి రిది యోజనముం బొనరింపుఁడెంతయున్

అధికసంపద యన్న నైలబిలుం గన్న
నొప్పు నొందకయ టుండుండుమనుచు
రూపం బటన్నఁ బూఁదూఁపు వానికి "నీది
యొక్క యందమె? అ టుం డుండు" మనుచు
బాహాబలముఁ గన్నఁ బరశురాముం గూడ
"నోహోహో! నీ వ టుండుండు" మనుచు
దానధర్మాన సంతాననిదానంబు
నొప్పక "నీ వ టుంటుండు" మనుచు
ఇట్టి సల్లక్షణములతో నెసఁగు విష్ణు
వర్ధనునితోడ సంబంధబాంధవంబు
పెరటి కల్పకమున్-దొడ్డి వేల్పుగిడ్డి
ఆర్యులార! యరయుఁ డాఢ్యచర్యులార!! ౬౦

ఇలఁ గడు మాఱుమూల యగు నిప్పెనుగొండ పురాన నున్న మీ
రెలమిని మీకొమార్తను మహీపతి కిచ్చిన మీ యశంబు ని
స్తుల మయి దిగ్దిగంతముల శోభిలు నం చన-మల్లుఁ డన్న వై
శ్యుల రతనంబు మండిపడి యుత్తర మిమ్మయి నిచ్చె మంత్రికిన్

నవఖండవ్రజ మండితమ్మగు నిలన్ వైశ్యుల్ సనం బోని చో
శ్లైవియే నుండెనె? మా మనస్థితిని సంతృప్తస్థితిన్ మెచ్చన
ట్టి విశేషజ్ఞచయంబు సున్నగు వధూటిన్ తేనికిం గూర్చి మే
ము వెసం గీర్తిని నెచ్చువార మని మా యర్థంబు గా దింతయున్

అని మల్లుం డనె సోముం
డను వైశ్యుఁడు లేఁచి భూపుఁ డల్లుం డగుటె
ల్లను సిరి చేటుం దెచ్చికొ
నిన చందము గాక వేఱు నెటి యౌనొక్కో?? క. ౩

అంచు వైశ్యుండు వల్కిన యంత మంత్రి
వెంట వచ్చిన పాండిత్యవిదుఁ డొకండు
రాజునకు మెచ్చుఁ గొల్పెడి రాణ మెఱయ
కర మదల్చి వచించె ని క్కణఁకతోడ!! క. ౪

ఆ కౌబేరైశ్వర్యము
నే కా దను భూపుని సిరి యేడ? నిఁకేవో
రూకలకుం దగిఁయెడి మీ
దౌ కల్మి యి దేడ? యిట్టు లాఁడఁగ నేలా!! క. ౫

పిచ్చుక కూర్చుండిన తన
యుచ్చే బ్రహ్మాండమంచు నుల్లమునఁ దనున్
మెచ్చుకొనినటుల మీసిరి
మెచ్చుకొనఁగా వలయు మీరె మేలే? యిదియున్?? ౯౬

ఇందు కులంబన భూతల
మందుఁ బ్రసిద్ధంబు మిగుల నద్దానికి మీ
కందముగా సంబంధము
పొందును గా దనుట మీకుఁ బోలునె? కనుఁడీ!! ౯౭

మ తొక కొలపుఁ బెండ్లి యని త
మరు తలఁచితిరేమొ? వినుఁడి మహిని యయాతిన్
బొరి దేవయాని పొందదె?
మఱియు శకుంతల వివాహమాన్యతఁ గనరే ౯౮

నావుడు గురుగుప్తుం డను
నో విజ్ఞా! మీదు మాఁట యొప్పునె? మీరున్
భావపడు నుత్తరంబిడ
మావలనం గాదె? రాజమంత్రి వరేణ్యా!! ౯౯

కచుఁడు తిట్ట దేవయాని కవి మతిని యయాతి రా
జు చపలాక్షియయ్యెఁ జంద్రుఁ జూడ-గురున కపకృతిఁగా
గుచరితమును బూనె నట్టి కొలముగొప్పయెంతో? భా
వచపలత శకుంతలా వివాహ మయ్యెఁ గాదొకో? ౧౦౦

సతిరస్కారముగాఁగ నూరుజుఁడు వాక్చాతుర్యముం జూపి యి
ట్లతి మాత్రంబుగఁ బల్క మంత్రియు సముద్రాంతశ్శిఖింబోలె ను
గ్రతనుం జెంది వచించు మీ మద మపారం బైకనన్ వచ్చె భూ
పతి మీకన్నెను గొంచుఁ బోవునెడ మీ ప్రాగల్భ్యముం జూపుఁడీ॥

మీ దగు కండకావర మమేయము పద్ధతి పొంటె మిమ్ము భూ
మీదయితుండు గోరె మఱి మీ రిడు టాతఁడు గొంట యేమి? తెం
డో దురితాత్ములార! యన్నృతోదరి-నాఁగనె మీరు తే వలెం
గాదొ? య టీనిచో-యముని కాఁటియ మీ ర్భువినే కనం దగున్

అనుచు నమాత్యుఁ డెంతయును న్యాయము నారయకాఁడ నుత్తరం
బు నతని కిచ్చుటం తగను బోలదటంచుఁ దలంచి యంత భో
జనసమయంబు గా-సభను జాలొనరించియు నెల్ల వారి భ
క్తి నొనరుపం బొనర్చి సభ దీర్చిరి మర్మముగాఁగ వైశ్యులన్

అమ్మెయి నాంతరంగిక సభాంతర మద్ది చెలంగ వైశ్యులం
దిమ్ముగ యోచనం జలిపి, పృథ్వీతనూజను గొంచుఁ బోయి లా
భ మ్మెది రావణుండు గనె? బాగటె యీ మన కన్నియన్ సుధీ
సమ్మతి లేని రీతిఁ గొనిచన్న నృపాలున? కంచు నెంచియున్

ఇందుల కేఁగి భోజనము లెంతయుఁ బేరునకుం బొనర్చి భూ
మండలనేతృమంత్రియును మానుగ భోజన మాచరించియున్
దండిని మార్చుకొందురొకొ తద్దయు వైశ్యు? లటంచు నచ్చకున్
మెండుగ నమ్మి వచ్చె సదమేయులు వైశ్యులు గారవింపఁగన్

వ. అప్పుడు మంత్రి యవ్వైశ్య శిఖామణులం గాంచి "మీరు యోచించిన యభిప్రాయంబు వచించునది" యని యడిగి నంత వైశ్యు లి ట్లనిరి.

ఓ మంత్రీశ్వర! యెమ్మె
మే మాలోచించినఁ గడిమిం దేవికి నీఁ
గా మేకొన్న కుమారిని
భూమి నిఁకేనికి నొసంగఁ బోలదు గాదె?? ౧౭౭

నావుడు మంత్రివర్యుఁడు మనంబుననుం దలపోసి "యింతలో
నీవిషయంబుతేల" దనియెంచి నృపాలుఁడు చెప్పినట్లుగా
నీ విధిఁ బల్కె "మీకు నిది యిప్పుడు దోపఁగ లేదు-వైశ్యులా
రా! వెస మాస మొండు గడువౌ దనుకన్ దలపోయుఁడీ గతిన్"

అని తన వెంట భూమిపతి యంపిన సూడిద లెల్ల వారి కి
చ్చి నెఱిని విష్ణువర్ధనునిఁ జేరియు నాతని వెంటఁ బట్టణం
బునకును నేఁగి రీ విషయ ముం దగ నెంచియుఁ గుంద వైశ్యులున్
కనుఁగొనఁ దొంటి శాపయుగి కార్యము తాను జెలంగ నిమ్మెయిన్

## ఆంతరంగిక సభ

ఆ సభ యమ్మెయిం చరగి నంతట వైశ్యనికాయ మెల్ల నా
వాసము లొప్పుఁ జేరియు విభావరి దాఁట నొనర్చి రాత్రిలిన్
వాసవి కెట్టి పా టగునో? వైశ్యుల కే మగునో? య టన్న స్వా
యాస మనః ప్రకారముతె యందుచుఁ గుందుచు నుండి రందఱున్

తులమున కెల్ల సంకమును గూర్చెడి నీ చెడు రీతి గాదె? క
న్నెల రతనంబు దేవతకు నెమ్మి నొసంగఁగఁ బద్ధ వాసవిన్
సులలితమైన ధర్మమును జూపి మనశ్చపలత్వ మూతగా
వెలయఁ గొనం దలంచుఁ బృథివీపతి యయ్యది యెట్టి న్యాయమో?

అని వైశ్యుల్ తలపోయుచుండ నటు వృద్ధాత్ముం డొకం డాఁడు నా
కును జాతిస్మరభావ మొప్పు దొలుతన్ గోపంబుతో వైశ్యపం
క్తి నిఁకం గీర్తిసమాఖ్య నీమెను శపించెం జిత్రకంఠుండు నా
యన గంధర్వుఁడె విష్ణువర్ధనుఁడుగా నావిర్భవంబుం గనెన్

ఆ కన్యామణి కీర్తి వాసవియు శంభ్వాఖ్యుండె యీ కన్య కీ
లోకానం గుసుమాఖ్యుఁడౌ పితయుఁ దల్లోకాక్షి (భార్య) యే వీని గా
శీకాక్షామణి కన్యకాంబ తొలి నుర్విన్ వేఁ గలిం దిట్టి రా
వీఁకం దా మన కౌన తిచ్చె మన యీపృథ్వీభవంబుల్ తగన్

ఈ మన మింక శంభు దరికేఁగియు నక్కడినుండి కన్యకాం
బా మహనీయసమ్ముఖనివాసముఁజేరెడునట్టి వేళఁ దా
నీ మెయి దగ్గఱించినది యీ నరపాలుని కోర్కి కూడ రా
దో మహితాత్ములార! కర ముల్ల మునన్ భజియింతు మంబికన్

# విరూపాక్షుఁడు-బాలనగరులు

వ. అప్పుడు జాతిగౌరవమును గీటునం బుచ్చి తనయొక్క
కామాతురతత్వమును వ్యామోహమునే ప్రధానముగాఁ దమ కన్యం

గోరియున్న రాజన్యుండు తమ కన్యుండు జన్యార్హుండు సౌజన్య మున కేమాత్రమును బాత్రుండు గాఁడని నూట రెండు గోత్రముల వారగు న ప్పురాంబికా భక్తశిరోమణులగు వైశ్యరత్నముల కొమరులయిన నలబాగరులు కుసుమార్యనందనుండును వరప్రసాద జనితుండును నయిన విరూపాక్షుని దమకు నధ్యక్షునిగా మున్నిడు కొని యట కేతెంచి యక్కడి తమ పెద్దలయొక్క సంవాదంబు నందలి యర్థంబును గ్రహించి రప్పుడు విరూపాక్షుండు బాలనగ రుల పక్షంబున నిట్లు వచించె ౧౧౫

పరములు మీదు ధర్మముల పాటి యిదంచును బల్క నాకు నం
దరమొకొ? యైన నంబిక మనంబునఁ దోఁపగఁ జేసినట్టితే
వ రహిని బాలవైశ్యతతి పక్షమునన్ వచియించు వాడ మా
మొఱ యిది యాలకించి పెరపోకడ మాని యటుం బొనర్పుఁడీ॥

అఖిలలోక నుత మైనట్టి శ్రీయుతము క
న్యాంబికా భక్తిమా కలరుఁ గాదె?
పరమానుకంపానుభావుండు శ్రీ మహా
దేవుండు మన కిష్ట దైవము గద?
ఆ దేవతా దేవు లనుమతింపఁగఁ గరి
నిల దిద్దఁ బుట్టితి మిట్లుఁ గాదె?
తన శిక్ష ననుభవింప నృపుండుగాఁ జిత్ర
కంఠుండు రా జయ్యె క్షమను గాదె?

అతని శిక్షించు పని యవశ్యంబుగాదె?
మేము వీరాధివీరతామేయుల మయి
యాజిలో రాజు నోర్చి జయంబు గొని య
తనికి నతని వారికి బుద్ధిఁ గనుపఱతుము. ౧౧౭

శ్రీ కన్యాపరమేశ్వరీ కరుణచే సిద్ధించి శ్రీకంఠు న
స్తోకాకార కృపావిశేషమున సంశోభించి లోకైక సు
శ్లోకంబుం గనఁ జేయు విక్రమము కల్లోలించుమాలోన సా
నేకప్రక్రియ రాజు శిక్షితుని గావింపం దగున్ బోరిలోన్ ౧౧౮

శస్త్రాస్త్ర భల్ల పటలీ
నిస్త్రింశాద్యాభ్యసన మనీష రణ కళా
శాస్త్రజ్ఞత రాజులఁ బద
ఛస్త్రిం*బలె దన్ని రాజు వడిఁ గుదురుపమే? ౧౧౯

ధీరహితుడు రాజు ధీవరుండగు మంత్రి
అగ్గి తోడు వాయు వమరి నట్టు
లనద లిండ్లు గాల్ప యత్నించుచున్నారు
అట్టి వారి వదల నగునె యెందు?? ౧౨౦

వారే వీరులో! యింకన్
వారే శూరులకొ? మఱియు వారే కరమున్
ధీరులొ? ధీరులు వీరులు
శూరులు మనలోనఁ గలరు సూనృత మరయన్ ౧౨౧

* ఫుట్ బాల్ = Football.

1. ధైర్యవంతుల మిత్రుడు-తెల్విలేనివాఁడు.

2. తెల్విని పాలించువాఁడు-బెస్త.

బాల నగరు లనగఁ జనుబాలు త్రావు
కందులా? కారు! బేలలా? కారు సమర
కేళియందు మత్తారికుంఠాలగండ
మండలదళన చండప్రచండ హారులు ౧౨౨

పంపుఁడు మమ్ము ఠీవసల పర్ణము పై గుటిపించి మీరు యు
ద్ధంపు ధరాతలంబునకుఁ దద్దయు నుద్దవిడిన్, బురాళి నై
లింపనికాయ మెన్న నవలీల జయించిన శూలివోలె మా
యింపమె? విష్ణువర్ధనుని నింకను నాతని వారి నందఱిన్? ౧౨౩

శ్రీ కన్యాపరమేశ్వరి
శ్రీకరి యై కరము మాదు శిరమున ననుకం
పాకర మై తనరంగా
మా కెం దీ కరణి లోప మొసగునె? మాకున్? ౧౨౪

మాన్యులు మెచ్చంగ ననా
మాన్య పరాక్రమము మెఱసి మత్తుండగు రా
జన్యుని జన్యంబునఁ గడు
దైన్యముఁ గనఁ జేయు మాదుదర్పముఁ గనుఁడీ ౧౨౫

అని యిటు బాలవైశ్యతతియాఁడఁగ వందయు రెండు గోత్రముల్
గనదగు వారు షట్సుతములం బది రెంటను చొప్పు గోత్రముల్
తనరెడి వారు వైశ్యులు సుదారతరంబుగ నెంచి యెంచి యే
మనుటకుఁ దోఁప కొక్కొకతె యాస్యము నొక్కరు గాంచుచైతగా

# ఆరువందల పన్నెండు గోత్రములవారు

నొగిని నెట్ట కేల కాఱునూట పదియు రెండు గో
త్రగణము గల వైశ్య లిట్టులన్ వచించి రిమ్ముగన్
"జగతి రాజె హరి యనుచును సజను ల్వచింపరే
నిగమములును నాగమములు నిక్క మట్టు లాఁడెడిన్ ౧౨౮

చాళుక్యాన్వయ వార్ధిరత్న మయి విశ్వాసైకపాత్రుండు నై
హేళిం బొల్చిన విష్ణువర్ధనుని "గా" దం చోలి వా క్రుచ్చి యే
రే లా గొప్ప మనం గలా? ర్గనుక వే నేణాక్షి నర్పించి ప్రా
ణాల న్నిల్పుకొనంగఁ జూచుట సమర్థం బెంతయున్ సజ్జనుల్
భూలోకేంద్రుడుఁ జంద్రవంశ్యుఁడు నిఃకళం బుంజీభవత్సద్గుణ
శ్రీ లీలాఖని విష్ణువర్ధనుఁడు హేళిం గన్యకం గోరఁగా
నీ లేమం చను కన్న బేలతన మెందే నుండునే? సోదరుల్!
వాలాయంబుగ నిందుఁ గల్గు శుభముల్ బాధల్ బ్రశం బెంచుఁడీ!

ఆఁడిన దంతయు నాఁటగాఁ బాడిన
దంతయుఁ బాఁటగా నలరవచ్చు
మన పల్కు ప ల్కాగమం బయి ముట్టిన
దెల ముత్యం బయి యెసఁగ వచ్చు
తలఁచిన దెల్ల సాధన మయి పట్టిన
దెల్ల బంగార మై హెచ్చ వచ్చు
బంగారు తేర్ల నంబారి యేనులపైన
నేక విభూతి నూ రేఁగ వచ్చు

బొక్కసము నిండ్లకుం గొని పోవవచ్చు
అతఁడు కాఁడు మేమె నృపుల మనఁగ వచ్చు
విష్ణువర్ధనుఁ డల్లుఁడై వెలయు నెడల.
కానఁ గన్యనిచ్చుటె క్షేమకరము కరము ౧౩౦

అల్ల విశ్వామిత్రుఁ డాఁకటి మంటచేఁ
గుక్క మాంసమును గొనఁగ లేదె?
తనవంక జయమును ధర్మజుం డాసించి
భావానృతంబును బల్కలేదె?
"కురుపాండవాజిలోఁ గొనను జక్రం" బన్న
హరి తన మాఁటకు నటె నిలిచెనె?
ఆ దశకంఠున "కభయమస్తు"నుబ్రహ్మ
"యాద్భయ"మను విశేషార్థ మనఁడె?
యముఁడు గొనిపోవఁ గన్యక యవని నున్నె?
రాజును యమునిగా నెంచ రాదె? యీమె
నధిపున కిడి వే తొక కన్నె నంబఁ గొల్వ
నూనిచినయెడ వల దను నొక్కొ యంబ?? ౧౩౧

కృతయుగాన నీ చాన ప్రకృతియె రేణు
కాభిధానగాఁ ద్రేత సీతాభిధ యయి
ద్వాపరాన ద్రౌపది యయి పరఁగి కన్య
క కలి నై జగన్నాశంబుఁ గల్గఁజేయు ౧౩౨

## విరూపాక్షుఁడు

అంచు నాఱు నూర్ల పదిరెం డయిన గోత్ర
ముల సువైశ్యులు పల్కినఁ బూర్ణరుషను
గని విరూపాక్షుఁ "దక్కటా! కన్యక నిటు
వీరు దూషింత్రె?" యనియు వచించు మరల

లోకైకేశ్వరి యగుఁ గద
శ్రీకన్యాంబిక? జగతికి సేమం బిడ లీ
లాకలనం బెటో నెఱపెడి
నా కలకలములఁ గన నగునా మనబోఁటుల్?? ౧౩౪

హరి హర విధులే యంబా
చరిత రహస్యము లెఱుంగఁ జాల రనఁగ ను
ర్వరఁ బురుగుల మగు మనమా?
కర మామె విమర్శనంబుఁ గావించు పనుల్??

కరుణానిధి కన్యక పై
శ్య రమాపాదన కయి క్షమను బొడమె ని
త్తెఱగున నామెం దెగడిన
"నరకానరకాన" దేన నలు వీఁగెదరో??' ౧౩౫

"రాజులు విష్ణునంశ"మను రాణ నెఱుంగని దేరు? కాని యా
రాజులు "విష్ణురూపులమురా!" యని తమ్ముఁ దలంచి గర్వధీ
రాజితు లై తుదిన్ శమన రాజు జగద్వనికానివాస సౌ
ఖ్యాజరులౌ టెఱుంగమె? నృపాళినిగూర్చి వచింప నేటికిన్??

“రాజు రమాధినాథుఁ”డను రాజ యదే మనుజేశునేనిఁ బే
రోజను జెందరా దటుల నుర్వి సమస్తనృపుల్ సుకం చిదన్
రాజిలుచున్న దుష్టనృపులం జదువన్ బహుళావతారుఁడై
యీ జగతిన్ సుకమ్ము నిడ నింత శ్రమంపడ నేల శౌరికిన్??

జనరంజనపరుఁడే రా
జనఁగాఁ దగు వంచనమును జరపుచు జనఖం
జనకరుఁడగువానిఁ రా
జనఁదగునా! గాజు నాఁగ నగుఁగా వానిన్?? ౧౩౯

అంచు విరూపాక్షుఁ డన శ
తించియు నాన్నూఱును బది రెండగు గోత్రా
తెంచఁగ నగువారల నొక
యంచితుఁ డిటు బల్కె నాగ్రహాగ్రహ వశుఁడై

ఓ విరూపాక్ష! పిల్లఁడ వోయి! నీవు
నీవనఁగ నెంత? నీ తెల్వి యెంత? యింత
చర్చలో మర్మము నరయఁ జాలుదొక్కొ?
చేతులం ద్రిప్పి త్రిప్పి వచింతు విందు.

శ్రీకన్యాంబిక కర్పిత
యీ కన్యక యెటుందు రంబ యెసఁగునొ? లేదో?
వీఁక నిటుం గనరాదిదె
మీకుఁ బ్రమాణమొ? నృపునకు మేల్మియు దగదే?? ౧౪౦

కాన రాని కన్యక నొక వంకగఁ బెట్టి
కాన వచ్చు వేల్పుతేని తేనిఁ
గాదు లాఁడి మమ్ముఁ గాఁటి పా ల్సేతురా?
యిట్టి? లెడ్డె చవట లెల్ల మీరు??

సంపద గల వా రంచు ని
లింపులఁ బోనట్టి విభవలీలఁ గల రటం
చిం పొంద నందుకున్ భళి!
దింపితి రిటు గుంటలోన ధీరుల్! మమ్మున్!! ౧౪౫

"బ్రాహ్మణ క్షత్రయుల కాత్మభవ నొసంగ
రా" దనుచు నెట్టి యడ్డంబు రా" దనంగ
"దేవతార్పిత" యను మాటఁ దీసికొనియు
వచ్చినారు దానికిఁ దగు బలము గలదె??

తనరు ఁగాదె? యుత్సరాపవాదములవాద?
మట్టిదియె యిందు గ్రాహ్యంబు "గా" దనఁగ నగునె
కన్య నిచ్చిన సకలసౌఖ్యములు గల్గు
నీయకున్న వినాశ మెంతే నిజంబు ౧౪౬

# ఇందుకు 102 గోత్రముల వారి ప్రత్యుత్తరము:

అని ఆర్వ్నూర్వది రెండు గోత్రముల వారన్నంత నూటింక రెం
డును గోత్రంబుల వార లుగ్రులయి యిట్లుం బల్కి రీ రెల్లవా
రనఘుల్ న్యాయవిదగ్రగణ్యులును నిట్లాడంగ నౌనౌక్కొ మీ
కు నమస్కారము సల్పి పల్కెదము బల్ గో మొప్ప నాలింపుడీ

రాజు కళంకమూర్తి యయి రాజిలు నాకసమందు నట్ల భూ
రాజులు బూజు పట్టిన తెఱంగున డెందము లెంతయేని మే
లోజను వీడఁగా జనత నోలి రహిం గన కాత్మ సౌఖ్యముల్
రాజులఁ జేసికొంటకయి రాణను జల్పెద రేదియేనియున్ ౧౪౮

వేదం బద్దము రాదు శాస్త్రముల పెంపే సున్న యింకం బురా
ణాదుల్ వారల దృక్పృథంబుననెలేవా? యేది డెందాన కిం
పౌ దానిం బొనరింతు రడ్డపడువా రంతంబునుం గాంచు వా
రీ దారిన్ గన వచ్చు కాలభటులై పృథ్వీపతుల్ మంత్రిలన్

క్రూరులు మాంసభక్షకు లకుంఠిత దుర్వ్యసనైక చిత్తులు
ర్వీరమణీవిభూతిహృతి విజ్ఞులు నజ్ఞులు న్యాయదూరు లీ
భూరమణాళి నెట్టి దగు పొందికకేనియుఁ జేరుటన్న వి
స్తారభయంకరాహిదగు చక్కి వసించుటె నిక్కువంబుగన్ ౧౫౦

అట్టి రాజుల నెంచ రా దాశయమున
వారితోఁ బొందు మోక్షసంపదకు బందు
పూర్ణతర దుర్వ్యథాపుంజములకు విందు
అంగిట నమృతంబును, విసం బాత్మలందు ౧౫౧

నూట రెండు గోత్రములవారొ్నగిని వైశ్య
లి ట్లనంగ నార్యా్నరులు నింకఁ బదియు
రెండు గోత్రాల వార లీ లీలననిరి
నూట రెండుగోత్రములు! వినుం డటంచు

తెలియని వారిం దెలుపం
గల మెఱిఁగిన వారిఁ దెల్పగలము సుఖవుగాఁ
దెలిసీ తెలియని వారిం
దెలుపంగ దరంబె యెట్టి దేవర కేనిన్?? ౧౫౩

వ. అంత

నూట రెండు గోత్రంబులను దగు వైశ్య
లంత ని ట ని రకట! చంద్రాన్వయుఁ డగు
నీ నృపుం డని కన్యక నిత్తుమనిన
దేవి కర్పిత నీమె నె ట్లీవలయునొ?

వ. అనవుడు ౧౫౬

ఆఱునూర్లుఁ బదియును రెండయిన గోత్ర
ము లగు వైశ్యు లి ట్లనిరి మీర లెటు లడ్డి
నను నరేంద్రుండు కన్యం గొనం గలుగుట
నిక్క మి మ్మాఁట ముమ్మాటు నిక్కువంబు

వ. అనవుడు బాలనగరులు జ్వాలాజాల జటాలకీలభ్రం బగు నాకసంబున కువ్వెత్తుగ రేఁగినట్లు క్రోధైకమూర్తులై లేఁచి రట్లు మూటరెండు గోత్రాల వైశ్య గ్రామణులునుం గావించిరి. వా రార్వూర్లు పదిరెండు గోత్రంబుల వైశ్యులను గాంచి మిక్కిలి కర్కశంబుగా వచియించిరి ౧౫౭

మానముకన్నఁ బ్రాణ మను మాటకు నెక్కువ విల్వ గల్గునే?
మానము పోవు వెన్క మనిమాత్రము లాభ మ దేది యుండునో?
మానము పోవుచో శవసమానుఁడు గాఁడె యెవండు గాని? యో
మానవదగ్రగాము! లసమాన యశంబును గానఁగా నగున్

రా జరుదెంచియున్ విశిఖరాజి నిగిడ్చియుఁ బూరుషాళి నెం
తే జవ మొప్పఁ గాలుపురినిం గనఁ జేయు నటంచు నిండ్లలో
రాజముఖీతతిం జెఱచురా! యన్న సందియ మేల? కన్నెతో
నోజను వహ్నిలో బడిన నుండ్మనె యె చ్చగు ఖ్యాతి యెందునన్??

పావనపావనుండయిన పావకుడే మన దిక్కు గాఁగఁ గుం
డావళి నగ్ని గొల్పి యటఁ బడ్డయెడన్ నదిఁ గన్యకాంబ యెం
తో విమలాద్భుతిన్ నిజపదోత్తమసన్నిధిఁ జేర్చునిందు మా
భావమునందు సందియము పర్వదు సుండి రవంత యేనియున్

పరఁగను రా జనంగను ప్రపంచమునం దగు గౌరవానకున్
బోరయునె పాత్రుఁడై? కరముఁ బోలఁ ప్రభంజనునట్లుఁగాంచు ధ
ర్మరుచిరుఁడైన రాజు నల మాధవుగా భజియించు లోకమ
ట్లోరయకె మంచి వా డనుచు నూరక కల్గునె సద్యశం బనన్??

గోముఖ వ్యాఘ్రములును బయోముఖ విష
కుంభములు నరరూపరక్షోవిసరము
నగు నృపులు పలువు ర్కలి నలరు వారు
కుటిలు లగు వారలను లెక్కఁ గొనఁగ నగునె?? ౧౬౩

వీఁడును వాఁడును నింకే
వాఁడుం దోడు పని లేదు వడి నిలు వేల్పే
తోడై మనము తరింపం
జాడం జూపించు వినుఁడి! సజ్జనులారా!!

విపులసౌఖ్యంబుతోఁ బెంచిన నీశరీ
రం బంతుఁ గనక తిరంబు గాదు
క్షణభంగురంబైన తనువు నమ్మఁగ నేల?
యట్లె యీ హయ రథ హస్తిముఖ్య
ములగు నైశ్వర్యముల్ పోరిజెడకుండునే?
వీనిపై నడియాస వెలయ నేల?
శ్రీ కన్యకాంబికాంఘ్రి కుశేశయద్వయీ
భక్తుల కానందపటిమ యరుదె?

కాన నూరక సందేహ మూన నేల?
అసమ సమరంబునం జయం బబ్బఁబోదు
కాన నగ్ని ప్రవేశంబు నూని కన్య
కాంబికా సన్నిధిం జేర నగును మనము ౧౬౫

అని నూట రెండు గోత్రము
లనువగు వైశ్యులను బాలకాఽఽళియు భయమున్
దనరింపు చనంగఁ బిఱికి
తనమున నార్యాణిరాజు తగు గోత్రంబుల్

# 612 గోత్రములవారి యభిప్రాయము

రాజద్రోహము నాత్మహత్యయు నొనర్పం బూని యున్నారు మీ
రీ జన్మాంతపు వేళ దండధరు గీ మేఁగంగ నం దంధతన్
వాజెమ్మ ల్బలెఁ గూలు వారు గద? యంతంబందుకున్ లే దిఁ కీ
తేజంబున్ మఱి ముక్తి గ్రక్తియును సున్నే కాని యున్నే తగన్?

జనపతి మాఁట నొకింత వరించిన
సౌఖ్యము నాతని సఖ్యమగున్
మనమునఁ గారణ మొప్పది కానిది
మానక మీ రనుమానమునన్

కనదురు బీకరకార్యము నూనుటఁ
గాంచఁ బొగందగు దాని సిగం
జొనిపినటుం గద? తేలు విడన్ ఫణి
నోటకు గేలిడు పాటిగదా? ౧౬౯

ఈ పనిచేఁ జెడు నీ జగముం బర
మింక యశం బది యె మ్మెయినో?
మీ పతి మీ గమి భూమిని బానెడి
పోడిమిఁ జల్పినఁ బోలుఁ గదా
నాపకు లై చనినం జనుఁ డీరె
చనన్ వెనుకం దగు సౌఖ్యమెదో?
ఆఁపియు మీ రొగి యత్నము దీని
ధరాధిపు మన్ననఁ గాంచవలెన్

తనువులు కడుఁ గొల్పెఁ దర్పమా? డెందమందెన్
అనువు గనక యే చాలైనఁ జెందుంది మీరే
అనుచును బది రెండై యాఱు నూర్గోత్రములా
రనఁగ శతము రెండై నట్టి గోత్రాలు పల్కన్ ౧౭౦

ధర్మార్ధంబు శరీర మీఁగినను నత్యంతంబుఁ బున్నెంబె గొ
శర్మాధాయక కార్య మట్లై యగు నంచద్దైవ భక్తాఽఽళిపైఁ
గూర్మిన్ బ్రాణము లీఁగినన్ సరియె లోఁగొం కూని కాపట్యపున్
మర్మం బొప్పిన మన్కియున్ మనికియే మన్యాత్మకుల్! కాంచుఁడీ!

సత్య జ్ఞాన యశః పరోపకృతులన్ దైవాఱ నాపాదనం
బత్యంతంబుగ నొప్పి నప్పుడు నవశ్యంబైనఁ బ్రాణంబులన్
ప్రత్యూహం బగుచోఁ దృజించినను దైవం బొప్పుఁ దద్వంశమున్
నుత్యంబై పితృకీర్తిఁ బల్కుచు నిల న్మాతృప్రథన్ వెల్గెడిన్

అని దీక్షాపరతంత్రమానసము లొయ్యం జూపుచు న్నూఱు రెం
డును గోత్రంబుల వారు వారల నిసుంగు ల్వాల్కు నాలించియున్
మన మిప్పీరిని జేరుచో మరణముం గాంచన్ వలెన్ రా! యటం
చును నార్నూర్వది రెండు గోత్రములవా ర్లొత్తిల్లు వేగంబునన్

బైట కేఁగియుఁ బెరవారి మాఁట వినక
ప్రిదులు జవమున నార్నూఱుఁ బదియు రెండు
గోత్రములవారి రాజునకుఁ గులమునకు
వెఱచియుం జావ లేకిట్లు వెసఁ బలికిరి ౧౭౪

పరములకుఁ కన్యకా వింధ్యవాసినులకు
నగరశంకర కమలా జనార్దనులకు
భాస్కరునకు మ్రొక్కియును వివరము నెల్ల
రాజునకుఁ దెల్పి యట నుండు రాణఁ జూప!!

వ. అప్పుడు

ఆఱు నూర్లును బదియు రెం డయిన గోత్ర
ములగు వారల పెనుగొండ పురినె యున్న
శిఖిఁ బడిన వారికివి నిక శిఖిని బడని
వారికిన్ సంకరత్వంబు పరఁగు నంచు!! ౧౭౫

వ. బాలనగరు లార్నూట పదిరెండు గోత్రముల వారి కిట్లనిరి. ౧౪౫

మానమునకుఁ బ్రాణము లొడ్డు మతము మాది
ప్రాణములకై దవులఁ బాఱు మతము మాది
ఎట్టి వానికిన్ మీది కానట్టి తెఱఁగు
కానఁ బెనుగొండ మీ రుంట కాని మాట॥

వీరతకుఁ బెట్టు పే రయి వెలయు మాదు
దరిని మీరుంట యెపుడేనిఁ దఁగిన దొక్కొ?
ఈ బృహద్గిరిపురి నుండ కెటకు నేని!
మీరు పోవలె వేగంబు మేకొనంగ॥

ఇద్ది మాది మాపెద్దల దెసఁగు మత మ
టంచు బాలనగరు లన నాఱు నూర్ల
పదియు రెండు గోత్రాల వా రెదెదొ త్రోవఁ!
బట్టి యేఁగి రెవ్వరి త్రోవ వారు గాఁగ॥ ౧౫౧

వ. అట్లు వెడలిన యార్నూట పది రెండు గోత్రముల వారు నానాదిక్కులకు నానావిధంబులుగా వెడలిరి. ఆ వివరములు పలుతెఱంగులం గానంబడియెడి నయిన నందలి రెండుతెఱంగుల నిందు వాకొనియెద ౧౫౨

ఇన్నూటతొంబది యెనిమిది (298) గోత్రముల్
పడమటఁ జని నీచభంగిఁ గనిరి
ఎనుబది (80) తూర్పునకేఁగిన గోత్రాల్ తు
రాషులన్ (తురాషాన్-ఇంద్రుని దెసకేగినవారు) నిందాఖ్య ప్రబల నయిరి
వంద (100) గోత్రాలు గోపసమాఖ్య దక్షిణ
దిశకేగి శివుని మతిని దలపక
నూటముప్పది నాల్గు (134) నూల్కొను గోత్రము
లుత్తరదిశ కేఁగె నొగి బహుగతుల
ఉత్తరదిశకేఁగిన వార లాగి బహుగతి
గతులనగ-నంధతన్ సతీఁ సుతులఁ బంపి
వెంబడించుట-మార్గాంతుఁ - బేర్ల మార్పు
గద్దదికఁ బూను-టాదియౌ గతులఁ జనిరి ౧౮౩

వ. మా తొక వినికి వినునది ౧౮౪

ఎనుబది (80) తూర్పున కేఁగిన గోత్రోత్తు
రాషాఖ్య నందిరి రహిఁ యమదిశ
కిన్నూఱు (200) గోత్రంబు లేఁగె గోపాభిఖ్య
పరఁగంగ నూటమ్ముదియు నాల్గు (134)
గోత్రముల్ దరదాఖ్యఁ గొని యుత్తరముననె
నూటయెనుబదాఱును (186) దగుగోత్ర
సంఖ్యవారలు క్రమసంజ్ఞ ఖడ్గము లూని
యంధతఁ దార పుత్త్రాంచితముగ

---

183 వ పద్యము : 298 + 80 + 100 + 134 = 612 గోత్రములు
184 వ పద్యము : 80 + 200 + 134 + 186 + 12 = 612 గోత్రములు

పేర్ల మూర్చి మార్గాంతుతో వెడలిరి - పది
రెండు గోత్రంబు లెటొ యేఁగిరి కడురయము
గాఁగ నిటు భిన్నవిధములుగాఁ బ్రతీతి
పఱుఁగు ఁబాఱిన వారల వాటి నరయ ౧౮౫

# ఆశ్వాసాంత పద్యములు

అంబా! తావకమైన దివ్యచరితం బాలింపఁగాఁ జేయు కా
వ్యం బీ లాగునఁ జేయ నీ విఁక భవద్భక్తాళియా నూటరెం
డుం బర్యుం దగు గోత్రముల్ తనరు ధన్యుల్ వైశ్య లింపొంద నా
లంబత్వంబును బూని ప్రోవు శుభశీలా! కన్యకాదేవిరో!!!

పరమప్రోద్ధత యత్న మూని యిటులన్ వ్రాయంగ నౌ నీదు స
చ్చరితం బంబ జగన్నుతం బగుచు నీసత్కీర్తికిన్ మూర్తియై
దురితానీక వనీ కుఠారమయి సంతోషప్రదంబై భువిన్
బరఁగంగావలె వైశ్యకల్పకత నొప్పం గన్యకాంబామణీ!! ౧౮౬

"నా" యనఁదగ్గ యెవ్వరిని "నాయన?" యంచనఁ బల్కరైరి రా
మా" యన నీ వనన్ మఱియు మా రమణీమణి యైన శారదా
మాయియు నైన సాయిసదమంద విభుండయినన్ బసందుగా
హాయిని గూర్చి ప్రోవవలె నమ్మరొ! నన్నును గన్యకాంబరో!!!!

గద్యము. ఇయ్యది శ్రీతుంగభద్రానదీ తీర విరాజమాన- కర్నూల్నగరనివాసి-నిరంతర శ్రీమద్వేంకటేశ్వర చరణారవింద మిళిందాయమాన మానస-వైశ్యర - త్యాంగిరసగోత్రపవిత్ర-ధర్మ పత్నీ కోటాంబికాసమేత-దోమాగోవిందార్యవర్య సుతజ్యేష్ఠుం డును-శ్రీ రామచంద్ర కృపాకటాక్షనిరీక్షణాసాది తాంధ్రగిర్వాణ కవిత్వ కృతపరిచయుండును-శ్రీ బ్రహ్మవైవర్తమహాపురాణ శ్రీ పరకాలవిలాస - శ్రీ బ్రహ్మేశ్వరపురాణ-శ్రీ గౌతమక్షేత్ర మాహాత్మ్య-శ్రీ విష్ణుభక్తి- ప్రేమాభిరామ-శ్రీ ముకుందమాలా - శ్రీ గంగాలహరీ - శ్రీ కనకధారాస్తవ - దూతాంగద - చంద్రకళా సుదర్శనాత్మబోధసుజనత్రయ - శ్రీ సీతాకళ్యాణ శ్రీ మార్కం డేయవిలాస - శ్రీ సిరియాళచరిత్ర శ్రీ నృసింహాధ్వరీయ - శ్రీ మదభినవరామదాస- శ్రీమదభినవ ప్రహ్లాదచరిత్ర-శ్రీరోహిదాస శ్రీగిరిధరలాలచరిత్ర-సుభాగ్యశతక - శ్రీకన్యకాపరమేశ్వరీ శతక శ్రీ వీరరాఘవశతక - సన్మారాద్యనేక-భాషాంతరీకరణ-ప్రబంధ - నాటక-యక్షగాన-శతక-ఖండకా-వ్యోపన్యాసకర్తయును - హరికథా కాలక్షేపనిర్వాహకుండును-నానాదేశ రసికప్రదత్త-శ్రీ మదాంధ్ర విద్యావాచస్పతి - సాహిత్యసరస్వతి - విద్యావినోద - కవిభూషణ - విద్యాసాగర-కవిర-త్నాశుకవితల్ల-జాశుకవితాధురీణ - కవికుంజ - రావధానిపంచాన - నావధానపితామహ - కవిచక్రవర్త్యద్యాదరాం కిత-దోమా వేంకటస్వామిగుప్తచే ప్రణీతంబయిన శ్రీ కన్యకా పురాణపద్యకావ్యమునందు పంచమాశ్వాసము.

# షష్ఠాశ్వాసము

శ్రీకన్యకాంబ! వినత!
ప్రాకట కరుణావలంబ! పరమమునీంద్రా
నీకనుత గుణకదంబ! వ
శీకృత లోక నికురంబ! చిన్మయబింబా!! ౧

అంబరో! వినిపింతు నీ యవలి కతను
నాకలింపు మత్యంతంబు నచ్చెరు విడు
వింతలన్ వింత వైశ్యుల విమలధర్మ
కర్మరతను వాక్రుచ్చు నాఖ్యాన మిదుగొ! ౨

# వీరముష్టి వాండ్రు

నెల నాళ్ళ గడువు గొని వై
శ్యులు రాజు కడన్ గొలంపు యోగ్యత నెటుల
న్నిలుపుట యను నాలోచన
ములఁ బాల్వో కరయుచుండ భూపుం డపుడున్ ౩

పెనుగొండన్ వైశ్యచయం
బును గని కన్నియను వడిని భూపుని కడకుం
బనుపఁ డని తొందఱం జ
ల్పను వే నంపెం దన భటపటలి దిటవుగన్ ౪

ఆ వచ్చిన ఘటు లెంతయు
నీ వైశ్యుల పురికి వచ్చి యిట నీ వైశ్యుల్
పావనధర్మాత్ముల సం
భావన మనగా మనములు బల్వింత గనెన్

వైశ్యనాయకులు దేవళమునన్ సభ దీర్చి
కడుఁ గఠినమగు సంగతిని జర్చ
సేయుచుండియుఁ బురిం జెలఁగియు నిత్యనై
మిత్తికక్రియల కే మేల్మిఁ దఱుగ
క త్రిమూర్తు లొప్పు నగారాళిఁ బూజలు
సత్రంబు లందు భోజనములు నిఁక
విద్యానిలయముల వేద శాస్త్రాభ్యాస
విధులు వ్యాయామంపు వీడు లందు
సాము సాధనం బాయుధ శాలలందు
నల్ల యభ్యాస - మంగ ళ్లనభ్యుదయము
గాఁగ బేరసారంబులు గ్రాలుచుండె
పూర్ణవిభవాన బృహదద్రి పురిని నపుడు

ఆ దానంబుల నల్ల ధర్మముల నాత్రప్రాంచద్దయారీతులన్
శ్రీదైవాఱు త దద్భుతప్రభుతమైఁ జెల్వొందు భాగ్యంబు నిం
పాదిం గాంచిన రాజసైనికుల కత్రబం బయ్యె నీ వైశ్య ర
త్నోదారామలధర్మవర్తనకు నేదో సాటి యన్నట్లుగన్!!

దానం జాల ముదంబు వారు గని యీదానోరుధర్మాదృతి
శ్రీ దైవాఱెడి వైశ్యులేడ? మదవర్ధిష్ణుండు ధృష్టక్రమో
న్మాదుండై తగు విష్ణువర్ధన ధరానారీ వరుం డేడ? యీ
భేదం బారయ నెన్న దోమ లటులం బెం పొందునం చెంచియున్

కామంబు పై కొనం-గాన వచ్చిన కాంత
లను దేఱ నొక పరి ననుపుచుండు
కోప మొప్పఁగ- నేని కొంపనో ముంపఁగాఁ-
బొమ్మంచు నొక సారి ముదల వెటు
ఎంతటి సత్పాత్రుఁ డేతెంచినం గాను
నీక మాచేత నెట్టించి వైచు
నేస్తు రామయొ? యెట్టి గేస్తుభామయొ? కాన
కా క్కాక్క- పరి లాఁగు నొద్ద నొగిని
పొగరు గప్పి సజ్జనులను బోవఁ జేయు
ఓర్వమిని జేయఁ జేయని యొడిక మేది?
అల్ల విష్ణువర్ధను కొల్వు నందు నున్న
ఇట్టివే కద పని పాటు లెంచి చూడ??? ౯

ఆ రాజున్ భజియింప నేల అల దుషాత్యంత దుర్వర్తనో
దార శ్రద్ధను బూన నేల? సుకరో రాఘౌఘఖా జ్వారకా
గారాళిం బడి భ్రమగ్గ నేల? మతిరంగ ద్దాన ధర్మాదివి
స్తారప్రక్రము లైన వైశ్యతతి పజ్జన్నిల్వ మే లాదొకో?? ౧౦

వారాశికన్న గంభీరముల్ గావొకో
యీ వీరుల కృపాద్యహృత్కుహరము?
లొగి మేరువునకన్న నున్నత కఠినమ్ము
గాదె యీ వైశ్యుల ఘన ధృతియన?
నిండుఁ బున్నమనాఁటి పండు వెన్నెల తేఁట
కీ వర్తకుల యశం బెచ్చుఁ గాదె?
మది మాట పని యొక్క మాదిరి యే త్రిక
రణశుద్ధు లీ వణిగ్రాజి గాదె?
అంచు నానందముఁ సైనికాళి యొంది
తమదు జీవితశేష మా ధన్యమయిన
జ్యేష్ఠశైలానఁ గడపఁగా నెంచినార
"లేమి?" టని వైశ్యు లాశ్చర్య మెదలనొంద !! ౧౧

వ. అంత ౧౨

ఆ కుసుముండు లోనయిన
యర్యులు వీరుల వారిఁ గాంచి మీ
రీ కరణిఁ బురాన నిట
నే వసియింతు రి దేల? తేని యా
జ్ఞాకలపంబు మాట యెటుఁ
జల్పుదు? రీ రిటుఁ జేయ భూపుఁ డ
జ్ఞాఁకలఁ బెట్టఁ డొక్కొ మిము
నం చడుగఁ భటు లాఁడి రిమ్మెయిఁ!! ౧౩

ఓ మహనీయులార! వినుఁ
డూరుజులార భవత్కుమారిక
భూమిపు భార్య గా నిడఁగఁ
బోలిన యత్నము వీరు సేయుచే
నేమముతోడ నున్నొ గమ
నింపఁగ నంపె మము న్నృపుండు మే
మీ మెయి నిందు వచ్చి భవ
దిద్ధతఁ గాంచి-కరంబు మెచ్చియున్ ౧౪

ఆ రాజు ప్రజలఁ గారా
కూరంబుల నొందఁ జేయు కుటిలగుణుఁ డటం
చారసి-యల పురి మని-యముఁ
జేరఁగ నే? లనుచు నిందె చేరితి మిట్లున్

పాలన ముంతురొ? నీటం
గూలం ద్రోయుదురొ? మీదు కూర్మినవిడ కే
మీ లా గిట నుందుము - మము
మీ లోపలి వారలనుగ మీ రెంచ వలెన్ ౧౬

వ. నావుడు వైశ్యు లిట్లనిరి

మీరే కాకె వ్వారే
నే రాణ వత్తురేని - నిప్పురమున న
వ్వారికి నవ్వారి సుఖ
శ్రీ రాజిలు నైన నొక్క చి క్కపు డగుఁ- జూ ౧౮

తనకుఁ మాకొమిరెను ని
మ్మని భూపతి తగని కోర్కె నడిగి యరిగె న
ట్లొనరింపఁ దలఁప కే మ
గ్నిని బడఁ దలఁచితిమి వంశకీర్తి న్నిల్పన్ ౧౯

ఇటు మరణ మొందఁ బూనితి
మటువంటి మము నొగిఁ జేరినందున మీకిం
దెటువంటి సుకమొ? పొం దె
ప్పటియటు మీ భూమి పాలు పాలికి మీదన్

మా పయి మీకుం బ్రేముడి
యేపారుట నిజమ యేని నీ మా చావుం
బ్రాపించు తలఁపు తప్పఁ గ
నే పగిదినొ మమ్ముఁ గూర్చి నృపునకు ననుఁడీ. ౨౧

అగ్నిలోఁ బడు యత్నంబు ననుట వీఁడి
యున్న సంగతులం దెల్పుఁ డుర్వీపతికి
మీ కతని బాధ యుండదు మాకు వంశ
గౌరవము నిల్పుకో వీలు గల్గు నిజము

అన విని వైశ్యుల కనిరి భ
ట నికరము కర మడఁకువ గడల్కొన భూపుం
గనఁ బోవు విచ్చు మాకుం
ధనరదు ఘనులార! మేము ప్రాలుదు మిందే ౨౩

ప్రాణాలున్ దాణాలు బి
ఛాణాలుం గోరి ధర్మసరణిన్ పీఁడన్
రాణమొకో? మాహిష కం
ఛాణు జగానన్ ఫలంబు గానంబడదే?? ౨౪

ఈ కలియుగమున ధర్మ
శ్రీకిం దానకము లగుచుఁ జెలఁగెద రీ-ర
త్నాకల మా మతి మీ య
స్తోకహితమునం గను ననుచుం బల్కెదరే??

శ్రీ కన్యాంబామణియే
మాకున్ వేల్పది మొదలు విమలతరములు మీ
శ్రీకీర్తులఁ బాఁడుచు మిము
మా కొలము భజించుత మహిమండలి వైశ్యుల్ ౨౬

అని నంత వైశ్యరత్నము
లనఘులు తద్రాజభటుల యమలతకున్ విం
తను నొంది సంతసించియుఁ
గని రయ్యా! మీ మనంబు లగు మాన్యంబుల్

మా కొలమున్ మీదు కొలం
బీ కలి శ్రీ కన్యకాంబ నెన్నుచుఁ గొలువన్
బ్రాకటమతి మాదు కొలము
మీ కొలముం బ్రోఁచుచుండు మేల్మని మీపైన్ ౨౮

ప్రభలతోడ శ్రీ కన్యకాంబను బొగడుచు
మీ కొలంబు వా ర్కనుపడఁగ మా కొలంబు
వారు ముష్టి వేతుర దగు వీరముష్టి
మీదు వీరకార్యమున కమేయఫలము

ఇటుల మీదు జాతి యిల వీరముష్టి వా
రనఁ దలిర్చుచుండు నార్యవైశ్య
పటలి కెల్లఁ బ్రేమపాత్ర మై కులము లు
న్నంత కాల మిది నిరంతరంబు ౩౧

వ. అట్లు వైశ్యు లప్పటి కని రా భటులలోనే కొందఱు వైశ్యుల యగ్నిప్రవేశానంతరము బాలనగరులతో వారి పితృతర్పణాదులకొఱకు కాశ్యాది క్షేత్రంబుల కరిగి పవిత్ర గంగాజలములఁదెచ్చిరి. వారి సంతతి వారు తెచ్చిన పవిత్రమగు జలములు 102 గోత్రములవారి యిండ్లవివాహప్రారంభములయందుపయోగింపఁబడు నాచారముగల్గు కావున వారికి గంగకావిళ్ళవారు అను పేరుగల్గినది. కొందఱు భటులు శివలింగములం దెచ్చుటకును పెనుగొండపురిలోఁ బ్రతిష్ఠించుటకును బాలనగరులకు సాయపడిరి వారే మైలారులు. వారు శ్రీ కన్యకాపరమేశ్వరీపీఠములతో వైశ్యులపురములకు సంచరించి శ్రీ కన్యకాంబా భక్తిప్రచారము చేయుదురు. వీరు వీరముష్టుల ప్రభల పయిన అమ్మవారి

యొక్కయు నూటరెండు గోత్రికులయొక్కయు శిరంబులను
యుద్ధాయుధములును నలంకరించి యుండును ౩౦ ఎ

విప్రజాతి విప్ర వినోదవితతి గొల్చు
క్షత్రియులను గొల్చు భటరాజప్రకరము
మొగి భజింత్రు వైశ్యుల వీరముష్టి వారు
గొల్చు వారు గొల్లలఁ బిచ్చుగుంటు వారు ౩౧

అంచు సూతుం డనియు శౌనకాదులకును
వైశ్యతతి యోల నెంచి సల్పనయినట్టి
యత్నముంగూర్చి పల్కె నుదారఫణితి
అంబుధరగర్జనం గరం బనుకరింప ౩౨

# మహాయుగాంతర విషయము

సాలంకాయనుఁ డల్ల వైశ్యుల కుదంచ త్సత్కృపం బల్కె వై
శ్యాళుల్! నే నిట మీకుఁ జెప్పునది యన్యంబైన కల్పంబునన్
హాళిన్ మించిన మీ తెఱం గిపుడు నొయ్యం దద్గతిం జర్గెడిన్
వాలాయం బొక యింత యెందయిన భిన్నత్వంబునుం జెందదున్

కావున మీ యనంతర మొకండు భవత్కథఁ బల్కినట్లు లే
వీ విధిఁబల్కు మీ కథ రచించు భవిష్యదుదార వేత్తృతా
శ్రీ విభవంబు మా కెసఁగుఁ జెన్నుగ నీ పయి వైశ్యు లెమ్మెయిన్
భూవరు నిచ్చఁ జేయమికిఁ బూని యొనర్చిరొ? ఆలకింపుఁడీ!!

## కర్తవ్యమునుగూర్చి వైశ్యుల సమాలోచనము

వ. అప్పుడు వైశ్యులు తమలోఁ దా మిట్లు తలపోసిరి

శ్రీమ న్మంగళమూర్తి నేఁడు మన నీ చిక్కుం దొలంగించి స
ప్రేమం బ్రోఁచునొ? యేనిఁజేరుదుమొ? యేవిన్యాసముంగొందుమో?
యే మాద్రిం దలఁపోయు టేల? కడు హాయిం గన్యకాదేవియుఁ
సామాన్యేతర సత్కృపాభర కటాక్షశ్రీల నింపొందఁగన్ ౩౬

ఖలుఁడగు విష్ణువర్ధనుఁ డఖండమహావిభవాభిరామ మై
యలఘుతరంపు ధర్మమున కాదరు వౌ మన వంగసం బహో
విలయముఁ జెందఁజేయుటకుఁ బెక్కువమై మదిఁ బూని యుండె ని
మ్మల మన కన్నె నాతనికిఁ బూన్చుటకున్ మన మొప్ప మేనియున్

కరుణారంగ దపాంగభంగికముగాఁ గన్యాంబికారత్న మా
దరు వౌచున్ మనలన్ మనం జలుపఁ దాత్పర్యంబుఁ దత్పాదపం
కరుహస్థం బొనరింతుమే నిహపరన్యాసంబులం దామెయే
సరిగాఁగన్ మనసుం జరింపఁ బెలుపున్ సందేహ మిం కేటికిన్??

వందనముం బొనర్చెద మభంగురభక్తి చెలంగుచుండ దై
నందిన వంద్యమాన నళినప్రభవాది సమస్తదేవతా
బృంద మనఃప్రమోదద పవిత్రచరిత్ర పదారవిందని
ష్యంది మరందనందిత నతాళికదంబకుఁ గన్యకాంబకున్ ౩౯

వ. అని యా వైశ్యు లెల్లరును తత్పురాంబికా వందారువులై నంతఁ గుసుమశ్రేష్ఠి సభవారికి నమస్కారంబు గావించి యిట్లు వక్కాణించె ౪౦

నా కొమార్తను జననాథుండు వాంఛించె
నాకు నద్ది యిచ్చు గాక యునికి
కిం బ్రమాణముగను గీలిలో నుఱికెద
మీ రనుజ్ఞ యిం డమేయగుణులు!! ౪౧

వ. నావుడుఁ దక్కు వైశ్యులు కుసుమున కిట్లనిరి ౪౨

కుసుమ! నీవు శిఖిని గూలఁగా మే ముండి
దేని నొందఁగలమొ? తెలియ రాదు
నృపుడువచ్చి మమ్ము నేలఁ బెట్టియుఁ గాల
రాఁచి కన్నె మిన్న నాచికొనఁడె?? ౪౩

చనిన నెల్ల వారు చన వలెన్-మనినచో
నెల్లవా ర్మనవలె-నిది ప్రతిజ్ఞ
గాని-యొకరు చావఁగా నొకర్బ్రదుకుట
కాని మాఁట కుసు మగణ్యవైశ్య!! ౪౪

శ్రీదఁ గన్యకాంబను నగరేశు వింధ్య
వాసినిం గోనకమలను బ్రభు జనార్ద
ను గురు ధార్మికాచారంబును దలపోయు
వారు గాని వా రిటనుండి పాఱ వలయు

వ. అంత. ౪౫

## చాటింపు

తేఁపు కన్యావివాహంబు ప్రిదులఁ గలదు
భీతిపడు వారలుండక వెడల వలయు
భీతి లేని దేవీభక్తవితతి యయిన
వైశ్య లీ పురంబందునే పరఁగవలయు

వ. అంత. ౪౮

ఉదయించె నింగినిం బూ
ర్వదిశ నపూర్వతర కాంతిరాజితుఁడై రా
జు దగన్ వైశ్యుల కీరితి
పొదలు నిలం దనదు కాంతిపోల్కి ననంగన్ ౪౯

వ. అప్పుడు.

## ధనదునకు వీరకంకణము

ధనదం డను వైశ్యార్భకు
డనఘుఁడు వయసునకుఁ జిన్నయయ్యు గుణములన్
ఘనుఁడు కయిమోడ్పుతో ని
ట్లను గురువులు! పెద్దలు! మన వాలింపఁదగున్ ౫౦

నా మనవి - మాన్యమున కై
యీ మన మగ్ని ప్రవేశ మిటఁ జేయ న్నా
కోము రహి మొదటి వీడెము
శ్రీ మహిమలు! మీరలు దయసేయుఁడి! పేర్మిన్!! ౫౧

నావుడు వైశ్యు లని "రహో
నీ వనఁ బిన్నవు వయసున నెచ్చగు మేమిం
దీ విధి నించఁబ ముండఁగ
నో వరగుణ! యీతెఱఁ గిది యేలా నీకున్?? ౫౩

అనవుడు ధనదుఁ డను "దీక్ష కరయ వయసు
నకును సంబంధ మొకఁ డున్నె? నాకు దీక్ష
యిం డనఁగ-భాస్కరుఁడు పురోహితుఁడును గురుఁ
డతనికిం దీక్ష నిడ నగు ననితలంచి ౫౪

ఆఱు కాను గాఁకుల-నింక నాఱు పోగు
లింబుగ దగు దీక్షాకంకణంబు గట్టి
పోఁక లా ర్గల వీడెముం బూన్చి వైశ్య
బాలుఁ డగు ధనదున కిచ్చె భాస్కరుండు

వ. అప్పుడు భాస్కరుండు వైశ్యుల కి ట్లనియె. ౫౬

తొలి దీక్షాకంకణ మి
ట్లెలమిఁ గొనిన యీ ధనదున కిడుఁడీ! వైశ్యుల్!
కులగౌరవరక్షకునకు
విలసిలు మీసుకృతములను బెక్కువ పేర్మిన్ ౫౭

హరి హరుల గుళ్లు-రామే
శ్వరముఖ తీర్థముల మీరు సల్పిన పున్నెం
బు రహిం దీక్షాకంకణ
మొరిమఁ దొలిని గొన్న ధనదు నొందుం గాకన్ ౫౮

మఱలఁ జాటింపు
ఆపై దీక్షాకంకణ
మే పుణ్యులు దాల్తు-రట్టి రేతెం డగ్నిన్

వేపడఁగ నంచుఁ జాటిరి
యా పురి ద్వ్యుత్తర శతకులు లగు వైశ్యలకున్

## 612 గోత్రముల వైశ్యులు

అగ్నిలో ప్రవేశింప నౌ ననెడి వార్త
చెవిఁ బడఁగ-నాలు నూ టి రా ర్చెలఁగు గోత్ర
ముల కిరాటు ల్జడిసి పాటి పోయి రెన్ని
యెన్ని దెసల కో పరుగెత్తు నేపు తెలియ ౬౦

## వీరకంకణ ధారణము

దీక్షాకంకణ ధారణార్థ మెవరేదీ? యన్న యన్వేషణం
బీక్షింపం గన రాక రాక నొగి వార్ధిం బోలు బల్ ఘోష తీ
అక్షయ్యంబుగ "నాకిదుం-డిదుఁడు నాకయ్యా!" యటం చొక్కఁడౌ
దీక్షన్ నూ టిరు గోత్రముల్ దనరు వార్ధిపించి రా సై రటన్ ౬౧

## ఆదిశక్తియగు శ్రీ కన్యకాపరమేశ్వరి సాక్షాత్కారము

వ. అప్పుడు. ౬౨

రవి కోటీందుసహస్ర కాంతులను గేరం జాలు ప్రాకాశ్య మొ
ప్పి వియన్మండలి నుండి సన్మునులు సేవింపన్ మహానంతవై
భవ మొప్పన్ సుమణీవిమానముపయిన్ బ్రాంచత్తటి ద్దేహయై
నవలావణ్యముతోఁ గనంబడియెఁ గన్యాంబా మహాదేవియున్

అంతం గేల్దుగలన్ మొగిడ్చి తను నత్యంతంబు భ_క్తిన్ మహా
సంతోషమ్మునఁ గాంచు భ_క్తులగు వైశ్య్రశేణి కా దేవి యి
ట్లింతిం తం చన రాని పేర్మి ననె ''మీ రెల్లర్ శిఖిం జొచ్చుచో
నంతం బొందదె యింతనుండి వరవైశ్య్రశేణి భూమండలిన్??

నూట రెండు గోత్రంబులను నొక యొక్క
గోత్రమున కొక జత గాఁగఁ గొమ్మయుఁ బతి
యునుగ దంపతు లగ్నిలో నుఱుక వలయు
దానఁ జంద్రికాభ యశ మందం జెలంగు ౬౫

# సమాధి సురధుల చరిత్ర సంగ్రహము

ఏ నీ వైశ్యకులంబు నంతటిని హాయిన్ ము_క్తి నందింపఁగా
మా నౌ కారణమున్ వచించెదను సన్మానాన నాలింపుఁ డా
ర్యానేక స్తుతమైన తొంటి దగు కల్పంపు గృతంబందు వై
శ్యానీకేశ్వరుఁ డౌ సమాధి సురధుండున్ భూపుఁడున్ మించఁగన్

వారలలో సురధుఁడు భూ
మీరమణుఁడు రాజ్య మీఁగి మేల్మి సమాధిన్
జేరి ననుఁగూర్చి తపమున్
ఘోరతరంబుగ జలిపి రకుంఠితరీతిన్

వారి తపంబును మెచ్చియు
వారి దరి న్నేను గానఁ బడి రాజునకు
భూరాజ్యము సావర్ణిక
సార మనుత్వము నొసఁగియు సత్కరుణమెయిన్ ౬౭

మఱియు వైశ్యమునివరు సమాధిని గన
నతడు నతుల నుతులఁ జల్పి నన్నలరిచి
నంత వరమును గోరు మన్నంత నాకు
ననియె నాకుఁ వర మ్మేది యనవసరంబు ౬౯

ఎందు కనిన మత్తపమున నే విముక్తి
నాకు నిత్తువు గానఁ దచ్ఛ్రీకతకయి
వేఱు కోర నెందుః కయిన నిలను నాదు
బంధులకు ముక్తి గల్గుటే వాంఛ నాకు

పిత దెస నిరవై నాల్గు గోత్రతతి వారు
మాత దెసను వింశతి గోత్రమండలియును
అత్త దెసఁ బది రెండు గోత్రాన్వయములు
సహజ దెసను షోడశ గోత్రసంచయమును ౭౧

కొమిరె దెసఁ బదొకొండు గోత్రములవారు
మేన యత్త గోత్రములు నెమ్మిఁ బదియును
తల్లి తోఁబొట్టు వష్ట గోత్రములు నిత్య
ముక్తి బ్రహ్మ సాయుజ్యముఁ బొందవలయు

అని వరము వేఁడ నతని కే నంటి నీదు
వంశమునఁ బుట్టి యే మునుల్ పడయ రాని
ముక్తి నీకు నీ వారికిఁ బొరి నొసఁగెద
నంచు నత్యంతకారుణ్య మతిశయిల్ల * ౭౩

---

* ఈ గోత్రములు అతని గోత్రముతో నూటరెండగును

ఆ సమాధియే కుసుమాఖ్యుఁ డయ్యెఁ డిపుడు
ఆ సమాధి కుమారిక యైన వాస
వి యను కన్య శచీ దేవి విమల కళయె
ఆమెయే నేను గా నిఁక నలరఁగలను ౩౪

అల్ల యింద్రాణి నా యంశమ యగు నట్లు
లయ్యె నీ పయి నా తేజ మటను బెంచి
అగ్ని నెపమున మీకు మోక్షప్తి నిడుదు
నేను నగ్ని కుండమున మీతో నుఱుకుదు

వ. అనినంత ౩ౕౕ

అపుడుఁ గన్యాంబతో వచ్చినట్టి మునులు
వైశ్యులను గూర్చి పల్కె రీ పగిది మీర
లంబ కర్పిత యైన కన్యను నృపునకు
నీయనే రా దిడిన యశోహీనత యగు ౩౩

ఈ నూట రెండు గోత్రము
లే నల్వుగ వైశ్యులందు నెసఁగు ననఁగ గో
త్రానీకము ప్రాకృతనా
మానీకయుతం బగుచును నవనిం బరఁగున్ ౩౮

ఈ వాసవి కన్యామణి
దేవినయిన నేన నేఁటిదినము మొదలుగా
ఈ విమల౯ ము న్నిడుకొని
వే వైశ్యులు కుండములఁ బ్రవేశింపుఁ డొగిన్ ౩౯

ఓలిన్ మీ రటులగ్నినిం బడఁగ యత్నోదారులై నంతటన్
జ్వాలాజాల జటాలకీలి శిఖలన్ వా దాఁడు బల్కాంతితో
హేళిన్ శ్రీ నగరేశ్వరాలయముపై నాఁడున్ విమానంబు లెం
తే లాలిత్యముతోడ మిమ్ములను నాయిక్కన్ రహిం జేర్పఁగన్

మీ రటు ననుఁ జేరఁగ నే
తేరఁగ మీ పుత్త్రికాకృతి న్నేను శిఖిన్
దీటియు మిము మత్పదమును
జేరుతు నో వైశ్యులార! శ్రితవరులారా!! ౮౧

ఈ కరణిన్ వైశ్యుల కా
శ్రీ కన్యాంబ యటఁ బల్కి చెందెన్ మాటున్
భీకిం దూరగులై సు
శ్లోకుల్ వైశ్యుల్ ముదానఁ జొ ప్పొంది రటన్ ౮౨

# బాలనగరులకు వైశ్యదంపతుల హితబోధ

వ. అప్పు డగ్నిప్రవేశ మొనర్పం బూనియుండిన వైశ్య దంపతులు తమ బాలకులగు బాలనగరుల నుద్దేశించి యిట్లనిరి. ఓ విరూపాక్షాది బాల నగరులారా! మేము దెల్పుహితం బాలించునది.

ఆత్మగౌరవార్థము నవ్యయామలత్వ
ముకొఱకు మన మిపుడు నిటఁ బూనునట్టి
శిఖి శిఖాప్రవేశంబును జేయ కరిగి
నట్టి వైశ్యులతోడఁ బొం దందకుండు!! ౮౩

కామిరె నిచ్చి పుచ్చికో ల్పవం_క్తిఁ ఘ_క్తి
లోనయినవి వారితోను వలదు
తా దనక యొనర్పఁగా నరకప్రా_ప్తి
రౌరవాదికంబుగా రహించు ౯౬

ఈ శిఖిశిఖాప్రవేశాన కిచ్చ పడక
పాటి పోయిన వారికి వర్ణసంక
రత్వము న్నరకంబును రాఁగల విఁక
వారితో నెట్టి చేరిక వలదు మీకు ౯౭

కొలపుఁ బెద్దటికంబు సత్యమును నోఁగుఁ బాగునుం జూడ కెం
దుల నీలోకపు సౌఖ్యమే కరము సంతోషం బటం చెంచి ది
క్కులకుం బాటిన వార లెట్టులయినఁ గొల్పోదురే కాలు ను
జ్వల దండాహతులఁ గళత్ర సుత బాధఁ దుర్యశో లాభమున్?? ౯౮

మీరు ద్విజులగుట వేదా
చారులు సంకేతగోత్ర చయ మాపద్ధ
ర్మారూఢి నేమమున కే
పారిన నాచారములను బాధింపదెటున్ ౯౯

మన బాలనగరు లెల్లఁ
ఘనమునఁ గన్యాంబయందునఁ హరి హరులం
దును భ_క్తి గల్గి వేదో
_క్తనియతి దగి శుభము లెల్లఁ గాంతురు మిగులన్ ౧౦౦

మానమునకన్నఁ బ్రాణ మ
నూనం బను మాఁట మదిని నూనక మానం
బే నిత్యం బని ధర్మముఁ
బూనిన మీ కిహపరములు పొసఁగు నిజముగన్ క౧

మానము కన్నఁ బ్రాణమె
మానిత మని ప్రాణభయము మానసమందున్
మానని దుర్జను లిహపర
హీనతమై నరకమందు నిక్కం గనరే॥ క౨

అట్టి యెడ్డెలు మనలోన నమరుకతన
వర్ణసాంకర్య మొదవక పరఁగుకొఱకు
యోగ్యతార్హత్వ మెంచియు నొగిని మేన
రికముఁ బ్రోత్సహించినయెడఁ శ్రీకరంబు

అంతమాత్ర మాతులధర్మ మఖిల గతుల
గృత్యమంచుఁ దలంపఁగా నిం పగునొకొ
తగ విశేషస్థితులను బాత్రత్వ మెంచి
చేయవలయు సంబంధముఁ శిష్టరీతి క౪

మాతృసోదరుండు మాతులుం డా తల్లి
కొడుకులు తమ యాఁడుపడుచుల కొడు
కులకు వయసు క్రమతఁ గూఁతుల నిడ నగు
మేనరికపుఁ దీఱు మెకొనునెడ క౫

కూఁతుం గన్నట్టిం డెం
తో తోఁబుట్టు కొడుకుపయిఁ దొరపు భక్తిꣳ
జేతంబునఁ బూన వలెꣳ
ఖ్యాతియు నీతియును నిద్ధి యగు వైశ్యులకున్ ౯౬

అంతమాత్ర మేన యల్లుఁ డెంత యనర్హు
డయినఁ గూఁతు నీయనగునటంచు
మాతులసుత దుష్టమతి యైనఁ గొన నగు
నన్న మాఁట యెంత యర్హ మగునొ! ౯౭

ఒక్క మా టాలకింపుఁడీ! ఉరకలేని
పోని కారణంబులఁ బూని మోహ కామ
ములకుఁ బ్రాధాన్య మిచ్చి మాతుల సుధర్మ
మునకు నెగనామముం బెట్టు టనువు గాదు ౯౮

పట్టి పై యందముల కింపుఁ బడెడి వారు
డబ్బుఁ జూచి ధర్మము నెగద్రొబ్బు వారు
మాతులసుతాతిరస్కారపాతకమున
కుఁ నెటుఁ దప్పికో సాధ్య మగునె? తలఁపుఁడు ౯౯

పెద్ద మేన మామ పి న్నగు మేన మా
మ యను భేద మరయక యెవని సుత
పెద్దదయిన నాఁడ బిడ్డ కొడుకు దానిఁ
బెండ్లి యాఁడ నగును బిన్నను విడి ౧౦౦

మేనమామ కిర్వురు భార్య లైన యెడల
నం దొకతెకు సంతతి యున్న నల్ల సుతకు
మాతులక్రమమునఁ గొనఁగ మానిత మగు
చెల్లె సవతి కొడుకున కిచ్చినను దగును ౧౦౧

దీనుఁడైన జామాతకు మేనమామ
తాను ధనవంతుఁ డైనచో ధన మొసంగి
తన కొమార్తె నిచ్చినయెడ ఘనమ యగును
దీనుఁ డని తిరస్కారంబుఁ బూనరాదు ౧౦౨

అతివ కన్నయును సవతి తల్లికొడుకును
నుండి వారికిఁ గూఁతు లున్నయెడల
దొనఁ గెచ్చు దలఁపక తోఁబుట్టు తనయనే
కొడుకునకుం గొన్న గొనబు గూర్చ
ఇద్ది మాతుల ధర్మ మెంతయు వైశ్యుల
కుఁగ మాననీయమై కుంభినిఁ దగు
యుక్తవయస్సున కుపనయనంబులఁ
గావించి మీపుత్త్రికచయమునకు
వేదశాస్త్ర-పురాణాది విద్యలందు
శర-గదా-శరాసన-ఖడ్గసాధనముల
నాజీ-వీరవిహారంబులందు నేర్పు
గలుగఁ జేసియు వన్నియం గొలుప వలయు ౧౦౩

బేరసారాలం గుబేరు బేరం బాఁడు
నేరుపు మీలోన నెగడుఁ గాక
ఖండఖండాంత రాఖండాపణము లందు
మీకు విఖ్యాతి బలి మించుఁ గాక
శ్రీకన్యకాధీశ్వరీ సేవనిత్యముఁగా
మీయందు మిగుల రాణించుఁ గాక
విద్యాగృహాన్నసత్త్రాద్యమ్ములౌ మేటి
ధర్మముల్ మీవల్లఁ దనరుఁ గాక
వేద శాస్త్ర పురాణ విజ్ఞాదులకును
దేవ భూదేవ సేవానిధి ప్రతతికి
హరి హరాలయ నిర్మాణ సరణులకును
మీరు పెట్టిన పేరులై మించు గాక ౧౦౪

పాండిత్యంబున వీ రపారులు-వణిగ్వ్యాపారమందుఁగా సము
ద్దండుల్ ఖండనభూమియందుఁ గడు నుద్దంతుల్ వివాదాళి ధీ
శౌండుల్ నిక్కువ మన్న కీర్తిని దిశాచక్రంబులం గాంచి మీ
ర్గాండీవి ప్రియసారథిప్రతిము లై రాజిల్లుఁడీ! బాలకుల్!! ౧౦౫

వేదాధ్యయనముఁ గావింపఁ గావింపఁ గా
వింప వైశ్యుల చేవ వెలయుఁ గలదు
వేదాంగ శాస్త్రాది విద్యల నేర్వ నే
ర్పింప వైశ్యుల చేవ వెలయుఁ గలదు

హల సంపదలయందు బల సంపదలయందు
బెరిగి వైశ్యుల చేవ వెలయఁ గలదు
సంగరరంగంబులం గడుం గండ లౌ
లలిని వైశ్యుల చేవ వెలయఁ గలదు!
అనఁగ సత్కీర్తి మీకు నెప్డలరుఁ గాక
ఆత్మగౌరవం బొగిని మీ కలరుఁ గాక
ఎల్ల సిరిసంపదలు మీకు నెసఁగుఁ గాక
సుగుణభరులార! ఓ బాలనగరులార!! ౧౦౬

మనదు విద్యకున్ మన కీర్తికిని మన ధన
మునకు భంగకారకు లయి దనుజు లెచ్చు
కొలములం బుట్టు వా రని పలుకఁ బడియె
ఇద్ది హెచ్చరికం గొనుఁడీ నగరులు!! ౧౦౭

తీర్థాల పేరక్క తిరునామముం దాల్చి
మీకును గుర్విగా మెలఁగునట్లు
మిమ్ముఁ దిట్టెడు వారు మీచేత మన్ననల్
గొంచు చూ రేఁగి రాణించునట్లు
మీలోని వారలే మిమ్ముఁ దిట్టెడి వారి
కిని సాయముగఁ జేరఁ దనరునట్లు
పై వారికిన్ లక్ష లీవిచ్చి లెక్కకు
రాని వార్కొందఱు ప్రబలునట్లు

దుస్థ్సితి కలి ప్రభావానఁ దొడరఁ గలదు
మన కొలమునందు ముందు ముం దనఘలార
మీర లెల్ల జాగ్రత్తను మెలఁగ వలయు
సుగుణభరులార! యో బాలనగరులార!! ౧౦౮

ఎందుఁ జూచిన మీర లెంతయు వేద వి
ద్యావిదు లను కీర్తి తనర వలయు
ఎందుఁ జూచిన మీర లేయించిన తటాక
వని కాల్వసరములు [దిగుడు బావులు] పరఁగ వలయు
ఎందుఁ జూచిన మీర లెసఁగించు చలిపంది
రుల చల్లఁదనము సొం పలర వలయు
ఎందుఁ జూచిన మీ యహీన కర్మాగార
ముల పరిశ్రమలు పెంపొంద వలయు
కఱవు మీ యిండ్లఁ గఱవయి క్రాలవలయు
లేమి యను మాఁట మీ కడఁ లేమి యగుత
వేల్పులకు మీ యెడం గృప వెలయుతఁ గడు
సుగుణభరులార! యో బాలనగరులార!! ౧౦౯

శ్రీ కన్యకాధీశ్వరీ దేవి మీ కెప్డు
బెట్టని కోటయై వెలయుఁ గాక
వింధ్యవాసినితోడ వెలయ శ్రీ నగరేశుఁ
డెపుడుఁ బేర్మిని మిమ్ము నేలుఁగాక

కోనకమలతోడి గో మొందు శ్రీ జనా
ర్దనుఁడు మీ పాలిట నొనరుఁ గాక
బ్రహ్మస్వరూపుఁ డౌ భాస్కరాచార్యుండు
మీ పురోహితుఁ డయి మెలఁగుఁ గాక
అనుచు నెన్నియో రీతుల నగ్నియందుఁ
బడఁగఁ బూనిన వైశ్యులు పరఁగఁ దమదు
బాలనగరులఁ గాంచి దీవన లొసఁగిరి
కర మమోఘాక్షరములతోఁ దిరము గాఁగ ౧౧౦

వ. మఱియు నిట్లనిరి. ప్రతివైశ్యుఁడును తనగోత్రప్రవరాదులయిన దశలింగంబుల నెఱింగి సంధ్యానమస్కారాదులయందుఁ దగిన ట్లుపయోగించుకొనవలయును. ౧౧౧

సహధర్మచారిణీ సంగతి దక్కఁ బ
రస్త్రీ జననిగాఁ దలంపవలయు
దాన ధర్మ విధుల మాన రా దెప్పుడు
గూట సాక్ష్యంబులఁ గూయరాదు
దబ్బఱ లాడఁగ దగదు వానప్రస్థ
మందు భైక్షుకవృత్తి యలరవలయు
శత్రువితతితోడ సంబంధము వలదు
భాస్కరుండు గురుతఁ బరఁగునిష్ఠ

అతని తరము వారి కర్హ్మాతం బట్టి పౌ
రోహితము చెలంగుఁ బ్రోఁది మనకు
మాదు సిరి గురునకు మఱి ధర్మములకు న
గరులకు నీఁక మాదు కర్మలకును ౧౧౨

వ. అని యా యగ్నిని ప్రవేశింప బోవు వైశ్యులు స్వకీయ విత్తోప యోగవిధానంబు నిర్ణయించిరి. ప్రభవ సంవత్సర * మాఘ శుద్ధ ద్వితీయను పెనుగొండపురమునందలి నూటరెండు గోత్రముల దంపతులు, గోత్రమున కొక జతచొప్పున, శ్రీకన్యకాంబా దేవీ సమర్పిత కులకన్యారత్న మానాపహరణ ప్రయత్నము రాజు

* చిత్తూరు శ్రీ వాటంబాటి వేంకట నరసింహం శ్రేష్ఠిగారు ప్రచురించిన పుస్తకములో, సంవత్సరము కలి "2638" అని యున్నది. రాజరాజనరేంద్రుని కాలము నందుగదా ఈ చరిత్రము జరిగినట్లు చెప్పఁబడినది? అట్లయినచోఁ గాలము వేయి సంవత్సరములకు మించి యిటీవలకు మార్చవలసియుండు నని తోచుచున్నది. ఇంకను నీయంశము పరిశీలించవలసి యున్నది. ఇతర పుస్తకములు గూడఁ గొన్ని చూడఁబడినవి. కొన్నిటిలో సమయమును గూర్చి లేనే లేదు. కొన్నిటిలో అయిదువేల సంవత్సరములకు బూర్వమనియు లోనుగాఁ గలదు. ఎంత పూర్వకాల మని వేసిన నంతమంచి దనుకొన్నారేమోః తెలియదు. భాస్కరాచార్యకృత మగునొక శ్రీ కన్యకాపురాణగ్రంథము నందలి లెక్కప్రకారము కలియుగ సంవత్సరసంఖ్య నాలుగువేల ఆరువందల యిరవై అయిదు (4625) అని యొకమతము. అప్పటికి సుమారైదువందల సంవత్సరములక్రిత మమ్మవారి చరిత్రము జరగియుండునని యూహింపఁబడినది. ఇది సరిపడి శ్రీ కన్యకా పరమేశ్వరీ కాలము క్రీ॥ శ॥ 1025 అని తోఁచుచున్నది. అనగా పదకొండవ శతాబ్దము. అదియే బహుశః రాజరాజనరేంద్రుని కాలము. ఏమనఁగా అతని తండ్రి విమలాదిత్య విష్ణువర్ధనుఁడు క్రీ॥ శ॥ 1022 లో కాలధర్మము నొందినట్లు తెలియుచున్నది.

గావించుటవలన అసమాన కక్ష్యాబాధ నెదుర్కొను రీతిగా శ్రీ పర
మేశ్వరి యాజ్ఞచొప్పున శ్రీవాసవికన్యతో నగ్నిప్రవేశంబు గావింపఁ
బూని. ౧౧౩

ఊర నుండినను ఘోరారణ్యముల నున్న
శ్రీకన్యకయె వేల్పు మాకు నగుత
శ్రీనగరేశుండు శ్రీవింధ్యవాసిని
తోడ మమ్ముం బ్రోవఁ దొడరుఁ గాక
శ్రీకోనకమలయు శ్రీజనార్దనుడు మా
చెడుగులఁ దోలి ప్రోఁచెదరుఁ గాక
బాధగురులుఁ గాక బోధగురులు మాకు
నెందు నే వేళ లభింత్రుఁ గాక
నిత్య నైమిత్తిక విధాన నిచయ మందు
మఱి శుభాశుభకర్మలన్ మానసిక వి
కార వారణ జ్ఞాన ప్రకారములకు
భాస్కరాభ గురుల్ మాకుఁ బరఁగఁ గలరు ౧౧౪

వ. అని వైశ్యులు తమ యప్పటి గురుండును బురో
హితుండును నయిన భాస్కరుని చరణారవిందంబులకు నమస్క
రించి తమ బాలనగరులచే నతనికి నమస్కరింపించిరి. ఆతండును
నైహికాముష్మిక సుఖంబు లొందవు నటు లాశీర్వదించె. ౧౧౫

# యామికులు—103 అగ్నికుండములు

వ. అంత వైశ్యులు యామికులయిన నగరరక్షకభటులం గాంచి శ్రీనగరేశ్వరాలయము కడను వైశమే శ్రీ వాసవికి నొక టియు నూటరెండు గోత్రముల వైశ్యదంపతులకు నూటరెండును వెలసి నూటమూఁ డగ్నికుండంబులను ద్రవ్వనది యని యాజ్ఞా పించి వారి కుటుంబంబులకుఁ దరతరంబుగా నుండునట్లు మంచి జీవిక లేర్పరించిరి. యామికభటులు వైశ్యులయాజ్ఞల నిర్వర్తించిరి.

## నగ రాలంకారము

పెనుగొండ పురమునం గే
హనికాయం బెల్ల వెల్లి నలరిచి చలుకుల్
వానరిచి ముగ్గుల బెట్టియు
వనితాపతు లూనిరి నవవస్త్రములు నగల్ ౧౧౩

నానాభూషణ భూషితాంగులగుచు న్నాశీకపత్త్రిశులు
ద్యానంబందలి నీలకంఠవనితా హంసీ నికాయంబటున్
సానంద ప్రకృతిం దలిర్చి రెద కన్యాంబా పదాంభోరుహ
ధ్యానానూనత మానితం బయి కడుం దాపాపహం బైతగన్

నూటమూడు కుండంబులం ద్రవ్వి భటులు
వాని మర్మంబు నూటిరువంశములకు
మాత్ర మెఱిగించియుం గ్రామ మందు బెండ్లి
యంచుఁ జాటించి రందంబు లలరఁ జేయ ౧౧౪

అంతన్ రాజపురోహితుండు జనపుం దంపంగ నేతెంచి య
త్యంత శ్రీకరమైన యల్లనగరిన్ సాలంకృతం గాంచి ని
శ్చింతం బెండ్లికి నాయితం బయితిరే? శ్రీమంతులారా! యనన్
సంతోషంబున వార లుత్తర మొసంగం బొల్చె నీరీతిగన్

"నరవరాచార్య! సర్వసన్నాహములను
జలిపినార మిదంతయున్ సరగ నీవు
నృపుని పాలికి నరిగి వచింపుమయ్య"
అనఁగ రాజగురుం డిటు లానతిచ్చె ౧౨౧

దెబ్బ దిరుగురు పరివార ముబ్బుచుండ
వెంబడిని రాఁగ నేతెంచు విష్ణువర్ధ
నావనీంద్రుఁ డనుచుఁ దెల్పి యరిగె రాజ
ధాని కావార్తఁ దెల్ప భూజాని కచట ౧౨౨

## కుసుమ కుసుమాంబికలు

అంతం గుసుముం డింటికిఁ
జింతం జని కూఁతును గని చెచ్చెఱ బాష్ప
క్రాంతాక్షులతో నిట్లను
సంతోషం బంత మయ్యె సరగ న్నేఁడున్ ౧౨౩

పుత్రకామేష్టినిం జల్పి పుత్రిని గవి
కన్యకంబార్చనార్పితగా నొనర్ప
నయ్యెః బెండ్లి పేరంటాల నరయమి యటు
లుండ నిల నుంటయుం గూడ నుడుగ వలసె!! ౧౨౪

దిరిసెనవంటి మేనఁ దగు దీనిని భీకరవహ్నియందు నే
తెఱగునఁ ద్రోయఁగాఁ గలమొ? దివ్యతరాభరణ ప్రకాశ శో
భరహిఁ జెలంగఁగాఁ దగిన భామ కహో! శిఖికీలికాతతిం
బొరి నగలం బొనర్చునటు బోల విధాత లిఖించెనే? కటా!!

నగలం బూల నొసంగి మేనికి నలంకారంబు గావించి మే
ల్నగుమోముం గని సంతసించుటకు మా ర్గా దుర్గమాగ్ని ప్రవి
ష్టఁగ నిన్నుం బొనరింపఁ బూన వలసెన్ సత్పుత్రిరో! వాసవీ!
యిఁగ నావంటి ఖలాత్ముఁ డెవ్వఁ డయినన్ బృథ్వీస్థలిం గల్గునే!!

వ. అని వాపోవుచున్న తండ్రిం గని వాసవీదేవి తా జాతిస్మరగాన నిట్లు వచించె. ౧౨౭

తొల్లిటి పుట్టుకం దపము తోరపు రీతి నొనర్చు మౌని యా
నల్ల సమాధి వీవనెద-రట్టి మహాత్ముడవైన నీవిటుం
దల్లడిలంగ నౌనె? మరణంబు జనించిన వారికెల్ల వ
రిల్లు విడంగఁ బోదుగద? దీనికి నో! పిత! దుఃఖ మేటికిన్?

దాహమున కగ్గమౌటను * దేహ మయ్యె
శీర్ణతఁ† దగి శరీరంబు చెలువుఁ గాంచు
మృత్యువుఁ గనుట మర్త్యుఁడౌఁ బృథ్వి నరుఁడు
కానఁ జావును గూర్చి దుఃఖం బదేల? ౧౨౯

చలి పందిళ్లకు జేరు పాంథులొగి నాశాబృందమం దుండి వ
చ్చుచులలిన్ భర్తయుఁ బెండ్లము న్నినుగులున్ జుట్టాలుపక్కాలు మి
త్రులునుం జేరుదు రెట్లుఁ బాంథు లల నీరుం ద్రావి వే బోదు ర
ట్టుల వీరున్ ఋణ మీఁగ వేఱగుట యేఁడుం గా దనన్ శక్యమే??
దేహంబె యాత్మ యనుదు
ర్మోహము వీడంగ నాత్మ పూర విశుద్ధిం
దా హవణిల్లు న్నిత్యము
దాహమ్మున్ జ్యుతిఁ గన దని తద్దయుఁ దోచున్ ౧౩౦

పుట్టుట చచ్చుట పొనరు దేహమునకే
ఆత్మ నిత్యుండు నిరంజనుండు
శాంతుఁ డా యాత్మను శస్త్ర మేదియుఁ గోయఁ
జాలదు భయము లజ్జను గనండు
అనలంబునం గాలఁ డనిలంబునం దాఱఁ
డైన మాయా బద్ధుడై జరామ
రణ భయాదిక సంసరణ వికారము లొందు
స్వాత్మానుభావంబు సరగ నొంది

* దహ్యత ఇతి దేహః
† శీర్యత ఇతి శరీరః,

స్వస్వరూపంబు నారని సౌఖ్యమొందు
జీవునకుఁ బరమాత్మకే చేటురాదు
కుల మహత్త్వ సంస్థాపక సలలిత పటు
ధర్మమున కిత్తము శరీరతతిని శిఖికి ౧౩౨

వ. ఇట్లు పల్కి సాక్షాత్తు కన్యకాపరమేశ్వరిగానే యేర్పడిన యా వాసవీకన్య తండ్రికి జ్ఞానోపదేశంబు గావించి నంతనతండు జాతిస్మరత్వంబును భూత భవిష్య ద్వర్తమానంబులఁ దెలియు శక్తిని బడసి—యానంద మయుం డయ్యె.

అంత దనుక బాష్పంబువు
సంతతధారఁ దగు కుసుమసతి యా కుసుమా
కాంతకు స్వాంతము శాంతి ని
తాంతమ్ముగఁ గాంచెఁ దెల్వి తగ లాభించెన్ ౧౩౪

# అగ్నివేదికా ప్రదేశము

నూటమూఁ డగ్నివేదికల్ నొగిని దనరు
అల్ల శ్రీనగరేశ గేహాంతిక స్థ
లమునకును సతీసుత సమేతముగఁ గుసుమఁ
డేగె–నప్పటికే వైశ్య లెల్ల వచ్చి ౧౩౫

దంపతీసమేతంబుగాఁ దత్స్థలమున
జేరి యుండిరి కులగౌరవోరుదీక్ష
కరములన్ వీరకంకణాల్ కరము మెఱయ
అగ్నిసిద్ధి కాళయు, నాళయములఁ దనర
నూటరెండు గోత్రంబులను దగు దంప
తుల జతలు ధర్మమయపీఠములఁ దమ తమ
కుండముల పొంతఁదగ నల్ల కుండ నికర
మధ్యమున నొప్పె వాసవి మహితపీఠి ౧౩౭

నానా రత్న లసత్ప్ర
తానీకముపైన మణిమయాలంకృతి శో
భానూనదంపతులతో
నా నెలవు తగె భయతమగు నాకస మనఁగన్
అందఱి మోములఁ జిఱున
వ్వందముగాఁ దగుటను నరు ణాంభోజాతా
ళిం దగఁ జంద్రాతప మిం
పొందిన రహి యందుఁ గాన నొప్పొందె నటన్ ౧౩౮

## వైశ్యుల సందేహము

వ. అప్పుడు వైశ్యులు మనంబులయం దిట్లు సందే
హించిరి—— ౧౪౦

ఈ వాసవి యగ్నిఁ జొరం
గా వెస సమ్మతపడునొకొ? కా కంగనలం
దావేశిలు చపలత నెటు
గా వర్తించునొ యెఱుంగఁగా వశమొకొ౯ ౧౪౧

వ. అని యనుమానించు వైశ్యుల తెఱంగు నంతయును సర్వేశ్వరియును సర్వజ్ఞయును నయిన సాక్షా చ్ఛ్రీ కన్యకా పరమేశ్వరియే యయిన యవ్వాసవాంబ వైశ్యుల కిట్లాడెడి.

ఏ నా శ్రీకన్యాంబిక
నీ నాటను నుండి వాసవీద్ధాభిఖ్యన్
మానుగను వాసవాంబిక
నా నెసఁగెద నర్యులార! నలువును వినుఁడీ ౧౪౩

మాయామయ నగు నా చే
నీ యగ్ని వెలుంగు నిందు నేఁ జొఱ మది భీ
త్యాయత నగుదు నటంచు౯
మీ యాశయములను శంక మేకొన నేలా??

కులదేవతనై నాకుల
మెలమిం గారవముఁ జెడెడి నెడ నూఱక నే
నొలయుదునె? మానరక్షం
జలుపనె? ఖలరాజు శిక్ష సలుపనె? భక్తుల్ ౧౪౫

# జ్ఞానదృష్టి ప్రదానము

నాదు మాట లేల? జ్ఞానదృష్టిని మీకు
నిత్తు- రాఁగఁ బోవు నేమి? యేమి?
యనెడు వానిఁ గనుఁడి యనఁగ వారికి నెల్ల
జ్ఞానదృష్టి గల్గెఁ గరము వింత ౧౪౬

వ. అపుడు

అటఁ గన్యాఁబిక తోడఁ దాము శిఖివేద్యంతస్థలిం జేరు టు
త్కటచింత న్నృపు నెత్తి ప్రీలుటయు శ్రీవారాణసీయాత్రకుఁ
బటు భక్తిం జని వచ్చి యింపున విరూపాక్షుండు పట్టంబు నొం
దుటయుం లోనుగ వారు గాంచి రురుసంతోషాన దద్దృష్టిచేఁ

వ. అంతట నక్కీర్తి (వాసవీ) కన్య వైశ్యులం గాంచి
యిట్లనియె. గాంతలం గూర్చి మీ రనుమానించుచున్నారు. ౧౪౭

బొంకుటెంకి మనంబుపోలును గులిశంబు
భయము శూన్యంబు; కాపట్యమెచ్చు
నీటదీసిన వెన్న నిక్కంబు; వంకర
నడక; కరుణ కానబడదు సుంత
వారి పలుకు లెల్ల వారిపై వ్రాఁతలు
స్వాంతంబులెన్న వజ్రాయుధములు"
అని పొత్తముల యందు ననినా రటంచు న
న్నట్టి దానిగ నెంచి నారె మీరు??

కాక కోకిలముల్ నల్పుగా దగియును
కోకిలమును కాకికి సరిగూర్ప నగునె ?
నేనె మాయ-నామాయ నిజ్జగంబు
నడచు; నాదుభక్తుల మిము విడను జుడి ! ౧౫౦

అని వాసవి తన రూపం
బును కన్యాంబాత్వము తన ముఖ్యాశ్రితులై
పొనరెడి వైశ్యులకుం జూ
పెను వారలు భక్తితోడ మ్రొక్కి నుతింపన్

కోటి సూర్యులఁ గేరు మేటి తేజంబును
గోటి చంద్రుల మించు మేటి చలువ
కోటి తటిత్కాంతి పాటిగా గల్గి బృం
దారక బృంద సేవారచనల
కానందమందు స (న?) దానందకందమై
నట్టి జగన్మాత యయిన కన్య
కాంబ-వాసవి కన్యయందు జూపట్టి వై
శ్యనికాయ మెల న్ భయాంచితముగ
పరమ సంతోష మంద నంబామతల్లి
వారలం గాంచి యిట్లులం బల్కె వారు
నోటమాట యటన్నది వాటపడక
కన్నులర్పించి చూచుచు గ్రాలుచుండ ౧౫౨

మానవంతులు మానరక్షానియతికిఁ
బ్రాణములనైన లెక్కకుఁ బరపకుండ్రు
ఇందుకుఁ వేదవతి కత పొందు నొక్క
యింపయిన యితిహాస మాలింపుఁ డీరు ౧౫౩

# వేదవతీ చరిత్రము

వేదవతి నామె పిత యా
శ్రీదయితున కిచ్చి పెండ్లి చేయఁదలచియుఁ
దా దేవపురికి నేఁగన్
వేదవతి పితమతిఁ జేయ వెసను దలఁచియుఁ ౧౫౪

వెన్నునిఁ బెండ్లి యాఁడుటకుఁ బేర్మినిఁ జెందియు విష్ణుపేర్మికై
యున్నతరీతిమైఁ దపము నూనె మహామునులుఁ సురల్ కడుం
బ్రోన్నత మద్ది యం చనఁగఁ బోలఁగ నప్పుడు రావణుండు తాఁ
గన్నన నద్దరిం జనుచుఁ గాంచెను వేదవతీ శుభాననఁ

లేతసూర్యుని మేలి యాతపకాంతిని
నాతపః కాంతిచే నవఘళించి
నల్లని కృష్ణాజినంబును నార చీ
రధరించి యర్ధచంద్రకళ బోలి

గబ్బి గుబ్బిలఁ బ్రేమ కలిమిచే సన్నని
నడు మసియాఁడుచుం దడఁ బడంగ
సరగఁ గర్ణాంత విశాల నేత్రంబులు
నల్లి కల్వల చూపు లల్లనీన
అందచందాల బరిణయై యలరు చాన
పరమ పావనతా నిదాన రుచిరాంగి
రంగు బంగారు నెమ్మేని రమణి మిన్న
యల్ల వేదవతిం గాంచి యసురవరుడు ౧౫౭

వ. రావణుం డా పడంతి కిట్లనియె. ౧౫౮

మెచ్చితి నీదురూపమును; మేల్మిని చానలమిన్న! నేనన౯
హెచ్చిన దానవాగ్రణి నహీఁనుఁడ రావణుఁడన్న పేరితో
నచ్చరిత ప్రకారమునఁ జయ్యన లంక నెసంగువాఁడ; బల్
మచ్చిక నీపయిం గలిగె లాలన పాలన సేయవే నను౯

పువ్విలుకాని బాణమున ముద్దులు గుల్కెడి కన్నె మిన్న! నీ
వెవ్వతె? విందునుం దపము నెందుకుఁ బూనితి? వెమ్మెలాఁడి! నీ
వివ్విధినిం గఠోరనియమేద్యతఁ గాంచుట యర్హమొక్కొ; నీ
దివ్వకు నన్నువంటి ప్రియుఁ జేరి స్మరోద్ధతి నార్పఁగాఁదగున్

అని లంకాపతి మారబాణహతుఁడై యాలేమ వేణీభరం
బున లాగంగను నాఁగ రాని రుష దత్ఫుల్లాంబు జాతాక్షి క
త్తిని న క్కేశము లల్లఁగోసి కనులన్ తీక్ష్ణత్వ మత్యంతమై
తనరన్ రావణుఁ జూచి యిట్టులనె నత్యంతావమానార్తయై

ఏనొక పెద్దనంచు నదనిందిత రూపుఁడ నంచుఁ బల్కు దు
ష్టానయశీల మూని - నను నంటిన నీచవు నీవు తాఁకఁగా
నైన మదీయదేహమును నగ్నికి నప్పన మాచరించియుఁ
బైని జనిన్ భవత్కులము బాడొనరించెద మూలముట్టుగన్ ౧౬౧

అని మరు జన్మమందునను నల్లలితాంగి విదేహరాజనం
దిని యయి లంకసర్వమును నిర్మథనంబును బం క్తికంఠుతోఁ
గను కత మయ్యెఁ దా శిఖిశిఖన్ మనమోలిఁ బ్రవేశమైన యం
తను నరనేత శీర్షము తునాతునకల్ గనునై మృతిం గనున్

## శ్రీ కన్యకాంబ పేర్లు

ఈ వాసవి యను కన్యక
తేవం దగు రూపునను గడిందిగ మీతో
బావకునందుఁ బ్రవేశము
గావించుట "వాసవి" యనఁగా బేరుఁ గనున్ ౧౬౩

అంతెగాక-వాసవి-వాసవాంబ యనఁగ
కన్యకాంబ-వాసవకన్య-కన్యకాంబి
క యను పేర్లతో నర్చనం గాంచు తాను
గొల్చు భక్తులరైన మీకు రహి నిడఁగ ౧౬౪

వాసవితోడన్ భస్మపు
రాసులు దా మ్రగ్గె వైశ్యరాజి యని యొగిం
దాసతి విన్నంత నృపతి
వే నచ్చు శిరంబు పగిలి వే వ్రక్కలుగన్ ౧౬౫

అని వాసవి యన్నంత ది
విని సురదుందుభులు మ్రోసె వెస వైశ్యులు గే
హనికాయ మేఁగి దేవికిఁ
గనికర మెసఁగంగఁ బూజ గావించె రహిన్

శ్రీకన్యా పరమేశ్వరి
యే కడిఁదిగ వాసవిగను నెసగం గన నెం
తో కన్నుల వైకుంఠం
బై కనుపించెనని వైశ్య లందముఁ గనియున్ ౧౬౬

శ్రీనగర శంభునకు మ్రొక్కి చెలఁగ వింధ్య
వాసినికి జోతలిడియును బద్మనయనుఁ
డగు జనార్దనుఁ గొల్చియు నొగిని గోన
కమల పాదంబులకు నతిం గణఁకఁ జల్పి

అప్పుడు వైశ్య సతీపతు
లప్పంకజనేత్ర వాస వాంబయుఁ గడు మే
లొప్పగ నభ్యంజనముం
జొప్పుగఁ గావించుకొనియు సొంపు దలిర్పన్ ౧౬౭

అటులా వాసవి కిన్నిమజ్జనము నుష్ణాంబు ప్రతానంబునం
బటుసౌగంధిక వస్తుయుక్తముగ జల్పం జేసియున్ భూషణ
చ్ఛటతో భూషితనుం బొనర్ప నలి వాసవ్యాఖ్యయా దేవి యె
క్కటి సౌందర్య మదెంతయేనియు జగత్కళ్యాణమై చొప్పడెన్

అటులన్ మంగళ మజ్జనంబులను వైశ్యశ్రేణి గావించి యె
క్కటిమై భూషణభూషితాంగులయి వీఁకన్ నైజ మధ్యంబునన్
జటులాక్షీమణి యల్ల వాసవి తగన్ దా రేందు లేఖాసము
త్కట శోభాయుతమైన నింగివలె రంగారెం దదర్వ్యాఘమున్

ఏనుగంబార్ల హారు లెసగించిన శక
టాలపైన గుఱ్ఱాల నెల్లఁ దగు బండ్ల
మీద నెక్కి యేతెంచిరి మేల్మి వైశ్య
లగ్నిగుండాల దరికి నెచ్చైన రహిని ౧౭౩

కుసుమ సెట్టియు నలసతి కుసుమయు సుత
వాసవీదేవి యేను గంబారి పయిన
నెక్కి మంగళ ధ్వానంబు లెసఁగుచుండ
నగ్నిగుండాల కడఁజేరి రప్పు డెలమి

వ. అంత ౧౭౪

అందుకు నేగుదెంచి రపు డందఱు వైశ్యుల లేమ లెల్ల నా
నందముతో నురోజ జఘనంబుల ప్రేఁగుమెయిన్ వణంకు గా
నందముతోడ, నంచ నడయందలి పొంకముఁ జక్క దిద్ద నౌ
సుందర మందయానముల, సొంపుమెయిన్ శరదిందు చంద్రికా

నిందన మాచరింపఁగల నిర్మలసుందర మందహాస రో
చిం దళుకొత్తు మోములనుజెల్లరె! నా-జలజాత కర్ణికా
శిందమరంద బిందువుల లీలలతోఁ బికకీరశారికా
శిం "దమ యంక పొంక మొక లెక్కయె?"యంచనువాఙ్మనోజ్ఞత౯
నందన కాననాంతర కనద్విబుధాబ్జముఖీచయంబు దై
నందిన సేవఁ జల్పు సురనాయికకై చన నౌ తటిల్లతా
బృందమునా విభూషణ పరిష్కరణంబున నంబరాళిచేఁ
జంద మ దెంత యేనియుఁ బసందు మెయిం దగ నొప్పుచున్న వా
రందున నొక్కరామ మొగమందున గ్రపపుఁ జూర్ణ మూని పూ
ర్ణేందు ముఖీత్వమున్-మఱొక యింతియు మోమునఁ జందనానబల్
పొందు మెయిన్ బరాగభరపుల్ల జలేజముఖీత్వము౯ మొద
ల్లిం దగు, నంకపొంకము నిగారముగాఁ దగు వా రవారి భ
క్తిం దగఁ గన్యకాంబను నొగి౯ మది నెంచి, వసంత మాఁడి, మేల్
దుందుభిరావముల్ చదలి తోడను వియ్యము లందుచుండ బే
ర్మిం దనరారు చక్కడి కరింగమ భంగిని జేరి రిమ్ముగ౯ ౧౭౫

వ. అప్పుడక్కడ దంపతు లెల్ల రు నట్లుఁజేరి ౧౭౬

మమ్ముల బ్రోవగావలె నుమాపతి యా నగరేశ్వరుం డిఁక౯
మమ్ములఁ బ్రోవగావలెను మా పతియైన జనార్దనుండును౯
మమ్ములఁ బ్రోవగావలెను మా యిలు వేల్పగు కన్యకాంబయున్
శమ్మది మా కెసంగఁగను శత్రుసకు౯ బటుభంగ మేర్పడన్

వ. అని వైశ్యులు ప్రార్థించినంత శ్రీవాసవీరూపంబున నట వేంచేసి యుండిన శ్రీ కన్యకా పరమేశ్వరి బాలనగరుల నుద్దేశించి, యితః పూర్వము మీ పెద్దలును నేనును గావించిన హితోపదేశంబులను మఱువవలదు, ఈయగ్ని ప్రవేశంబున మీ పెద్దలును మీరును పరిశుదులరు. మఱియు మన పెండ్లిండ్లలోఁ బంచస్తంభప్రతిష్ఠా గౌరీపూజా-కంకణధారణ-బంధు మర్యాదా-దేవతాపూజా-నాకబలి-పుంసవన-గోత్రపూజా విధానములు, గోత్రతాంబూల విధానంబులు మొదలయిన పద్ధతులను గమనించునది. మనయందు గౌరవాభిమానంబులు లేని వారికడను నీతి విన్యాసహీనులకడను ఈ నా చరిత్రను వినిపింపరాదు ౧౭౮

విత్తాపహారంబు దత్తాపహారంబు
సత్యా విచారంబుఁ జలుపరాదు
అగ్నికుండములందు నర్భ్యఁ లన్నట్టిది
మీ రెన్నఁ వేర్పుండి మేల్మితోడ
కుండ ప్రవేశంబు గోమరుగా నెంచని
వారు కృతఘ్నులై పరఁగఁగలరు
ఆచారదూర మై ఆచార్యబోధన
హీన మైన పని గావింపఁ జనదు
వర్ణ గౌరవార్థం బగ్నిఁ బడినవారి
కీర్తియుఁ జనినవారి యకీర్తియు నిలఁ
బున్నమ నమాసనుం బోలి పొనరగలవు
అరవిందుతారకము-బా లార్యులార!! ౧౭౯

# వైశ్యకవీశ్వరులు

నా కవనము నాక వనము
గా కది కాకవనమగునె? కాకవికాయు
క్కోకిలకుల కలరవముఁగ
లాకలన దగు!! నను సుకవులన్ మీ ర్గనుడీ!!

పుట్టిన నాటినుండి సిరి పోలగ సాటి కిరాటులట్లుఁ దా
నెట్టనఁ బూని యుండిన గణింపఁడె? యమ్మెయిఁ గాక కడ్పు వా
కట్టియు నే కదీక్షమెయిఁ గై తన బూజన మాచరించు వాఁ
డెట్టి మనోజ్ఞ గౌర (వ) మునకేనియు నర్హుఁడు గాఁడె మిక్కిలిన్
మీ కూర్చిన విత్తంబులు
మీ కట్టిన మేఁడలు నిల మేకొను నెలవం
దే-కాని-సుకవికృతి రహి
వాకొను భువినెల్లఁ దిరిగి ప్రాంచత్కీర్తిన్ ౧౮౩

సుకవీం ద్రాశీర్వాదము
ప్రకటంబగు మోదము నిడి పాపము మాఁపున్
నికరంబగు సత్కీర్తిన్
బ్రకటము గావించు నిల నిరంతర రీతిన్

మీలోనో? మీజనంబుల
నో లలి సుకవన విలాస మొప్పని వారల్
వాలాయ మున్న మాత్ర బు
ధాళిని దత్కవి కృతి వెల యందదు లోటున్ ౧౮౪

నూటికిఁ గోటికి నొకఁ భువి
బాటిగఁ గవితను ముదంబు బడయన్-గవితా
ధాటిఁ గలవార లనఁ బది
కోటుల కొకఁ డయిన నుండఁ గూడునొ లేదో!! ౧౮౪

ఉండెన్ మాఘుడు కాళి(శ్రీ)
తుండాదిగఁ గవు లతనికిఁ దోఁచి రొకరహిన్
దండిగఁ దత్కృతి కృతి యె
వ్వం డొ సలిపి యతని పేరఁ బరపెనఁట బళీ!!

అసురులు కలి భువిని నవనీసురాది జ
న్మంబులంది మన కొలంబున మన
కె వివదింపులఁ బొడమింతు రెవ్వని వ్రేల
వానికన్నె పొడువఁ బరసినట్లు ౧౮౬

సకల పాపములకుఁ జక్రవర్తియ యగు
నరసికతతి మ్రోల సరసకవితఁ
జెప్పు టనఁగ మనదు చెట్టుఫలం బట్టి
సుకవులు మనలోనఁ జొప్పడుదురు

కవిత లేనియెడలఁ గాలంబునుం దాఁటి
యశముఁ గాంచ నాస యలరఁ బోదు
స్వర్గ ఫలము సున్న సంఘంబు వారికి
సుకవి గౌరవంబుఁ జూపకున్న ౧౮౮

# గురుకృతజ్ఞత

ఇహాపరములు మన కేర్పడ
గహనతమస్సున నినుండు గల్గిన యిటు మే
టి హావణిలె గురుఁడు భాస్కరుఁ
డు హృది నతని మే ల్మఱవకుఁడు నగరువరుల్!! ౧౯౦

మా వెనుకన్ మిము వేద
శ్రీ విధి నడచికొనఁ జేయు శిష్టుఁ డతని మీ
ర్భావంబున గారవముం
గావింపవలెం జగంబుఁ గడుఁ మే లనగన్ ౧౯౧

# శ్రీ వాసవాంబా పూజావిధానము

బొటనవ్రే లంత రూపంబుఁ బొనరిచియును
ఫుల్లనీలోత్ప లేక్షణంబులఁ దలిర్చి
దక్షిణ కరాన బోఁకలఁ దదితరకర
మున నభయముద్ర గలవాసవి నెఱీఁ జెలఁగు

అగ్నికుండ సంజాతనై నట్టి ననుఁ బ
సపుఁబొడిని నుంచినన్ శోభ సరగ నిడి సు
ఖంబు యశముఁ గ ంతుఁ బాపంబు లడఁతు
శ్రితులకు నిరంతరంబు సత్కృ పనుఁ బూని ౧౯౩

నగరేశ్వరునకు వింధ్యనివాసికిఁగోన
కమలకును జనార్దన ప్రభునకు
అర్చాస్వరూపంబు లలరించి యటను శ్రీ
చక్రంబు నో బాలచక్రమునొఁత
నర్పించి నన్నుటం దనరించి పూజించు
వారికి నెల్ల సంపదల నిడుదు
శారద నవరాత్ర జాలంబున న్నన్నుఁ
బూజించువారికిఁ బొనరు శుభము

లెల్ల నట్టి రీతిని నడ్డగించు వారి
యఖిల శుభములను హరింతు నర్యులార
యింపయిన నా నిసుంగు! లాలించినారె?
మీ కఖిల సుఖంబులు గల్గు మేల్మితోడ! ౧౯౪

# శాపము

వర్ణస్థులలో నుత్తమ
వర్ణస్థుల మనను లెక్కఁ బరఁగింప కెదఁ
బూరాహంకృతి నవమతి
వర్ణానకు నిడిన తేఁడు పడయున్ శిక్షన్ ౧౯౫

తేఁడను తేఁడు "నాఁగ సుధరిత్రిని ధర్మముఁ బ్రోచు ప్రోడయే
తేఁ డటుఁ గాని నాఁడు నొక వృక్షముగా శుభమిచ్చునట్టి మా

ఱేడును ఱేఁడె? పక్షితతి లెక్కను గొంచెము వాసిఁ గన్న పూ
ఱేడును ఱేఁడె? కూళ యగు ఱేనిని ఱేడననేల గోడుగన్ ౧౯౬

విష్ణువర్ధనుండు వెస మన యగ్ని ప్ర
వేశవార్త తెఱఁగు విన్నదె - తల
వేయివ్రక్కలుగను వ్రీలి చావఁగలాఁడు
వాడు చన మన విభవం బెసంగు ౧౯౮

వ. అని ఘోరాతి ఘోరంబుగా సమస్తలోకంబు దద్దరిల్లు నట్లు సగర్జనంబుగా శపించి యగ్ని ప్రవేశంబునకు వైశ్యదంపతులకు నాజ్ఞ యొసంగె.

# అగ్నికుండ ప్రవేశము

ఆ యంబ యానమేరకు
ఆ యర్య సతీపతు లగ్నిం బడఁగా
ఆ యురు కుండంబుల శిఖి
యే! యుష్ణతఁ బూనకుండె హిమశీతలుఁడై ౧౯౯

శ్రీవాసవీ చరణ పంకజ భృంగరూపుల్
గా వైశ్యులన్న శిఖిఁ గాల్చునె? కాక వారి
తేవం దదాస్యములు వాఁడవు టీకు హెచ్చె
సావేశ మోదమునఁ జిర్విగ వందమొందెన్ ౨౦౦

# అగ్నిదేవునకు వాసవీదేవికి సంవాదము

అగ్గికుండమందుఁ గూలినట్టి వారు గారు వీ
ర్వగ్గె గల్గి పూనినారు వారికేళి "నాఁగ వా
రగ్గి కుండ మందునుండి యాశయాలఁ గొంకగా
నిగ్గుగాఁగ దేవి యగ్గినిం బొనర్చెఁ బ్రశ్నము॥ ౨౦౧

# భృగుపత్నీ విషయము

సరగ నపు డగ్ని వాసవి సన్నిధిఁ గను
పట్టినంత దాహకశక్తి పరఁగ కునికి
కత మడుగ నిట్లు శిఖి పల్కె "గణ్యులార!
తొల్లి భృగుముని నన్ను వర్తిల్లఁజేసి
నిండుచూలాలు తనయాలిని స్వగృహాన
నుంచి నన్నటఁ గావలి యుంచి వనికి
బోఁ బులోమాసురుఁడు వచ్చి పోరి నడుగఁగ
"వాడు శుక్రుచ" ట్టని యున్న వార్త యంటి ౨౦౩

వ. అంత

వాఁడు భృగుసతిం బట్టు భావంబుఁ జూప
నామె తొమ్ము మోదుకొనియు భూమిఁ బడగ
నామె గర్భంబు జాఱఁ బుట్టిందెఁ గొడుకు
చ్యుతిని గనుటం జ్యవనుఁడని యొప్పఁ బేరు ౨౦౪

వ. పిమ్మట ౨౦౬

భృగుముని వనినుండి వచ్చి యింతివల్ల
నే మయిన దాలకించి రోషించి నన్ను
సర్వభక్షకుం డగు నట్లు శాప మీయ
శంభుకృప వల్ల నాకు నాశాప మీఁగె ౨౦౭

ఒక్క ఋషియె నా కింతటి చిక్కు నిడఁగ
ఈ మహా వైశ్యములను నిందుఁ గాల్చి
యెంత చిక్కును గొంతునో యెఱుఁగరాదు
కాన శైత్యంబునం బొల్తుఁ గడఁగ నిందు ౨౦౮

## అగ్నికి సమాధానము

"తలిదండ్రులకు సపర్యలను జల్పెడివాఁయ
గురుదైవభక్తు లకుటిలమతులు
ధర్మ సత్యప్రవర్తనులుఁ బ్రియంవదుల్
వివిధ విద్యావిదుల్ విమలమూర్తు
లయిన మిమ్మేమి? నే నాహుతిం గొనుటేమి?"
యని యగ్ని వచియింప నర్యులెల్ల
అగ్ని దేవుని కని "రయ్య! నీవన్న సం
గతి నే టిదియు వేఱు; కడఁగి మేము

కన్యకాంబా పద బ్జాంతికంబుఁ జేర
నెంచి నీలోఁ బ్రవేశింప నీ ప్రయత్న
మూనితి మన - యగ్నియు సమాధాన మొంది
శిఖలఁగొల్పి వారిని లోనఁ జేర్చికొనియె ౨౦౯

# మణిద్వీప కైలాసముల సందర్శనము

గొనబుగ నూటరెండయిన గోత్రములై తగు వైశ్యు లెల్ల న
య్యనువునఁ గన్యకాంబ నెలవౌమణి దీవిని జేరి యల్ల వే
ల్పునకుఁ బ్రణామముం జలిపి భర్గజగంబు వికుంఠ మేఁగి యం
దున శివు గేశవుం గని సతుల్ పొనరించి రహింప నేర్పడెన్

అపు డచ్చెరువుగ నింగిం
జపలావల్లీ దినేంద్ర చంద్రోర్బుద కాం
తిపరిష్కారంబుగ దేజోక
డపు రూపముగఁ గనుపట్టె నన్నిసుఁగులకున్ ౨౧౧

వా రరసి చూడఁగా వృష
భారూఢుఁడు చంద్రమౌళి యహిహారుఁడు గౌ
రీరమణీ విఘ్నేశకు
మారయుతుఁడు మారహరుడు మాధవహితుఁడున్ ౨౧౨

అగు శంకరుఁ డగు పట్టగ
నగరులు శిరములను వంచి నతులం జేయం
దగ శ్రీవాసవి కన్పడి
"నగరేశు నితని నుతించు నగరులు! వినుడీ!!"

అని శంకరు శ్రీకన్యాం
బ నగరులు తఱియించు కొఱకుఁ ప్రస్తుతి సల్పెన్
"గానముల నెల్ల నొసంగుట
కనఘుఁడు మన తండ్రి శివున కన్యం దేడీ!! ౨౧౪

ఎల్లలోకముల సృష్టించి రక్షించి ల
యించు కృత్యముల గావించువాఁడు
స్థావర జంగమాత్మక విశ్వమును దన
యానం జరింపఁ జేయ నగువాఁడు
హరిహ రాభిన్నత కాల వాలంబయి
తనుఁ గూర్చియె తపానఁ దనరు వాఁడు
అగజాపుఁ డగచాపుఁ డపహృతపాపుఁడు
ధరణీ రథుఁడు పురహరుఁడు హరుఁడు
నయిన శివునకు మ్రొక్కెద నచలభక్తి"
ననెడి స్తోత్రాన శంభున కర్చన యిడు
వారి దొసఁగు లన్నియుఁ బటాపంచ లగు న
టంచు శ్రీవాసవీదేవి యానతిడియె ౨౧౫

వ. అప్పుడా దృశ్యం బంతయు నంతర్ధానం బొందె. నద్దివ్య దర్శనంబుం గాంచి బాలనగరు లానందపరవశులైరి. అంత భాస్కరుండు బాలనగరులఁగాంచి దివ్యోద్యమంబుతో సంఘ గౌరవార్థము శ్రీ భగవత్యర్పితంబుగా నసువుల నొసఁగిన పెద్దల స్వర్గమనంబున వారికి నాశౌచంబుండఁ బని యుండదకా యని యోచించుచుండె.అది యట్లుండ నిద్ది యంతయు నిక్కడఁ బెనుగొండలో జరిగిన విషయం బెప్పటి దప్పటికే తనకుం దెల్ప రాజుచే నియమింపబడిన భట సముదాయ మా శ్రీ కన్యకాపరమేశ్వరీ మహామహిమంజేసి మత్తుం గొని యప్పురంబు నందలి విత్త మత్తకాశినుల కౌఁగిళ్లలో మెత్త పడి యల్లవారి గబ్బిగుబ్బల హత్తుకొని యుండి రది యట్లుండ - నీ బృహద్గిరికి వచ్చి బల్మినయినను గన్యారత్నముం గైకొని పోవు పూన్కితో విష్ణువర్ధనుండు ససైన్య పరివారంబుగా నరుదెంచి కోట వెల్పటికి వచ్చిన సంగతి నాలకించి విరూపాక్ష ప్రభృతు లయిన బాలనగరులు వీరావేశంబు రెట్టించి ౨౧౬

# విరూపాక్షాదుల విక్రమము

ప్రబల ఘాంకార భైరవభేరికానికా
యారభటుల్ నింగి నంటుచుండ
నూటరెండు కౌలాల పాటియున్ వాసవీ
జయగీతము పఠింపు సరవిమించ

శరశరాసన తూణచయము పాణులకు నా
భరణాయమాన మౌ సరణి నూన
శ్రీ కన్యకాధీశ్వరికి జయం బను ఘోష
యాననాబ్జములఁ జెన్నారు చుండ
ఆ విరూపాక్షుఁ డమి తాద్భు తామల ప్ర
భావుఁడై విరూపాక్షుని పగిది నల్ల
వచ్చు విష్ణువర్ధనునకుఁ బటు ధృతి నెదు
రు సను నతని కిట్లు వచించె రోస మెసగ ౨౧౮

మా కన్య యనఁగ నరయు ము
మా కన్యయె! యన్యఁగాదు-మర్త్యుల కగునే?
మా కన్య గాని దామె
న్నీ కే కరణిని నొసంగ నే మెంతు మయా!!

కోర్కె యెంతదైనఁ గోరవచ్చుం గాని
అల్లకోర్కె తీఱు టండె శంక
అంబికా నివేది తాంగన న్నీవంటి
నీచు కోరఁగ నది నెఱి నగు నొకొ? ౨౧౯

## విష్ణువర్ధన మఃరణము

అల్లవాసవీ కన్య కన్యకాంబ యగుచు
మాదుపెద్దల నెల్ల నమందకృపను
నగ్నిముఖమునఁ గొని వెళ్లె నాత్మమంగ
ళకర మణ్యంతరీపంబునకు ఖలాత్మ! ౨౨౦

రా జేను పేరుం దాల్చిన
గాజ్జో! రా! రార! పోరఁగా వచ్చిన నా
తో జగడమాఁడి చనరా!
వే జీవము కడకు జేమగాగ విమతుల లెక్కన్ ౨౨౬

వ. అని విరూపాక్షుండు విక్రమించు చున్నంత-నంత నే పతండు సెప్పుచున్న దంతయుఁ దెల్లనోటితో నాలకించు చుండిన విష్ణువర్ధనుండు వాసవీకన్య నిర్యాణంబు నొంది తన కన్య యయిన దని తెలియఁగానే-హాహాకృతుల్ భూనభోంతరాళంబులు పిక్కటిల్లఁ గావించుచుఁ దాను చిత్రకంఠుం డనెడి జాతిస్మృతి నంది-నాడు తన కీఁబడిన శాపం బై వచ్చిన దని భావించి-ఫట్టు ఫట్టనగా గపాలంబు వేయిగాఁ దునాతునక లై పడగా డింక కొట్టి యరదంబు నుండి క్రిందకు దరదంబుగా దొరలె-నంత-నదంతయుఁ గనుచున్న బాలనగరులు

అంబా శాపం బెప్పటి
కిం బొల్లగు నొక్కొ? నేఁటికి ఖలుఁడు తన పా
పంబునకు ఫలము పొందెన్
దంబుగ వైశ్యులయశము కడంక వెలుంగన్ ౨౨౭

# ఉత్తమలోక ప్రాపణము

ఆపయి బాలవైశ్యులు ని జాలయముల్ సని తల్లిదండ్రులున్
బ్రాపుగఁ బుణ్యలోకముల ప్రాప్తిని జెందగ నుత్తరక్రియల్
దీపరమక్రముల్ ధరణిదేవులు భాస్కరముఖ్యులైన వా
రోఁపిన సాయ మీయఁ గర మోలి నివాసములీయగాదగెన్. ౨౨౮

# శ్రీ రాజ నరేంద్రుడు

విష్ణువర్ధనుఁ డా రీతిఁ బృథ్వికి నెడ
మయిన రాజ్మహేంద్రుఁడు తదీ యాత్మజుండు
తండ్రి మరణానఁ గొండయంత వెత మదిని
గ్రుంగియును వైశ్యమహిమను బ్రోఁది నెంచి ౨౩౦

పుణ్యులను నేఁచు వాఁడు మేల్పొందఁ బోఁడు
పాప కార్య కారి సుకంబుఁ బడయఁ బోఁడు
నాదుతండ్రియె సాక్ష్యంబు నాకుఁ గాఁడె
పుణ్యుఁడు చెడఁడు; పాపి మేల్పొందఁ డరయ

వైశ్యుల యశంబు లోకైక భవ్య మయ్యె
విష్ణువర్ధను నపకీర్తి వెలసె దెసల
దోషి తండ్రి మాఁట యటులఁ దొడరుఁగాక''
అంచు రాజ్మహేంద్రుం డెడ నెంచి యపుడు ౨౩౨

పరమదయా విశాలుఁడు నృపాలుఁడు రాజమహేంద్రుఁ డప్డు ని
ర్భరమగు పేర్మి జ్యేష్ఠగిరి పట్టణ మందలి వైశ్యబాలురం
బొరిఁ గన నేఁగినంత-గురుపుంగవు డౌ నల భాస్కరుండు భా
సురముగ గారవంబు నిడ సొంపును జెందియు భూపమౌళియున్

విరూపాక్షునిం గాంచి ''వీరుండ వంచు
న్నిరూపింతు''నంచెన్ని నింద్యేతరుండా
ధరానేత యాఁడున్ సుధా ధార లట్లున్
ధరన్ మీ పితల్ కీర్తి దార్కొందు రంచున్ ౨౩౪

వ. రాజరాజనరేంద్రుండు వైశ్యులకు మరల నిట్లు వచించె.

ఓ విరూపాక్షముఖ్యులౌ నూరుజాతు
లార! మీ పితరులకుఁ బ్రోల్లాసముగను
పుణ్యలోకముల్ గలుగంగఁ బోయి కాశి
గయఁ బ్రయాగను సేవించి కదలి రండు ౨౩౬

మీరు వచ్చునందాఁకను మీ పురమును
మీది రాజ్యంబుఁ గాపాడి మీ కిడెదను
నాఁగ భాస్కరుఁ డిది "బాగు, బా" గనంగ
ఆ విరూపాక్షుఁ డాతేని నర్థి నెన్ని

రాణ్మహేంద్రుఁడ వీవు-భారత కృతిపతి
విట్టి నీవు పుణ్యుండవై యొసగ వాక్కా?
నీ ముదలఁ గాశి విశ్వేశుని గను రహిని
గంగఁ గ్రుంకి దేవుని గొల్చి గయకు నరిగి ౨౩౭

పితరులకుఁ బిండముల నిడి వెసఁ బ్రయాగ
లోఁ బ్రయాగ మాధవుఁగొల్చి లోలత యఱు
మతిని నేతెంతుమయ్య! భూమి తలనాథ!
నీదు పేర్మికై మాకు నెంతే ముదంబు

అనన్ ధరావరుండెదన్ ముదంచితుండు విప్రులన్
ఘనాత్ములన్ గరంబు కర్మకారకత్వమున్
గనంగ వైశ్యపాళి తోడు గాఁగ నంప వైశ్యులున్
గనత్ పితృప్రతాన కౌర్ధ్వకార్యముల్ పొనర్చియున్ ౨౪౮

# శ్రీ కాశీ ప్రయాగ గయా క్షేత్రసందర్శనము

కరులు హరులు నాందోళిక
లరదంబులు నెక్కి రింతలై యర్యసుతుల్
పౌరినిం బ్రయాగతీర్థం
బరిగి మకర సంక్రమణము నందున్ భక్తిన్ ౨౪౧

శ్రీ ప్రయాగఁజేరి చెలగం ద్రివేణికా
సంగమమున యందు స్నాన మై ప్ర
యాగ మాధవు నట నమలభక్తి భజించి
బాలనగరు లటను వదలి కదలి

శ్రీ వారణాసిఁ జేరఁగ
నా వైశ్యార్భకులు వెడలి ఆ నగరి యమో
ఘావేల వైభవము గని
భావంబుల నబ్రమముఁ గనఁ బరగెన్ మిగులన్ ౨౪౩

అజముఖ్య దేవతలకే
త్రిజగన్నుతమైన కాశి దీప్తి వచింపన్
గజిబిజి యగునఁట వైశ్యుల
కు జగానిర్ధ మది మురువు గూర్చుట యరుదే!! ౨౪౪

"ఈ కాశి బళీ! పాపపు
రాకాసుల పాలికిం దురాయి యనుచు బల్
పీకం బొగడుచు వార
స్తోకముదముఁ గనుచు నందుఁ జొప్పడియు నొగిన్. ౨౪౫

గంగాభవానిలో మును
గంగా నయ్యేం గడంకగా వా రఘ మీ
గంగా నీ గంగం గే
రంగా రంగార దె దని రంగుచు భక్తిన్

ఆల న్నేలలల సొమ్ముల
జాలున్ భూదేవతలకు సద్గుణులగు ప్రా
జాళి కట వా రిడన్ యశ
మాలోకాలోక మెసఁగె నత్యంతంబున్ ౨౪౮

## శ్రీ కా శి

మేల్మి శ్రీ విశాలాక్షీ సమేతు విశ్వ
నాథు ఖండేందుమకుటు ననంత భక్తి
బాలనగరుల్ యజించి యభంగరీతి
బ్రమథభావంబు వారిలోఁ బరగి తోఁప

వ. మఱియు వారు సాంజలిబంధంబుగాఁ దమ గురున్ భాస్కరు ము న్నిడుకొని. ౨౫౦

వందామహే! సదా ఖం
డేందుధరం మృగధరం చ వృజినహరం సం
క్రందన ముఖబృందారక
బృందార్చితపాద మగసు తేశం దేవమ్! ౨౫౧

శ్రీ కాశీ కృతగేహం
లోకాతీతం చ భసితసితదేహమ్
శ్రితభయహరసన్నాహం
ప్రణామహే! విశ్వనాథ మగజేశమ్ ౨౫౨

కిటీకృత పౌరా నా
త్మాత్మకరః పాతి సితమిళిందో యః
వారణాసీ పురేఽగసం
తాఽనితభృంగీయుత స్తమీ దేఽహమ్

అనుచు నుమామహేశులను నర్చన సల్పి నమస్కరించి కా
శిని విడియున్ గయం జనియు జెల్వు మెయిన్ పితృదేవతాళికిన్
జనువునఁ బిండదానములు సల్పిరి పెద్దలు కానుపించియున్
గొనిరి నిజాన్వవాయజు లకుంఠితభక్తిని నిడ్డ పిండముల్ ౨౫౪

పెద్దలకున్ నమస్కృతులు బేరు లవేల మతిం బొనర్ప వా
ర్ధద్దది లేని సంతసము నందియు వెళ్లిరి కాశికాది దీ
వ్యద్దశ నొప్పు చోటులను వైశ్యకుమారులు దానధర్మముల్
తద్దయు నైకరీతుల చెలంగ నొనర్చిరి శుద్ధమౌ మతిన్ ౨౫౫

ఆ లేమి యా లేమి యడఁచె వా రిడ సంబ
రాశి వాఁపెం దద్దిగంబరతను
ఆ నేల పాలౌట నా నేల గడపె-బం
గా రంపదుఁ గగ్లు కంగారు డించె

ఆ తిండి కరువు వోకార్చె నా తిండి-యా
శయ్యలేమిం దీర్చె శయ్యయీవి
దూపంబు తమి నార్పె దీపమద్ది-యపాత్ర
తం దాని డుల్చెఁ బాత్రతతి యదియు
ఈ మొదలగు నీవుల నెల్లయిచ్చినారు
పెద్దలను నాకమునకు నంపించినారు
అపుడు శ్రీకన్యకాదేవి యుల్ల వారి
యెదుట న గ్గయన్ గనుపట్టె నింపుతోడ ౨౫౬

నానాభూషణ భూషితాంగి యగుచున్ నైకార్క-తేజంబుతో
గానం బడ్డ కులైకదేవతకు శ్రీకన్యాంబకున్ వార లెం
తేనిన్ భక్తి నమస్కరింపఁ గను న ద్దేవీవతంసంబు స
న్మానం బొప్పఁగ వైశ్యకోటి కనెడిన్ మాధుర్యధుర్యోక్తులన్

నా వార లైన మీర్వినుఁ
డో వైశ్యులు! వహ్ని బడక యురికిన వారల్
పావకు పా లయ్యెద రా
వైవస్వతలోకమం దభంగుర భంగిన్ ౨౫౮

వ. అట్టి యార్నూరు పదిరెండు గోత్రాలవారితో మీ కెట్టి చేరికయు వలదు. శ్రేష్ఠుఁడగు ప్రతివైశ్యునకును దశలింగంబు లుండు-నవ్వది గుర్తులు తెల్పెద — నయ్యవి (1) కులము (2) గోత్రము (3) ప్రవర (4) ఋషి (5) దానములు (6) క్షేత్ర

సంఖ్య (7) అఖండదీపసంఖ్య (8) జపసంఖ్య (9) తటాకము - దైవము (10) వర్జ్యవస్తువులు. అను నీపదియు దశలింగములు ప్రతి సద్వైశ్యునకు నుండున నవుడు బాలనగరు లామెకు నమస్కరించి వానిని వివరింపవలెనని ప్రార్థింపగా నామె యానతి నొసంగిన క్రమం బెట్టిదనిన ;

(1) గోత్రము — అగ్ని ప్రవేశంబయినందుకుఁ గాని వారికి మీకును భేదముతెలియుటకై, యీనఁబడిన సాంకేతిక గోత్రనామమగును.

(2) ఋషి—యనఁగా కులకర్తయగు కూటస్థుండు.

(3) దానము—ఆయావంశమువారికిఁ బ్రసిద్ధంబయినది.

(4) క్షేత్రము— ఎన్నిక్షేత్రములయందుఁ బెద్దలకుఁ బ్రీతిగా దానంబులుగావింపవలెనో

(5) అఖండదీపసంఖ్య—గోమఠుం డాజ్ఞాపించిన యఖండ దీపసంఖ్య.

(6) జప సంఖ్య.

(7) తపస్థానములు—తపస్సుగావించిన తీర్థస్థలములు.

(8) తటాకములు— ఏతటాకంబుచెంతఁ దపంబాచరింపఁ బడినది - మీరును దటాకముల నెలకొల్పినచో దేవతలు సంతోషింతురు.

(9) ఇష్టదేవతలు—అనగా మీరు కాశినుండి తెచ్చుకొన్న లింగములను ఏ గోత్రమువాఁడు ఆ కూటస్థుని పేర లింగములను ప్రతిష్ఠింపనగు.

(10) వర్జ్యములు—విడువవలసిన భోజ్యములు.

అని పల్కినంత వాసవి
కిని వారలు మ్రొక్కి యని రాగిన్ "తల్లీ! నీ
యనుపమకృప దశలింగము
లను గూరిచి వింటిమమ్మ! లలితచరితరో! ౨౬౦

నూటరెండు గోత్రములలోఁ బాటిగాఁగ
గోత్రముల నొక్కొ యొక్కఁ డా గోత్రమునకు
నుండు దశలింగములఁ దెల్పు మురుకృప మెయి
నీకు మ్రొక్కెదమమ్మ! అనింద్యచరిత! ౨౬౧

వ. అనవుడు శ్రీకన్యకాపరమేశ్వరీదేవిచే వైశ్యబాలనగరులకు వివరింపఁబడిన నూటరెండు గోత్రముల దశలింగముల ప్రణాళికలు.

ఆర్షేయత్వమునుబట్టి గోత్రసంఖ్యలను వినునది.

| | |
|---|---|
| (1) ఏకార్షేయ గోత్రములు డెబ్బదియేడు | 77 |
| (2) ద్వ్యార్షేయగోత్రములు పదునేడు | 17 |
| (3) త్ర్యార్షేయగోత్రములు ఆరు | 6 |
| (4) చతురార్షేయగోత్రము ఒకటి | 1 |
| (5) దశార్షేయగోత్రము ఒకటి | 1 |
| మెరశి నూటరెండు | 102 |

ఆయా గోత్రములకుఁ జెప్పఁబడిన వర్జ్యవస్తువులను భుజించినచో దోసం బని తెలియునది. ౨౬౪

బాలనగరులార ! పావనమైన యీ
నాచరిత్రమును గనన్మతిమెయి
నాలకించువారు - నాలకింపించువా
రెంచువారు శుభములెల్ల గాంత్రు
ఇండ్లకేఁగుఁ డీర లిఁక నవసరముల
నేను జనముఖమున నింపుఁగొల్పు
ముదలలన్ వచింతు - బొనరింపు డారీతి
వెస సుఖ మగుమీకు - బిడ్డలార ! ౨౬౬

వ. అని యవ్వాసవాంబ యంతర్ధానంబు నొందె-బాలనగరులును శ్రీ కన్యకాపరమేశ్వరీ వరప్రసాదంబునంజేసి సమస్తశక్తిసామర్థ్యంబులను జెంది విలసిల్లిరి. మఱియు శ్రీ వాసవీదేవి వల్లఁ దెల్పఁబడిన శ్రాద్ధవిధానంబు వినునది. ౨౬౭

# శ్రాద్ధవిధానము

పెద్దలకు మృతదినమున వెస నమవస
సంక్రమణముల వ్యతిపాతి సరగ "గయ" మొ
దలగు పుణ్యస్థలుల వైధృతుల మహాల
యముల గ్రహణములన్ శ్రాద్ధ మమరుఁ జేయ ౨౬౮

మృతతిథియు గ్రహణశౌచములును వచ్చె
నేని యవి తీఱు వెన్కఁ గావింపవలయు
యోగ్యులగు పురోహితుల తో దొందవలయు
యోగ్యదూర నిమంత్రణ మొప్పుఁ గాదు ౨౬౯

బ్రాహ్మణార్థము యోగ్యుండు పరఁగఁడేని
కొడుకునో భ్రాతనో యిడుఁడి భక్తి
శ్రాద్ధకర్మము శ్రద్ధతోఁ జల్పనగును
అగ్నికుండజాతనగు నా కర్చలిండు

కమలాలతోడ నా రూ
పము నిర్మించుకొని యర్చ పరగింపవలెన్
సుముఖ నగుచు మీకెల్ల శు
భముల నొసంగెదను వైశ్యబాలకులారా! ౨౭౧

వ. అని వచియించి నంత నాకసంబునుండి వేల్పులు పూలవానఁ గుఱిసి రమ్మవా రెమ్మెలు గుల్కఁ కాంచన రత్నవిమానంబునం దారూఢయై మణిద్వీపంబునకు వేంచేసినది. వైశ్యబాలకులు కాశియందు వృషోత్సర్జనంబు గావించి తమ పెద్దల జ్ఞాపకార్థము వారికి శాశ్వతంబుగాఁ బునరావృత్తిరహితంబయిన యుత్తమలోకంబు సిద్ధించుకొఱకు నూటయొక్క గోత్రంబుల వారు నూటయొక్క శివలింగంబులను శ్రీ కాశినుండి తమ పెనుగొండపురంబునకుఁ గొంపోయి యందు మిక్కిలి భక్తిపురస్సరంబుగాఁ బ్రతిష్ఠింపించిరి. ఆ లింగంబు లట్లు నెలకొల్పంబడిన వీథి లింగాలవీథి యను పేరితోఁ గాన నయ్యెడిని. ౨౭౨

శివలింగంబులనుం ద్రికాలములఁ బూజింపంగ నే వారు సౌ
ఖ్యవితానంబు లలిం గనుంగొని పరం బందున్ శివాంఘ్రిద్వయీ
సువిశేషామల సన్నిధానము గనన్ జొప్పొందు నం చల్ల వా
రు వెసన్వర్తిల నందు క గ్గురుడు తోడుం గొల్చె మాన్యంబుగన్

వ. అప్పుడు భాస్కరుఁడు వైశ్యబాలకుల కిట్లనియె. ౨౭౪

శివలింగార్చకులై భవత్సుయశమున్ శ్రీవాసవీగాథయున్
సువిశేషంబుగ నెల్లచోఁ దెలుపఁగాఁ జొప్పొందు వారి నే
ను వెసన్ గొల్పితి వారికిన్ సతతమున్ భుక్త్యాదు లర్పించి వై
శ్యవితానం బల వారి నేలవలయున్ సర్వేశు డింపొందగన్ ౨౭౫

వ. అనిన పిమ్మట— ౨౭౬

పెనుగొండ వచ్చుత్రోవను
బోనరు జగన్నాథుఁ గొల్చి పుణ్యముఁ గాంచం
దనరెన్ బాలనగరుల్
వనజాక్షుఁడు శ్రీపతి యలప్రభువు రహిఁ గనన్ ౨౭౭

# శ్రీ విరూపాక్ష పట్టాభిషేకము

పెనుగొండకు బాలనగరు
లును రాఁగా రాణ్మహేంద్రుఁడున్ రాజన్యుం
డు నిరుపమానందముఁ గని
యును వారి నెదుర్కొనియె మహావిభవమునన్ ౨౭౮

అల్ల రాజమహేంద్ర విరూపాక్ష ముఖ్యు
లయిన వైశ్యబాలకులు ప్రయాణవిషయ
కథనముం జెప్పికొని సొంపు గదుర మతుల
రాజమహేంద్రుండు మిక్కిలి రాణనొంది ౨౭౯

శ్రీ విరూపాక్ష పట్టాభిషేకమునకు
మేలి కార్తాంతిక నిగదితా లంఘు సమ
యమున మూర్తంబు నియమించి యంబుధి నదు
ల జలముం దేరఁ జేసి యుల్లాస మెసఁగ ౨౮౦

నానాదేశ నృపాళి వచ్చియును గన్నారం గనుం గాంచి గా
ఢానందంబునఁ బొందుచుండ నిక వైశ్యశ్రేణి సర్వంసహా
నూనస్థానములందు నుండియును రానొప్పొందగా నింక వి
ప్రానీకంబుఁ గవీంద్ర పండితులు రానై సంతసంబొందఁగన్

మంగళవాద్యంబులు భో
రంగ నభోరంగము లలరంగా శుభమం
త్రాంగవిధానము రహిఁ మిం
చంగాఁ బట్టాభిషేకసరణి చెలంగెన్ ౨౮౨

శ్రీ విరూపాక్ష పటాభిషేక మనఁగ
శ్రీ విరూపాక్ష పట్టాభిషేకమె నిజ
మమర రాజమహేంద్ర కవిముని మోద
మమితముగఁ బెనుగొండలో నందమొప్పె ౨౮౩

ఆత్మగౌరవ విజ యాంక మగుచుఁ గన్య
కాంబికాపావనతకుఁ జిహ్నం బగుచును
నవ్యశుభముల కెల్ల తానక మగుచును
అవ్విరూపాక్షపట్టమం దతిశయిల్లె ౨౮౪

అల్ల కైలాసమున విరూపాక్షునట్టు
లమలరత్నపీఠిని విరూపాక్షుఁ డలరి
అల్ల పెనుగొండ పురినుండి ఆర్యకీర్తి
సర్వసర్వంసహా న్నిండఁ జల్పె మిగుల ౨౮౫

ఆ నగరంబు సర్వము నుదార పరిష్కృతి వైశ్యకోటి యెం
తేనియు నందఁజేసియును దీర్చిరి వారును బేర్మి మంగళ
స్నానము లాచరించియు బసందుగ నాత్మకులైకరత్న స
న్మానముఁ జూడ వచ్చిరి కన న్ముద మాశయపాళి నిండగన్

## మహోత్సవము

వ. అంత. ౨౮౬

రాజమహేంద్రుని యునికిన్
రాజమహేంద్రపురవు గజరాజము నటఁ దే
గాఁ జల్వ విరూపాక్షుం
డో జను నారూఢుడయ్యె నొగి దానిపయిన్ ౨౮౭

ఆదంతి విరూపాక్షుఁడు
చేదంతిన్ వేయికనుల సామియు నెక్కన్
ప్రోఁది యగు నంద మెసఁగం
గాఁ దగ నెక్కెం జనములు కడు రంజిల్లన్ ౨౮౯

## రాజ్యము

వ. పిమ్మట. ౨౯౦

ఇహమును పరమును నెల్లవారలు నింపు
గాఁ గనఁదగు ధర్మకలన మించ
రాజమహేంద్రుండు రాజరాజై రాజ
కోటీరుఁడై చెంతఁ గూర్మిఁ దనర
సకల యాచక జనాశాపూరకామర
తరు దానఫలము తమ్మరయుచుండ
శ్రీ కన్యకాధీశ్వరీదేవి సర్వలో
కేశ్వరి తముఁ గడు నింపునఁ గన
ఖండఖండాంతరములన్ రకరకములగు
బేరసారంబు లెల్ల దీపింపఁ జేసి
వైశ్యుల సిరిఁ బెంచెను విరూపాక్ష డరరె!
ఆత్మరాజ్యంబు రామరాజ్యంబుగాగ ౨౯౧

కులసద్గౌరవ మూలకంద మగుచున్ క్షోణీస్థలిం మించు శ్రీ
లలితాంగీమణి కన్య కాంబ దగు దిగ్రంగత్పవిత్రత్వయు
క్తి లసత్సత్కథ యూత యైన బుధమూర్ధన్యుల్ కడున్ ధన్యులై
యలనూఱున్మఱిరెండుగోత్రములవా రింపొందువా రైవైశ్యులన్

వ. అప్పుడొక మహనీయుడైన వైశ్యరత్నముయొక్క అభిప్రాయముగ ఆర్యవైశ్యులు శుభకార్యములలో శ్రీ కుసుమాంబ పుట్టినింటి గోత్రమయిన "మైత్రేయస" (మిథునకుల) గోత్రమువారికి శ్రీ కుసుమశ్రేష్ఠిగారి గోత్రమయిన "ప్రాభాతస" (ఉద్వాహకుల - లేక - పెండ్లికుల)గోత్రమువారికిని మొదట శ్రీ కన్యకాపరమేశ్వరిపేర నొక కన్యకకు మర్యాద (తాంబూలాదులు అయిదు) జరగు. వెనుక అదే రీతిగా జరగు నని వచియింప నెల్లరు నందుల కామోదించిరి. అని సాలంకాయన ముని వైశ్యమునులకు వచియించిన తెఱంగున సూతమహర్షి నైమిశారణ్యంబునందు శౌనకాదులకు వచియించె. శ్రోతలకు నానందంబు కల్గినది. ౨౯౩

# ఫలితప్రార్థన

శ్రీ కన్యాపరమేశ్వరీచరిత మీ చెల్వొందుగ్రంథంబు న
స్తోకంబై తగునట్టి పట్టుదలతో దోమాన్వయాయుండు బల్
వీకన్ వేంకటసామి దీని కృతిసల్పెన్; దల్లి కన్యాంబ క
స్తోకాకారజయంబు దీని కిల యందున్ మించ నందంబుగన్ ౨౯౪

చదివిన వ్రాసిన వినినన్
మది నెంచిన మానుగ నిది మనుజులకు శుభ
ప్రదము సతీప్రదము సుత
ప్రదమున్ శ్రీప్రదము నఖిలభవ్యత్ప్రదమున్. ౨౯౫

# ఆశ్వాసాంతము — గ్రంథాంతము

ఎన్నో పుస్తకముల్ పఠించియును నే యెవ్వారినో కొల్చి యిం
కెన్నో తావులనుం జరించియును నెంతేఁ గూర్చి కొన్నట్టి దౌ
సన్నాహంబున శక్తి కొద్ది నిటులన్ సల్పంగ నయ్యెన్ భవ
త్సన్నిస్తంద్ర కథానకంబుఁ గుసుమాంచన్నామపుత్రీమణీ!

నీకున్ మించిన మేటివేల్పు నెవ రెందే గానలే ర్గావునన్
నీక న్నీదగు సత్కథానకము నెంతే బావనం బంచనన్
నీకన్ సందియ మెప్పుడైనఁ గృతి నావిన్యాస మోటన్ సుధ
న్యాకారంబునఁ దగ్గునేమొ కద? యట్లయ్యున్ భవత్సత్కృపా
శ్రీకల్గన్ భువి మించ నట్టి దెదియో? శ్రీ కన్యకాంబామణీ!

శ్రీ కన్యాంబా! శిష్టాలంబా!
లోకస్తుత్యశ్లోకా! చేతున్
నీకు జోహార్ నిత్యానిత్య
శ్రీకిం దావై చె న్నొందమ్మా! ౨౯౭

అంగిరస (వగిడికుల) గోత్రుఁడు నిఁక వైశ్యకులుఁడయిన
దోమవంశ్యుండు వేంకటస్వామిగుప్త
అమల గోవిందసుతుఁడు వ్రాయ నయినట్టి
కన్యకాపురాణపుఁ బద్యకావ్య మందు
ఇద్ది షష్ఠమాశ్వాస మో యిందుముఖిరొ!
గణ్యకరుణావలంబ! శ్రీ కన్యకాంబ!! ౨౯౯

దోమా వేంకటకవి యు
ద్దామకృతిగఁ గన్యకాకథ యిది 'వ్యయ' సమన్
శ్రీ మెయి నాశ్వీయుజా ౨సిత
మైమించు తృతీయ ముగిసె నర్క-దినమునన్

క్రీస్తుశక-వైరి-వేద-నీరేజ-జేందు
వర్షదశమమాసమునను బదియు మూఁడ
యిన దినాన(13 అక్టోబరు 1946 ఆదివారము) శ్రీ కన్యకేద్ధకృతి యి
దయ్యె దోమ వేంకటసామి దగు కృతి తగు

విజయవాటి యందు వెస శ్రీ కనకదుర్గ
పాదసన్నిధిఁ దగు వాఁడు-వాడు
వారని కయితగ వ్రాసె దోమకులుండు
వేంకటకవి యిద్ది వినయమెసఁగ ౩౦౨

కందనోలఁ (కర్నూలు) బుట్టఁ గాంచిన యతఁడు గో
వింద కోటమలకుఁ బెద్దబిడ్డ
దోమ వేంకటకవి తొడరి శ్రీ కన్యాంబ
కతను వ్రాసె నిద్ది కణఁకఁ దనర 303

గద్యము. ఇయ్యది శ్రీ తుంగభద్రానదీ తీర విరాజమాన కర్నూల్నగరనివాసి-నిరంతర శ్రీమ ద్వేంకటేశ్వర చరణారవింద మిళిందాయమాన మానస-వైశ్యర - త్నాంగిరసగోత్రపవిత్ర-ధర్మ పత్నీ కోటాంబికాసమేత-దోమాగోవిందార్యవర్య సుతజ్యేష్ఠుం డును-శ్రీ రామచంద్ర కృపాకటాక్షనిరీక్షణాసాది తాంధ్రగీర్వాణ కవిత్వ కృతపరిచయుండును - శ్రీ బ్రహ్మవైవ ర్తమహాపురాణ శ్రీ పరకాలవిలాస - శ్రీ బ్రహ్మేశ్వరపురాణ - శ్రీ గౌతమక్షేత్ర మాహాత్మ్య-శ్రీ విష్ణుభ క్తి-ప్రేమాభిరామ - శ్రీ ముకుందమాలా- శ్రీ గంగాలహరీ - శ్రీ కనకధారా స్తవ - దూతాంగద - చంద్రకళా సుదర్శనాత్మబోధ - సుజనత్రయ - శ్రీ సీతాకళ్యాణ-శ్రీ మార్కం డేయవిలాస - శ్రీ సిరియాళచరిత్ర-శ్రీ నృసింహాధ్వరీయ - శ్రీ మదభినవరామదాస - శ్రీమదభినవ ప్రహ్లాదచరిత్ర-శ్రీ రోహిదాస శ్రీగిరిధరలాలచరిత్ర-సుభాగ్యశతక - శ్రీకన్యకాపరమేశ్వరీ శతక- శ్రీ వీరరాఘవశతక - సన్మార్గాద్యనేక-భాషాంతరీకరణ - ప్రబంధ- నాటక-యక్షగాన-శతక-ఖండకావ్యోపన్యాసక ర్తయును - హరికథా కాలక్షేపనిర్వాహకుండును - నానాదేశ రసికప్రద త్త - శ్రీమదాంధ్ర

విద్యావాచస్పతి - సాహిత్యసరస్వతి - విద్యావినోద- కవిభూషణ- విద్యాసాగర-కవిర-త్నాశుకవితల్ల-జాశుకవితాధురీణ - కవికుంజ - రావధానిపంచాన - నావధానపితామహ - కవిచక్రవర్త్యాద్యాదరాంకిత - దోమా వేంకటస్వామిగుప్తచేఁ బ్రణీతంబయిన శ్రీ కన్యకా పురాణపద్యకావ్యమునందు షష్ఠమాశ్వాసము.

గ్రంథము - సమాప్తము

# అంజలి

## దేవీస్తుతి

క. శ్రీ కన్యాపరమేశ్వరి! - ప్రాకటముగ వైశ్యవంశప్రాభవుఁడగు నా
శ్రీ కుసుమశ్రేష్ఠునకును - వేకరుణను బుట్టినావు వేనతు లివిగో.

గీ. నీవు జన్మించినందున నీరజాక్షి! - వైశ్యవంశము పూతమై వరలె నమ్మ
భూమి వైశ్యుల బ్రోవగ భువన జనని!-వందన శతంబు లిడుదునో వాసవాంబ!

## స్వవిషయము

సీ. శ్రీ దోమకుంటాన శ్రీ వేంకటస్వామి - యనుపేర జన్మించె నాతనికిని
వేంకటసుబ్బమ్మ పేరను భార్యయౌ - ఆ దంపతులకును అనుగుబిడ్డ
లై కల్గి రిద్దరు, ఆంజనేయాఖ్యుఁడు - పుత్త్రుఁడై విలసిల్లు! పుత్త్రినౌదు
నేను; నా నామము ఇందిరాదేవి యౌ - పెంచిరి మమ్ముల బేర్మి మీర

గీ. ఆంజనేయుఁడు పరిణయమాడినాఁడు - పేర్మిగ వసంతమాల యనెడి పేరు దాని
వారికిని గల్గినారలు వన్నెమీర - కొమరు లలరిరి ముగ్గురు కొమరి యొకతె.

గీ. వెలసె తొలి కుమారుఁడు చంద్రశేఖరుండు-మలి కొమరుఁడు సీతారాముఁ
డలరె మిగుల
వరగె మూడవకొడుకు గోపాలుఁడనగ-పొలుపుమీఱ రమాదేవి పుత్త్రి యగుచు.

గీ. సుతుల ముప్పుర భర్తను సుతను వీడి - స్వర్గలోకాన కేగె వసంతమాల
ముప్పదేండ్లకె జన్మము ముగిసె సకట-దైవలిఖితము తప్పింపఁ దరమె మనకు.

గీ. పిదప ప్రేమకుమారని పేర్మిమీర-ఆంజనేయుఁడు పరిణయమాడె మరల
వారు సుఖ సంపదలతోడ వరలునట్లు - రామచంద్రుఁడు బ్రోచుత ప్రేమతోడ.

గీ. ఆంధ్ర గీర్వాణభాషల నంద మలర - పుస్తకంబుల రచియించె పొలుపుమీర
శతవధానంబు లెన్నియో సల్పి బిరుదు-లందె నా తండ్రి లోకాన ఖ్యాతి గాంచె.

గీ. పెద్ద చదువుల నెన్నియో పేర్మి మీఱ - చదివె నా సోదరుండు; నేను చదివినాను
చెలగి "భాషాప్రవీణ"; నే వేయుదాన - గురుకులమ్మున నొజ్జగ కూర్మి మీర

# అభివందనములు

కీ॥ శే॥ శ్రీ దోమా వేంకటస్వామి గుప్తగారు మా పితృపాదులు, బహునగర ప్రముఖ ప్రజానీక సమాదరణీయులు, అనేక పీఠాధిపతి, రాజాస్థాన సమ్మానితులును, అనేక బిరుద లాంఛనులు, బహుముఖ ప్రజ్ఞాపరిణతులు. సంస్కృతాంధ్ర సాహితీసంభావితులు వైశ్యవంశ శిరోమణియునగు మా తండ్రిగారు శతాధిక గ్రంథములు రచించి యుండిరి. అందు శ్రీ కన్యకాపరమేశ్వరీ పురాణమును గుంటూరు వాస్తవ్యులును, గుంటూరు పత్రిక, వాసవి పత్రికాధిపతులును సంస్కృతాంధ్ర పండితులును గ్రంథప్రచురణ ప్రచారాదులయందు విశేషానుభవ సంపన్నులునగు శ్రీ జక్కిలినమ్మాళ్వారుగారు ముద్రించుట యదృష్టము. ఈ గ్రంథమీనాటికీ విధముగా ముద్రణయగుట మిక్కిలి సంతోషదాయకము. ఈ గ్రంథముద్రణ పూర్తిచేసిన శ్రీనమ్మాళ్వారుగారికి సర్వదా నాకృతజ్ఞతాపూర్వక వందనములు, మరియు అభినందనములు. మాతండ్రిగారు సుమారు అయిదు వత్సరంబులనాడు తమ యశశ్శరీరమిటవదలి స్వర్గస్థులైరి. ఇట్టి శుభసమయము నందు మా తండ్రిగారున్నచో నెంతసంతోషము నందెడి వారో? ఆయన ఏలోకమునందున్నను దీనింగాంచి ముదంబు నందుదురని నాతలంపు. శ్రీ కన్యకాపరమేశ్వరి శ్రీ నమ్మాళ్వారుగారికిని, వారికీ విషయమున చేయూతనిచ్చిన మహాదాతలకును సమస్తవైశ్యులకును సకల శుభాయురారోగ్యసంపదల నిచ్చి రక్షించుటకై ప్రార్థించుచున్నాను.

గోళ్ల ఇందిరాదేవి

భాషాప్రవీణ - తెలుగు పండిట్ - నవభారతి గురుకులం - రాజమండ్రి.

# కథాసంగ్రహము

## ౧

పాపములను పోగొట్టునదియు, మోక్షమును గూర్చునదియు, నైమిశారణ్యమను పుణ్యక్షేత్రము గలదు. అందొకనాడు బ్రహ్మోపాసకులగు శౌనకాదిమునులు కొలువుతీరియుండిరి. ఆ సమయమున సకలవేద పురాణజ్ఞానవేత్తయగు సూతు డచటికి వచ్చెను. ఆతని రాక చూచి మునులానందము నంది, "స్వామీ! మీ రాక మాకు సంతసమును గూర్చినది. సర్వపాపహరములగు పుణ్యకథలను మీనోట విన గోరెదము. అనుగ్రహింపుడు." అని వేడిరి.

సూతపౌరాణికుడు ఆమునులకు నమస్కరించి "మీరు మహానుభావులు. సకల వేదపురాణముల నెఱిగిన వారు; మీకు దెలియనివి నేనేమి చెప్పగలను. అయినను కోరితిరి కాన కొలదిగ జెప్పెదను వినుడు." అని పలుక శౌనకు డిట్లనెను. "సూతా! అడుగగనే చక్కని కథలను చెప్పెదనంటివి. అంతియుచాలు. కన్యకాంబను గురించి వైశ్యకథను మాకు దెల్పుము" అనియనగానే, సూత మహర్షి శ్రీ కన్యకాంబ చరిత్రను శౌనకాది మహర్షులకు సుందరమగు వాక్కులతో నిట్లు చెప్పెను.

మణిద్వీపము బ్రహ్మ విష్ణు మహేశ్వరాదుల లోకములకు సమానమై యొప్పుచుండును. అది వేదములకును, విద్యావేత్తలగు మునీశ్వరులకును, దేవతలకును నుతింపరాని మహావిభవములతో నొప్పుచుండును. రత్నాలు పొదిగిన బంగారు మేడలును, వజ్రాలగోడలు, గరుడపచ్చలనేలలు, పద్మరాగమణుల కిటికీలును, ఇంద్రనీలమణులు పొదిగిన భూభాగములును గలిగి విరాగులకును ఇంపుగొల్పుచుండును. అందలి శుకశారికాదులు ఆదిశక్తి సహస్రనామములను బఠించుచుండును. త్రిమూర్తులు తమ పత్నులతోడ వచ్చి యా యాదిశక్తికి చరణసేవలు కావించుచుందురు. అచ్చటి యమృత సరస్సుల వికసించిన పద్మములకై మూగుతుమ్మెదల బ్రవాత ఓంకారమయి యా పరాశక్తి స్తుతించినట్లగును. కోకిలకూతలును, చిలుకల పలుకులును, గోరువంకల మాటలును, నెల్లప్పుడును సందడిగనుండును. బ్రహ్మ బ్రహ్మస్వరములతోడను, సరస్వతి వీణాగానములోడను, విష్ణువు విలాసములతోడను, లక్ష్మి యలంకారములతోడను, శివుడు తత్వవాక్యములతోడను, గంగాగౌరులు ఉపచారముల తోడను, సంతసము కూర్చుచుండ, ఆశ్రితరక్షణ కావించుచు బ్రహ్మాది దేవతలును, వసిష్టాది మహర్షులును, యక్షకిన్నర కింపురుష గంధర్వాదులు సభయందుండిరి.

అట లక్ష్మీసరస్వతులు చామరములగొని యిరువంకల విసరుచుండగను, బ్రహ్మ నాలుగు మొగముల బిరుదములు చదువుచుండగను, విష్ణువు స్త్రీ వేషమును ధరించి

యెలరను సర్వించుచుండగను, శివుడేమి యాజ్ఞయని చేతులు జోడించి కాచియుండగను, నిండోలగంబుండి బ్రహ్మాండముల దృష్టులతోడనే రక్షించుచు పరాంబిక వెలుగొందుచుండెను. వేదవేదాంగోపనిషత్తులు రూపములుగొని సేవలు చేయుచుండ పాపముల దొలగించుచు కనకసింహాసనమున నుండెను. సకల దేవబృందములు కిరీటరత్నకాంతులు సోక పాదపద్మములకు సమస్కరించుచుండిరి. ఇట్లా లోకమాత యొప్పియుండ నామణిద్వీప మలరారుచుండును. ఆ త్రిమూర్తులును నాశక్తి కిసుమంతయును సాక్షిగారు. ఆమెయే పరాశక్తి. యోగమాయయును సర్వాధికారిణియు నా పరాంబయే. ఆమె లోకానుగ్రహార్థము "దుర్గ, భద్రకాళి, విజయ, వైష్ణవి, కుముద, చండిక, కృష్ణ, మాధవి, కన్యక, మాయ, నారాయణి, ఈశాని, శారద, అంబిక"– అను పదునాలుగు నామరూపములతో నొప్పారును. ఈ మణిద్వీపమున నాల్గురూపములతో విరాజిల్లును.

ఆ దేవి మహిమయే మోగాని. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు నప్పుడప్పు డచటికేగి స్త్రీరూపులై యామెను గొల్చుచుందురు. దాని రహస్యమా త్రిమూర్తులకే యెఱుగరాదన నితరులకు సాధ్యమా? శ్రీభూదేవులన నొప్పు నామె పదునాల్గు రూపములను గొప్పగ పొందుచు నా మణిద్వీపమున నుండును. అందు బంగరు టరుగుమీద, రత్నసింహాసనముపై సకలదేవతలు పరివేష్టించి స్తుతించుచుండ కన్యకా పరమేశ్వరి ప్రకాశించెను. పదునాల్గురూపములతో విలసిల్లు

నా మెవద్ద వైశ్యులు నిలిచియుండిరి. వారు ఏడునూట పదు నాలుగు గోత్రముల వారు. వారిలో సమాధి మున్నగువారు నూటరెండు గోత్రములవారు కన్యకాంబా భక్తినిష్ఠులైరి.

ఆ దేవియు వైశ్యులను లోకసుఖమునకై దయ జూచుచు, ప్రజాసుఖమును గలిగింపజేయు వారి నైపుణ్యా మును గాంచి, "వీరిని భూలోకమునకు బంపిన నైహిక పార మార్థిక సంపదలను భూమికి గూర్పగల"రని తలంచి, ఏడు వందల పదునాలుగు గోత్రముల వైశ్యులను జూచి యిట్లనెను. "ఇచటనున్న మీరెల్లరే లోకమునకేగుచున్నను, అచటనుండు వారికి ధర్మనిష్ఠ నొసంగి ముక్తిని గూర్చదగును. కలిలో లోక మాకలాకలి యని మనుష్యు లధర్మములు చేసి నరక మును పొందుదురు. అట్లు కాకుండ జేయునది. లోకమున మీ వైభవము వెలయువలయును." అని పార్వతి వైశ్యములను లాజ్ఞాపించి, ఆశ్రయులతో భూమికివచ్చి, పెనుగొండను నిర్మించి, శంభుశ్రేష్ఠి యవతారమైన కుసుమశ్రేష్ఠికి కుమా ర్తెగా తాను జన్మించెను. నగరమున శివజనార్దనులు భాస్కరు డుగా జన్మించునటుల త్రిమూర్తులను, వింధ్యవాసినీ, వనజ నయనలు నగునట్లుగా లక్ష్మీసరస్వతులను ఆ దేవి ప్రార్థించెను. లోకముల పాపములను బాపి ధర్మము నిల్పుటకై తనయంశల సృజింపదలచెను. మఱియు వైశ్యబృందమునుజూచి, "మీ రందఱు భూమినిజన్మించి, ఆదర్శముగ సద్వర్తనమున నడచు నది. దానికి తగినవసతులు శ్రీశంకరుడు కలిగించును. కాన నా పార్వతీపతిని సేవింపుడు. ఏడువందల పదునాలుగు

గోత్రములయందును, నూటరెండు గోత్రములు పుణ్యవంతము
లయియుండును'' అని యాజ్ఞాపించెను.

వైశ్యులా కన్యకాంబ వాక్యమును విని, ఇది సత్యమా? యసత్యమాయని యోచించి, సత్యమగుట యెఱింగి విచారమునంది, తెలివి తెచ్చుకొని నయభయములతో నెమ్మదిగ నాదేవి కిట్లనిరి, ''అమ్మా! మా మనవి వినుము. నీ సన్నిధానమున నెట్టి యాపదయు లేక సుఖముగనుండఁగా, కోపముతో నిట్లు పొమ్మనదగునా? నీవు తలచుకొన్న కాపదేమున్నది? మమ్ము భూమికేగి బాధనొందుమని యాజ్ఞాపించెదవా? దయయుంచుము. విష్ణువునొద్దగాని, శంకరునియొద్దగాని యుండి రమ్మనుట కొంత సంతోషముగల్గును. అట్లు కాక భూమికేగి బాధనొందుడనుట మాకు భరింపరానిది. మీ వియోగము సహింపలేము.'' అని దుఃఖమునొందిరి. అందు నూటరెండు గోత్రాలవారు దేవి సన్నిధానమును విడనాడుటకు దుఃఖింపగా, దేవి వారి కిట్లనెను.

''నా తలంపు మార్చరానిది. నాయాజ్ఞ చొప్పున ధర కేగి నా చెప్పిన రీతి వర్తించువారు త్వరలో నన్ను చేరునట్లనుగ్రహించెదను. శివసన్నిధికి బోవుటకు ప్రయత్నింపుడు. పూజ్యమైన అపాంతరాత్ములయి వెళ్ళుచున్నారు. ఇది మార్చరాని''దని పలుక వైశ్యులు నమస్కరించిరి. కన్యాంబ మఱియు నిట్లనె. ''శివుని వాసస్థానమగు కైలాసము హిమాలయము శిఖరములలో నొకటియగు మహాద్రి; అది కనుపించు దూరములోనుండును. ఏగిరియును దాని మహాత్వ

మునకు సాటిగాదు. గౌరీ సమేతుడగు నాశంకరుని సుఖముగ పూజింపుడు. కైలాసమును నాకొండయు వేఱని తలంపవలదు. అచ్చట నిచ్చటవలె నన్ను పూజింపుడు. అనుమానసము గాని శివునియొద్దకు పొందు. చేయదగిన విధుల నతడు వివరించును. మీకేదేని సందేహము గలిగినచో వెంటనే వచ్చి నేను తీర్తును'' అని కన్యాకాంబ వైశ్యులకు చెప్పెను.

నారుడు ''కన్యాకాంబ వాక్కు తప్పదు. పరమేశ్వరుని గొల్చుట కందఱును పోవగును.'' అని చెప్ప వైశ్యులు ప్రయత్నముతో మణిద్వీపమును వదలదలచి, వీడ మనస్సు రాక ఏడువందల పదునాలుగు గోత్రములవారును ''దేవి! నిన్ను గొల్చుట యానందమునకు నెలవుకదా! నిన్ను గొల్చు మమ్ము నేడిట్లు పొమ్మనుట న్యాయమా? కైలాసవాసుడగు నాగభూషణుని సేవింపబోవు మమ్ము కరుణింపుము'' అని నుతించి ''వందే శంభు ముమాపతిం'' అనుచు బయలుదేఱి, భృంగి, భృంగిరిటి, నందీశ, గణేశ, కుమారులు సేవించుచుండగా, లోకమాతయగు పార్వతి చెంతనుండ చెన్నొందు చంద్రశేఖరుని గాంచి, సాష్టాంగ నమస్కారములు చేసిరి. మణిద్వీపముననుండి శ్రీ కన్యకాపరమేశ్వరీయాజ్ఞచే వచ్చినట్లుగ దెల్పిరి. అంత శంభుడు తన కైలాసంబున కొలది దవ్వున నున్న మహాగిరియందు వసించుచు, సకాలమునకు తన యొద్దకు వచ్చి నాయాజ్ఞచొప్పున మెలగవలసినదని చెప్పగా, వైశ్యులు చిత్తమనుచు వెళ్లిరి.

వైశ్యులా పర్వతమందలి ప్రకృతి దృశ్యములను జూచి యానందించుచు, "మహాగిరియను పేరు దగినట్లున్నది. దేవి మనకు తగిన నివాస మొసగినది. సమీపమున ధనాధిపతియగు కుబేరుడు సిరులొసంగ శివునియందు భక్తినుంచుదము. ఇచ్చట వసించుచు మనము వైశ్యులము గాన గోవులను బెంచి, గవ్యములను పొంది, హోమాది కార్యములను జేయుదము. బేరసారములలో కుబేరుని మించి, నవనిధులను మించు నిధులను సంపాదించుదము. అన్నవస్త్ర విద్యా వైద్యాది కార్యములకు సహాయములు చేసి, యార్తులను రక్షింపవలయు"నని నియమమును పూనిరి. కన్యకాంబయును వారు ధర్మాత్ములుగ జీవించుటకు సంతోషించెను.

అట వైశ్యులు "మాతల్లిని వదలి యెట్లు జీవింపనగునో? మాకు మరల జూడనగునా" యని కలవరపడుచుండ, కన్యకాంబ ప్రీతితో మహాగిరి కేతెంచి, నందనవనమును మించిన సౌందర్యముగల మహాగిరి స్థలములను జూచి యానందించెను. వైశ్యులు కన్యకాంబను పూజించి కైలాసమున కేగి శివుని పూజించుచుండిరి. శివుడు వారిని ధీరులగను వినాయక, కుమారస్వాములవలెను, పార్వతివలెను నందివలెను జూచుచు నాదరించుచుండెను.

ఒకనాడు వసువులు, రుద్రులు, దిక్పాలురు, దేవతలు, యక్షరాక్షస కిన్నరాది గంధర్వులును వచ్చి శంభుని పాదములకు నమస్కరించుచుండిరి. సకలాభరణములును పార్వతితో కూడియుండ, గరుడవాహనము నెక్కి లక్ష్మితో

విష్ణుప్రభుః, హంసనెక్కి సరస్వతితో బ్రహ్మయును, ఐరావతమునెక్కి శచితో నింద్రుడును, చిత్రరేఖతో కుబేరుడును రాగా, గౌరీశుని యాజ్ఞచే వైశ్యులు వారిని గౌరవించిరి. అట్లు సతీయుక్తులగు త్రిమూర్తులకును, దేవతలకును, దేవాంగనలకును నమస్కారంబు కావించిరి. అప్పుడు శంభుడు వైశ్యుల కిట్లనెను.

"ఓ వైశ్యులారా! కలియుగమువచ్చి, భూప్రజలను బాధించుచున్నది. మీ రటకు జని కలి యాకలిం దీర్చి, ప్రజకు మేలుకూర్పుడు. దేవి యాసతియు నదియుగదా" అని పలుక వైశ్యులు విచారమునంది, "దేవి యిటకు పొమ్మనె. మీ రిటనుండి భువికి పొమ్మనుచుంటిరి. దయాళురగు విష్ణ్వాదులతో యోచించి సంతోషమును కూర్పుడు అని పలికిరి. అందులకు శివుడు 'కన్యకాంబ మాటయేగాని నామాట కాదు. మార్పు కోరదరేని ఆమెనే యడుగుడు' అని చెప్పెను. అంతట వైశ్యులు మణిద్వీపమున కభిముఖులై, "అమ్మా! ని యాజ్ఞచే నిటకు వచ్చితిమి; శంభుడు భూలోమున కేగు డనుచున్నాడు. ఇచ్చట నీదర్శనము కలుగుటచే స్వేచ్ఛాచారముగ నుంటిమి. భూలోకమున కేగిన మీదర్శనమెట్లు? తల్లీ! మమ్మిప్పుడేల పాలింపవు?" అని ప్రార్థింప త్రిమూర్తులును, దేవతలును, మునులును నాశ్చర్యము నొంద, సూర్యచంద్రప్రకాశమానయై, సర్వాభరణభూషితయై నవ్వుచు ప్రత్యక్షమాయెను. బ్రహ్మేంద్రాది సకల దేవాదులును, మునులును స్తుతిపాఠముల గావించిరి. అంతట

దేవి వైశ్యులను జూచి, "ఓయీ! నామాట వినుడు. భూమిని ధర్మము నశించి యలమట నొందుచుండ ధర్మస్థాపనకై మిమ్ము పొమ్మంటిని గాని, బాధల నొందుటకుగాదు! ఇప్పుడు తగినవిధమును భూమియందాచరింపు"డన నీ వైశ్యులు దేవీదర్శన వియోగమును పొందలేమన మరల వారి కిట్లని చెప్పదొడగె.

## ౨

"ఓ వైశ్యులారా! విచారమును మానుడు. నన్ను వదలుటకు విచారము నందుచున్నారు. లోకమున ధర్మ రక్షణ గావింపవలెను మిమ్మనుసరించి నేను కన్యకాంబనై జనియించెదను. శివుడు నగరేశ్వరుడుగను, వింధ్యవాసినిగ గౌరియు, శచి వాసవిగను, లక్ష్మీనారాయణులు కమలా జనార్దనులుగను పుట్టుదురు. మీ రెచ్చటనున్నను ఆచోటికి మహాద్రి (పెనుగొండ) యను పేరుపెట్టి నన్ను పూజింపుడు. పూర్వజన్మజ్ఞానముచే ధర్మమును వ్యాపింప జేయుదురు. ఏదియు శాశ్వతముగాదు. మానము ప్రధానము. దాని రక్షింపుడు" అని పల్కి యంతర్ధాన మందెను. వైశ్యులు సందేహమును మానిరి.

అంతట సకలపరివారసమేతుండగు శంకరునికి వైశ్యులు నమస్కరింప నత డిట్లనెను "భూమండలమున భారతభూమి గొప్పది. అందు గోదావరి యనునది శ్రీరామసేవితమై పవిత్రమై యొప్పుచున్నది. దానిచెంత బ్రహ్మ బ్రహ్మమేధ

మను యజ్ఞము చేయుచున్నాడు. అందులకు దేవర్షులును, సపరివారముగ నేనును, లక్ష్మితోడ విష్ణువును, ఇంద్రాది సకలదేవతలును, బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రులును నరుగవలయును. అచ్చటికి మీరును బయలుదేరుడు'' అని చెప్ప వెంటనే యందఱును ప్రయాణమైరి.

గోదావరీనది నాసికాత్ర్యంబకమందు జనించినది. సకల పాపహారము, సకలసంపత్కరము. అచ్చటికి త్రిమూర్తులును, ఇంద్రాదిదేవతలు, గంధర్వులు, సకలాసురులును, అణిమాదిసిద్ధులును, మునులును, చాతుర్వర్ణ్యులును బ్రహ్మమేధమును చూడవిచ్చేసిరి. ఆ ప్రదేశము సందడిగనుండెను. అప్పుడు బ్రహ్మ యాగమున కెవరెవరు వచ్చిరని ప్రశ్నించెను.

బ్రాహ్మణులు పదునెనిమిదిగణములవారును, క్షత్రియులు నాలుగువందల తొమ్మిదిగోత్రములవారును, వైశ్యులు ఏడువందల పదునాలుగు గోత్రములవారును వచ్చిరనిరి. ఆఱునూట పంద్రెండుగోత్రముల వైశ్యులు యాగమునకు వచ్చినవారలలో మాసంఖ్యయే యధికమని బ్రాహ్మణులను పరిహాసించిరి. అందులకు విప్రులు కోపించి 'భూమిని పుట్టి బాధల నొందు'డని శపించిరి. అప్పుడేమియు చేయకున్న నూటరెండుగోత్రములవారు శాపమునకు భయముచెంది, బ్రహ్మతో 'స్వామీ! మేము నిర్దోషులము; మాకీశాపము కలుగకుండునట్లుచేయు'డన, వారిని మీ రక్షింపకునికి మీకును ననుభవింపక తప్పదు. అయినను మీ సచ్చరిత్ర మీకు కీర్తి గలిగించునని పలికె.

అప్పుడు జగదంబికాభక్తుడగు సూతుడు శౌనకాది మహామునుల కిట్లు చెప్పెను. ఆ నూటరెండుగోత్రములలో శంభు శ్రేష్ఠి తెలివిగలవాడు. ఒకనాడు మణిపీఠియందు దేవిని పూజించుచుండ శచి యచటికి రాగా, నామెను జూచి 'యీమె కుమార్తెగ గలుగునట్లుగ వర మిమ్మని' వేడెను. ఆమె యనుగ్రహముచే కూతురుగ బుట్ట వాసవి యని పేరుపెట్టుకొని యామెతో నా శంభు శ్రేష్ఠి గోదావరీతీరమందు జరుగు యాగము చూడబోయెను. అచ్చట వాసవి సౌందర్యమును గాంచి యెల్లరు నచ్చెరువందిరి.

అట్టితఱి మన్మథునివలె సుందరాకారుడగు మణిపురాధిపుడు చిత్రకంఠుడను గంధర్వుడు వాసవి రూపసౌందర్యములకులోనై, యాగము ముగియగనే శంభు శ్రేష్ఠుని కడకేగి యెల్లరు నాశ్చర్యమంద నిట్లడిగెను. "ఓ పూజ్యా! నేను మణిపురాధిపుడగు గంధర్వరాజను. ఈ మహాగిరికి కూంత వేటు దూరమున నున్నది. నాకును వాసవికిని ఈడు జోడుగ నుండును. కాన నీకుమార్తెను నాకిచ్చి వివాహము కావింపు"డని కోర, శంభుసెట్టి తన బంధులనడిగి, 'ఈయ వీలుకా'దని పల్కెను. అంత చిత్రకంఠుడు కోపగూరి, "ప్రియముతో కన్యనీయమని యడుగగా నింపుగూర్పక కీడును పలికితిరి. ఇందులకు మీకు శాపమిచ్చుచున్నాను. మీ నూటరెండుగోత్రములవారును కన్యతోగూడ భూమియందు జన్మించి యగ్నిపాలగుదురుగాక" అని యనెను. అందులకు వైశ్యులు ప్రతిశాపము నిచ్చిరి. "ఔరా! నీ పొగరుతనము!

నీకెట్లు ఋణపడితిమి, మా కన్యనిమ్మని యడుగగానే, కాను కగా నర్పింతుమా? దుష్టా! నీకిచ్చుటకంటె క్రూరమృగ మున కిచ్చుట మేలు. నీశాపముచే మాకన్య యెట్లులైనను నశించును. నీవును భువిని రాజవై, దానియందలి మోహ ముచే కృశించి, తల పగిలి చత్తువుగాక. మాకు కఠినముగ శాపమిత్తువా" యని పలుక వాడు తలబ్రద్దలయి చచ్చెను. ఆ కన్యయే వాసవిగా జన్మించెను. ఆ చిత్రకంఠుడే విష్ణు వర్ధనరాజుగా బుట్టెను అని మఱియు సూతు డిట్లనెను.

సుశీల సోమకాంతులను యక్షదంపతులు కలరు. వారు శచీభక్తులగుటచే నామెను తమ గర్భమందు జనించు నట్లు ప్రార్థించిరి. సోమకాంతుడు శంభుసెట్టి యయ్యె. శచి వాసవిగ వనితనికి జనించె. ఆ సోమకాంతుడె కుసుమ శ్రేష్ఠియు, సుశీల కుసుమాంబయు నగుదురు. శచి వారి కుమార్తెగ వాసవి యగును.

పూర్వము శతజిహ్వుడను రాక్షసుని చంపుటకు బ్రహ్మ జయంతుని గోరెను. శచి, తనకొడుకు ప్రాణభయ మున దుఃఖించి, యడ్డుపడ బ్రహ్మ కోపించి, "లోకకల్యాణ మునకు జయంతుని నియమింప వారింతువా? దీనికి దగినట్లు భూలోకమున నరభామినిగ పుట్టుము" అని శపించెను. శచి మిక్కిలి దుఃఖించెను. ఇంద్రుడు "పద్మభవా! స్త్రీ స్వభావముచే నాసతి యట్లు కోరినది. ఇందుల కాగ్రహ మేల? ఇట్లు శపింపదగునా? నీశాపముచే నాభార్య భూమిని జనించి మఱొకని వివాహమాడియుండగా దేవరాజత్వము

నాకు బరువుకాదా! ఈ భార్యకే కాక భర్తకు గూడ నయిన నొప్పిగదా!" అన బ్రహ్మ ప్రీతితో నీభార్య యన్యునికి సతి యగునని తలంపకుము. ఆమె లోకమున బుట్టి, కన్యకగా నుండి కన్యకాంబ యని గౌరవమును పొందు" నని చెప్పెను. చిత్రకంఠుని శాప మువలనను, బ్రహ్మశాపమునను కన్యాంబ సంకల్పము చేతను శచీదేవి భూలోకమునబుట్టి లోకపావన యగును" అని చెప్పెను.

శ్రీ కన్యకాపరమేశ్వరి మహాగిరియందు వేంచేసి వైశ్యులను జూచి యిట్లనెను. "ఇందున్న నూటరెడుగోత్రములవారు నాకు హితులు. తక్కినవారు నామమాత్ర వైశ్యులు. మీలో శంభుశ్రేష్ఠి గొప్పవాడు. ఆతనిపుత్రిక శచీదేవి. ఆమెను నాపూజకు నియమింపుడు. పీఠెచ్చట నున్నను నది పెనుగొండయని ప్రసిద్ధినొందును. అందు పెద్ద సెట్టికి బిడ్డనై మీతో నుండును. మీ వాసస్థానమునందలి దేవళముననుండి పూజలు గొందును" అని కన్యకాంబ చెప్పి యంతర్ధానయాయెను.

పిమ్మట వైశ్యులు కైలాసమునకేగి యొకచోట గూర్చుండి శంభు నానతి స్తుతించుచుండిరి. శంభుడు "తొల్లి కన్యాంబయే చెప్పెనుగదా! కాన నీగోకర్ణస్థానమును వదలి భూమికి పొండు" అని వైశ్యులతో నన "ఓ ఉమాపతీ! కన్యకాంబ ప్రకృతివగు నీయొద్ద సంతోషముతో నుండగ మమ్ము పొమ్మనుట న్యాయమా!" యని వైశ్యు లనిరి.

"విషయమంతయు వినియు వంత నొందవచ్చునా" యని శివుడు పల్కుచుండ బ్రహ్మయు సతితో వచ్చెను. వారి యెదుట "కలియుగము పాపభూయిష్ఠమయినది. కులధర్మములు వ్యత్యస్తములగును. ద్వేషసహితులై యొకరినొకరి నాక్రమింతురు. అట్టి నరకస్థానమున కా? మమ్ముపంపుచున్నారు" అని ప్రార్థింప శంకరు డిట్లనెను.

"దేవి మీకు గొప్పగ గోదావరీతీరమున 'పెనుగొండ' ను సకలైశ్వర్యనిధానముగ నిర్మించియున్నది. ఇది యుగాత నిరపద్యాపురము, నారాయణపురము, శివపురము, విశాలపురము, మేలాపురము, నరసాపురము, ధనదపురము, త్రిగుణపురము, జగన్నాథపురము, పీఠికాపురము, బాలకుండము, కాచంట, పాంచాలము అను పదునేడుపురములు నిర్మింపబడియున్నవి. అందులకేగి ధర్మానుసరణి వ్యాపారములుచేయుచు ధర్మరక్షణగావింపుడు' అనెను. బ్రహ్మయు శంకమాని సకలశుభంకరుడగు శంకరుని యానతి భూమి వసింప సర్వశుభములు చేకూర్చు" ననెను.

అంతట వైశ్యులు భూలోకమున పెక్కుస్థలముల శివలింగముల స్థాపించి పూజించిరి. కాని శివుడు కనుపింపలేదు. వారు భయంకరముగ తప మొనరింప శివుడు ప్రత్యక్షమయ్యెను. వారి ప్రార్థన ననుసరించి కైలాసమున వసించుటకనుమతి యిచ్చెను.

## 3

సూతుడు శౌనకాదిమహామునుల కవ్వలికథ నిట్లు వచించెను.

వైశ్యులు కైలాసముచేరి శివుని, వాసవిని గణేశ షణ్ముఖులను భక్తితో పూజించుచుండ, సాలంకాయనుడు శివుని జూడవచ్చెను.

సాలంకాయనుని రాకచూచి యెల్లరును సంతోషించిరి. శివుడు "సాలంకాయనునితో భువికేగి, యతని వలన మీ సందియములను దీర్చుకొని గోకర్ణక్షేత్రమునందున్న నన్ను పూజింపుడు" అని వైశ్యులకు చెప్పెను. సాలంకాయనుడు వైశ్యులతో తనయాశ్రమముజేరి వారికి జ్ఞానోదయము కల్గునట్లు బోధించుచుండ, "మా వైశ్యులచరిత్రమును, కాలగతియును, సృష్టిగతియును" దెల్పుమని వైశ్యులు కోర నతడిట్లు చెప్పదొడగెను.

ప్రతిష్ఠానగరమున చూడామణియను వైశ్యుడుగలడు. అతడు సంతానము లేక భార్గవచ్యవనుని యాజ్ఞచే శ్రీ విష్ణుని కొల్చి ధర్మనందనుడను పుత్రుని వడసెను. అతడు భార్గవచ్యవనునివద్ద విద్య నభ్యసించుచుండెను. ఒకనాడు సమిధలను, దర్భలను దెచ్చుట కడవికి వెళ్లెను. అట అంగిరసుడను బ్రాహ్మణుడు 'ఒకబోయ నన్ను చంపుచున్నా'డని యఱచె. ఆ కేకవిని యటకేగి బ్రాహ్మణుని విడిపించి యతనికి మాఱుగ తానాబోయతో బలియగుటకై

కాళికాలయమునకు బోవుచుండెను. అంత నొకరాజు సైన్యముతో వేటకురాగా జూచి బోయ భయపడి, ధర్మనందను నొక బిలమునదాచి మూతవేసి తానొక చెట్టునెక్కెను. వేటకై వచ్చిన రాజు విశ్రాంతికై యాచెట్టుక్రింద కూర్చుండెను. చెట్టుపైనున్న బోయనుజూచి, వాని నరహంతకుడని తలచి వానిని వధింప భటుల కాజ్ఞాపించెను. వారు నట్లే చేసిరి. అప్పుడు శివుని యాజ్ఞచే కైలాసమునుండి యాదిశేషుని గడకేగుచున్న వాసుకి బిలద్వారము మూసియుండుటచే కోపించి కాలువ నది భస్మమాయెను లోన పద్మాసనము వైచికొని దేవిని ధ్యానించుచున్న ధర్మనందనుని గాంచి, యాబాలుని దోడ్కొని తండ్రివద్దకు వెళ్లెను. ధర్మనందనుడు శేషునికి నమస్కరింప సంతోషించి వరము కోరుకొనెను.

ధర్మనందనుడు సృష్టిరీతిని దెలుపుమని కోర శేషుడు చతుర్యుగముల పరిమితియు చరాచరసృష్టియును, త్రిమూర్తులయొక్క కార్యములను, సకలవిశ్వముల స్థితియును దెలిపెను.

సాలంకాయనుడు వైశ్యుల కిట్లు మరల చెప్పెను. సోమకాంతుని కూతురగు ప్రతాపవతిని సోమదత్తుడు వివాహమాడ గోర నతడు నిరాకరించె. సోమదత్తుడు 'వివాహమైన యేడుదినములకు చావగల'దని శాపమిచ్చె. సోమకాంతుడు పంచకల్పవృక్షముల నడుమ నైదు స్తంభముల నేర్పఱచి సోమదత్తునికిచ్చి వివాహముచేయించెను. అదిమొదలు ఐదు కంబములు పెండ్లితిన్నెకుండవలయునని శివుడనెను.

మణిగ్రీవుడనెడి వైశ్యుడు సాలంకాయనమునిని జూచి, "స్వామీ! వైశ్యులు గంధర్వునకు కన్నె నీయమని యేల యనిరి?" అని యడుగ, స్వర్గమున గంధర్వులు శూద్ర తుల్యులుగాన కన్య నీయమని వైశ్యులనిరి. అందులకు కోపించి దివినుండ దగదు భువికి పొండని, గంధర్వులు వైశ్యులను శపించిరి. పిమ్మట ప్రతాపవతీ సోమకాంతులవివాహము జరిగెను. వారలకు శచియంశము చే కీర్తియను కాంత జనించి, సకల లోకసుందరియై యౌవనయై వనమున చరించుచుండె. అతటి చిత్రకంఠుడను గంధర్వుడటకువచ్చి, కీర్తిసౌందర్య మునుజూచి మోహించి యామెతో నిట్లనెను. "ఓసుదతీ! నినుగోరితిని, నన్ను వరించి నామోహమునుదీర్పుము" అని మర్యాద నతిక్రమించి పలికెను. అందులకు కీర్తికాంత 'దుష్టుడా! ఏచూపున చూచితివి? నీవు గంధర్వుడవా? సిగ్గులేదా? నిన్నుగోరిన కాంతలు భ్రష్టలుగారా! పోపొమ్ము' అని శూలములవలె కటువాక్యములచే దూషించెను. ఆ మాటలు విని సిగ్గుపడి చిత్రకంఠుడు వెడలిపోయెను.

కీర్తికాంత చెలికత్తెలతో నింటికేగి, విషయమును తల్లి కెఱిగించెను. చిత్రకంఠుడు నామెయందలి మనస్సును మార్చుకొనలేక వైశ్యనాయకునికడ కేగి, కాళ్లపైబడి "కీర్తికాంతపై నామనసు చిక్కినది. నాకిచ్చి వివాహము గావింపుడు. లేనిచో మరణింతును," అని వేడుకొనగా, సోమదత్తుడతడు నీచజాతియగుట చింతించి, "గంధర్వునకు కన్యనిచ్చుటకంటె గంగలోద్రోయుట యుత్తమము. ఈడా?

జోడా? మీరు మాకన్యను గోరదగునా? పోపొమ్ము" అని మొగమాటము లేక పలికెను. ఆ మాటలువిని నిరాశచే కోపమునంది, "గంధర్వరాజగు చిత్రకంతుడను. నన్ను లెక్కగొనక శాఖులు ప్రేలెదరా! మీరు మీకొమరితతో గూడ భూమియందుపుట్టి, మీ సంపదతోగూడ నగ్నియందు బడి నశింతురుగాక" అని శాపమిచ్చెను. వైశ్యులును కోపము నంది, "నీచగంధర్వా! మాకన్యనిచ్చుటకు నీభటులమా! ఇంతటి గర్వమా? నీవును భూమియందుపుట్టి ఈమె మీద ప్రియపడి తలపగిలి చచ్చెదవు. ఈలోకమున నే కాదు. ఏలోకమునైనను నామెమీది మోహశచే మరణింతువుగాక. ఈమె నీకు వశముగాడు" అని ప్రతిశాపమిచ్చిరి. పిమ్మట కైలాసమున కేగి శివుని కీవృత్తాంతమును దెల్పి, శివుని కన్యకాంబను కొలుచుచునుండిరి,

అనంతరము సూతుడు శౌనకాది మహామునులకు గౌరీకల్యాణమును చెప్పదొడగెను.

దక్షుడు కూతురగు దాక్షాయణిని, అల్లుడగు శివుని పిలువకయే అశ్వమేధము చేయుదొడగెను. దధీచుడను ముని శివుని పిలువక యాగముకూడదు, విష్ణునికిని ప్రీతికాదు అన, 'శివుడు దిగంబరుడు, తమోగుణుడు, ప్రాణిహరుడు కాన సత్కరలే'దనె దక్షుడు. దాక్షాయణి శివునివలదన్నను యజ్ఞమునకువెళ్లి, యచ్చట భర్తృదూషణమును విని సహింపక యాయగ్నిలోబడి నశించెను. అంత నచ్చట శివుని జటల నుండి వేయికన్నులు, వేయితలలు, వేయిచేతులు గల్గి

భయంకరముగ వీరభద్రుడు జనించెను. సకల దేవతలను బాధించి దక్షుని తల నరికి కైలాసమున కేగెను. శివుడు దక్షుని మొండెమునకు తల నంటించి బ్రతికింపగా, నతడు శంభుని పొగడెను. దాక్షాయణి హిమవంతుని పుత్రికగ జన్మించెను. శివుడు భార్యా వియోగముచే ఎన్నో దివ్య వర్షములు హిమాలయముపై తపస్సు చేసెను

తారకాసురుడు బ్రహ్మవలన వరములుపొంది, గర్వముచే దేవముని గణముల బాధింపజొచ్చెను. సురబాధపడ జాలక బ్రహ్మను ప్రార్థింప, "హిమాలయముపై శివుడు తప మొనరించుచున్నాడు. పార్వతికిని, నతనికిని గలిగిన పుత్రునిచే వాడు నశించును, లోకములు సుఖించు"నని బ్రహ్మ చెప్పెను. అది విని యింద్రుడు బృహస్పతి యాజ్ఞచే మన్మథుని పిలిపించి, "నీవు శివుని పార్వతిపై ప్రేమగొను నట్లు చేయుము. వారికి గలిగిన పుత్రుడు తారకునివధించును. లోకములకు మేలుకూడును" నన మదనుడు వసంతునితో గూడ తపోవనమున కేగి, తపము చేయు శంభుని యొద్దనున్న పుష్ప బాణము నాటవేయ శివుడు మనోవికారమునొంది, రోషముచే మూడవకంట మన్మథుని జూడ నతడు భస్మమాయెను. లోకములు దుఃఖించెను.

అదివిని రతి, భర్తృమరణంబునకు మిక్కిలి వగచి, శివుని పాదములపైబడి, "నాథ! రక్షింపుము, దేవా! ఏమంటి మాటచే నాపతిని దహించితివో, దానితో నన్ను కాల్పుము" అని మొరలిడెను. దేవర్షులును శివుని వేడిరి. అంత శివుడు

రతితో "ఓ సాధ్వీ! దుఃఖింపకుము. నీ భర్తను బ్రతికించె దను. నీకుమాత్రమతఁడు రూపముతో గనుపించును. సకల జీవుల హృదయములలో వసించును" అని పలుక, మన్మథుడు జీవించె. పతితో రతి శివునికి నమస్కరించి చనెను. అంతట దేవతలు ఉమాశివులపై పుష్పములు వర్షించిరి. అప్పుడు బ్రహ్మ "మహాదేవ! నీదు లీలలు పరమములు. నీవు గౌరిని గ్రహింపుము. మీపుత్రుడు దేవతలబాధ తీర్చును" అని యనెను.

౪

ఒకనాడు నారదుడు శంభుని గాంచ కైలాసమునకు వచ్చెను. శివుడును కుశలప్రశ్నలగావించి, లోకమున నెటనైన సుందరియగు కన్నెను జూచితివా? యనెను. అంత నారదుడు "మీరు సర్వాంతర్యాములు. మీ రెఱుగనిది లేదు. అయినను తెలిపెద. హిమవంతుని పుత్రిక రూపగుణముల మీకు తగినది. ఆమె మీయందు బద్ధానురాగయై యున్నది. లాలించినచో మహిమ నొందగలదు" అని పలికి నారదుడు వెళ్లెను.

శివుడును పార్వతిపై ననురాగమును బొందెను. అంత పార్వతి చెలికత్తెలతో మానససరస్సునకేగి యట జలకమాడి, కమలములు కోసి శివుని తన్ను పరిగ్రహింపుమని పూజించెను. శివుడును సంతసించి వృద్ధబ్రాహ్మణ రూపముతో తెల్లని జడలును, చేతకఱ్ఱయును బూని పార్వతి

వద్ద నిలిచెను. ఆమెయు నతిథిపూజ కావించి నమస్కరించె. "కల్యాణమ"స్తని యాశీర్వదించి, "నీ పూజను నీ ప్రియ దైవము గ్రహించెను. నీపేరేయ్యది? నీవెవతెవు?" చెప్పుమని యడిగెను. పార్వతి యాజ్ఞచే, నామె చెలికత్తె "ఈమె హిమవంతుని పుత్రిక. శంభుని గోరి తపసు చేయుచున్నది. అతడు గ్రహింపనిచో మరణింపనున్న"దని చెప్పెను. వృద్ధుడు పకపక నవ్వి, "నీవు మిక్కిలి ముగ్ధవు. శివునికి నుండ నిల్లు, కట్టబట్టయు లేదు. పాములు నగలు, స్మశానవాసము, దయ్యములు సేవకులు, తల్లిదండ్రులు లేరు. నీ వెక్కడ? అత డెక్కడ" అని పరిహసించెను.

పార్వతి శివుని దూషణ సహింపక, ముఖము చిట్లించి చెవులు మూసికొని, 'పాపహారుడగు శివుని దూషింప నోరెట్లు వచ్చె' ననెను. ఆమె చెలులు నా వృద్ధుని కఱ్ఱను, కమండలువును లాగి పరిహసించుచుండ, "వృద్ధుని మాటల లెక్కయేమి!" యని వారిని వారించె. అంత విభూతిపూసిన శరీరముతోడను, ఫాలచంద్రునితోడను, ఎఱ్ఱని జడల తోడను, సర్పహారములతోడను, పులితోలు వస్త్రము తోడను. త్రిశూలాదుల ధరించిన నాలుగు చేతులతోడను శివుడు సాక్షాత్కరించి, తపము ఫలించుటచే సిగ్గుతో నిలిచిన పార్వతి చేయిపట్టుకొని "నీయందు ప్రేమగలిగెను, మన్మథబాణముల తప్పించి నన్నేలు"మనె గౌరి చిఱునగవుతో "మావారు కలరు గదా ఇచ్చుట" కనె. శివుడును, గౌరియును తమ గృహముల కేగిరి. శంభుడు సప్తమునులను

దలచెను. వారు హిమవంతుని కడకేగి శివునికై పార్వతిని కోర నాత డంగీకరించి, "ఓషధిప్రస్థమున వివాహముచేయ సిద్ధముగనున్నా"నని.

అంత శివుడు, శీఘ్రుడు, ప్రవర్ధనుడు, జడుడు నను ప్రమథుల పంపించి సకలలోకాధిపతులకును, మునులకును, బ్రహ్మాలకును నాహ్వానములంపె. వారుకూడ రాగా శంభుడు హిమగిరికేగె. హిమవంతుడును సపరివారముతో నెదురుగ వచ్చి, యాహ్వానించి ముత్తైదువులచే నివాళియొసంగె. హరుడు బంగారువస్త్రమును, రత్నాలనడుముపట్టాయును, నవరత్నహారమును, మణికిరీటమును, కస్తూరిచందనపుపూత యును ధరించెను. అంతట గిరీశుడు అగ్నిసాక్షిగ గిరిజను పశుపతి కొసగెను. ఎల్లలోకములనుండి కానుకలువచ్చెను భూలోకమునుండి రాకుండెను. కారణమేమని శివుడు కుబేరు నడిగెను. క్రయవిక్రయముల జరుపు వైశ్యు లిటనుండుటచే భూలోకమునుండి కానుకలురాలేదని చెప్పెను. శివుడు "నిజము వైశ్యులు వ్యాపారము గోరక్షణము కృషియు చేయుచు వేదాచారులై భూలోకమున చక్కని ధర్మముల నాచరణము గావించుచు, నన్ను జేరి పిమ్మట కన్యకాంబను గందురు" అని యానతిచ్చెను. బ్రహ్మయును "మీరు నిర్విచారముగ భూలోకమున కేగుడు. చిత్రకంఠుని శాప సమయమును సమీపించినది. పదునెనిమిదిపట్టణముల విశ్వ కర్మ మీకై నిర్మించును. మీకు తోడుగ భాస్కరాచార్యు లనై నేను జన్మింతును" అనె. వారి యాజ్ఞచొప్పున గోదా

వరీతీరమున పెనుగొండ మొదలగు పట్టణముల వసించిరి. పెనుగొండయందు కన్యకాంబ దేవతయై యొప్పెను.

ఆ పెనుగొండయందు సకలసంపదలును గలిగి ధర్మాత్ముడగు కుసుమశ్రేష్ఠి ప్రాభాసగోత్రుడుండెను. అతని భార్య కుసుమాంబ. మైత్రేయసగోత్రమందు బుట్టినది. గుణవతి, సౌందర్యవతి. ఈ దంపతులు భక్తితో కన్యకాంబను గొల్చుచుండిరి. సర్వసంపదలచే నలరారుచు అతిథ్యభ్యాగత పూజ లాచరించుచు సిహాపరములకు సాధన కర్మలతో విరాజిల్లుచుండిరి. చాలకాలము గడచెను. ఎల్ల సంపదలున్నను సంతానసంపద లేమి వారికి లోపము కలిగించెను. అంత వారు తమకొఱకై జన్మించిన భాస్కరుని వద్దకేగి, తమ విచారమును దెల్పుకొనిరి. భాస్కరుగురువు వారిని జూచి "వంతనొందకుడు. తొల్లి దశరథుడు పుత్రకామేష్టి జేసి నలుగురుపుత్రులను బడసెను. నీవది చేసిన నొక పుత్రికను, నొకపుత్రుని పొందుదువు" అని చెప్పెను.

కుసుమార్యుడు భాస్కరుని కర్తగా జేసికొని యాగము నిర్వర్తించె. యాగాగ్ని మధ్యమునుండి శంకరు డుద్భవించి, యొక బంగారు గిన్నెను కుసుమునికి నిచ్చి మాయమైపోయెను. అంతట యాగము పూర్తి కావించి దానాదులొనర్చె. తత్ఫలముగ కుసుమాంబ గర్భము ధరించెను. గర్భము దినదిన ప్రవర్ధమానమై, నవమాసములు నిండ వైశాఖ శుద్ధదశమీ భానువారమున పునర్వసునక్షత్రశుభదినమున నొక పుత్రు

డును, నొకపుత్రికయు జన్మించిరి. జ్యోతిష్కుడు వీరిరువురి వలన వైశ్యులకు కీర్తి కలుగునని జాతకములు వ్రాసెను. శివు నను గ్రహమున జన్మించుటచే నతని నామాంతరమగు విరూపాక్షనామము బాలునకును, వసు అనుగ్రహమున జన్మించుటచేతను, కీర్తికరయై యొప్పుటచేతను నాబాలికకు వాసవి కీర్తికన్య యనునామములను తలిదండ్రు లుంచిరి. విరూపాక్షునకి పంద్రెండవయేట ఉపనయనము గావించిరి. భాస్కరాచార్యునివద్ద వేదాది సకలవిద్యలను నేర్చి కీర్తిమంతుడాయెను. వాసవియు సౌందర్యవతియై గుణవతియై యొప్పుచుండెను.

సుప్రసిద్ధముగు చంద్రవంశస్థుడగు నర్జునునకు నభిమన్యుడు, నతనికి పరీక్షిత్తు, నతనికి జనమేజయుడు, నతనికి శతానీకుడు, నాతనికి విజయార్కుడు, నాతనికి విష్ణువర్ధనుడును గలిగిరి. ఆతడే చిత్రకంఠుడను గంధర్వుడు. వైశ్యుల శాపమువలన జన్మించెను. అతడు దిగ్విజయముచేయదలచి కుమారుని రాజరాజేంద్రునికి పద్మశైలనగరము నప్పగించి విజయయాత్రకు బయలుదేరెను. సకలదిక్కులజయించి, ధనకనకాదివస్తువులనార్జించి, కుసుమగుప్తునిచే రక్షితమగు పెనుగొండను జూడదలచి, వర్తమానమంప వారును సంతసించి విష్ణువర్ధనుడు మెచ్చునట్టి సన్నాహములను జేయుచుండిరి.

ౘ

వైశ్యులందఱుగూడి పట్టణవీధుల నలంకరించిరి, ధనకనకరత్నములను రాసులుగఁబోసిరి. నగరవాసు లలంకరించుకొని యెదురేగి కొనివచ్చిరి. స్త్రీలలంకరించుకొని మేడలపైనుండి వీక్షించిరి. నివాళు లొసగిరి. అంత వైశ్యులారాజు నొక సౌధమున విడియించి గౌరవించిరి. అంత కుసుమగుప్తుడు భార్యతోగూడివచ్చి నమస్కరించి కానుక లొసగి, పరమేశ్వరీయాలయమును దర్శింపరండని గోరెను. రాజు సేనగుపైనెక్కి, వేదతూర్యనాదములు చెలరేగుచుండ వైశ్యబృందముతో నాలయమునకు వచ్చెను. నూటరెండుగోత్రములవారును, ఆర్యాటపంద్రెండు గోత్రములవారును రాజుతో గర్భాలయమును ప్రవేశించిరి.

పిమ్మట వైశ్యులు "రాజా! ఈమె మాదైవము, ఈమెయున్నచోట త్రిమూర్తులు సపత్నీకులుగ వసింతురు. మే మున్నచోటు పెనుగొండ. మేము వేదాదివిద్యల నభ్యసించి, బేరసారముల ధనమార్జించి కృషి గోరక్షణలను జేయుచు బీదసాదలను పోషించుచుందుము" అని చెప్పిరి. రాజా దేవాలయ వైచిత్ర్యముంగాంచి యాశ్చర్యపడుచుండెను. ఆ దేవి దర్శనార్థమై బలవిక్రమముగల పురుషులును, సర్వాభరణభూషితులగు సుందరులును వచ్చిరి. ఓంకారపూర్వకముగ దేవికి పూజలు జరిగెను. పిమ్మట వైశ్యముఖ్యుడు కుసుముడు పూజించెను. శచీఅంశయగు వాసవి పూజించి, "త్రాహి" అని నీరాజనమిచ్చి తీర్థప్రసాదముల

భక్తులకొసగెను. ఆమెయందమును జూచి రాజు ఆమెయందు మోహముగొనెను. తక్కినవారు ఆమె పూజలకలరి భక్తిని పొందిరి. రాజు మన్మథవికారమునకు లోనయి పెక్కుచేష్ట లొనరించెనేగాని వాసవి కన్నెత్తియైన జూడలేదు. రాజు సహింపలేక "ఓ వైశ్యులారా! ఇట్టి కన్య నెందును చూడలేదు. నామన సీమెయందు లయించెను. నాకీమెను రాణిగ నొసంగుడు. శుభములను పొందుడు. నేను చంద్రవంశీయుడను. మాపొందు ఇంపుగొల్పును. ఈమె శచి, నే నింద్రుడను. మమ్ముం జేర్పుడు" అని రాజు పలికె. ఆ మాటకు వైశ్యులు చింతించి యోచించిరి. కుసుమార్యుడు రాజును జూచి "రాజా! మా మనవి వినుడు. ఈమె జనించి నపుడె పరమేశ్వరి కర్పించితిమి. ఇది మాయాచారము. తొలికూతు నీదేవి కర్పింపవలయును. ఆ జన్మ మామె నీ కల్యాణిని పూజింపవలెను" అని చెప్పెను. రాజు కోపము నంది నేనేమియు కోరలేదుగదా! ఇంతమాత్రమున కేల యిట్లుపలికెదరు. మీరు బాగుగ యోచించి యీదినమే బదు లిండు అని మంత్రి నటనుంచి తాను తన విడిదికి బోయెను. వైశ్యులు కానుకలు గొను డన నలక్ష్యముగ నేగెను.

అంత మంత్రి విక్రమసింహుడు "వైశ్యులారా! మీరు రాజాజ్ఞను త్రోసిపుచ్చకుడు. కుసుమార్యా! నీవు కులపెద్దవు. చాళుక్యవంశజుడు విష్ణువర్ధను డల్లుడగుట

యదృష్టముగదా! తానై వచ్చుసిరిని కాలదన్నకుము, రాజు విష్ణ్వంశుడు. కాదనకుము. బ్రాహ్మణుడు తక్కిన వర్ణముల స్త్రీలను గొనునట్లు క్షత్రియునకును నీకన్య గొనదగును. కాదనకుడు. రాజుతో పేచీ పెట్టుకొనకుము" అని చెప్పెను. వాసవి మంత్రివాక్యములు విని పూర్వజన్మజ్ఞానము కల దగుటచే "పూర్వము తన్ను మోహించిన చిత్రకంఠుడు శాపముచే జన్మించినాడనియు, నశించుననియు'' నెఱిగి యూరకుండెను. అంతట కుసుమార్యు డిట్లనె. "మాతోలి కన్యను యావజ్జీవము పూజలుసేయ దేవి కొసగుట యాచారము. దేవికొసగిన కన్యను మఱొకరికిచ్చుట యెట్లు? వేఱొక కన్యను గోరిన నిచ్చెదము.'' మల్లుడును, సోము డును రాజునకు కన్యనిచ్చుట కీడును తెచ్చుకొనుట యనిరి. మంత్రియు కోపమునంది యంతయేల? మీకొక మాసము గడువొసగెదము. ఈలో మీరు చక్కగ యోచింపుడని రాజువెంట నగరమున కేగెను.

వైశ్యులందఱుగూడి పారుపోవక యోచించుచుండ నొక వృద్ధుడు పూర్వస్మృతిచే "సీమకీర్తి కన్యక, ఆతడు చిత్రకంఠుడు. శాపముచే నిట్లు జన్మించిరి. శంభునికడ కేగి, మనము కన్యకాంబయు చేరుసమయము సమీపించినది, ఈ రాజు కోరికి కూర్పరాదు, మన మాదేవిని భజించుదము" అని పలికెను. పిమ్మట బాలనగరులు, "మేము వీరులము,

యుద్ధనిపుణులము, రాజుతో యుద్ధము చేసి గెలిచెదము, మమ్ము పంపుడని" వైశ్యులను కోర వారొకరినొకరు చూచుచు నూరకుండిరి. అప్పుడు ఆఱునూర్ల పండ్రెండు గోత్రముల వారును "వ్యర్థముగ పోరాడి మరణింపనేల? రాజల్లుడైనచో సకలసంపదలు ననుభవింపవచ్చును. యముడు గొనిపోయి నచో నేమనగలము, అట్లే యీతనికిచ్చి మనుట మేలు. కృత యుగమున రేణుకయు, త్రేతాయుగమున సీతయు, ద్వాపర యుగమున ద్రౌపదియు నయి ఇప్పుడు కన్యకయయి జగ న్నాశము చేయనున్నది" అని యనిరి. అందులకు విరూపాక్షుడు కన్యను దూషించి నందులకు కోపించి, "రాజు విష్ణువే యైనచో నిట్టి యన్యాయమునకు వచ్చునా? దేవి మహిమ నెన్న నెవరికి వశము? గర్వులకు నీయరా"దనెను. "నీవు బాలుడవు, కష్టసుఖముల నెఱుగవు. ఈ నిచ్చగింపకు. దేవి కల్పించితి మననేల? దానికి నాధారముగలదా? కన్యనిచ్చిన సుఖమును లేకున్న వినాశము గలుగు" ననిరి. నూటరెండుగోత్రముల వారు "రాజులు దోషులు. వారికి వేదశాస్త్రాదులడ్డురావు. తమ కింపగుదానిని కావింతురు. వారితో వసించుటకంటె పాము వద్దనుండుట మేలు. వారికి నోట నమృతము, కడుపున విషము" అని యన తక్కినవారు రాజెట్లయినను కన్యను గొనిపోవుట నిజమనిరి. అట్లని వారికి భయపడి స్త్రీలను చెఱచుదురా! అంతకంటె నగ్నిలో చొచ్చుట మేలని బాల

నగరులు నూటరెండుగోత్రములవారును పలికిరి. మఱియు నగ్నిజొచ్చినవారికిని, చొరనివారికిని సంకరము గలుగును. 612 గోత్రములవారు పెనుగొండ నుండరాదు. ఇప్పుడే యెటకేనియు పొండన, వారు తలకొకదిక్కునకు పోయిరి. పెక్కునామములతో నొప్పిరి.

౬

వైశ్యులు రాజువద్ద నెలదినములు గడువుదీసికొని తమ కులమర్యాద యెట్లాయని తోచక యోచించుచుండిరి. రాజు కన్యను బంపుడని భటులను వైశ్యులకడకు పంపెను. భటులు వచ్చి వైశ్యుల యాచారవృత్తములను, వ్యాపారమును దానాదులను జూచి యాశ్చర్యము నొంది, రాజు దుర్వృత్తములను దలంచి వారటనే యుండి జీవిత శేషమును గడుపదలచిరి. అడిగిన వైశ్యులకును నెఱిగించిరి. "మే మగ్ని జొచ్చి మరణింపనుండ మాకడనున్న మీ కేటిలాభము? పొండు మీ రాజును గొలువుడు. మీకు మాయందు ప్రియము కలదేని మా యగ్నిప్రవేశమునకు విఘ్నము కలుగకుండ రాజు కడకేగి, ఇది తప్ప తక్కిన విషయములను జెప్పుడు, మా దేవి మిమ్మనుగ్రహించును" అని వైశ్యులాడిరి. (భటులు వైశ్యులను, కన్యకాంబను గొలుచుచుందుమనియు, మీరు ముష్టివేయ వీరముష్టివారమని యొప్పుచుందుమనియు

పల్కిరి. కొంద అగ్నిప్రవేశానంతరము పితృతర్పణాదుల కొఱకు బాలనగరులతో కాశీకేగి గంగను కొనివచ్చిరి. వారి యాయుధములపై నూటరెండుగోత్రములవారిశిరస్సుల చెక్కింతురు. విప్రవినోదులు విప్రులను, భట్రాజులు క్షత్రియులను, వీరముష్టివారు వైశ్యులను పిచ్చుగుంటువారు గొల్లలను కొల్చుచుందురు)

వైశ్యులు పరాంబికను గొల్చుచుండ కుసుమశ్రేష్ఠి సభకు నమస్కరించి "రాజు నాకుమార్తెను గోరెను. అది నాకిష్టముగాదు. నే నగ్నిచొచ్చెద" ననె. నీవు మరణించిన రాజు మమ్ము నేలబెట్టి శాలరాయును. కన్యను గొంపోవు. పోయిన నందఱును పోవలెనని వైశ్యులనిరి. రేపు కన్యావివాహము. భయపడువారు నగరమును తొలగిపోవలెను. భీతి లేనివా రుండదగును. మనకీర్తి వ్యాపింపవలెననిరి. ధన దుడు సాహసించిరాగా భాస్కరాచార్యు డతనికి వీరకంకణము నొసగి, ఇది గ్రహించినవారికి పుణ్యతీర్థఫలము లబ్బును. అగ్నిలో పడదలచినవారెవరో కంకణము ధరింపరా వచ్చునని, ఆ మాటవిని 612 గోత్రములవారు దిక్కులకు పాఱిరి. 102 గోత్రములవారు కంకణములదాల్చిరి.

అంత కన్యకాంబ మఱి విమానమున ఆకాశమున ప్రత్యక్షమై తనకు నమస్కరించు వైశ్యులతో "మీరెల్లరగ్ని

ప్రవేశముచేయ లోకమున వైశ్యసంతతి నశించును. కాన గోత్రమున కొకదంపతివంతున చొచ్చునది. మీకీర్తి వెలుగొందును'' అదియునుగాక కృతయుగమున సమాధిసురధుల వైశ్యరాజులు గలరు. వారిలో సమాధి నన్నుగుఱించి తపముచేసెను. నేను ప్రత్యక్షమయి వరమడుగుమంటిని. ''ముక్తిగోరు నాకు నన్యవరములేల ? నాకెట్లయిన ముక్తి కలుగును. లోకమున మావంశీయులకు ముక్తినొసగుము. తండ్రివైపు 24 గోత్రములు, తల్లివైపు 20 గోత్రములు, అత్తప్రక్క 12 గోత్రములు, సోదరివైపు 16 గోత్రములు, పుత్రికపక్షము 11 గోత్రములు, మేనత్తప్రక్క 10 గోత్రములు, తల్లితోబుట్టువుదెస 8 యును, బ్రహ్మసాయుజ్యమును పొంద వరమి''మ్మనెను. అంగీకరించితిని. ఆ సమాధియే కుసుమార్యుడు. సమాధి కుమారియే వాసవి, శచ్యంశ. ఆమెయే నేను. అగ్నినెపముతో మీకు మోక్షమిత్తును. నేనును మీతో నగ్ని నుఱికెదను. చొఱగనె నగరేశ్వరాలయముపై విమానములాడును. వానిలో నాస్థానమునకు గొంపోవుదును'' అని పలికి యంతర్ధానమాయెను.

అంత అగ్నిప్రవేశ మొనర్పనున్న దంపతులు బాలనగరుల కిట్లు హితముపదేశించిరి. ''ఆత్మగౌరవమున కగ్నిప్రవేశముచేయకపోయినవారితో చేరకుడు. సపంక్తిభోజనము కావింపకుడు. చేరిన నరకమగును. వారికి వర్ణసంకరమగును.

దారాపుత్రాదులతో యమబాధల నందుదురు. మీరు వేదని యతిచే కన్యాంబయందును హరిహరులయందు భక్తియుంచిన శుభముల పొందుదురు. మేనతికము చేసిన వర్ణ సాంకర్యము తప్పును. ఎట్టి కారణముల చేతను మేనతికము తప్పరాదు. యుక్తవయసున నుపనయనముగావించి, వేదధనుర్వేదాది విద్యల నేర్పవలయును. దేశదేశముల బేరములు సాగించి దేవాలయసత్రాదులనిర్మించి సిరిసంపదలతో ప్రసిద్ధినొందుడు. మనవిద్యాకీర్తిధనములకు భంగకరులు ఈర్ష్యాపరులు హెచ్చుకులముల బుట్టుదురు. జాగరూకతతో నుండ ముందుగనే తెలుపుచుంటిని. (శ్రీ) కన్యకాపరమేశ్వరి మేలొనరించును. భాస్కరుడు మీకు పురోహితుడై వెలయును'' అనియుపదేశించి, ప్రభవసంవత్సర మాఘశుద్ధ ద్వితీయను నూటరెండుగోత్రములవారు గోత్రమున కొకజత చొప్పున సిద్ధపడి వాసవి కన్యతోగూడ నగ్నిప్రవేశమునకు 103 అగ్నిగుండముల నేర్పఱిచి నూటరెండు వంశముల వారలకు రహస్యమును దెలిపి పెండ్లియని చాటించిరి. రాజు పురోహితుని పంపగా సాలంకృతయను కన్యనుజూపి సిద్ధముగ నున్నామని చెప్పిపంపిరి.

అంత కుసుమశ్రేష్ఠి పుత్రికను జూచి పుత్రకామేష్టి చేసి కని, వివాహముచేసి యానందింపక, అగ్నినిద్రోయవలసి వచ్చెగదా! నావంటిపాపియుండునా! అని దుఃఖింప వాసవి ''పుట్టినవారికి గిట్టుట తప్పదు. నీవు పూర్వమున సమాధి

యనఁ బాడవు. చావునకు దుఃఖింపరాదు. బాటసారులు చలి పందిళ్లకు చేరునట్లు దారాపుత్రాదు లొక్కచోట చేరుదురు. ఋణముతీఱినవిడిపోవుచుందురు. మూన్ప శక్యముగాదు. శరీర మునకే జననమరణములుగాని యాత్మకు లేవు. జీవుడు మాయాబద్ధుడై జరామరణాదుల నందుచుండును'' అని తండ్రికి జ్ఞానోపదేశముగావించె. అతడు భూతభవిష్యద్వర్తమానముల నెఱుఁగుశక్తినిపొంది యానందించె. కుసుమాంబయు నెమ్మది నందెను.

కుసుముడు సతీసుతలతో నగరేశ దేవాలయమున కేగెను. అప్పటికే తక్కినవారందఱు తమ తమ గుండముల వద్దనుండిరి. వారు వాసవి యగ్నిని చొచ్చునో చొరదోయని సందేహించుచుండ సర్వాంతర్యామియగుకీర్తి వారి యభి ప్రాయమెఱిగి తాను కన్యకాంబయగుటను తనమాయచే సర్వము వ్యాపించియుండుటను దెలిపి, వారికి జ్ఞానదృష్టి నొసంగి సందేహము తొలగించెను. మఱియు ''వేదవతి విష్ణువును గోరి తపముచేయుచుండ దుష్టుడగు రావణుడు ఆమె సౌంద ర్యమును జూచి కామించి జడను బట్టిలాగెను. అంత నామె జడను త్రెంపివైచి, క్రూరముగజూచి దుర్నీతితో నన్నంటిన నాయీశరీరము నగ్నికాహుతిచేసి మరుజన్మమున నీవంశము నాశము గావింతునని పల్కి మరుజన్మమున సీతయై పుట్టి రావణునితో లంకనంతయు నాశము కావించెను. మన

యగ్నిప్రవేశముకాగనే విష్ణువర్ధనుని శిరస్సు ముక్కలు ముక్కలై నశించును. నేను వాసవి, వాసవాంబ, కన్య కాంబ, వాసవకన్య, యనుపేర్లతో పూజలుగొనుచు మీకు మేలొనరింతును. భాస్కరుని మేలు మరువకుడు. అతడు వేద మార్గవిధులను బోధించును. అగ్నికుండమున బుట్టిన నారూపు బొటనవ్రేలంత రూపము పసుపుతోచేసి పూజించు వార లకు శుభములుకూర్తును. నగరేశ్వరునికి, వింధ్యవాసినికి కోన కమలకు, జనార్దనునకు పూజారూపములు గావించి యర్చించు వారలకు సర్వశుభము లొసగుదును. నవరాత్రుల నన్ను పూజించువారికి మేలుకలుగును. మనవిభవము వన్నె కెక్కును'' అని చెప్పి కుండప్రవేశమున కాజ్ఞయిచ్చెను.

వైశ్యదంపతులు అగ్నిం జొచ్చిరి. అగ్నిదహింపలేదు. ఏల దహింపవని వాసవి యగ్నిని ప్రశ్నించె. ''పూర్వము భృగుమహర్షి గర్భిణియగు తనభార్యకు నన్ను కావలియుంచి చనె. ఇంద్రుడు వచ్చి భృగుపత్ని పట్టబోవ నామె తొమ్ము బాదుకొనె. గర్భము జాఱి కొడుకుపుట్టె. అందువలన వాడు చ్యవనుడాయెను. పిమ్మట భృగువు వచ్చి పత్నివలన విషయ మెఱింగి, నన్ను సర్వభక్షకుడవగుమని శపించె. శివునిదయ వలన నాశాపము తొలగె. ఒక్కఋషియే యంతటి చిక్కు కలిగింప, ఇందఱు వైశ్యఋషులను దహింప నెన్నిచిక్కులు వచ్చునో యని దహింపనొల్లను. మీరు సద్వర్తనులరు'' అని

పలుక వైశ్యులు 'ఆర్యా! నీవన్న సంగతి వేఱు, ఇది వేఱు. కన్యకాంబ చేర నీలోఁ బ్రవేశించుచున్నా'మన నగ్ని సమ్మతించి వారిని తనలో జేర్చుకొనెను.

వైశ్యులు 102 గోత్రములవారు కన్యకాంబ వసించు మణిద్వీపమున కేగి యామెకు నమస్కరించి కైలాసవైకుంఠములకేగి శివకేశవుల సేవించిరి. అప్పుడు శంభుడు గౌరి విఘ్నేశ కుమారులతో గూడి వృషభారూఢుడై తోఁచెను. వారికి నగరులు నమస్కరించుచుండ శ్రీవాసవి ఈ దేవుని నుతించువారలకు దోషములు తొలగునని. అంత సపరివారముగ శంభు డంతర్ధానమాయె. రాజు పంపిన భటులు దేవీ మహిమచే స్త్రీలకు వశులై పోయిరి. భటులు రాకపోవుటచే విష్ణువర్ధనుడు బలిమిచే కన్యను గొనిపోవ ససైన్యముగా పెనుగొండకువచ్చె.

అప్పుడు విరూపాక్షుడు రాజురాక విని యుద్ధసన్నద్ధుండై యెదురుచని, "ఓ రాజా! రారా! మాకన్య పార్వతి. నీకు లభ్యమగునా? దేవి కర్పించినదాని గోరదగునా! మా పెద్దలను దీసికొని అగ్నిముఖమున మణిద్వీపమున కేగినది. పోరాడవచ్చిన నాతో యుద్ధముచేయుము" అని పలుక రాజు వాసవి మరణించినదని వినగానే తాను చిత్రకంఠుడను పూర్వస్మృతినంది నాడు తనకీబడిన శాపము గావచ్చినదని భావించి తలపగిలి రథమునుండి క్రిందికి దొరలి మరణించె.

బాలనగరు లిదంతయుజూచి నగరమున కేగి పితరుల కుత్తర క్రియలు సలిపిరి.

విష్ణువర్ధనుని పుత్రుడు రాజనరేంద్రుడు తండ్రిమరణమునకు దుఃఖించియు పుణ్యాత్ములకు ద్రోహముచేయువారు నశింతురనుటకు నాతండ్రియే నిదర్శనమని తలచి పెనుగొండ యందలి వైశ్యబాలురను చూడవచ్చెను. భాస్కరగురువు గారవించెను. రాజు సంతసించి, విరూపాక్షునిగాంచి మీరు కాశీప్రయాగ గయాదిక్షేత్రముల సందర్శించి మీపితరులకు పుణ్యలోకముల గూర్పుడు. మీరు వచ్చుదాక మీ నగర రక్షణగావించి యొసగెదనన భాస్కరుడు సమ్మతించె.

వైశ్యబాలురు కాశీ గయా ప్రయాగాది క్షేత్రములకువెళ్లి పితరులకు పిండతర్పణాదులొసగ స్వయముగ గ్రహించిరి. గయాక్షేత్రమున కన్యకాదేవి ప్రత్యక్షమై దశలింగముల వివరణమును, గోత్రసంఖ్యలక్రమమును దెలిపి, ఆయా గోత్రములకు జెప్పబడిన వర్జ్యవస్తువులను భుజించిన దోషమనియు, నాచరిత్రను వినువారును, వినుపించువారును శుభముల పడయుదురనియు, ఇక మీరిండ్లకు పొండు. అవసరముల ప్రజాముఖమున వినిపింతుననియు పలికి యంతర్ధానయయ్యెను. వైశ్యులు కాశినుండి నూటయొక్క గోత్రంబులవారు నూటొక్కశివలింగములను గొనివచ్చి పెనుగొండయందు ప్రతిష్ఠించిరి. ఆ వీధికి లింగాలవీధి యనిపేరు.

పెనుగొండకు బాలనగరులు రాగానే రాజనరేంద్రుడు మర్యాదతో తోడితెచ్చి, ప్రయాణవిషయముల నడిగి తెలిసికొని జ్యోతిష్కులచే నుంచబడిన శుభముహూర్తమున విరూపాక్షునకు పట్టాభిషేకంబు గావించెను. ప్రజలెల్లరు సంతసించిరి. రాజనరేంద్రుని సాయముతో విరూపాక్షుడు రామరాజ్యమువలె పాలించెను. కన్యకాంబ యాశీర్వాదముచే నూటరెండుగోత్రములవారు లోకమున ధన్యులై వెలసిరి. ఈ కథను చదివినను, వ్రాసినను, విన్నను, తలచినను సకలజనులకు ఆయురారోగ్యైశ్వర్యభోగసుఖములను శ్రీ కన్యకాంబ యొడగూర్చును.

శుభమ్, శుభమ్, శుభమ్.